

'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50 | సంపుటి: 18 | సంచిక: 12

శుక్రవారం 4-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సన్‌రైజర్స్ పరాజయాల హ్యాట్రిక్

బ్యాటర్ల వైఫల్యంతో కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో ఓడిన హైదరాబాద్. - 14లో



అంతా చెప్పేస్తున్నారా?

'ఏఐ'కి వ్యక్తిగత వివరాలివ్వటం ఎప్పటికైనా ప్రమాదమే.. - 16లో



ఆన్‌లైన్‌లో జడ్జీల ఆస్తుల వివరాలు

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కీలక నిర్ణయం తీసుకున్నారు. స్థిర, చరాస్తుల వివరాలను సుప్రీం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నారు.

- వివరాలు 6లో



వ్యూహాత్మక భాగస్వామ్యం వైపు..

ఇండో పసిఫిక్ ప్రాంతంలో న్యాయబద్ధమైన, స్వేచ్ఛాయుత విధానాలకు కట్టుబడి ఉంటాం అని భారత్, థాయ్‌లాండ్ ప్రకటించాయి.

- వివరాలు 6లో



టీచర్ల నియామకాలు రద్దు

పశ్చిమబెంగాల్‌లో 2016 నుంచి పనిచేస్తున్న 25 వేల మంది ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకాలను సుప్రీంకోర్టు రద్దు చేసింది.

- వివరాలు 6లో



చైనా అధీనంలో 4 వేల చ.కి.మీ.

నాలుగు వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనా ఆక్రమించిందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ ఆరోపించారు.

- వివరాలు 6లో

పనులు ఆపేయండి

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు స్టే.. కేసును సుమోటోగా తీసుకున్న ధర్మాసనం..

- వందల ఎకరాల్లో చెట్లను కొట్టేస్తారా? అంత అత్యవసరం ఏమొచ్చింది?
- కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి తీసుకున్నారా?..అన్న జస్టిస్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జి
- తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు పనులు నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం
- తమ ఉత్తర్వుల్లో ఉల్లంఘనలు జరిగితే సీఎస్ వ్యక్తిగతంగా బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- కంచ గచ్చిబౌలి ప్రాంతాన్ని సందర్శించి అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం.. 16కు వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం తీవ్రస్థాయిలో స్పందించింది. తమ తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆ భూముల్లో చేపట్టిన అన్ని రకాల అభివృద్ధి పనులను నిలిపివేయాలంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. చట్టాన్ని ఎలా మీ చేతుల్లోకి తీసుకుంటారంటూ ప్రశ్నించింది. కేవలం మూడ్రోజుల వ్యవధిలో వంద ఎకరాల్లో చెట్లను కొట్టేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టిన ధర్మాసనం.. ఇది చాలా తీవ్రమైన విషయమని, అంత అత్యవసరం ఏమొచ్చిందంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి తీసుకున్నారా? అని ప్రశ్నించింది. భూముల్లో ఎలాంటి పనులు చేపట్టకుండా స్టే విధించింది. తమ ఆదేశాల విషయంలో ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. కంచ గచ్చిబౌలి భూముల అంశాన్ని అమికస్ క్యూరీ పరమేశ్వర్ గురువారం ఉదయం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జి మసీలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కేసును సుమోటోగా తీసుకున్న ధర్మాసనం.. వారాంతం సెలవులను సద్వినియోగం చేసుకుని అధికారులు చెట్లను నరికివేయడంలో తొందరపడ్డారని అభిప్రాయపడింది. తక్షణమే ఆ భూములను సందర్శించి మధ్యాహ్నం 3:30 లోపు మధ్యంతర నివేదిక సమర్పించాలని తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు, కంచ గచ్చిబౌలిలో చెట్ల మిగతా 3వ పేజీలో ▶

సీఎంకు సంయమనం పాటించడం తెలియదా?

- స్వీయ నియంత్రణ పాటించలేరా?
- సీఎం రేవంత్‌పై మరోసారి సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు.. ఆయన వ్యాఖ్యలు 10వ షెడ్యూల్‌ను ఎగతాళి చేసినట్లే ఉన్నాయని వ్యాఖ్య
- కోర్టు ధిక్కారం కిందే తీసుకోవాల్సి ఉంటుందన్న జస్టిస్ గవాయి

2లో

సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో హెచ్‌సీయూ విద్యార్థుల సంబరాలు..



సుంకాల సునామీ

- ట్రంప్ టారిఫ్‌ల దెబ్బకు కుదేలైన స్టాక్ మార్కెట్లు.. ఆసియా, యూరప్ మార్కెట్లన్నీ భారీ పతనం
- వాటికన్నా తక్కువ నష్టంలోనే భారత మార్కెట్లు.. మన ఆటో, టెక్స్‌టైల్, జ్యుయలరీ రంగాలపై తీవ్ర ప్రభావం
- ఫార్మా, ఎనర్జీ రంగాలకు మినహాయింపు
- నా ఆపరేషన్ సక్సెస్: ట్రంప్



ఈ ఊరికి ఆ ఊరెంతో... ఆ ఊరికి ఈ ఊరూ అంతే!. వస్తూనే దీన్ని ఆలాపించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్... ఇప్పుడు ఆచరించేశారు. అమెరికా వస్తువులపై ప్రపంచ దేశాలన్నీ భారీ సుంకాలు విధిస్తున్నాయి కనక... తామెందుకు తగ్గాలంటూ... ఇండియా సహా ఏ దేశాన్నీ వదలకుండా సుంకాల సమ్మెటతో చితక్కొట్టేశారు. అన్ని దేశాలకూ అమెరికా అతి పెద్ద మార్కెట్ కావటంతో... కంపెనీల లాభాలపై ప్రభావం పడి, వ్యాపారం తగ్గుతుందనే భయాలు మొదలయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లన్నీ కుదేలయ్యాయి. ఒకరకంగా భారత మార్కెట్లు తక్కువే నష్టపోయాయి. మొదట మిగతా మార్కెట్లలాగే భారీ పతనంతో మొదలైనా... చివరకు కాస్త కోలుకున్నాయి.

అమెరికాకు భారత్ నుంచి ఎక్కువ ఎగుమతయ్యేవి సాఫ్ట్‌వేర్ సేవలు, మందులే. సుంకాల దెబ్బ నుంచి ఫార్మాను మినహాయించారు. ఇక సాఫ్ట్‌వేర్ సేవలపై టారిఫ్‌లు లేకున్నా... ట్రంప్ చర్యలతో అమెరికా మాంద్యంలోకి జారే అవకాశాలున్నాయని, కంపెనీలు టెక్నాలజీపై వ్యయాలూ తగ్గించుకుంటాయనే అంచనాలు వస్తున్నాయి. అందుకే భారత ఐటీ షేర్లు భారీగా పతనం కాగా.. అమెరికాలో టెక్నాలజీ కంపెనీల సూచీ అయిన నాస్‌డాక్ అనూహ్యంగా 5 శాతానికి పైగా పతనమయింది.

ఆటో, టెక్స్‌టైల్, రత్నాలు– ఆభరణాల రంగాలపై ఈ సుంకాలు తీవ్ర ప్రభావాన్నే చూపించవచ్చు. ఎందుకంటే దేశం నుంచి అమెరికాకు వీటి ఎగుమతులు గణనీయంగా ఉన్నాయి. కాకపోతే టెక్స్‌టైల్, దుస్తులపై భారత్ కన్నా చైనాపై ట్రంప్ ఎక్కువ సుంకాలు విధించారు. దీంతో చైనాతో పోలిస్తే మన దుస్తులు తక్కువ ధరకు విక్రయించే అవకాశం ఉంటుంది కనక మన కంపెనీలు లాభపడతాయనే అంచనాలున్నాయి.

- వివరాలు 15లో

2024లో ఇండియా నుంచి అమెరికాకు ఎగుమతి అయిన ప్రధాన రంగాల విలువ... (బిలియన్ డాలర్లలో)

సాఫ్ట్‌వేర్ సేవలు	205
టెక్స్‌టైల్	36
రత్నాలు, ఆభరణాలు	32.85
ఫార్మా	9
ఆటో(విడి భాగాలు)	6.79
ఆటో (వాహనాలు)	0.22

న్యూస్‌రీల్

కాంగ్రెస్ సర్కారు ఐదేళ్లూ కొనసాగితేనే మంచిది



'రేవంత్ ప్రభుత్వం ఐదేళ్లూ అధికారంలో కొనసాగితేనే.. మనం చేసిన మంచి ఏమిటో తెలుస్తుంది. ఈ ప్రభుత్వ పనితీరుపై ప్రజలు విసిగిపోయారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు ఖాయం' అని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు.

- వివరాలు 12లో

చూడు స్వామీ..వసతుల లేమి!



దక్షిణ అయోధ్యగా పేర్గాంచిన భద్రాచలంలో రాములోరి భక్తులకు ఇక్కట్లు తప్పటం లేదు. ప్రధాన ఉత్సవాల సమయంలో తరలివచ్చే లక్షల మంది భక్తులకు మౌలిక వసతులలేమి తీవ్ర సమస్యగా మారుతోంది. మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసినా అమలుకు నోచుకోవట్లేదు.

- వివరాలు 5లో

హలో అంటే చాలు.. పట్టేస్తారు!



సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు తెలివి మీరుతున్నారు. తమ మోసాలు, నేరాలకు 'ఏఐ'ని జోడిస్తున్నారు. తప్పు చేయకున్నా చేసినట్లు ఆడియోలు, వీడియోలు సృష్టిస్తూ.. బెదిరింపులకు దిగుతున్నారు.

- వివరాలు 2లో

కమలంలో కానరాని జోష్



ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీని ఓడించి ఘనవిజయం సాధించిన బీజేపీ క్యాడర్‌లో స్తబ్ధత ఏర్పడింది. అడపాదడపా నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తున్నా రాష్ట్ర రాజకీయాల్లో పూర్తి ప్రభావం చూపేలా అవి ఉండట్లేదని నేతలు పెదవి విరుస్తున్నారు.

- వివరాలు 2లో

ఇదండీ సంగతి



వక్ఫ్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం

- రాజ్యసభలోనూ గట్టెక్కిన 'ఉమీద్'
- అనుకూలంగా 128, వ్యతిరేకంగా 95 ఓట్లు
- బిల్లు రాజ్యాంగ విరుద్ధమన్న విపక్షాలు
- ముస్లింల హక్కులను ఎవరూ లాక్కోరు
- విపక్షాలవి కుట్రపూరిత ఆరోపణలు: రిజిజు
- యథేచ్ఛగా వక్ఫ్ భూముల దుర్వినియోగం
- దానికి అడ్డుకట్ట వేసేందుకే బిల్లు: నడ్డా



- రెండ్రోజుల సుదీర్ఘ చర్చ.. తీవ్రస్థాయి వాదోపవాదాలు.. ఎట్టకేలకు వక్ఫ్ (సవరణ) బిల్లు-2025 పార్లమెంటు ఆమోదం పొందింది. విపక్షాల తీవ్ర అభ్యంతరాల నడుమ బుధవారం ఈ బిల్లును లోక్‌సభ ఆమోదించిన విషయం తెలిసిందే. ఇది గురువారం రాజ్యసభ ఆమోదం కూడా పొందింది. 13 గంటలకు పైగా జరిగిన సుదీర్ఘ చర్చ అనంతరం బిల్లుపై ఓటింగ్ జరిగింది. అనుకూలంగా 128, వ్యతిరేకంగా 95 ఓట్లు వచ్చాయి. వక్ఫ్ బిల్లును కేంద్రం రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం చట్టంగా రూపుదాల్చుతుంది. - వివరాలు 6లో

యాదాద్రి జిల్లా మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో వర్షానికి తడిసిన వడ్లను ఎత్తుతున్న మహిళ



ముంచెత్తిన వాన

- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కుండపోత.. చెరువులను తలపించిన రోడ్లు
- భారీ వర్షానికి పెచ్చులూడిన చార్మినార్
- రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు
- నారాయణపూర్‌లో 9.78 సెంటీమీటర్ల వర్షపాతం
- పాలమూరు జిల్లాలో పిడుగుపాటుకు నలుగురు బలి
- పలు జిల్లాల్లో నేలరాలిన వడ్లు, మామిడికాయలు

సాక్షి, హైదరాబాద్/నెట్‌వర్క్: ఉపరితల చక్రవాత ఆవర్తనంతో రాష్ట్రంలో చాలాచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. గురువారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై క్రమంగా జల్లులతో మొదలైన వాన... ఆ తర్వాత తీవ్ర రూపం దాల్చింది. గ్రేటర్ హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో భారీ వర్షపాతమే నమోదైంది. మధ్యాహ్నం తర్వాత చినుకులుగా మొదలై.. పలు ప్రాంతాల్లో కుండపోతగా మారింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆ తర్వాత నాలాలు పొంగడంతో ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. కీలక రద్దీ సమయంలో భారీ వర్షం కురవడం... రోడ్లు జలమయం కావడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు గంటల తరబడి మిగతా 5వ పేజీలో ▶

అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షాలతో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎస్ శాంతికుమారికి సూచన

- వివరాలు 5లో

క్లుప్తంగా...

నిరంకుశత్వానికి ఎదురొడ్డిన ధీరుడు కొమురయ్య

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో దొడ్డి కొమురయ్య జయంతి



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, గంగుల

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాయుధ పోరాటానికి దొడ్డి కొమురయ్య స్ఫూర్తిగా నిలిచారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆయనకు నివాళి అర్పించారు. నిజాం నిరంకుశత్వానికి ఎదురొడ్డి పోరాడి అమరత్వం పొందిన కొమురయ్య, తెలంగాణ సమాజంలోని పోరాటతత్వానికి నిదర్శనంగా నిలుస్తారన్నారు. భూమి, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన ధీరుడు దొడ్డి కొమురయ్య అని కేటీఆర్ కొనియాడారు. ఆయన ఆశయాలను సాధించే దిశగా బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాడుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో నివాళి అర్పించారు.

వంచనకు మారుపేరు కాంగ్రెస్ సర్కార్

ఢిల్లీలో బీసీల దీక్షకు రాహుల్, ఖర్గే రాకపోవడం ఏమిటి?: మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని, ద్రోహానికి, వంచనకు మారు పేరు కాంగ్రెస్ ప్రభుత్వమని శాసన మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మండిపడ్డారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ బీసీలను మభ్యపెట్టిందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఏడాదికి బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు, బీసీ సబ్ ప్లాన్ అంటూ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై అఖిల పక్షాన్ని ఢిల్లీ తీసుకెళతా.. అని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి నిలుపుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌సీయూలో విధ్వంసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. లగచర్లలో రైతులపై దౌర్జన్యం చేసినట్టే ఇప్పుడు విద్యార్థులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ హరితహారం చేపడితే రేవంత్‌రెడ్డి హరిత హననం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఢిల్లీలో జంతర్ మంతర్ దీక్షకు రాహుల్ గాంధీ, ఖర్గే రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పార్లమెంటుకు కూతవేటు దూరంలో ఉన్నా.. జంతర్‌మంతర్ వద్ద బీసీల దీక్షకు రాహుల్, ఖర్గే రాలేదంటే బీసీలపై కాంగ్రెస్‌కున్న చిత్తశుద్ధి ఏమిటో తెలిసిపోయిందని ఆయన అన్నారు.

రేపట్నుంచి ఆస్ట్రేలియాలో 'అటవీ' బృందం పర్యటన

సాక్షి, హైదరాబాద్: పది మందితో కూడిన అటవీశాఖ అధికారుల బృందం ఈ నెల 5 నుంచి 15 వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఆ దేశంలోని బొగ్గుగనుల ప్రాంతాల్లో 'ఎకో రిస్టోరేషన్'కోసం, పర్యావరణ పరిరక్షణకు అమలుచేస్తున్న కార్యక్రమాలను ఈ బృందం అధ్యయనం చేయనుంది. బృందంలో అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీం, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్, పీసీసీఎఫ్ (కాంపా) డాక్టర్ సి.సువర్ణ, భద్రాద్రి సర్కిల్ సీసీఎఫ్ డి.భీమానాయక్, కొత్తగూడెం డీఎఫ్‌వో జి.కిష్టాగౌడ్, మంచిర్యాల డీఎఫ్‌వో ఆశిష్‌సింగ్, కొమురం భీమ్ డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్, ఖమ్మం డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్, మంచిర్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి.రత్నాకర్, పాల్వంచ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.సురేశ్ ఉన్నారు. వీరి పర్యటన ఖర్చును సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భరించనుంది. కాగా, డోబ్రియాల్ ఆస్ట్రేలియా పర్యటన కాలంలో సీఎంవోలో కార్యదర్శిగా పనిచేస్తున్న డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి పీసీసీఎఫ్‌గా పూర్తి అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తారు. గురువారం ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులిచ్చారు.

ఏడు లక్షలు దాటిన యువ వికాసం దరఖాస్తులు

బీసీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య బట్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. గురువారం సాయంత్రానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్పొరేషన్ల పరిధిలో 7లక్షల దరఖాస్తులు వచ్చినట్టు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్యబట్టు తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించాలనుకున్న యువత ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తు ప్రక్రియ ఈనెల 14వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

హలో అంటే చాలు.. పట్టేస్తారు!



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడుతున్న ఈ-కేటుగాళ్లు

- కాల్స్‌తో ఆడియో, వీడియో రికార్డు చేసి అసభ్య క్లిప్స్ తయారీ
- వాటిని బాధితులకు పంపి భారీ మొత్తం చెల్లించాలని డిమాండ్
- ఉత్తరాదిలో ఎక్కువగా జరుగుతున్న ఇలాంటి నేరాలు
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న సైబర్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: టార్గెట్ చేసిన వ్యక్తులకు కనిపించకుండా ఆన్‌లైన్‌లోనే అందినకాడికి దండుకుంటున్న సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతున్నారు. ఏళ్లుగా జరుగుతున్న సెక్స్‌టార్షన్ క్రైమ్‌కు తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను జోడిస్తున్నారు. ఫలితంగా తప్పు చేయకున్నా చేసినట్లు ఆడియోలు, వీడియోలు సృష్టిస్తూ.. బెదిరింపులకు దిగుతున్నారు. వాటిని సోషల్‌మీడియాలో పోస్టు చేస్తామంటూ బాధితులనుంచి అందినకాడికి దండుకుంటున్నారు. ప్రస్తుతం ఈ తరహా సైబర్ నేరాలు ఉత్తరాదిలో ఎక్కువగా జరుగుతున్నాయని, అపరిచిత కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని నిపుణులు, సైబర్ పోలీసులు సూచిస్తున్నారు.

ఈ నేరాలు ఒకప్పుడు ఇలా..

వాస్తవానికి సెక్స్‌టార్షన్ నేరం చాలాకాలంగా జరుగుతోంది. 2022–23లో ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదైనా.. ఆ తర్వాత కొంత వరకు తగ్గాయి. అందమైన యువతుల ఫొటోలను వాట్సాప్ డీపీలుగా పెట్టుకునే సైబర్ నేరగాళ్లు.. ఎంపిక చేసిన నంబర్లకు సందేశాలు పంపేవాళ్లు. వాటికి స్పందించిన యువకులు, పురుషులతో చాటింగ్ చేస్తూ సన్నిహితంగా మెలిగేవారు. ఆపై విషయాన్ని వీడియో కాల్స్ వరకు తీసుకువెళ్లేవాళ్లు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా సదరు యువతే నగ్నంగా ఉండి కాల్ మాట్లాడుతున్నట్లు చేసేవారు. ఆ తర్వాత అసలు కథ మొదలుపెట్టే సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేసిన వ్యక్తి సైతం నగ్నంగా కాల్ చేసేలా ప్రేరేపించేవారు. ఆ కాల్‌ను రికార్డు చేసి, అతడికే షేర్ చేసి బెదిరించి, తాము అడిగినంత ఇవ్వకుంటే సోషల్‌మీడియాలో పోస్టు చేస్తామంటూ దండుకునేవారు.

ఇప్పుడు ఏఐ వాడుతూ..

తాజాగా 'ఈ-కేటుగాళ్లు'సైతం ఏఐని గణనీయంగా వినియోగిస్తున్నారు. ఎంపిక చేసుకున్న ఫోన్ నంబర్లకు వాయిస్, వీడియో కాల్స్ చేస్తున్నారు. ఆ వ్యక్తి వాటికి ఆన్సర్ చేస్తూ 'హలో', 'ఎవరు'వంటి పదాలు వాడితే చాలు.. ఆ వాయిస్, వీడియోలను రికార్డు చేసుకుంటున్నారు. వీటిని ప్రత్యేక ఏఐ సాఫ్ట్‌వేర్స్‌లో పొందుపరిచి.. సదరు వ్యక్తి యువతితో అశ్లీలంగా, అసభ్యంగా సంభాషిస్తున్నట్లు, ఏకాంతంగా గడుపుతున్నట్లు ఆడియో, వీడియోలు సృష్టిస్తున్నారు. వీటిని టార్గెట్ చేసిన వ్యక్తికి పంపి బెదిరింపులకు దిగుతున్నారు. ఆ యువతితో ఫిర్యాదు చేయిస్తామని, సోషల్‌మీడియాలో పోస్టు చేస్తామని, కుటుంబీకులకు పంపిస్తామని చెప్పి బెదిరిస్తున్నారు. ఆ ఆడియో, వీడియోలతో తమకు ఎలాంటి సంబంధం లేదని తెలిసినప్పటికీ.. తీవ్ర ఆందోళన చెందే బాధితులు ప్రత్యామ్నాయాలు ఆలోచించట్లేదు. సైబర్ నేరగాళ్లు డిమాండ్ చేసిన మొత్తం చెల్లించడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

అపరిచిత కాల్స్‌కు స్పందించొద్దు..

ఇలాంటి నేరాల్లో బాధితులు తమ పరువు పోతుందనే ఉద్దేశంతో సైబర్ నేరగాళ్లు అడిగిన మొత్తం చెల్లించడానికే మొగ్గు చూపుతున్నారు. అయితే ఆ కేటుగాళ్లు ఒకసారి డబ్బు తీసుకుని వదిలిపెడతారనే గ్యారంటీ లేదు. అనేక ఉదంతాల్లో పదేపదే డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. బాధితులు నగదు చెల్లించకుండా, ధైర్యం చేసి ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తేనే ఫలితాలు ఉంటాయి. వీలున్నంత వరకు అపరిచిత నంబర్ల నుంచి వచ్చే ఫోన్, వీడియో కాల్స్‌కు స్పందించకపోవడం ఉత్తమం.

– ఎన్.ఆర్.ప్రభాకర్‌రెడ్డి, సైబర్ క్రైమ్ నిపుణుడు

సీఎంకు సంయమనం పాటించడం తెలియదా?

స్వీయ నియంత్రణ పాటించలేరా?

- గతంలో హెచ్చరించినా మార్పు రాలేదు
- సీఎం రేవంత్‌రెడ్డిపై మరోసారి సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- ముఖ్యమంత్రి వ్యాఖ్యలు 10వ షెడ్యూల్‌ను ఎగతాళి చేసినట్లే ఉన్నాయని వ్యాఖ్య
- ఆయన మాటలు కోర్టు ధిక్కారం కిందే తీసుకోవాల్సి ఉంటుందన్న జస్టిస్ గవాయి
- వ్యాఖ్యల టేపులు అందజేయాలని స్పీకర్ తరఫు న్యాయవాదికి ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: 'ముఖ్యమంత్రికి సంయమనం పాటించడం తెలియదా? ఆయన అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను ఎగతాళి చేసినట్లే ఉన్నాయి.. గతంలో హెచ్చరించినా ఆయనలో మార్పు రాలేదు..'అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జి మసీతో కూడిన ధర్మాసనం వరుసగా రెండోరోజు ఘాటుగా వ్యాఖ్యలు చేసింది. ఆయనపై తాము గతంలో చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు కారణమని వ్యాఖ్యానించింది. గురువారం సుప్రీంకోర్టులో తెలంగాణ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు విచారణ సందర్భంగా.. 'ఉప ఎన్నికలు రావు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు'అంటూ సీఎం అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యను బీఆర్ఎస్ తరఫు సీనియర్ న్యాయవాది ఆర్యమా సుందరం గురువారం మరోసారి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన పత్రికా కథనాలను న్యాయమూర్తులకు చూపించారు. ఈ నేపథ్యంలో ధర్మాసనం స్పందించింది.


గతంలో చర్యలు తీసుకోకుండా తప్పు చేశామా?

'గతంలో ఇలాంటి అనుభవం ఉన్నందున కొంత సంయమనం పాటించాలనే విషయం ముఖ్యమంత్రికి తెలియదా? 2024 ఆగస్టులో ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణం కేసులో బీఆర్ఎస్ నాయకురాలు కవితకు బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. వాటిపై అప్పుడు క్షమాపణలు చెప్పారు. కానీ ఆ సమయంలో మేము సీఎంపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోకుండా తప్పు చేశామా? అని ఇప్పుడు అనిపిస్తోంది. సీఎం కనీస స్వీయ నియంత్రణ పాటించలేరా?..'అని ధర్మాసనం ప్రశ్నించింది.' గతంలో ఇలాంటి ఘటనను ఎదుర్కొన్న వ్యక్తి ఆ తర్వాత కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలా? సీఎం మాటలు కోర్టు ధిక్కారం కింద తీసుకోవాల్సి ఉంటుంది..'అని జస్టిస్ గవాయి హెచ్చరించారు. 'సీఎం అటువంటి వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అడ్డుకున్నారు. సుప్రీంకోర్టు పరిధిలో ఉన్న విషయం, పైగా స్పీకర్ సమక్షంలో ఇలా వ్యాఖ్యలు చేయడం సరైన విధానం కాదు అని వారించినా ముఖ్యమంత్రి పట్టించుకోకుండా మాట్లాడారు..'అని ఆర్యమా సుందరం ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

ఆ రెండు వ్యవస్థలు సంయమనం పాటించాలి

'న్యాయవ్యవస్థ, శాసనవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య పరస్పర సంయమనం అవసరం. దేశ సర్వోన్నత న్యాయస్థానం అన్ని విషయాల్లో సంయమనం పాటిస్తుంది. అదే సంయమనాన్ని శాసనవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థల నుంచి మేం ఆశిస్తున్నాం..'అని ధర్మాసనం పేర్కొంది. అసెంబ్లీలో విపక్షం నుంచి అంతకంటే ఎక్కువగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఉన్నాయని స్పీకర్ తరఫు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ చెప్పారు. అయితే అవన్నీ ఇప్పుడు అప్రస్తుతమని జస్టిస్ గవాయి బదులిచ్చారు. శాసనసభలో ముఖ్యమంత్రి ఫిరాయింపులకు సంబంధించి చేసిన వ్యాఖ్యలను (ట్రాన్స్‌క్రిప్ట్, టేప్స్) యథాతథంగా తమకు అందజేయాలని సింఘ్వీని జస్టిస్ గవాయి ఆదేశించారు.

2028 వరకు వేచి చూడాల్సిందేనా?



జస్టిస్ గవాయి



జస్టిస్ అగస్టీన్ జార్జి

ఇదేనా మీ దృష్టిలో రీజనబుల్ టైం అంటే..?

- తెలంగాణ స్పీకర్ కార్యదర్శి తరఫు న్యాయవాదికి సుప్రీం ప్రశ్న
- ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసు విచారణ.. తీర్పు రిజర్వ్
- 8 వారాల లోపు తీర్పు వెలువరించాలని కోరిన పిటిషనర్ల తరఫు న్యాయవాది
- అంగీకరించిన జస్టిస్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జి ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: 'ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడి 14 నెలలు అవుతోంది. ఇది సరిపోదూ అన్నట్లు ఇంకా మరింత సమయం అడుగుతున్నారు?. ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేందుకు 2028 జనవరి వరకు వేచి చూడాల్సిందేనా?. ఇదేనా మీ దృష్టిలో రీజనబుల్ టైం అంటే?'అంటూ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కార్యదర్శి తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ప్రజాస్వామ్యంలో ఉన్నామనే విషయాన్ని న్యాయవాదులు మర్చిపోతే ఎలా? అంటూ చురకలు వేసింది. బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడంపై పలువురు ఇతర ఎమ్మెల్యేలు దాఖలు చేసిన ఎస్ఎల్‌పీ, రిట్ పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జి మసీలతో కూడిన ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. స్పీకర్ కార్యదర్శి తరఫున అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపించారు. ఎస్ఎల్‌పీపై సీనియర్ న్యాయవాది ఆర్యమా సుందరం, రిట్ పిటిషన్‌పై దామ శేషాద్రినాయుడు, పి.మోహిత్‌రావులు వాదనలు వినిపించారు. సింఘ్వీ సుదీర్ఘ వాదనలను విన్న తర్వాత ధర్మాసనం తీర్పును ఎనిమిది వారాలకు రిజర్వ్ చేసింది.

స్పీకర్‌కు తుపాకీ గురిపెట్టి నిర్ణయం తీసుకోమనలేం..

ఈ ఫిరాయింపులపై స్పీకర్, స్పీకర్ కార్యాలయం స్పందించేందుకు మరికొంత సమయం కావాలంటూ సింఘ్వీ ఆరంభంలోనే అభ్యర్థించారు. 'స్పీకర్ తలకు తుపాకీ గురిపెట్టి నిర్ణయం తీసుకోమనలేం..'అని ఆయన అన్నారు. దీనికి జస్టిస్ గవాయి స్పందిస్తూ.. 'ప్రతిరోజూ ముఖ్యమైనదే అనే విషయాన్ని మీరు మర్చిపోవద్దు. రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కోర్టుపై ఉందనే విషయాన్ని గుర్తించండి. రెస్పాండెంట్ల వాదనలో వైరుధ్యాలను కూడా కోర్టు ఎత్తి చూపింది. మీ దృష్టిలో రీజనబుల్ సమయం అంటే ఎంతో ఇప్పటికైనా చెబుతారా..?'అంటూ ధర్మాసనం నిలదీసింది. దీంతో 'సహేతుకమైన కాలం'అనేది స్పీకర్ నిర్ణయించాలని, ఆరు నెలల సమయం సరిపోతుందని సింఘ్వీ అన్నారు.

ఇబ్బందికరంగా న్యాయవాదుల తీరు: ధర్మాసనం

అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి నాలుగు వారాల్లో ఒక షెడ్యూల్ నిర్ణయించాలని స్పీకర్‌ను సింగిల్ బెంచ్ ఆదేశించిన విషయం మర్చిపోవద్దని జస్టిస్ గవాయి అన్నారు. 'కోర్టు జోక్యం చేసుకునే వరకు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ కాలేదు'అని ఆర్యమా సుందరం చెప్పారు. 'సహేతుక సమయం'లో స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని మరోసారి సింఘ్వీ చెబుతుండగా.. జస్టిస్ గవాయి అడ్డుకున్నారు. 'ఇప్పటికే 14 నెలలు గడిచాయి. ఇంకా ఆరు నెలల సమయం అడుగుతున్నారు. అంటే 2028వ సంవత్సరం జనవరి లేదా ఫిబ్రవరి ఎన్నికలు వచ్చే వరకు ఉండాల్సిందే అంటారా? ఇదేనా మీరు చెప్పే.. మీ దృష్టిలో ఉన్న రీజనబుల్ టైం'అంటూ ఘాటుగా స్పందించారు. 'ప్రత్యేకంగా ఇటువంటి కేసుల్లో న్యాయవాదులు వ్యవహరిస్తున్న తీరు న్యాయస్థానాలకు ఇబ్బందికరంగా ఉంటోంది..' అంటూ ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. రెండు వైపులా వాదనలను విన్న తర్వాత తీర్పును రిజర్వ్ చేసింది. 8 వారాల వరకు తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలో జోక్యం చేసుకున్న ఆర్యమా సుందరం.. 8 వారాల్లోపే తీర్పు వెలువరించాలని అభ్యర్థించారు. ఆ విధంగానే 8 వారాల్లోపు తీర్పును వెలువరిస్తామని ధర్మాసనం హామీ ఇచ్చింది.

కమలంలో కానరాని గెలుపు జోష్

బీజేపీ నేతలు, కార్యకర్తల్లో స్తబ్ధత

- ఎమ్మెల్సీ గెలుపు తర్వాతా మారని తీరు
- ప్రభుత్వంపై బీఆర్ఎస్ ముప్పేట దాడి
- ప్రకటనలకే పరిమితమైన బీజేపీ నాయకత్వం
- ఎటూ తేలని కొత్త అధ్యక్షుడి నియామకం



సాక్షి, హైదరాబాద్: ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీని ఓడించి ఘనవిజయం సాధించిన బీజేపీలో ఆ జోష్ అంతలోనే మాయమైంది. నాయకులు, కార్యకర్తల్లో స్తబ్ధత ఏర్పడింది. నిరుద్యోగ యువత, మహిళలు, రైతులు ఇతర వర్గాల సమస్యలపై అడపాదడపా నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తున్నా రాష్ట్ర రాజకీయాల్లో పూర్తి ప్రభావం చూపేలా కార్యక్రమాలు జరగడం లేదని కొందరు నేతలు పెదవి విరుస్తున్నారు.

బీఆర్ఎస్ దూకుడు.. బీజేపీ పాకుడు

గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారాన్ని సాధిస్తామనే స్థాయిలో పార్టీకి హైప్ వచ్చినా 8 సీట్లతోనే సంతృప్తి పడాల్సి వచ్చింది. అయితే, ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 17 సీట్లకుగాను 8 సీట్లు గెలిచి బీజేపీ సత్తా చాటింది. అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా ఎంపీ సీట్లు గెలిచి రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అసలైన ప్రత్యామ్నాయమనే స్థాయి తెచ్చుకుంది. దీంతో 2028 శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమనే స్థాయిలో రాజకీయవర్గాల్లో అంచనాలు ఏర్పడ్డాయి. బీఆర్ఎస్ స్థానాన్ని బీజేపీ భర్తీ చేస్తుందనే అభిప్రాయం ప్రజల్లోనూ నెలకొంది. కానీ, బీఆర్ఎస్ అంతలోనే కోలుకుని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఊపిరి సలపనివ్వకుండా పోరాటం చేస్తోంది. బీజేపీ మాత్రం ఆ స్థాయిలో పోరాడలేకపోతోంది. బీజేపీలో ముఖ్యనేతల నుంచి కిందిస్థాయి వరకు ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్య నాయకుల మధ్య సమన్వయలేమి మరింత పెరిగిందని అంటున్నారు. 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు ఎవరికి వారు సొంత ఇమేజ్‌ను పెంచుకోవడంపైనే దృష్టి పెట్టడం, ముఖ్యనేతలు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో కేడర్‌లో గందరగోళం నెలకొంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో 42% బీసీ రిజర్వేషన్లపై తీర్మానం, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, బడ్జెట్‌పై చర్చలో ఎమ్మెల్యేలు పార్టీ వాదనను బలంగా వినిపించలేకపోయారనే అభిప్రాయం వ్యక్తమైంది.

వరుస గెలుపుల తర్వాత కూడా నిర్లిప్తతే

శాసనసభ, లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరుస విజయాల తర్వాత కూడా బీజేపీలో పెద్దగా జోష్ కనిపించటంలేదు. ప్రజా క్షేత్రంలో ప్రభుత్వంపై కొట్లాడే విషయంలో మీనమేషాలు లెక్కిస్తోంది. వరుస గెలుపులను పదిలం చేసుకొనే కార్యకలాపాలేవీ ఇప్పటివరకు రాష్ట్ర నాయకత్వం చేపట్టకపోవటం గమనార్హం. మరోవైపు పార్టీలో పాత, కొత్త నేతల మధ్య వైరుధ్యాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్ర పార్టీ కొత్త అధ్యక్షుడి నియామకం ఆలస్యం కావటం కూడా నేతల్లో నిర్లిప్తతను పెంచుతోందనే వాదన వినిపిస్తోంది. ఢిల్లీ అధిష్టానం కూడా రాష్ట్ర బీజేపీని ముందుకు కదిలించే ప్రయత్నం చేయటం లేదు. కొత్త అధ్యక్షుడి నియామకం ఆలస్యం అవుతున్నకొద్దీ నాయకులు, కార్యకర్తల్లో నిస్తేజం, నిర్లిప్తత పెరు గుతుందని కొందరు నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఖురాన్ స్ఫూర్తిని విస్మరించిన వక్ఫ్ బోర్డు

- హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- పాదరక్షలు విడిచిపెట్టి ఖురాన్ చదివిన న్యాయమూర్తి



సాక్షి, హైదరాబాద్: పవిత్రమైన ఖురాన్ స్ఫూర్తిని వక్ఫ్ బోర్డు విస్మరించిందని హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డు, పిటిషనర్ల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. తాము గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దారుల్‌షిఫాలోని ఇబాదత్‌ఖానాను స్వాధీనం చేసుకోవాలని.. షియా, ఇమామియా, అషరీ, అక్బరీలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తూ నిర్వహణ కమిటీ ని ఏర్పాటు చేయాలని.. గతంలో ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని వక్ఫ్ బోర్డులోని గత కమిటీ సభ్యుడు మీర్ హస్నయిన్ అలీఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. వక్ఫ్ బోర్డు తీరుపై గతేడాది హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. విచారణ సందర్భంగా ఇబాదత్ ఖానా స్వాధీనం చేసుకోవాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. షియా, ఇమామియా, అషరీ, అక్బరీలకు సమాన ప్రాతినిధ్య కల్పిస్తూ నిర్వహణ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను పునః సమీక్షించాలని అలీఖాన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ భీమపాక నగేశ్ గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్ తీరును తప్పుబట్టారు. ఖురాన్‌లోని పలు అంశాలను చదివి వినిపించారు. ఇది చదివేటప్పుడు న్యాయమూర్తి పాదరక్షలు విడిచి పెట్టారు. ఖురాన్ చెప్పిన మంచి ఆచరించాలని, ఆ స్ఫూర్తిని పాటించాలని పిటిషనర్‌కు, వక్ఫ్ బోర్డుకు సూచించింది.

బీసీ రిజర్వేషన్ల పెంపుకోసం కొట్లాడుతాం

పార్లమెంటులో తీర్మానం కోసం పోరాటం చేస్తాం

- కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీ హామీ
- పార్లమెంటు వద్ద వారిని కలిసిన పీసీసీ చీఫ్, రాష్ట్ర మంత్రులు
- బీసీలపై కేంద్రం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్



పార్లమెంట్ ఆవరణలో రాహుల్‌గాంధీని కలిసిన కొండా సురేఖ, రాజ్‌ఠాకూర్, ప్రకాశ్‌గౌడ్, మహేశ్‌కుమార్ గౌడ్, బీర్ల అయిలయ్య, పొన్నం, వీర్లపల్లి శంకర్, ఆది శ్రీనివాస్, సంజీవ్‌రెడ్డి, బలరాంనాయక్

సాక్షి, న్యూఢిల్లీ: బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని అసెంబ్లీలో తీర్మానం చేయటంద్వారా సామాజిక న్యాయ సాధనలో తెలంగాణ రాష్ట్రం దేశానికే దారి చూపిందని కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ అన్నారు. కులగణనను పూర్తి చేయడంతో పాటు దానికి అసెంబ్లీ ఆమోదం పొందిన తీరు అభినందనీయమని ప్రభుత్వాన్ని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవ వల్ల విద్య, ఉద్యోగాల్లో బీసీలకు న్యాయం జరుగుతుందని ఆకాంక్షించారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పార్లమెంట్ వెలుపలా, లోపలా ఈ తీర్మానం కోసం పోరాటం చేస్తామని తెలిపారు. గురువారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, వాకిటి శ్రీహరి, బీర్ల అయిలయ్య, రాజ్‌ఠాకూర్, వీర్లపల్లి శంకర్, సంజీవ్‌రెడ్డి తదితరులు సోనియా, రాహుల్‌లను పార్లమెంట్ ప్రాంగణంలో విడివిడిగా కలిశారు. జనగణన, బీసీ బిల్లుపై తీర్మానం, జంతర్‌మంతర్‌లో ధర్నా గురించి వారికి వివరించారు. పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లుపై కీలక చర్చ జరుగుతున్న నేపథ్యంలో ధర్నాకు హాజరు కాలేకపోయానని రాహుల్‌గాంధీ ఈ సందర్భంగా చెప్పారు. బీసీలకు సామాజిక న్యాయం జరిగేవరకు అన్ని రకాలుగా మద్దతుగా ఉంటామని హామీ ఇచ్చారు.

కేంద్రం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీ రిజర్వేషన్ల పెంపు తీర్మానాన్ని పార్లమెంట్‌లో ఆమోదించి బీజేపీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. తమిళనాడు తరహాలో 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. రాహుల్, సోనియాతో భేటీ అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చర్చించేందుకు ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకోవాలని తెలంగాణ బీజేపీ నేతలకు సూచించారు. రిజర్వేషన్ల అమలుకై ఎక్కడికైనా వచ్చేందుకు సీఎం రేవంత్‌తో సహా కేబినెట్ మంత్రులంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. హెచ్‌సీయూ భూములు వాస్తవంగా ప్రభుత్వానికి చెందినవని చెప్పారు. ఈ భూముల విషయంలో బీఆర్ఎస్, బీజేపీలు అసత్య ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు.

- కాంగ్రెస్ ప్రతినిధి బృందం కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి వీరేంద్రకుమార్‌ను కలిసి బీసీ రిజర్వేషన్ల బిల్లుపై చర్చించింది.

పాత బార్ల స్థానంలో.. కొత్త బార్ లైసెన్స్ దరఖాస్తుకు ఆహ్వానం

వివిధ కారణాలతో రద్దు చేసిన 40 బార్లను పునరుద్ధరించాలని ప్రభుత్వం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: గతంలో వివిధ కారణాలతో రద్దు చేసిన 40 పాత బార్ల స్థానంలో..కొత్త బార్ల లైసెన్స్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎక్సైజ్ శాఖ కమిషనర్ చేవూరి హరికిరణ్ తెలిపారు. ఈనెల 26 చివరి తేదీ అని, గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. గతంలో అనుమతి ఇచ్చిన వాటిలో వివిధ కారణాలతో 40 బార్లు మూసివేతకు గురయ్యాయని, వీటి లైసెన్సులను కూడా ప్రభుత్వం రద్దు చేసిందని, ఇప్పుడు వాటిని పునరుద్ధరించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఆదిలాబాద్‌లో 5, కరీంనగర్‌లో ఒకటి, వరంగల్‌లో నాలుగు, ఖమ్మంలో రెండు, నల్లగొండలో ఒకటి, మహబూబ్‌నగర్‌లో ఐదు, మెదక్‌లో ఒకటి, నిజామాబాద్‌లో నాలుగు, రంగారెడ్డి జిల్లాలో రెండు బార్లను పునరుద్ధరించాలని నిర్ణయించామన్నారు. అయితే జీహెచ్ఎంసీ పరిధిలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండడంతో 15 బార్లకు దరఖాస్తులు తీసుకోవడం లేదని వెల్లడించారు.

- మీర్‌పేట మున్సిపాలిటీలో పాత బార్ల స్థానంలో కొత్త బార్లకు నోటిఫికేషన్ జారీ చేశామని, వాటి కోసం దరఖాస్తు చేసుకోవాలని సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉజ్వలరెడ్డి తెలిపారు.
- వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరిధిలోని కొడంగల్ మున్సిపాలిటీలోని పాత బార్ల స్థానంలో కొత్త బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ తెలిపారు.

రైతు ఆత్మహత్యలపై త్రిసభ్య కమిటీ ఎందుకు వేయడం లేదు?: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రైతు ఆత్మహత్యలపై పరిహారం చెల్లింపునకు విచారణ చేపట్టాల్సిన త్రిసభ్య కమిటీని ఎందుకు వేయడం లేదో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. రైతు ఆత్మహత్యలపై విచారణకు త్రిసభ్య కమిటీ వేయడం లేదని, బాధిత కుటుంబాలకు రూ.6 లక్షల పరిహారం అందడం లేదంటూ హైకోర్టులో రైతు స్వరాజ్య వేదిక తరఫున రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండల్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది.

క్లుప్తంగా...

ఇది విద్యార్థుల పోరాట విజయం

కంచ గచ్చిబౌలి వివాదంలో సుప్రీం తీర్పుపై కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: కంచ గచ్చిబౌలి భూముల్లో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించరాదన్న సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నామని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. సుప్రీంకోర్టు నిర్ణయం విద్యార్థుల పోరాటానికి దక్కిన విజయమని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంచ గచ్చిబౌలిలో అటవీ సంపదను నష్టపరిచే ప్రయత్నం జరుగుతోందని సుప్రీంకోర్టు పేర్కొందని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు విచారణను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా గురువారం ఉదయం నుంచి చెట్ల నరికివేతను కొనసాగించడం దురదృష్టకరమని అన్నారు. ఇకనైనా అహాన్ని పక్కనపెట్టి సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించారు. పోలీసులు అరెస్టు చేసిన విద్యార్థులను బేషరతుగా విడుదల చేయాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వం నడుచుకోవాలని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు సూచించారు.

సుప్రీంకోర్టు స్టేను స్వాగతిస్తున్నాం

సీపీఎం కార్యదర్శి జాన్‌వెస్లీ



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని వేలం వేసి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలనే ప్రయత్నాన్ని సుప్రీంకోర్టు అడ్డుకోవడం శుభసూచకమని సీపీఎం కార్యదర్శి జాన్‌వెస్లీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌సీయూలోని వందల ఎకరాలలో చెట్లను తొలగించి, జంతువులకు తీవ్ర ఇబ్బంది కల్గించే చర్యలకు పాల్పడుతున్న ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన స్టే చెంపపెట్టు వంటిదన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లది మొసలి కన్నీరు

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



సాక్షి, న్యూఢిల్లీ: హెచ్‌సీయూ భూముల విషయంలో బీజేపీ, బీఆర్‌ఎస్‌లు మొసలి కన్నీరు కారుస్తున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. హెచ్‌సీయూ విద్యార్థులు బీఆర్‌ఎస్ ట్రాప్‌లో పడొద్దని సూచించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. హెచ్‌సీయూ విషయంలో కేటీఆర్ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గుత్తికోయలను బట్టలువిప్పి కొట్టిన కేటీఆర్, అటవీ భూముల గురించి ఇప్పుడు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'నేను సీఎం రేవంత్ రెడ్డిని ఒప్పిస్తా. హెచ్‌సీయూ భూములపై ఆల్‌పార్టీ మీటింగ్‌కు కేటీఆర్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వస్తారా?' అని ఆయన ప్రశ్నించారు.

దొడ్డి కొమురయ్య ఆశయాలను సాధిస్తాం

నివాళులు అర్పించిన పీసీసీ చీఫ్, మంత్రులు, ఎమ్మెల్యేలు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను సాధిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లోని అంబేడ్కర్ ఆడిటోరియంలో దొడ్డి కొమురయ్య 98వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా దొడ్డి కొమురయ్య వీరోచితంగా పోరాడిన తొలి అమరుడని కొనియాడారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల దాస్య విముక్తి కోసం ఆయన చేసిన పోరాటాలను చరిత్ర మరువబోదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు బీర్ల అయిలయ్య, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్, వాకిటి శ్రీహరి పాల్గొని నివాళులు అర్పించారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఇతర భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఫలితాలు విడుదల చేయండి


మంద కృష్ణ మాదిగ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఫలితాలు వెంటనే విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విద్యాశాఖ డైరెక్టర్ నరసింహారెడ్డిని కలిశారు. అర్హులైన క్రీడాకారులు ఉద్యోగాల కోసం రోజూ డీఎస్సీ ఆఫీసు చుట్టూ తిరుగుతున్న తీరును డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నిజమైన క్రీడాకారులకు వెంటనే న్యాయం చేయాలని కోరారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్ల రీ-వెరిఫికేషన్ నియామకాలను వెంటనే చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విద్యాశాఖ అదనపు డైరెక్టర్ లింగయ్య కలిసి కోరారు. అనర్హులకు ఉద్యోగాలిచ్చిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు.

'కంచ గచ్చిబౌలి'పై కౌంటర్లు దాఖలు చేయండి

- రాష్ట్ర ప్రభుత్వం, టీజీఐఐసీ తదితరులకు హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ ఈ నెల 7కు వాయిదా



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో చెట్లు నరకడాన్ని ఆపివేయడంతో పాటు ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు టీజీఐఐసీతో పాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 7కు వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూములను తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఐఐసీ)కి బదిలీ చేసి, చదును చేయడాన్ని వెంటనే ఆపాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలైన విషయం తెలిసిందే. తాజాగా గురువారం మరో పిటిషన్ కూడా దాఖలయ్యింది. ఈ పిటిషన్లపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ ఆన్‌లైన్‌లో విచారణకు హాజరయ్యారు. కంచ గచ్చిబౌలి భూముల వివాదాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించిందని, చెట్ల నరికివేతపై హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)ను వెంటనే నివేదిక అందజేయాలని ఆదేశించిందని చెప్పారు. పిటిషనర్లు పిల్‌లు దాఖలు చేసి అభివృద్ధి పనులను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారని, ఇలాంటి చర్యలతో రూ.50 వేల కోట్ల విలువైన పెట్టుబడులు కోల్పోవాల్సి వస్తుందని చెప్పారు. ఈ కంపెనీలు రావడం ద్వారా 5 లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని, గత 20 ఏళ్లుగా కంచ గచ్చిబౌలి సమీపంలో వివిధ సంస్థలకు, కంపెనీలకు భూములు కేటాయించినప్పుడు ఎవరూ ఎలాంటి నిరసన తెలపలేదని నివేదించారు. చంద్రబాబు హయాంలో అతి తక్కువ ధరకు వేల కోట్ల విలువైన భూమిని బిల్లీ రావుకు కట్టబెట్టారని చెప్పారు.

స్టే ఇచ్చినా ఆగని పనులు

పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. హైకోర్టు బుధవారం స్టే ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత కూడా పనులు కొనసాగాయన్నారు. గురువారం ఉదయం వరకు చెట్ల తొలగింపు పనులు ఆపలేదని చెప్పారు. దీన్ని వీడియోలు, ఫొటోలు తీసేందుకు యత్నించిన ఓ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వాదనల అనంతరం ధర్మాసనం.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, రెవెన్యూ ముఖ్య కార్యదర్శులకు, టీజీఐఐసీ, హెచ్‌సీయూ రిజిస్ట్రార్, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, కేంద్ర విద్యా శాఖ అధికారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది.

హెచ్‌సీయూను సందర్శించిన రిజిస్ట్రార్

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ హెచ్‌సీయూలో పర్యటించారు. దాదాపుగా ఐదు కిలోమీటర్లు కాలినడకన పర్యటించి వివరాలు సేకరించారు. అంతకు ముందు బారికేడ్లతో విద్యార్థులను ఈస్ట్ క్యాంపస్‌కు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు రిజిస్ట్రార్ రాకతో వాటిని తొలగించారు. జేసీబీలు సైతం మాయమయ్యాయి. రిజిస్ట్రార్‌ను కలిసిన ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వం ధ్వంసం చేసిన ప్రదేశాన్ని చూపించారు. రిజిస్ట్రార్ వెళ్లగానే పోలీసులు తిరిగి ఆ ప్రదేశాన్ని చుట్టుముట్టి ఎవరూ వెళ్లకుండా అడ్డుకున్నారు.

పనులు ఆపేయండి..

▶ మొదటి పేజీ తరువాయి

నరికివేతను అనుమతించకూడదని సీఎస్‌ను ఆదేశించింది. హైకోర్టు రిజిస్ట్రార్ నివేదిక అందిన అనంతరం 3.45 గంటలకు విచారణ ప్రారంభించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయవాది గౌరవ్ అగర్వాల్, భూముల విషయంలో ఆందోళన చేస్తున్న వారి తరఫున సీనియర్ అడ్వొకేట్ గోపాల్ శంకరనారాయణ్ వాదనలు వినిపించారు.

అటవీ ప్రాంతం కాదు: ప్రభుత్వ న్యాయవాది

కంచ గచ్చిబౌలిలో ప్రస్తుతం పనులు జరుగుతున్న ప్రదేశం అటవీ ప్రాంతం కాదని, 30 సంవత్సరాలుగా ఆ భూమి వివాదంలో ఉందని గౌరవ్ అగర్వాల్ చెప్పారు. అటవీ భూమి అని చెప్పేందుకు ఆధారాలు లేవని అన్నారు. దీంతో.. 'ఒకవేళ అటవీ ప్రాంతం కాకపోయినా చెట్లను నరికేందుకు అనుమతి తీసుకున్నారా? కేవలం 2, 3 రోజుల్లో 100 ఎకరాల్లో చెట్ల నరికివేత తీవ్రమైన అంశం. ఎవరు ఏ స్థాయిలో ఉన్నా చట్టానికి అతీతం కాదు.' అని జస్టిస్ గవాయి వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలో చెట్ల నరికివేతపై దాఖలైన పిటిషన్‌పై ఇప్పటికీ విచారణ జరుగుతోందన్నారు. కాగా.. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్న విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారని గోపాల్ శంకర నారాయణ్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

నెలరోజుల్లో నిపుణుల కమిటీ వేయాలి

చెట్ల నరికివేతపై హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) సమర్పించిన నివేదికలోని అంశాలపై ధర్మాసనం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. 'పెద్ద సంఖ్యలో చెట్లను నరికివేసి, భారీ యంత్రాలను ఉపయోగించి వందలాది ఎకరాలను అస్తవ్యస్తం చేశారు. ఈ విధ్వంసకాండ వల్ల నెమళ్లు, జింకలు ఈ ప్రాంతం నుంచి పారిపోయినట్లు చూపించే చిత్రాలు నివేదికలో ఉన్నాయి. దీనికి తోడు అక్కడ ఒక చెరువు కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ఈ రిపోర్టులో పొందుపర్చిన చిత్రాలను ప్రాథమికంగా పరిశీలిస్తే.. ఈ ప్రాంతం అడవి జంతువుల నివాసానికి అనువుగా ఉంది..' అని ధర్మాసనం పేర్కొంది. అటవీ భూములు గుర్తించడానికి చట్టబద్ధమైన కమిటీలను ఏర్పాటు చేయకపోతే.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగతంగా బాధ్యత తీసుకోవాల్సివస్తుందంటూ..ఓ కేసులో మార్చి 4న ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నామని ధర్మాసనం గుర్తుచేసింది. అటవీ భూములను గుర్తించే చట్టబద్ధమైన కసరత్తు ఇంకా ప్రారంభం కానప్పుడు, చెట్లను నరికివేసేందుకు ఉన్న 'అంత ఆందోళనకరమైన ఆవశ్యకత' ఏంటి? అని ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో నెలరోజుల్లో నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ఆరు నెలల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. అలాగే.. కంచ గచ్చిబౌలి ప్రాంతాన్ని సందర్శించి ఈ నెల 16 లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. 'ఆ ప్రాంతంలో చెట్లను తొలగించడం వంటి కార్యకలాపాలను చేపట్టాల్సిన అవసరం ఏంటి? చెట్ల నరికి వేత కోసం అటవీ అధికారుల నుంచి కానీ మరేదైనా స్థానిక చట్టాల కింద కానీ అనుమతులు తీసుకున్నారా? నరికివేసిన చెట్లతో రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది?..' తదితర ప్రశ్నలకు జవాబులివ్వాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసింది.

ప్రత్యేక ఫార్మాట్లో బెట్టింగ్ దర్యాప్తు

సిట్ అధికారులతో డీజీపీ భేటీ • దర్యాప్తు విధివిధానాలపై చర్చ



యువ ఐపీఎస్‌లతో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ కట్టడి కోసం ఏర్పాటైన సిట్ అధికారులతో రాష్ట్ర డీజీపీ జితేందర్ గురువారం సమావేశమయ్యారు. బెట్టింగ్ యాప్‌లను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐజీ రమేశ్ ఆధ్వర్యంలో ఎస్పీలు సింధూశర్మ, వెంకటలక్ష్మి, అదనపు ఎస్పీ చంద్రకాంత్, డీఎస్పీ శంకర్‌తో సిట్‌ను నియమించిన విషయం తెలిసిందే. సీఐడీ చీఫ్ శిఖాగోయల్ పర్యవేక్షణలో సిట్ బృందం పనిచేయనున్నది. ఈ సిట్ బృందంతో డీజీపీ తన కార్యాలయంలో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించి నమోదయ్యే కేసుల దర్యాప్తునకు ప్రత్యేక ఫార్మాట్‌ను రూపొందించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. త్వరలో బెట్టింగ్ కేసులు దర్యాప్తు జరిపే అధికారులతో సిట్ సమావేశం కానుంది. బెట్టింగ్ యాప్స్ కట్టడిపై సమగ్ర నివేదిక రూపొందించి 90 రోజుల్లోగా రాష్ట్ర ప్రభుత్వానికి సిట్ అందజేయనుంది.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: 40 ఏళ్లు దాటిన మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీజీపీ జితేందర్ సూచించారు. పోలీస్ శాఖలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి డీజీపీ కార్యాలయంలో గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును డీజీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. 40 ఏళ్లు దాటిన మహిళలు తప్పనిసరిగా ఏడాది, రెండేళ్లకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

డీజీపీతో యువ ఐపీఎస్‌ల భేటీ..: డీజీపీ జితేందర్‌తో యువ ఐపీఎస్‌లు భేటీ అయ్యారు. తెలంగాణ కేడర్‌కు కేటాయించిన 2023 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్‌లు ఓరియంటేషన్‌లో భాగంగా డీజీపీని గురువారం కలిశారు. ఈ సందర్భంగా పోలీసింగ్‌కు సంబంధించిన అంశాలపై వారికి డీజీపీ వివరించారు.

రణరంగంగా హెచ్‌సీయూ

- ముట్టడికి ప్రయత్నించిన ఏబీవీపీ.. 108 మంది అరెస్టు
- యూనివర్సిటీలో పటిష్ట బందోబస్తు
- బీఆర్‌ఎస్ నేతలు దిలీప్, క్రిషాంక్‌పై కేసు నమోదు

గచ్చిబౌలి: కంచ గచ్చిబౌలిలోని భూములకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గురువారం ఉదయం ఏబీవీపీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ముట్టడికి ప్రయత్నించారు. ఉస్మానియా యూనివర్సిటీ, నగరం నుంచి ఆటోలు, బస్సుల్లో కార్యకర్తలు హెచ్‌సీయూ వద్దకు చేరుకున్నారు. పోలీసుల దృష్టి మరల్చి పదుల సంఖ్యలో నిరసనకారులు పలుమార్లు వర్సిటీ సర్వీస్ గేట్ నుంచి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వాగ్వాదం జరిగింది. ఏబీవీపీ కార్యకర్తలను అరెస్టు చేసే క్రమంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో 108 మంది ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలను గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. వాహనాల్లో మొయినాబాద్, రాజేంద్రనగర్, నార్సింగి పోలీస్ స్టేషన్లకు తరలించారు. హెచ్‌సీయూ కేంద్రంగా ఆందోళనలు రోజురోజుకూ తీవ్రమవుతుండటంతో గచ్చిబౌలి పోలీసులు బందోబస్తు ముమ్మరం చేశారు. గురువారం హెచ్‌సీయూ ప్రధాన ద్వారంతో పాటు ప్రధాన రహదారి, గోపన్‌పల్లి గేట్, 400 ఎకరాలు ఉన్న వైపు, క్యాంపస్ లోపల పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు 400 ఎకరాల భూముల విషయంలో సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేశారని అరుణ్‌రాజ్ అనే వ్యక్తి ఫిర్యాదు నేపథ్యంలో బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి కొణతం దిలీప్,తో పాటు డాక్టర్ క్రిషాంక్ తదితరులపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్ 353 (1)(బి), 353 (1)సి, 353(2), 192, 196(1), 61(1)(ఏ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

లాఠీఛార్జి చేయలేదు: డీసీపీ

హెచ్‌సీయూలో విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేశారని మీడియాలో వచ్చిన వార్తల్లో నిజం లేదని మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. బారికేడ్లను దాటుకొని వస్తున్న విద్యార్థులను కేవలం తాళ్లతో అడ్డుకున్నామని చెప్పారు. అయితే కొందరు విద్యార్థులు పోలీసు సిబ్బందిని నెట్టేసి, హోల్డింగ్ తాడును లాక్కోవడానికి ప్రయత్నించారని, దీంతో లాఠీలను నేలపై, తాళ్లపై కొడుతూ విద్యార్థులను అక్కడి నుంచి పంపించామని వివరించారు.

వర్షంలోనే పాటలు.. డ్యాన్స్‌లు

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో హెచ్‌సీయూ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం వర్షం కురుస్తున్నా.. డ్యాన్స్‌లు చేస్తూ, పాటలు పాడుతూ ఆనందం వ్యక్తం చేశారు.



విద్యార్థులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు

రాయదుర్గం: ఏబీవీపీ జాతీయ కమిటీ నేతలు శ్రావణ్ బిరాజ్, శివంగి ఖర్వాల్, హెచ్‌సీయూ అధ్యక్షుడు అనిల్ కుమార్ తదితరులు గురువారం ఉదయం ఢిల్లీలో కేంద్ర, అటవీ, పర్యావరణ శాఖా మంత్రి భూపేందర్ యాదవ్‌ను కలిసి భూముల వివాదంపై వినతిపత్రం అందజేశారు. మరోవైపు వర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఉమేష్ అంబేడ్కర్, ప్రధాన కార్యదర్శి నిహాద్ సులేమాన్ తదితరులు ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

అంగుళం కూడా వదలకుండా స్వాధీనం చేసుకుంటాం

హెచ్‌సీయూ భూములపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- మేము అధికారంలోకి వచ్చిన తర్వాత కంచ గచ్చిబౌలిలో 'ఎకో పార్కు'
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మించి ప్రజలకు కానుకగా ఇస్తాం
- సీఎం అంటే నియంత, చక్రవర్తి కాదు.. పెద్ద పాలేరు మాత్రమే



మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్.. చిత్రంలో శ్రీనివాస్‌యాదవ్, జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మరో మూడేళ్లలో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రంగారెడ్డి జిల్లా కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ఆ భూము ల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఎకో పార్కును ఏర్పా టు చేసి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు, ప్రజలకు కానుకగా ఇస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్‌సీయూ భూమిని అంగట్లో సరుకులా చూస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి విసిరే బిస్కెట్లకు ఆశపడి ఎవరైనా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కొనుగోలు చేస్తే తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ 400 ఎకరాల్లో ప్రతీ అంగుళం భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, కాలే రు వెంకటేశ్‌తో కలసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రభు త్వం తన నిర్ణయం మార్చుకోని పక్షంలో హైదరాబాద్ ప్రజలతో కలసి సెంట్రల్ యూనివర్సిటీ వరకు ర్యాలీ చేపడతామన్నారు.

విద్యార్థుల పోరాట స్ఫూర్తికి సెల్యూట్..

'హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు చేస్తున్న ఆందోళన, పోరాట స్ఫూర్తికి బీఆర్‌ఎస్ పార్టీ తరఫున సెల్యూట్ చేస్తున్నాం. పది రోజులుగా విద్యార్థులు పోరాటం చేస్తుంటే ప్రజాస్వామిక లక్షణాలున్న ప్రభుత్వమైతే వారిని పిలిచి మాట్లాడాలి. ఆందోళనను విరమింపజేసే ఆలోచన చేయాలి. కనీసం ప్రభుత్వ అధికారులు లేదా మంత్రిని పంపి విద్యార్థులతో చర్చించాలి. కానీ ఆందోళన చేస్తున్న విద్యార్థులను స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి 'గుంట నక్కలు'అంటూ సంబోధిస్తున్నారు. మరో మంత్రి పేమెంట్ బ్యాచ్ అంటూ విద్యార్థులపై నోరు పారేసుకుంటున్నారు. హెచ్‌సీయూలో జంతువులు లేవని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన కృత్రిమ మేధస్సును బయట పెట్టుకుంటున్నారు'అని కేటీఆర్ విమర్శించారు.

ముఖ్యమంత్రి రేవంత్ పెద్ద పాలేరు మాత్రమే..

'హెచ్‌సీయూ భూమిపై కొట్లాడుకునేందుకు ఇదేమీ దాయాదుల పోరు, ఆస్తి తగాదా కాదు. యూనివర్సిటీ విద్యార్థులకు రేవంత్ బంధువు కాదు. ముఖ్యమంత్రి అంటే నియంత, చక్రవర్తి, రాజు కాదు. పెద్ద పాలేరు తరహాలో ప్రజా సేవ చేయాలి. ప్రజాపాలన అంటూ ప్రజాస్వామిక స్ఫూర్తికి పాతరవేసి బుల్డోజర్లు, జేసీబీలతో పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారు. ప్రభుత్వ భూములకు సీఎం కేవలం తాత్కాలిక ధర్మకర్త మాత్రమే'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

రాహుల్ గాంధీ స్పందించాలి

హెచ్‌సీయూలో విద్యార్థులపై లాఠీచార్జి జరుగుతున్నా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. తాము చేస్తున్నది రాజకీయ పోరాటం కాదని, హైదరాబాద్ భవిష్యత్తు కోసమే తమ ప్రయత్నమని పేర్కొన్నారు. న్యాయపరంగా, నైతికంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు, పర్యావరణవేత్తలకు అండగా నిలుస్తామని కేటీఆర్ ప్రకటించారు.

హెచ్‌సీయూ విద్యార్థుల విజయం: కేటీఆర్

'కంచ గచ్చిబౌలి వ్యవహారాన్ని సుప్రీంకోర్టు చేపట్టడం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు సాధించిన విజయం. విద్యార్థుల నిస్వార్థ, నిరంతర స్ఫూర్తివంతమైన పోరాటం వల్లనే ఈ సానుకూల తీర్పు వచ్చింది. భూముల పరిరక్షణకు మద్దతు ఇచ్చిన పర్యావరణ ప్రేమికులు, సామాజిక కార్యకర్తలు, సెలబ్రిటీలు, మీడియా, సోషల్ మీడియా మిత్రులకు ధన్యవాదాలు..'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాగా.. 'ఆ భూముల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం రేవంత్‌రెడ్డి దుందుడుకు చర్యలకు చెంపపెట్టు లాంటిది. నిన్న పార్టీ ఫిరాయింపుల విషయంలో మొట్టికాయలు, నేడు హెచ్‌సీయూ భూముల విషయంలో అక్షింతలు. అధికారం బలంతో ఏది పడితే అది చేస్తామంటే చట్టం చూస్తూ ఊరుకోదు..'అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు.

'కంచ'పై మంత్రుల సంఘం

- డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో ఏర్పాటు
- 'ఎక్స్'లో వెల్లడించిన సీఎం రేవంత్



సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో మంత్రుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. హెచ్‌సీయూ పాలకవర్గం, జేఏసీ, పౌర సంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులతో సహా అన్ని భాగస్వామ్య పక్షాలతో ఈ కమిటీ చర్చలు జరిపి వివాదానికి పరిష్కారం చూపనుంది. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గురువారం 'ఎక్స్'వేదికగా వెల్లడించారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని వేలం వేసి పెద్ద మొత్తంలో ఆదాయాన్ని గడించాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుంది. ఈ మేరకు పనులు చేపట్టగా, విద్యార్థులతో పాటు పౌరసంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. దీనిపై తాజాగా సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో ప్రభుత్వం మంత్రులతో కమిటీని ఏర్పాటు చేసింది.

సుప్రీం ఆదేశాలను పాటిస్తాం



కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. సుప్రీంకోర్టు కోరిన సమాచారాన్ని గడువులోగా పంపిస్తామని చెప్పారు. కాగా విద్యార్థులపై కఠినంగా వ్యవహరించవద్దని ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, సైబరాబాద్ కమిషనర్లను డిప్యూటీ సీఎం, మంత్రి ఆదేశించారు.

ఫేక్ ఫొటోలతో దుష్ప్రచారం

- తప్పుడు ప్రచారంతో విద్యార్థులను రెచ్చగొడుతున్నారు
- లక్షల ఎకరాల్లో చెట్లు నరికిన చరిత్ర బీఆర్‌ఎస్‌దే
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధం లేని భూముల విషయంలో విద్యార్థులను రెచ్చగొడుతూ ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే వర్సిటీ భూములను కాపాడుతామని బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ప్రకటనలు హాస్యాస్పదంగా ఉందంటూ గురువారం ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఫేక్ ఫొటోలు, వీడియోలతో సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. పారిశ్రామిక అభివృద్ధితో ఉపాధి అవకాశాలు పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తుంటే.. ఆయనపై కేటీఆర్ వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎంపై చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పదేళ్లలో బీఆర్‌ఎస్ ఎందుకు నోరు మెదపలేదు?

బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఈ భూముల గురించి ఎందుకు నోరు మెదపలేదని మంత్రి ప్రశ్నించారు. ఆ పరిసర ప్రాంతాల్లోని భూములను బీఆర్‌ఎస్ నాయకులు అప్పనంగా బినామీలకు కట్టబెట్టారని ఆరోపించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో 4,28,437 ఎకరాల అటవీ భూమిని మాయం చేశారని విమర్శించారు. ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేని కాళేశ్వరం కోసం 7,829 ఎకరాల అటవీ భూమిని నాశనం చేశారని మండిపడ్డారు. దేశంలో చెట్లను నరికి రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మూడోస్థానంలో ఉందని అన్నారు. 111 జీవోను తొలగించి జంట జలాశయాల పరీవాహక ప్రాంతాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు.

ప్రొఫెసర్లపై లాఠీచార్జి అమానుషం

మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో విద్యార్థులకు మద్దతుగా ప్రొఫెసర్లు ర్యాలీ నిర్వహిస్తుంటే ప్రభుత్వం పోలీసులతో లాఠీచార్జి చేయించడం అమానుషం అని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రజా సంఘాలు, విద్యార్థులు, మేధావులు దీనిని ఖండించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఒంటెద్దు పోకడలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు.

“ఎవరైతే, విశ్వసించి సత్కార్యాలు చేస్తారో,
వారికి క్షమాపణ మరియు గౌరవప్రదమైన జీవనోపాధి ఉంటాయి.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 4 ఏప్రిల్ 2025

పంతం నెగ్గించుకున్న ఎన్డీయే

ఎవరు ఎంతగా వ్యతిరేకించినా వక్ఫ్ సవరణ బిల్లు చట్టంగా మారబోతోంది. అంతా సవ్యంగా ఉన్నప్పుడు ఎవరైనా స్వోత్కర్షలకు పోవచ్చు. కానీ క్లిష్ట సమయాలే ఎవరేమిటన్నది నిగ్గుదేలుస్తాయి. బిల్లు పార్లమెంటులో గట్టెక్కడం మాట అటుంచి టీడీపీ ఇన్నాళ్లుగా వేస్తున్న సెక్యులర్ వేషాలకు తెరపడింది. టీడీపీ, జేడీ(యూ)ల మద్దతు లేనిదే కేంద్రంలో ప్రభుత్వాన్నే నడపటం సాధ్యం కాని దీనస్థితిలోవున్న ఎన్డీయే సర్కారు... ఇప్పుడు వక్ఫ్ బిల్లుపై సునాయాసంగా తన పంతం నెగ్గించుకోవటం ఎలా సాధ్యమైందో అందరికీ తేటతెల్లమైంది. వీరితోపాటు మొదట వీరావేశంతో మాట్లాడిన ఒడిశాకు చెందిన బీజేడీ ఆఖరి నిమిషంలో స్వరం మార్చి పార్టీ ఎంపీలకు స్వేచ్ఛనిస్తున్నట్టు ప్రకటించటం ప్రభుత్వానికి కలిసొచ్చింది. నిరుడు ఆగస్టులో ఈ బిల్లు ప్రవేశపెట్టి ఆదరా బాదరాగా ఆమోదింపజేసుకోవాలని ప్రభుత్వం తహతహలాడినా విపక్షాలు తీవ్రంగా ప్రతిఘటించటంతో దీన్ని సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) పరిశీలనకు పంపక తప్పలేదు. ఎన్డీయే సర్కారు ఏర్పాటైన పదేళ్లలో ఒక బిల్లు జేపీసీకి వెళ్లటం అదే ప్రథమం. రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల అనంతరం పెరిగిన బలం వల్లనైతేనేమి, ఏపీకి చెందిన కొందరు దిగజారుడు ఎంపీలతో రాజీనామాలు చేయించటం వల్లనైతేనేమి అప్పటితో పోలిస్తే ఇప్పుడు రాజ్యసభలో ఎన్డీయే బలం పెరిగింది. అందుకే వక్ఫ్ బిల్లు సునాయాసంగా గట్టెక్కుతుందని అధికారపక్షం నిర్ణయానికొచ్చింది.

వక్ఫ్ ఆస్తులకు సంబంధించి సమస్యలు లేవని ఎవరూ అనరు. ఎన్నడో 1954లో వచ్చిన తొలి వక్ఫ్ చట్టం అవసరాలకు అనుగుణంగా లేదన్న ఉద్దేశంతో 1995లో దాని స్థానంలో మరో చట్టం తీసుకొచ్చారు. 2013లో సవరణలు చేశారు. అయినా మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం వున్నదని చాలామంది అభిప్రాయపడుతున్నారు. వక్ఫ్‌కు సంబంధించిన ఆస్తుల్లో దాదాపు సగం వరకూ వాటి యాజమాన్యం లేదా నిర్వహణకు సంబంధించి సమస్యలున్నాయి. అవినీతి ఉన్నదనీ, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనీ ఆరోపణలు రావటం కూడా వాస్తవం. పారదర్శకత పాటించటంలేదన్న విమర్శ కూడా ఉంది. వీటిని సరిదిద్దాలంటే ముస్లిం పండితులతో, నిపుణులతో, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వంటి సంస్థలతో మాట్లాడాలి. ఎలావుంటే బాగుంటుందన్న అంశంలో సూచనలూ, సలహాలూ తీసుకోవాలి. కానీ ఇవేమీ చేయకుండా బిల్లు తీసుకురావటంతో ముస్లిం వర్గాల్లో సంశయాలకు అవకాశం ఏర్పడింది. ముస్లింల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకునే ఈ బిల్లు తీసుకొచ్చినట్టు ప్రభుత్వం చెప్పటం బాగానేవున్నా ఆచరణ అందుకు విరుద్ధంగా ఉంది.

బుజ్జగింపు ధోరణితో, ఓటుబ్యాంకు రాజకీయాలపై దృష్టితోనే బిల్లును వ్యతిరేకిస్తున్నారని విపక్షాలపై ఆరోపణలు చేస్తున్న ప్రభుత్వం తాను చేసిందేమిటో ఆలోచించిందా? నిజంగా చిత్తశుద్ధి వుంటే బిల్లు రూపకల్పనకు ముందు ఆ వర్గాలతో చర్చించటానికి అభ్యంతరమేమిటి? ముస్లిమేతరులకు వక్ఫ్ బోర్డులు, కౌన్సిళ్లలో స్థానం ఎందుకు కల్పించారన్న విషయమై ప్రభుత్వం ఇచ్చిన సంజాయిషీ ఏమాత్రం సంతృప్తికరంగా లేదు. మసీదుల నిర్వహణ లేదా మతపరమైన ఇతర అంశాలకు సంబంధించి వక్ఫ్ కౌన్సిళ్లు జోక్యం చేసుకోబోవని, కేవలం వక్ఫ్ ఆస్తుల వ్యవహారాలనే చూస్తాయని కేంద్రమంత్రులు అమిత్ షా, కిరణ్ రిజుజు చెబుతున్నారు. కానీ మౌలికంగా వక్ఫ్ ఆస్తి అంటే సంపన్న ముస్లింలు భక్తిభావనతో మతపరమైన అవసరాల కోసం, ఆ వర్గాల అభ్యున్నతి కోసం దానం చేసే ఆస్తి. అటువంటప్పుడు ఆ ఆస్తుల నిర్వహణలో అన్యులకు చోటీయటం అసమంజసం కాదా? ఇతర మతాలకు సంబంధించిన ధార్మిక ఆస్తుల నిర్వహణలో కూడా ముస్లింలకు అవకాశం ఇస్తారా? ఒకవేళ అలా ఇచ్చినా అందుకు ఆ మతస్థులు అంగీకరిస్తారా? ఇంతకాలం ముస్లిమేతరులు సైతం తమ ఆస్తిని కారుణ్య భావనతో వక్ఫ్‌కు ఇవ్వొచ్చన్న నిబంధన ఉండేది. కానీ తాజా సవరణ ప్రకారం అయిదేళ్లపాటు ఇస్లామ్‌ను ఆచరిస్తేనే అందుకు అర్హత వస్తుంది. అయితే ఇస్లామ్ ఆచరణేమిటో బిల్లు వివరించలేదు. 2013లో ఆ మరుసటి సంవత్సరం జరిగే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో వుంచుకుని ఆదరా బాదరాగా వక్ఫ్ చట్టానికి అప్పటి యూపీఏ ప్రభుత్వం సవరణలు తెచ్చిందని, అందువల్ల ఒక్క ఢిల్లీలోనే అనేక ఆస్తులు వక్ఫ్ ఆస్తులుగా మారాయని ప్రభుత్వం చెబుతున్నది. కానీ ఆ సవరణలను నాటి బీజేపీ నేతలు ఎల్‌కే అద్వానీ, సుష్మాస్వరాజ్ సమర్థించారు. సవరణలు పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించటంలో తోడ్పడ్డారు.

వక్ఫ్ బిల్లు తీసుకొచ్చిన ఉద్దేశంపై దేశవ్యాప్తంగావున్న 20 కోట్లమంది ముస్లింలలో ఎన్నో సంశయాలున్నాయి. బిల్లులోని నిబంధనలు ఆ సంశయాలను మరింత పెంచేవిగా ఉన్నాయి. వక్ఫ్ ఆస్తుల్ని ఆర్నెల్లలోపు డేటా బేస్‌లో నమోదు చేయనిపక్షంలో వాటికి సంబంధించిన వివాదాలపై న్యాయస్థానాల మెట్లెక్కటం అసాధ్యమని బిల్లు చెప్పటం సమంజసంగా అనిపించదు. వివాదంలో పడిన వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ ఉన్నతాధికారి నిర్ణయం అంతిమం కావటం కూడా సమస్యాత్మకం. ఏ ఉన్నతాధికారైనా ప్రభుత్వ ప్రయోజనాలకు విరుద్ధంగా నిర్ణయం తీసుకోవటం సాధ్యమేనా? ఇది అనుమానాలు రేకెత్తించే అవకాశం లేదా? మొత్తానికి తెలుగుదేశం వంటి పక్షాలు బిల్లుకు ఓటేసి, ఆపైన సవరణలు తీసుకొచ్చామంటూ లీకులిస్తూ, తమ సవరణలతో బిల్లు పకడ్బందీగా వచ్చిందనడం హాస్యాస్పదం. అందులోని డొల్లతనం ఏమిటో ఈ నిబంధనలే చెబుతున్నాయి. క్లిష్ట సమయాల్లో తటస్థత వహించటం ద్రోహంతో సమానం. తటస్థత మాట అటుంచి నిస్సంకోచంగా బిల్లును సమర్థించి టీడీపీ తన నైజాన్ని బయట పెట్టుకుంది. ఇందుకు మూల్యం చెల్లించక తప్పదు.

దాడి కోసం సాకుల వెతుకులాట

విశ్లేషణ



టంకశాల అశోక్

ఇరాన్ అణు కార్యక్రమం గురించి మార్చి 25న ఆసక్తికరమైన నివేదిక ఒకటి వెలుగులోకి వచ్చింది. బయట అంతగా ప్రచారంలోకి రాని ఆ నివేదిక, అమెరికాకు చెందిన 18 ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు కలిసి రూపొందించింది. వాటిలో సీఐఏ, పెంటగాన్ డిఫెన్స్ ఇంటెలిజెన్స్, అమెరికా నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ వంటివి ఉండటం గమనించదగ్గది. ఆ నివేదికను బట్టి, ఇరాన్ అణ్వస్త్రాలను తయారు చేయడం లేదు, చేయాలని కూడా అనుకోవటం లేదు.

ఇది ఇరాన్ నాయకత్వం స్వయంగా చెప్తున్న విషయమే! అయినప్పటికీ అమెరికా నాయకత్వం, ఇజ్రాయెల్‌తో పాటు, అమెరికా ఆదేశాల ప్రకారం వ్యవహరిస్తుందా అనిపించే ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ అణుశక్తి పర్యవేక్షణ సంస్థ ఇందుకు విరుద్ధమైన వాదనలు చేస్తూ వస్తున్నాయి. అణ్వస్త్రాల ఉత్పత్తికి వీలు లేదని అమెరికా హెచ్చరిస్తుండగా, అసలు శాంతియుత ఉపయోగానికా లేక ఆయుధాల కోసమా అనే దానితో నిమిత్తం లేకుండా అణు పరిశోధనలనే సహించబోమని ఇజ్రాయెల్ వాదిస్తున్నది.

చర్చలకు సిద్ధం అంటున్నప్పటికీ...

వాస్తవానికి ఇరాన్ అణు పరిశోధనా కేంద్రాలన్నీ ఐక్యరాజ్యసమితి అణుసంస్థ పర్యవేక్షణలో ఎప్పటి నుంచో ఉన్నాయి. తమ పరిశోధనలు, వాటి నియంత్రణల విషయమై పాశ్చాత్య దేశాలతో చర్చలకు సిద్ధమని గతంలోనూ ప్రకటించిన ఇరాన్ నాయకత్వం, నిరుడు ఇజ్రాయెల్‌తో క్షిపణుల రూపంలో ప్రతి దాడుల తర్వాత మరొకమారు స్పష్టం చేసింది. అటువంటి అంగీకార పత్రం ‘జాయింట్ కాంప్రహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ (జేసీపీఓఏ) పేరిట 2015 నుంచి ఉండేది కూడా! కానీ ట్రంప్ పోయినసారి అధ్యక్షునిగా ఉన్నప్పుడు అమెరికా దాని నుంచి ఏకపక్షంగా ఉపసంహరించు కున్నది. ఇపుడు తిరిగి ఆ విషయమై చర్చలకు యూరోపియన్ దేశాలు సుముఖంగా ఉన్నా ఇజ్రాయెల్ అంగీకరించటం లేదు. అమెరికా ఒకవైపు చర్చలంటూ, మరొకవైపు బాంబింగ్ అని బెదిరిస్తున్నది. అయితే చర్చలు మధ్యవర్తుల ద్వారా తప్ప ప్రత్యక్షంగా జరిపే ప్రసక్తి లేదని ఇరాన్ స్పష్టం చేస్తున్నది.

దీన్నిబట్టి అర్థమవుతున్నదేమిటి? అమెరికా, ఇజ్రాయెల్‌లకు కావలసింది ఇరాన్ శాంతియుత వినియోగానికైనా సరే అణు పరిశోధనలు జరుపుకొనేందుకు వీలు లేదు. ఇరాన్ నుంచి అమెరికాకు మధ్య సుమారు 7,000 మైళ్లు, యూరప్‌తో సుమారు 1,500 మైళ్ల దూరం ఉంది. ఇరాన్ వద్ద అణ్వస్త్రాలు ఉన్నాయనుకున్నా వాటి నుంచి ముప్పు ఉండేది మొదట యూరప్‌కు. అయినప్పటికీ ఇరాన్ ప్రతిపాదించిన ప్రకారం చర్చలకు వారు సిద్ధంగా ఉన్నారు. ఇరాన్ అణ్వస్త్ర ప్రయోగం అమెరికాపై చేయాలంటే వాటిని అంతదూరం మోసుకుపోగల దీర్ఘశ్రేణి క్షిపణులు, బాంబర్లు అవసరం. ఇరాన్ వద్ద ఇటు అణ్వస్త్రాలుగానీ, అటు క్షిపణులూ బాంబర్లుగానీ లేవని అమెరికాకు తెలుసు. అదే సమయంలో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌ల వద్ద అవన్నీ వేలాదిగా ఉన్నాయి.

అయినప్పటికీ ఎందుకీ వైఖరి? ఇక్కడ అర్థమవుతుంది రహస్యం.



అమెరికాకు వ్యతిరేకంగా ఇరాన్‌లో నిరసన ప్రదర్శన (ఫైల్)

ఇరాన్ భౌగోళికంగా పశ్చిమాసియాలో భాగం. ఆ ప్రాంతం యావత్తూ పాశ్చాత్య శక్తులకు రెండు కారణాల వల్ల ముఖ్యమైనది. ఒకటి – తమ సామ్రాజ్యవాద భౌగోళిక వ్యూహాల దృష్ట్యా. రెండు, ఇరాన్ సహా ఆ ప్రాంతపు దేశాలన్నింటా గల అపారమైన చమురు నిక్షేపాలు. గాజా యుద్ధం ముమ్మరంగా సాగుతుండిన రోజుల్లో ఇజ్రాయెల్ తాము గాజాతో ఆగబోమని, మొత్తం పశ్చిమాసియా చిత్రాన్నే మార్చివేయగలమని ప్రకటించింది. ఆ మార్పులో భాగంగా ఇరాన్ ప్రస్తుత నాయకత్వాన్ని లేకుండా చేయగలమని బాహాటంగా హెచ్చరించింది. ఇరాన్‌లో ప్రస్తుత నాయకత్వం పట్ల ప్రజలలో కొంత అసంతృప్తి ఉన్న మాట నిజం. కానీ ఆ స్థాయి ఎక్కడైనా మామూలుగా ఉండేదేగానీ తీవ్రమైనది కాదు. అటువంటిది ఉంటే ప్రజాగ్రహంతో ఇరాన్ షా 1979లో పతనమైనట్లు జరిగేది. లేదా యూరప్‌లోని జార్జియా, ఉక్రెయిన్, కిర్గిజ్‌స్థాన్, యుగోస్లావియా వంటి దేశాలలో సీఐఏ ప్రోత్సాహంతో ‘కలర్ రివల్యూషన్స్’ పేరిట ప్రభుత్వాలను కూలదోయటం, దేశాలనే చీల్చటం చేసినట్లు జరిగి ఉండేది. కానీ అవేవీ సాధ్యం కాగల పరిస్థితులు ఇరాన్‌లో లేవు.

నేను ఒకసారి వారం రోజులపాటు ఇరాన్‌లో ఉండటం తటస్థించింది. అంతకు ముందు మొహమ్మద్ రజా పహ్లవీ చివరి నియంతగా ఉండిన కాలంలో, ఇండియాలోని పలు నగరాలలో చదువుతుండిన ఇరానియన్ విద్యార్థులు మా జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)కి వచ్చి కొద్ది రోజుల చొప్పున హాస్టళ్లలో బస చేసి, షా పాలన పట్ల నిరసనలు ప్రకటించి వెళుతుండేవారు. అలాగే పాశ్చాత్య దేశాల పన్నుగడల పట్ల ఆ ప్రజల వ్యతిరేకతలు ఎంతటివో కూడా వారి ద్వారా తెలుస్తుండేవి. షా ప్రభుత్వంతోపాటు పహ్లవీ వంశ రాచరికం కూలిన దశాబ్దాల అనంతరం సైతం పాశ్చాత్య శక్తుల పట్ల వ్యతిరేకతలు ఎంతమాత్రం మారలేదని నేనక్కడ ఉన్న రోజులలో అర్థమైంది. అందుకు కారణం తమ పట్ల అమెరికా కూటమి విధానాలుగానీ, ఇజ్రాయెల్ కేంద్రిత వ్యూహాలుగానీ మారక పోవటమే!

ఇరానే ఎందుకు లక్ష్యం?

పాలస్తీనా సమస్యపై అరబ్ దేశాలకు, ఇజ్రాయెల్‌కు మధ్య యుద్ధాలలో ఇజ్రాయెల్ గెలవటం, ఈజిప్టు నేత గమాల్ అబ్దుల్ నాసర్ మృతితో పాన్ అరబిజం బలహీన పడటంతో అరబ్ రాజ్యాలకు ఇజ్రాయెల్ పట్ల రాజీ వైఖరి, అమెరికా కూటమి పట్ల సఖ్యత మొదలయ్యాయి. ఇజ్రాయెల్‌ను గుర్తించి దౌత్య సంబంధాలు నెలకొల్పుకోసాగాయి. పాలస్తీనాను నెమ్మదిగా మరచిపోయాయి. పాలస్తీనా నాయకుడు అరాఫత్ 2004లో మృతి చెందిన తర్వాత కొత్తగా అధికారానికి వచ్చినవారు అమెరికా, ఇజ్రాయెల్‌లకు పూర్తిగా మచ్చిక అయిపోయారు. హమాస్ కారణంగా ఇటీవలి యుద్ధం తలెత్తకపోయి ఉంటే బహుశా పాలస్తీనా విషయం అన్నదే క్రమంగా మరుగున పడేది. అరబ్ రాజ్యాలన్నీ పాలస్తీనాను ఇంచుమించు వదిలివేయగా, బలమైన మద్దతుగా నిలిచిన దేశం ఇరాన్. ఆసక్తికరం ఏమంటే, సున్నీ ముస్లిం దేశమైన పాలస్తీనాను సున్నీ అరబ్ రాజ్యాలు వదిలివేయగా, షియా రాజ్యమైన ఇరాన్ వారి వెంట నిలిచింది. వారికి ఇరాన్ కనీసం పొరుగు దేశమైనా కాదు. పాలస్తీనా సమస్యతో తనకేమి సంబంధం అని భావిస్తే అడిగేవారు లేరు. అయినా ఇటువంటి వైఖరి తీసుకోవటం ఇజ్రాయెల్, అమెరికాలకు ఎంత మాత్రం సరిపడనిది అయింది. ఇరాన్‌తో అరబ్ దేశాలకూ సున్నీ–షియా భిన్నత్వం కారణంగా అరకొర సంబంధాలు మాత్రమే ఉన్నాయి.

ఈ మొత్తం పరిస్థితుల మధ్య పశ్చిమాసియాలో ఇరాన్ ఒక్కటే ఇజ్రాయెల్, అమెరికాలకు ఏకైక శత్రు దేశంగా మిగిలింది. లెబనాన్, సిరియా, హిజ్బొల్లా, హౌతీలను ఏదో ఒక విధంగా దారికి తెచ్చుకోవచ్చు. కానీ ఇరాన్ సాధారణమైన శక్తి కాదు. అది గాక దాని వెంట రష్యా, చైనా ఉన్నాయి. పైపెచ్చు ఇటీవల ఉమ్మడి సైనిక విన్యాసాలు జరిపాయి. అణు రంగం విషయమై కూడా త్రైపాక్షిక చర్చలు నిర్వహించాయి. అణు ఇంధనం ఇరాన్ రియాక్టర్లలో ప్రస్తుతం 60 శాతం మేరకు శుద్ధి అయి ఉంది. శాంతియుత వినియోగానికి అది అవసరం. అణ్వస్త్రాల కోసం 90 శాతం శుద్ధి కావాలి. ఆ స్థాయికి వెళ్లగల సాంకేతిక శక్తి ఇరాన్‌కు ఉంది. కానీ అటువంటి ఆయుధాల తయారీ ఇస్లాంకు వ్యతిరేకమంటూ పాతికేళ్ల క్రితం ప్రకటించిన అధినాయకుడు అలీ ఖమేనీ ఇప్పటికీ అందుకు కట్టుబడి ఉన్నారు. అయినప్పటికీ ఇజ్రాయెల్, అమెరికాలు యుద్ధం చేయదలచిన వారికి సాకులు కరవా అన్నట్లు ప్రవర్తిస్తున్నాయి.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

- ఇరాన్ అణ్వస్త్రాలను తయారు చేయడం లేదని అమెరికా ఇంటెలిజెన్స్ ఏజెన్సీల నివేదికే చెబుతోంది. అయినా అమెరికా, ఇజ్రాయెల్ భిన్నవాదనలు చేస్తున్నాయి.
- పాశ్చాత్య శక్తులకు పశ్చిమాసియా రెండు కారణాల వల్ల ముఖ్యమైనది. సామ్రాజ్యవాద భౌగోళిక వ్యూహాల దృష్ట్యా, అపారమైన చమురు నిక్షేపాల దృష్ట్యా.
- అరబ్ రాజ్యాలన్నీ పాలస్తీనాను ఇంచుమించు వదిలి వేయగా, బలమైన మద్దతుగా నిలిచిన దేశం ఇరాన్. ఈ వైఖరి ఇజ్రాయెల్, అమెరికాలకు సరిపడనిది అయింది.

సోషల్ మీడియా

ఆస్తుల వెల్లడి



బిగ్ స్టోరీ: సుప్రీంకోర్టు న్యాయ మూర్తులు తమ ఆస్తులను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ప్రకటించనున్నారు. ఏప్రిల్ 1న జరిగిన సమావేశం తర్వాత నిర్ణయం తీసుకోవడమైనది. ప్రకటన స్వచ్ఛందం. ఇప్పటివరకూ ప్రధాన న్యాయమూర్తితో సహా 30 మంది న్యాయమూర్తులు తమ ఆస్తులను వెల్లడించారు. ఇది ఓ న్యాయమూర్తి ఇంటి దగ్గర నగదు వివాదపు ఫలితమా?

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ముందు చూపితే!



మణిపూర్ సమస్యను చర్చించడానికి నెలల తరబడి తిరస్కరించిన లోక్‌సభ... మొత్తానికి అర్ధరాత్రి రెండింటికి, దేశం మొత్తం నిద్రిస్తున్నప్పుడు, రాష్ట్రపతి పాలనను ఆమోదించే విషయం చర్చించింది. ఇదే వేగిరపాటు ఇంతకుముందు చూపివుంటే!

– మనూ సెబాస్టియన్, సంపాదకుడు

భాష ఇబ్బంది



హిందీ వ్యతిరేక ఆందోళనలు జరిగిన ఆరో దశకంలో తమిళ నాడులో పెరిగిన మాలాంటివాళ్లం రాజకీయ వలలో చిక్కుకున్నాం. హిందీని ఎగతాళి చేశాం. నేను బొంబాయి, అహ్మదాబాద్‌లో బ్యాంకు అధికారిగా, అడ్వర్టైజింగ్ ప్రొఫెషనల్‌గా ఇబ్బందులు పడ్డాను.

– రామానుజన్ శ్రీధర్, కమ్యూనికేషన్స్ కన్సల్టెంట్

దెబ్బకొట్టాయి!



జేడీ(యూ), టీడీపీ, ఎల్‌జేపీ (వక్ఫ్ బిల్లుకు మద్దతివ్వడం ద్వారా) పార్టీలు తమ ఓటర్లయిన ముస్లింలను వెన్నులో కాదు, ఛాతీలో పొడిచాయి!

– అపూర్వానంద్, ప్రొఫెసర్

మళ్లీ మొదటికా?



వియత్నాం మీద 46 శాతం, కంబోడియా మీద 49 శాతం సుంకాలు అమెరికా విధించడం అత్యంత దారుణం. చాలా కంపెనీలు తమ ఉత్పత్తులను చైనా నుంచి బయటపడటానికి ఇక్కడికి తరలించాయి.

– ర్యాన్ పీటర్‌సన్, ఆంట్రప్రెన్యూర్

ఇన్ బాక్స్

‘కంచ’ను మేస్తే...

కంచెలను తొలగిస్తమంటే
మిమ్ముల కాడెడ్లమై
మా మెడల మీదకు ఎక్కించుకున్నం
మీరే ‘కంచ’ను మేస్తరని
తెలుసుకోలేక పోయినం
అయ్యా...
అది మీ భూమో మా భూమో కాదు
ఈ నగరపుజీవి ఆక్సిజన్ బండ
నగరమిప్పుడు వెంటిలేటర్ మీద ఉన్నది
కొన ఊపిరిని తీసి
మీరు కట్టే ఈ అభివృద్ధి
శవపేటిక ఎవరి కోసం??
ఏ పిట్టలు ఎటువైపు నుండో
ఆకలితో వత్తయని
గుడిసె ముందర సూరుకిందా
వరి కంకులు యాలాడగడ్తం
గుడిసెలొక్కలే మలుసుకోను జాగున్న
ఏ పిచ్చుకలన్నొచ్చి
ఇంత సాటుజేసుకుంటే
సూశి మస్తు సంబురపడ్తం
అసువంటి ఈ గడ్డ మీద
మీ మరయంత్రాల రొదలకు
జడిసిన జీవుల పరుగులు
పచ్చులు చేస్తున్న ఆర్తనాదాలు
మీ మనసునెట్లా కదిలిస్తలేవు ప్రభూ!
ఓ... మీ హృదయాలకు
అధికారపు కంచెలు
తొడుక్కున్నారు కాబోలు
ఏమీ కనబడకుండా ఏమీ వినబడకుండా
మీరు ఊపిరి గొంతుకలను
నలుపాలని సూడకుర్రి
రేపటి మీకూ పానముండదు!
మాకు కంచెలను తీసేసుకునుడే గాదు
‘కంచ’ను కాపాడుకునుడు తెల్సు!!

– దిలీప్.వి I 84640 30808

కోర్టు ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టు

అభిప్రాయం



నైనాల గోవర్ధన్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల ‘కంచ గచ్చిబౌలి’ భూమిని, రేవంత్ రెడ్డి సర్కార్ వేలానికి పెట్టింది. వేలం వద్దని విద్యార్థులు జేఏసీగా ఏర్పడి కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఉగాది పండగ రోజున ఆ ప్రాంతపు చెట్లను తొలగించి, మట్టిని చదును చేయడానికై 50 భారీ బుల్డోజర్లు, పొక్లెన్లతో, వందలాది మంది పోలీసులు ఆ భూమిలోకి వెళ్లారు. వాటిని అడ్డుకోవడానికి యత్నించిన విద్యార్థులపై పోలీసులు విరుచుకుపడ్డారు. జుట్టు పట్టి ఈడ్చి వాహనాల్లో పడేశారు. 200 మందిని, 4 పోలీస్ స్టేషన్లకు తరలించారు. చివరికి ఈ వ్యవహారం దేశ అత్యున్నత న్యాయస్థానానికి చేరడంతో జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం స్టే ఆదేశాలు జారీ చేసింది.

గత కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ భూములను 100 కోట్లకు ఎకరం అమ్మింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమ్మకానికి పూనుకున్న కంచ గచ్చిబౌలి భూమి ఎకరాకు 100 కోట్ల పైమాటే. 400 ఎకరాలను వేలం వేస్తే 40 వేల కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం దృఢంగా భావించింది. అందుకే ఆందోళన చేస్తున్న విద్యార్థులపై తీవ్ర హింసకు పూనుకుంది. తద్వారా ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన 7వ హామీ ‘ప్రజాస్వామ్య హక్కుల రక్షణను పాతిపెట్టినట్లే’!

‘ఆధునిక రాజ్యంలో ప్రభుత్వం అనేది మొత్తం బడా సంపన్నుల సమష్టి వ్యవహారాలు చక్కబెట్టే కమిటీ మాత్రమే’ అని ఒక జర్మన్ తత్వవేత్త అంటారు. అంటే సామాన్య మెజారిటీ ప్రజలు కేంద్రంగా ప్రభుత్వాలు పనిచేయవని ఉద్దేశం. హెచ్‌సీయూ భూములను అమ్ముతున్న తెలంగాణ ప్రభుత్వం, ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్ముతున్న మోదీ ప్రభుత్వ విధానాలకు పైవాక్యం సరిగ్గా సరిపోతుంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా బడా పెట్టుబడిదారులకు అమ్ముతోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వవిద్యాలయ భూములను బడా కార్పొరేట్లకు అమ్మకానికి పూనుకుంది. ఇది ఈ దేశ విద్యార్థుల వైజ్ఞానిక భవిష్యత్తుకు విద్రోహం తలపెట్టడమే! ఉన్న ప్రభుత్వ వనరులను తెగనమ్మడానికి బదులు.... ప్రత్యామ్నాయంగా మోదీ–రేవంత్ బడా సంపన్నులపై ‘ప్రగతిశీల పన్ను’ ఎందుకు



వేయకూడదు? అవినీతి సొమ్మును, లక్షల కోట్ల నల్లధనాన్ని ప్రజల ప్రయోజనం కొరకు వెలికి తీసి, ఎందుకు వినియోగించకూడదు?

పాలకులు ప్రజల ఆస్తులు అమ్మడమే ఏకైక పనిగా సాగుతున్నారు. దశాబ్దాలుగా పథకం ప్రకారం విశ్వవిద్యాలయం భూములకు కోత విధిస్తున్నారు. కేసీఆర్... ప్రభుత్వ భూములను అమ్మితే దునుమాడిన రేవంత్ రెడ్డి... అదే పనికి ఇప్పుడు పూనుకున్నారు. ఈ చర్య అక్కడి జీవావరణ – పర్యావరణ స్థితిని నాశనం చేస్తుంది. హెచ్‌సీయూ వెల్లడించిన సమాచారం ప్రకారం 734 రకాల పూల మొక్కలు, 10 క్షీరద జాతులు, 15 రకాల సరీసృపాలు, నెమళ్లు లాంటి 220 రకాల పక్షులు, రెండు చెరువులు ఇక్కడ ఉన్నాయి. పుట్టగొడుగుల్లా పోలి ఉండే ప్రకృతి సిద్ధమైన భారీ బండరాళ్ల అమరికలు ఈ 400 ఎకరాలలో ఉన్నాయి. ఈ ప్రకృతి వైవిధ్యాన్నీ, దేశ భవిష్యత్తునూ ప్రభుత్వం విధ్వంసం చేయతలపెట్టింది. విశ్వవిద్యాలయ భూమిలో ప్రపంచ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని బుకాయిస్తోంది.

ఇటీవలే చైనాలో మన హెచ్‌సీయూ లాంటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో చదివిన విద్యార్థులే ‘డీప్ సీక్’ అనే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)ను, అతి చౌకగా ఆవిష్కరించారు. అమెరికా టెక్ ఆధిపత్యాన్ని కూల్చారు. భూములను అమ్మడం కంటే, ప్రపంచ ప్రమాణా లతో కూడిన, ఆధునిక మానవ అవసరాలను నెరవేర్చే చదువులు మరింత భారీ డబ్బును సమీకరిస్తాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల్లో నెలకొల్పుదామనే ప్రపంచ కంపెనీలు, ఈ విశ్వవిద్యాలయాల్లో చదివిన విద్యా ర్థులు సృష్టించే సంపద కంటే గొప్పవేం కాదు. ‘అక్కడ పులులు జింకలు లేవు. కొన్ని నక్కలు మాత్రమే అభివృద్ధిని అడ్డుకోవడానికి చూస్తున్నాయి. ప్రతిపక్షాలు విద్యార్థులను రెచ్చ గొడుతున్నాయ’ని ముఖ్యమంత్రి మాట్లాడడం అత్యంత దురదృష్టకరం. గురువారం (ఏప్రిల్ 3వ తేదీ) సుప్రీంకోర్టులోనూ ప్రభుత్వం అసలు అది అటవీ భూమికాద’ని బుకాయించడమూ తెలిసిందే.

ప్రభుత్వ విలువైన భూములను, సహజ వనరులను ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు ధారాదత్తం చేయకూడదని 2012 సెప్టెంబర్ 14న విడుదలైన జీఓఎమ్ఎస్ నం. 571 స్పష్టంగా చెబుతోంది. వనరుల సమీకరణ కొరకు ప్రభుత్వ భూములను అమ్మడం, వేలం వేయడం వల్ల భూమి తీవ్రంగా తగ్గిపోయి అన్యాక్రాంతమవుతుంది. దీనివల్ల సమాజ భవిష్యత్తు, ప్రజా ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతింటాయని ఈ జీవో పేర్కొంటున్నది. ప్రభుత్వ భూముల వినియోగం, అత్యంత శాస్త్రీయంగా న్యాయ బద్ధంగా ఉండాలని ఈ జీఓ చెబుతోంది. ప్రజల ప్రయోజనం కొరకే భూములను కేటాయించాలి. ఆ భూమి వల్ల వచ్చే భవిష్యత్ ప్రయోజనాలన్నీ ప్రజలకే చెందాలి. ప్రజా ప్రయోజనాలకు ఇవ్వవలసి వస్తే బంజరు భూములను, డ్రై ల్యాండ్స్‌ను మాత్రమే కేటాయించాలి. రెండు పంటలకు సాగు నీటి వసతి గల భూములను అసలు కేటాయించడానికి వీలు లేదు. పర్యావరణపరంగా సున్నితమైన భూములను, ట్యాంక్ బెడ్స్‌ను, రివర్ బెడ్స్‌ను, కొండలను, అడవులను ఎట్టి పరిస్థితుల్లో అన్యాక్రాంతం చేయకూడదు. ప్రభుత్వ భూము లను, నిధుల సమీకరణ కొరకు, ఎట్టి పరిస్థితులలో వేలం వేయరా దని ఈ జీఓ స్పష్టం చేస్తోంది.

హెచ్‌సీయూ భూమి పర్యావరణపరంగా సున్నితమైంది. హైదరాబాద్ మహానగరానికి ఊపిరితిత్తి లాంటిది. నీరు ఇంకడానికి భూగర్భ నీటిమట్టాన్ని పెంచడానికి ఇతోధికంగా తోడ్పడుతోంది. ఇంత విలువైన భూములను, ప్రైవేట్ బడా కంపెనీలకు ధారాదత్తం చేయడం భావ్యమా? ఈ సంగతులన్నింటినీ గ్రహించింది కాబట్టే సుప్రీం కోర్టు గురువారం తెలంగాణ ప్రభుత్వాన్ని తీవ్రంగా మందలించింది. ఈ భూముల్లో ప్రభుత్వం ఎటువంటి కార్యకలాపాలనూ నిర్వహించకుండా స్టే విధించింది. ఈ నెల 16న తిరిగి ఈ కేసుపై వాదనలు వింటామనీ, అప్పటికి ఈ భూములపై సమగ్ర నివేదికను తయారుచేసి తమకు సమర్పించాలనీ ఆదేశించింది. ఈ ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటివని వేరే చెప్పనవసరం లేదు కదా!

వ్యాసకర్త తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ I 97013 81799

దేవుని చేరే మార్గం

ఓ రోజు మహావిష్ణువు తనకెంతో ప్రియమైన గరుత్మంతుడిని చూసి ‘ఈ ప్రపంచంలో ఎన్ని రకాల మనుషులు ఉన్నా ర’ని అడిగాడు. అందుకు గరుత్మంతుడు ‘మూడు రకాలు. మొదటి రకం... పక్షి–దాని పిల్లల వంటివారు. రెండో రకం... ఆవు–దూడ వంటివారు. ఇక మూడవ రకం ... భార్యాభర్తల వంటి వారు’ అన్నాడు గరుడుడు. ఇంకాస్త విడమరిచి చెప్పమన్నాడు విష్ణువు. గరుడుడు ఇలా చెప్పాడు: ‘పక్షి గుడ్లు పెట్టి వాటిని పొదిగి పిల్లల ఆహారం కోసం బయటికి పోయి తిరిగొచ్చే లోపల పాము కొన్ని పిల్ల పక్షు లను తింటుంది. ఆహారంతో తిరిగొచ్చిన తల్లిపక్షి కనిపించకుండా పోయిన పిల్లల కోసం ఆందోళన చెందదు.



మిగి లిన వాటికి ఆహారం పెడుతుంది. అలాగే తమ నోట్లో పెడుతున్న ఆహారం మాత్రమే పిల్లపక్షులకు తెలుస్తుంది. తన తల్లి ఎవరు, తండ్రి ఎవరు, బయటకు వెళ్ళినవి వస్తాయా, రావా వంటివన్నీ తెలీదు. రోజులు గడిచే కొద్దీ ఎగరడానికి ప్రయత్నించి కింద పడి చనిపోతాయి. కొన్ని మిగులుతాయి. ఇటువంటి మనుషులు పేదరికంతో పోరాడుతారు. దొరికింది తింటారు. లేదంటే పస్తులుంటారు. దైవం కరుణిస్తుందేమోనని కడదాకా ఎదురు చూస్తుంటారు.

రెండో రకం విష యానికి వస్తే... ఆవు–దూడలను విడివిడిగా కట్టి వేయడం వల్ల ఎదురెదురుగా ఉన్నా అవి దగ్గరగా రాలేక ఒకదాన్ని చూసి మరొకటి అరుస్తూ ఉంటాయి. దూడకు తెలుసు, ఆవు దగ్గరకు వెళ్ళి పాలు తాగితేనే ఆకలి తీరుతుందని! కానీ కట్టే యడం వల్ల తను తల్లి దగ్గరకు వెళ్ళలేక పోతుంది. ఇలాగే మనుషులు కూడా! వారికి ఫలానా వారి (దేవుని) వల్ల అను కున్నది జరుగుతుందని తెలుసు. కానీ అక్కడికి వెళ్ళలేక పాశమనే వలలో చిక్కి పరితపిస్తుంటారు. మూడో రకం: ముక్కూ మొహం తెలీని ఇద్దరు స్త్రీపురుషులు పెళ్లిచేసుకుంటారు. మొదట్లో ఒకరంటే ఒకరు బెరుకు బెరుకుగా ఉంటారు. అయితే కాలక్రమంలో ఒకరి కోసం మరొకరు తమ ప్రవర్తనను మార్చుకుని విడదీయ రాని బంధం ఏర్ప రచుకుంటారు. ఇటువంటివారు దైవ చింతనతో ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ, తమ వ్యక్తిత్వ లోపాలనూ సరిదిద్దుకుంటారు’ అన్నాడు గరుడుడు. విష్ణువు గరుడుని విశ్లేషణకు సంతసించి, దీవించి పంపాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: శు.సప్తమి రా.1.50 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: మృగశిర ఉ.11.16 వరకు, తదుపరి ఆరుద్ర, వర్జ్యం: రా.7.25 నుండి 8.56 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 9.11వరకు, తదుపరి ప.12.26 నుండి 1.15 వరకు, అమృత ఘడియలు: రా.12.46 నుండి 2.20 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.57, సూర్యాస్తమయం: 6.10.

క్లుప్తంగా...

మోకిల పీఎస్‌కు జీవన్‌రెడ్డి

- టంగుటూర్ భూముల కేసులో విచారణకు హాజరైన మాజీ ఎమ్మెల్యే



శంకర్‌పల్లి: టంగుటూర్‌లో భూములకు సంబంధించిన కేసులో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి గురువారం మోకిల పీఎస్‌కు వచ్చారు. సీఐ వీరబాబు జీవన్‌రెడ్డిని స్టేషన్‌లో విచారించారు. తన భూమి కబ్జా చేశారంటూ సామ దామోదర్‌రెడ్డి 2024 మే 27న.. జీవన్‌రెడ్డి, ఆయన తల్లి రాజుబాయి, భార్య రజితపై మోకిల ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో జీవన్‌రెడ్డి హైకోర్టుకు వెళ్లగా, ఆయన తల్లి రాజుబాయి, భార్య రజితలకు బెయిల్ వచ్చింది. ఇదే కేసులో జీవన్‌రెడ్డి సుప్రీంకోర్టుకు వెళ్లగా, అరెస్ట్ చేయొద్దని విచారణకు సహకరించాలంటూ జీవన్‌రెడ్డికి సూచించింది. దీంతో ఆయన మోకిల పీఎస్‌కు వచ్చారు. విచారణ అనంతరం జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. '2016లో టంగుటూర్‌లో 114 ఎకరాల భూమిని కొనుగోలు చేశాను. నాటి నుంచి 2024 వరకు నేనే పొజిషన్‌లో ఉన్నా. ఆ ఎనిమిదేళ్లలో లేని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చింది? ఇది సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ కక్ష సాధింపు చర్యే' అని జీవన్‌రెడ్డి ఆరోపించారు.

కేర్లపాల్ ఎన్‌కౌంటర్‌కు నిరసనగా 7న బంద్

- మావోయిస్టు పార్టీ దర్భా డివిజినల్ కమిటీ కార్యదర్శి సాయినాథ్

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా కేర్లపాల్ సమీపంలో మార్చి 29న జరిగిన ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ ఈనెల 7న దంతెవాడ, సుక్మా, బస్తర్ జిల్లాల బంద్ పాటించాలని మావోయిస్టు పార్టీ దర్భా డివిజినల్ కమిటీ కార్యదర్శి సాయినాథ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన పేరిట లేఖ విడుదలైంది. మార్చి 29న కేర్లపాల్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరులైన 17 మంది సహచరులకు దర్భా డివిజినల్ కమిటీ నివాళులర్పించిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరుతో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు వందలాది మంది విప్లవకారులను హతమార్చాయని ఆరోపించారు. ఈ నేపథ్యాన దాడులకు వ్యతిరేకంగా ఈనెల 7న సుక్మా, దంతెవాడ, బస్తర్ ప్రాంతాల్లో బంద్ పాటించాలని సాయినాథ్ పిలుపునిచ్చారు.

మద్యం మత్తులో భర్తను చంపిన భార్య



సమ్మయ్య

ఏటూరునాగారం: మద్యం మత్తులో భర్తను కట్టుకున్న భార్య కర్రతో మోది చంపింది. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రొయ్యూర్‌లో గురువారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మండపు సమ్మయ్య(58), భార్య స్వప్నలు రోజూ మద్యం తాగి గొడవపడుతుండేవారు. ఈ క్రమంలో గురువారం ఉదయం కూడా ఇద్దరూ గొడవపడ్డారు. భార్య స్వప్న ఆగ్రహంతో కర్రతో భర్త సమ్మయ్య తలపై బలంగా కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే చనిపోయాడు. బంధువుల ఫిర్యాదుతో స్వప్నపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.



భద్రాద్రి రామా.. కనవేమి ఈ కష్టాలు

- వసతుల లేమితో సామాన్య భక్తుల ఇక్కట్లు
- ప్రధాన ఉత్సవాల సమయంలో కష్టాలు డబుల్
- సిబ్బంది, ప్రముఖులకే వసతి గదులు, కాటేజీలు
- పదేళ్లయినా అమలుకు నోచుకోని మాస్టర్ ప్లాన్
- 6న సీతారాముల కల్యాణానికి సీఎం రేవంత్ రాక

భద్రాచలం: దక్షిణ అయోధ్యగా ఘనతకెక్కిన భద్రాచలంలో రాములోరి భక్తులకు సీతమ్మ కష్టాలు తప్పటం లేదు. శతాబ్దాలుగా పెద్దగా అభివృద్ధికి నోచుకోకపోవటంతో ప్రధాన ఉత్సవాల సమయంలో తరలివచ్చే లక్షల మంది భక్తులకు మౌలిక వసతులలేమి తీవ్ర సమస్యగా మారుతోంది. శ్రీరామ నవమి వంటి ఉత్సవాల సమయంలో సామాన్య భక్తులకు కనీసం తలదాచుకొనేందుకు చోటు లేక గోదావరి ఇసుక తిన్నెలు, కరకట్ట వెంట సేద తీరాల్సి వస్తోంది. 17వ శతాబ్దంలో కుతుబ్‌షాహీల కాలంలో భద్రగిరిపై కంచర్ల గోపన్న నిర్మించిన ఆలయం ప్రధాన గోపురానికి కొద్దిపాటి మార్పులు తప్ప పూర్తిస్థాయిలో దేవస్థానాన్ని ఆధునీకరించ లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక యాదగిరిగుట్ట ఆలయంతో పాటు భద్రాచలం ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించింది. ప్రముఖ ఆర్కిటెక్ట్ ఆనందసాయి ఆధ్వర్యంలో మాస్టర్‌ప్లాన్ సైతం సిద్ధం చేశారు. కానీ, అభివృద్ధి పనుల శంకుస్థాపనకు కూడా నోచుకోలేదు. అదే సమయంలో యాదగిరిగుట్ట ఆలయ పునఃనిర్మాణం మాత్రం పూర్తయింది.

మాస్టర్‌ప్లాన్‌లో మళ్లీ కదలిక

పదేళ్లుగా మూలన పడిన మాస్టర్ ప్లాన్‌ను కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల హామీ మేరకు మళ్లీ బయటికి తీసింది. ఈ నెల 6న భద్రాచలంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో పట్టువస్త్రాలు సమర్పించడానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ అభివృద్ధిలో ప్రధానమైన మాడ వీధుల విస్తరణకు భూ, ఇళ్ల నిర్వాసితుల పరిహారం కోసం ప్రభుత్వం రూ.34 కోట్లు విడుదల చేసింది. ఈ అభివృద్ధి పనులకు 6న సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసే అవకాశముంది. మాస్టర్‌ప్లాన్‌లో ఆలయ అభివృద్ధితోపాటు భక్తులకు సౌకర్యాలు, మౌలిక వసతులకు చోటు కల్పించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

వసతులు కల్పిస్తే మరింత ఆదరణ

ప్రభుత్వం ఆలయాన్ని అభివృద్ధి చేస్తే భద్రాచలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు కూడా పర్యాటకంగా అభివృద్ధి చెందుతాయి. భద్రాచలంలో ఏటా ముక్కోటి, శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. వీటికి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. దీంతోపాటు భద్రాచలం ఏజెన్సీలో ప్రకృతి అందాల వీక్షణకు పర్యాటకులు వస్తున్నారు. కానీ, సరిపడా వసతులు లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. ఉత్సవాల సమయంలో భద్రాచలంలోని వసతి గదులు ముప్పావు భాగం విధుల కోసం వచ్చే సిబ్బందికే సరిపోతాయి. కాటేజీలు దాతలకు, వీఐపీలకే పరిమితం. దీంతో రెండు రోజుల వసతి కోసం ప్రైవేటులో రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వెచ్చించలేని సామాన్య భక్తులు గోదావరి ఇసుక తిన్నెలు, కరకట్ట ప్రాంతాల్లో సేద తీరుతున్నారు. ప్రధాన ఆలయం, గోదావరి, ఉపాలయాలను కలిపి స్పెషల్ కారిడార్ రూపొందిస్తే భక్తులు, పర్యాటకుల రాక పెరుగుతుందని స్థానికులు అంటున్నారు. 'భద్రాచలం టెంపుల్ అండ్ ఏరియా డెవలప్‌మెంట్ స్పెషల్ అథారిటీ'ని ప్రకటించి అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. 1964లో సీతారాముల కల్యాణం కోసం నిర్మించిన మిథిలా స్టేడియం నేడు సరిపోవటంలేదు. ఈ స్టేడియాన్ని పునఃనిర్మించి, గోదావరి నుంచి మోతెగడ్డ ద్వీపంలోని శివాలయానికి బోటింగ్ సౌకర్యం కల్పిస్తే పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని అంటున్నారు. అలాగే, పర్ణశాల ఆలయ అభివృద్ధిపైనా దృష్టి సారించాలని, కరకట్టపై సోలార్ షెడ్ నిర్మిస్తే భక్తులకు నీడతో పాటుగా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని సూచిస్తున్నారు.

యాసంగి ధాన్యం కొనుగోళ్లు షురూ!

- రాష్ట్రంలో వరి సాగైన భూమి 56 లక్షల ఎకరాలు
- కోటీ 40 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- ఈ సీజన్‌లో 70.13 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అవకాశం
- నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండల్లో మొదలైన కొనుగోళ్లు
- అకాల వర్షాలతో రైతుల ఆందోళన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యాసంగి సీజన్ కోతలు మొదలు కావడంతో పౌరసరఫరాల సంస్థ.. రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించడం ప్రారంభించింది. ముందుగా నాట్లు వేసిన నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ, నారాయణపేట వంటి జిల్లాల్లో వరికోతలు మొదలయ్యాయి. మార్చి నెలాఖరు నుంచే పౌరసరఫరాల సంస్థ ఆ మేరకు ధాన్యం సేకరణను ప్రారంభించింది. నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో 778 మంది రైతుల నుంచి రూ.22.99 కోట్ల విలువైన 9,908 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సంస్థ కొనుగోలు చేసింది. ఈనెల 10వ తేదీ తరువాత కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెపుతున్నారు. అదే సమయంలో ప్రతి ఏప్రిల్, మే నెలల్లో భయపెట్టే అకాల వర్షాలు ఈసారి కూడా రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. గురువారం కురిసిన వర్షంతో పలు జిల్లాల్లో పంటలకు నష్టం కలిగినట్లు ప్రాథమిక సమాచారం.

70.13 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు అంచనా

రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో 56.95 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఎకరాకు సగటున 25 క్వింటాళ్లకు పైన దిగుబడి వస్తుందని అనుకుంటే, ఈ సీజన్‌లో కోటీ 40 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని ప్రభుత్వం లెక్కలు వేస్తోంది. అయితే నిజామాబాద్, నల్లగొండ, నారాయణపేట, కామారెడ్డి, ఖమ్మం, సూర్యాపేటల్లో పండిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లు ఎక్కువగా కొనుగోలు చేసే అవకాశం ఉందని అంటున్నారు. బియ్యానికి తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో కూడా డిమాండ్ ఎక్కువగా ఉండడంతో సరిహద్దు జిల్లాల నుంచి ఆయా రాష్ట్రాలకు బియ్యం వెళ్లే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సీఎంఆర్ కోసం మిల్లులకు పంపించే అవకాశం ఉంది. కాగా ఇందులో 30 లక్షల మెట్రిక్ టన్నుల వరకు సన్న ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. రాష్ట్రంలో ఈనెల నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో ఈ సన్న ధాన్యాన్ని మిల్లింగ్ చేసి పౌరసరఫరాల సంస్థ గోడౌన్‌లకే తరలించనున్నారు. మిగతా 40 ఎల్ఎంటీ దొడ్డు బియ్యాన్ని సీఎంఆర్‌గా సెంట్రల్ పూల్‌కు తరలించే అవకాశం ఉందని నిపుణులు చెపుతున్నారు.

రైతన్నకు అకాల వర్షాల భయం

ప్రతీ యాసంగి సీజన్‌లో అకాల వర్షాలు, వడగండ్ల వానలు రైతులను ముంచుతున్నాయి. ఇప్పటికే ఒకసారి వర్షాలు, వడగండ్లతో రాష్ట్రంలోని రైతులు పంట నష్టపోయారు. తాజాగా గురువారం మహబూబ్‌నగర్, మెదక్, వికారాబాద్, సంగారెడ్డి, నారాయణపేట, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల మొదలైన జిల్లాల్లో కురిసిన వర్షం వల్ల ఎక్కువగా వరిపంటకు నష్టం వాటిల్లింది.

సన్నబియ్యం.. డీలర్లకు శఠగోపం

- 50 కిలోల బస్తాకు 5 కిలోల వరకు తరుగు
- వికారాబాద్ జిల్లా ధారూరు మండలంలో వెలుగులోకి
- లబ్ధిదారులకు సర్దుబాటు చేయలేక డీలర్ల ఇబ్బంది



ధారూరు మండలంలోని ఓ రేషన్ దుకాణంలో 50 కిలోల బస్తాను తూకం వేయగా 45 కిలోల 410 గ్రాములు వచ్చిన దృశ్యం

ధారూరు: రేషన్ దుకాణాలకు సరఫరా చేసే సన్నబియ్యంలో పౌరసరఫరాల శాఖ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. బస్తాకు 50 కిలోలు రావాల్సి ఉండగా 45 నుంచి 48.5 కిలోలు మాత్రమే రావడంతో డీలర్లు ఖంగుతిన్నారు. వికారాబాద్ జిల్లా ధారూరు మండలంలోని 31 రేషన్ షాపుల్లో గురువారం ఈ విషయం వెలుగుచూసింది. ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. పథకం అమలులో భాగంగా జిల్లాలోని అన్ని రేషన్ షాపులకు మొదటి విడతగా 10 క్వింటాళ్ల చొప్పున సన్నబియ్యం సరఫరా చేశారు. బుధవారం కేరెల్లి గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని స్పీకర్ ప్రసాద్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. గురువారం నుంచి డీలర్లు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో బస్తాల్లో బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అనుమానం వచ్చి ఒక బస్తాను తూకం వేయగా 45 కిలోలు వచ్చింది. మరి కొన్ని బ్యాగులను తూకం వేయగా 45 నుంచి 48.5 కిలోల వరకు ఉండటంతో అవాక్కయ్యారు. అరకిలో.. కిలో తక్కువగా ఉంటే సర్దుకుపోయే వాళ్లమని, ఏకంగా 5 కిలోల వరకు తక్కువగా ఉండటంతో ఇబ్బంది పడుతున్నామని డీలర్లు తెలిపారు. లబ్ధిదారులకు ఎలా సర్దుబాటు చేయాలో అర్థం కావడం లేదని వాపోయారు. సన్నబియ్యం కావడంతో ప్రతి ఒక్కరూ తీసుకెళ్తున్నారని డీలర్లు తెలిపారు. బియ్యం తక్కువ వచ్చిన విషయాన్ని ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ రేషన్ షాపులను సందర్శించి బియ్యం బస్తాలను తూకం వేయిస్తే అసలు విషయం తెలుస్తుందని వారు అంటున్నారు.

శ్రీరామ నవమికి పటిష్ట భద్రత

- క్యూఆర్ కోడ్‌తో భద్రగిరి సమస్త సమాచారం



పోలీసు శాఖ రూపొందించిన క్యూఆర్ కోడ్

భద్రాచలం అర్బన్/కొత్తగూడెం టౌన్: భద్రాచలంలో ఈనెల 6న జరగనున్న శ్రీరామనవమి వేడుకలకు 200 మంది సిబ్బందితో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు వెల్లడించారు. ఈనెల 6న శ్రీసీతారాముల కల్యాణం, 7వ తేదీన శ్రీరామ పట్టాభిషేకం జరగనున్న నేపథ్యంలో భక్తుల భద్రత కోసం పోలీసు శాఖ తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పార్కింగ్ స్థలాలు, ఆలయం, కల్యాణ మండపం, లడ్డూ, తలంబ్రాల కౌంటర్లను చేరుకోవడంతో పాటు తాగునీటి వసతి ఎక్కడ ఉందో సులువుగా తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్ రూపొందించామని వెల్లడించారు. అంతేకాక ఆన్‌లైన్ లింక్ కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. వీటి ద్వారా భక్తులు సులభంగా తమకు అవసరమైన ప్రాంతాలకు చేరుకోవచ్చని చెప్పారు. రెండు రోజులపాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా విధించే ఆంక్షలకు భద్రాచలం పట్టణవాసులు సహకరించాలని ఎస్పీ గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కోరారు.

రైతు సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి: రైతు సంక్షేమంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఆయన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్ గూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు రుణమాఫీ, రైతుబీమా, రైతుభరోసా వంటి పథకాలు అమలు చేస్తూనే సన్న ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తున్న ఘనత తమదేనని తెలిపారు. వానాకాలంలో రైతులకు రూ.1,700 కోట్ల బోనస్ చెల్లించామని చెప్పారు. అలాగే, రూ.20,687 కోట్ల రుణమాఫీ చేయగా, రైతు భరోసా పథకం కింద రూ.5 వేల కోట్లకు పైగా వారి ఖాతాల్లో జమ చేశామని వివరించారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే రైతుభరోసా నగదు అందుతుందని చెప్పారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని, ప్రభుత్వ కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఎస్‌ఓ చందన్‌కుమార్, డీఎం శ్రీలత, ఆర్డీఓ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లకే మరమ్మతులకు సాగర్ కుడి కాల్వ గేట్లు



కుడికాల్వ హెడ్‌రెగ్యులేటర్

నాగార్జునసాగర్: సుమారుగా 10.50 లక్షల ఎకరాలకు సాగు నీరందించే నాగార్జున సాగర్ కుడి కాల్వ గేట్లు మరమ్మతులు చేసిన మూడేళ్లకే పాడయ్యాయి. 8వ గేటు కిందికి దిగకపోవడంతో గురువారం ఎమర్జెన్సీ గేటు ద్వారా దానిని మూసివేసి 2వ గేటు ద్వారా కాల్వకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమకాల్వ హెడ్‌రెగ్యులేటర్‌కు మూడు గేట్లు, కుడి కాల్వ హెడ్‌రెగ్యులేటర్‌కు 9 గేట్లు ఉన్నాయి. మూడేళ్ల క్రితం కుడి కాల్వ 9వ గేటు కిందికి, మీదకు కదలకపోవడంతో బలవంతంగా కిందికి దింపే ప్రయత్నంలో గేటు ఊడిపోయి కాల్వలో కొట్టుకుపోయింది. దీంతో చాలా రోజులు నీరు వృథాగా పోయింది. ఆ సమయంలోనే కుడి, ఎడమ కాల్వల హెడ్‌రెగ్యులేటర్ వద్ద తూములకు కొత్తగేట్లకోసం టెండర్లు పిలిచారు. కుడి హెడ్‌రెగ్యులేటర్ గేట్లలో తొమ్మిదింటికిగాను రూ.3.30 కోట్లు, ఎడమ కాల్వ హెడ్‌రెగ్యులేటర్ మూడు గేట్లకు రూ.2.50 కోట్లు, షూట్ గేటుకు రూ.1.50 కోట్లతో 2022లో మరమ్మతు పనులు చేయించారు. అయితే ఆ పనులు పూర్తయి మూడేళ్లు కాకముందే.. మళ్లీ మరమ్మతులకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా కుడి కాల్వకు నీటిని విడుదల చేయడంతో హెడ్‌రెగ్యులేటర్ గేట్లు అంతగా వినియోగించలేదు. నీటి అవసరాల మేరకు ఎక్కువగా 2, 9వ గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. కాగా, ఇటీవలే 8వ గేటు ద్వారా నీటిని విడుదల చేశారు. దానిని మూసేందుకు ప్రయత్నించగా కిందికి దిగలేదు. దీంతో ఇంజనీర్లు శ్రమించి ఎట్టకేలకు మూసివేశారు.

ముంచెత్తిన వాన



సచివాలయం వద్ద భారీగా నిలిచిన వర్షపు నీరు

▶ మొదటి పేజీ తరువాయి

రోడ్లపైనే వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓల్డ్‌బోయిన్‌పల్లి–న్యూ బోయిన్‌పల్లి మార్గంలో మోకాలిలోతు వరద చేరడంతో రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తుమ్మలబస్తీలోని బల్కాపూర్ నాలాలోని వ్యర్థాలు తీస్తున్న జేసీబీ పూర్తిగా మునిగిపోయింది. సమతానగర్‌లో ఇళ్ల ముందు పార్కు చేసిన కార్లు, బైక్‌లు నీట మునిగాయి.

- రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, సిద్దిపేట జిల్లాల్లో గంటల వ్యవధిలోనే జోరుగా పడింది. కొన్నిచోట్ల వడగండ్ల వాన కూడా పడింది.
- రాష్ట్ర ప్రణాళిక శాఖ గురువారం రాత్రి 8 గంటల నివేదిక ఆధారంగా రాష్ట్రంలో అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్‌లో 9.78 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. హైదరాబాద్ జిల్లా హిమాయత్‌నగర్‌లోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో 9.10 సెంటీమీటర్లు, చార్మినార్‌లో 9 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

తగ్గిన ఉష్ణోగ్రతలు

రాష్ట్రవ్యాప్తంగా గురువారం గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. సాధారణ ఉష్ణోగ్రతల కంటే మూడు డిగ్రీల సెల్సియస్ మేర తగ్గాయి. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే...ఆదిలాబాద్‌లోనే 39.8 డిగ్రీ సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత, కనిష్ట ఉష్ణోగ్రత కూడా 21.7 డిగ్రీల సెల్సియస్‌గా ఆదిలాబాద్‌లోనే నమోదైంది. శుక్రవారం కూడా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగానే నమోదవుతాయని, శనివారం నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని చెప్పింది.

అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు (సెం.మీ.లలో)

జిల్లా	ప్రాంతం	వర్షపాతం
యాదాద్రి భువనగిరి	నారాయణపూర్	9.78
హైదరాబాద్	జీహెచ్ఎంసీ ఆఫీస్	9.10
హైదరాబాద్	డబీర్‌పురా	9.00
రంగారెడ్డి	సరూర్‌నగర్	8.95
హైదరాబాద్	బేగంబజార్	8.80
హైదరాబాద్	ముషీరాబాద్	8.78
హైదరాబాద్	అంబర్‌పేట్	8.50
హైదరాబాద్	యాకుత్‌పురా	8.35
యాదాద్రి భువనగిరి	తుర్కపల్లి	8.30
హైదరాబాద్	చార్మినార్	8.20

పిడుగుపాటుకు నలుగురు మృతి

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వేర్వేరు చోట్ల పిడుగులు పడి నలుగురు మృత్యువాత పడ్డారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా పదర శివారులో వ్యవసాయ పనులకు మహిళా కూలీలు వెళ్లారు. వారికి సమీపంలో పిడుగు పడడంతో సుంకరి సైదమ్మ(45) గాజుల వీరమ్మ(55) అక్కడికక్కడే మృతి చెందారు. సుంకరి లక్ష్మమ్మకు తీవ్ర గాయాలుకాగా, అచ్చంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.
- గద్వాల జిల్లా చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన బోయ చిన్న వెంకటేశ్వర్లు(41) పొలం వద్ద పశువులు మేపుతుండగా.. పిడుగు పడి మృతి చెందాడు. వడ్డేపల్లి మండలంలోని బుడమర్సుకు చెందిన మహేంద్ర(21) తుంగభద్ర తీరంలో గేదెలు మేపుతుండగా.. పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాడు.
- సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల పరిధిలోని ఇబ్రహీంబాద్ శివారులో వాన పడుతుండగా, బలరాం లచ్చయ్య జీవాలను చెట్టు కిందకు చేర్చాడు. ఒక్కసారిగా పిడుగు పడడంతో 20 మేకలు మృత్యువాత పడ్డాయి. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్‌లో పిడుగు పడి ఆవు, దూడ, కొడంగల్‌లో 25 మేకలు చనిపోయాయి. యాదాద్రి జిల్లా రాజాపేట, వలిగొండ మండలాల్లో పిడుగుపాటుకు ఆవు, పాడి గేదెలు మృతి చెందాయి.



సంగారెడ్డిజిల్లాలో పిడుగుపాటుకు మృత్యువాత పడిన మేకలు



ఈ మినార్ పెచ్చులూడటం రెండోసారి..

చారిత్రక కట్టడమైన చార్మినార్ పైభాగం నుంచి పెచ్చులూడి పడ్డాయి. భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం ఉన్న మినార్ నుంచి మట్టి పెచ్చులూడడంతో అక్కడే ఉన్న పర్యాటకులు, వ్యాపారస్తులు పరుగులు తీశారు. ఒక్కసారిగా భారీ శబ్దంతో పెచ్చులు ఊడి పడడంతో పిడుగు పడిందనుకున్నామని చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయ పూజారి సచిన్ తెలిపారు. గతంలో కూడా ఈ మినార్ నుంచి పెచ్చులూడడంతో ఆర్కియాలజీ అధికారులు మరమ్మతులు చేపట్టారు.

అకాల వర్షం...రైతులు ఆగమాగం

యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు మండలాల్లో చేతికొచ్చిన మామిడి కాయలు, ధాన్యం నేలరాలింది. మోత్కూరులోని వ్యవసాయ మార్కెట్‌లో, గుండాలలో బండపై ఆరబెట్టిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. గద్వాల జిల్లా గట్టు మండలంలో ఆర బెట్టిన పొగాకు వానకు తడిసింది.

- నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ, మెండోరా, ముప్కాల్, వర్ని మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. కొన్ని చోట్ల వర్షం నీటిలో ధాన్యం కొట్టుకుపోయింది. మెండోరా, ముప్కాల్ మండలాల పరిధిలో కల్లాల్లో ఆరబెట్టిన పసుపు తడిసి ముద్దయింది. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం, మక్కలు తడిసి పోయాయి. కామారెడ్డి జిల్లాలోని పెద్ద కొడప్‌గల్, నస్రుల్లాబాద్, బిచ్కుంద, నిజాంసాగర్, బాన్సువాడ, రామారెడ్డి, దోమకొండ, మాచారెడ్డి తదితర మండలాల్లోని కొన్ని చోట్ల రాళ్ల వర్షం కురిసి వడ్లు నేలరాలాయి. ఈదురుగాలులతో మక్క నేలవాలింది.
- మహబూబాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో బయట ఉంచిన మిర్చి బస్తాలు వర్షానికి తడిసిముద్దయ్యాయి. రెండు గంటలపాటు వర్షం కురవడంతో రైతులు పడరాని పాట్లు పడ్డారు.



సంస్థాన్‌నారాయణపురంలో టమాట తోటలోకి చేరిన వర్షపు నీరు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి: సీఎం రేవంత్
- ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎస్‌కు ఆదేశం



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర రాజధానిలో భారీవర్షాలు పడుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భారీవర్షం, ఈదురుగాలులతో హైదరాబాద్‌లో చెట్లు కూలడం, లోతట్టు ప్రాంతాలు జలమయమైన నేపథ్యంలో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. జీహెచ్ఎంసీతోపాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, రోడ్లపై నీటినిల్వలు ఉండొద్దని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, విద్యుత్ అంతరాయాలు లేకుండా జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, విద్యుత్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రాంతాల్లో వెంటనే సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలన్నారు. వాహనదారులు త్వరగా ఇళ్లకు చేరుకునేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో కూడా వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్లు పడుతున్నందున కలెక్టర్లు, ఎస్పీలు, అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేయాలని సీఎస్‌కు చెప్పారు.

25 వేల మంది టీచర్ల నియామకాలు రద్దు

- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం
- బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌పై మండిపాటు



న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో 2016 నుంచి పనిచేస్తున్న 25 వేల మంది ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకాలను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు 2024లో కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. నియామకాల్లో భారీ అక్రమాలు, అవకతవకలకు పాల్పడిన పశ్చిమబెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్(డబ్ల్యూబీఎస్ఎస్‌సీ)కు అత్యున్నత న్యాయస్థానం తలంటింది. మొత్తం 25,753 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకాల్లో అవకతవకలను, లోపాలను ఉద్దేశపూర్వకంగానే కప్పిపుచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ..మొత్తం నియామకాలు చెల్లవని తీర్పు వెలువరించింది. మళ్లీ నియామకాలు చేపట్టాలని మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం గురువారం ఆదేశించింది. మరికొద్ది నెలల్లో అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండగా చోటుచేసుకున్న ఈ పరిణామం టీఎంసీ ప్రభుత్వానికి షాక్ వంటిదని చెబుతున్నారు. ఎంపిక ప్రతి దశలోనూ పాల్పడిన అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు డబ్ల్యూబీఎస్ఎస్‌సీ చేసిన అతి ప్రయత్నాల వల్ల ప్రస్తుతం పరిశీలన, ధ్రువీకరణ అసాధ్యంగా మారాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అవకతవకల కారణంగా మొత్తం ఎంపిక ప్రక్రియ ఉద్దేశపూర్వకంగా లోపభూయిష్టంగా మారిందని నమ్ముతున్నట్లు స్పష్టం చేసింది. కోల్‌కతా హైకోర్టు మొత్తం నియామకాలను రద్దు చేస్తూ 2024 ఏప్రిల్‌లో ఇచ్చిన తీర్పును సమర్థించింది. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ, ఒక్క వ్యక్తి చేసిన తప్పిదానికి అందరినీ ఎలా శిక్షిస్తారని ప్రశ్నించారు. మానవీయ కోణంలో ఈ తీర్పును అంగీకరించబోనంటూనే సుప్రీం ఆదేశాలను అమలు చేస్తానని, న్యాయవ్యవస్థను గౌరవిస్తానంటూ ప్రకటించారు.

వక్ఫ్ బిల్లు రాజ్యాంగంపై దాడే

సీపీపీ భేటీలో సోనియా గాంధీ



న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) బిల్లు భారత రాజ్యాంగంపై నిస్సిగ్గుగా దాడి చేయడమేనని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ అన్నారు. సమాజాన్ని శాశ్వతంగా విభజించి ఉంచాలనే బీజేపీ వ్యూహంలో ఇది భాగమన్నారు. లోక్‌సభలో బిల్లును ఆదరాబాదరగా ఆమోదింపజేసుకున్నారని విమర్శించారు. సంవిధాన్ సదన్‌లో గురువారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సోనియా తమ ఎంపీలను ఉద్దేశించి మాట్లాడారు. ఒక దేశం– ఒకే ఎన్నిక బిల్లు కూడా రాజ్యాంగ విద్రోహమన్నారు. దీన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. 'వక్ఫ్ (సవరణ) బిల్లును బుధవారం లోక్‌సభలో హడావుడిగా ఆమోదింపజేసుకున్నారు. గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లుపై కాంగ్రెస్ వైఖరి సుస్పష్టం. ఇది రాజ్యాంగంపై నిస్సిగ్గుగా దాడి చేయడమే. సమాజాన్ని ఎప్పటికీ విభజించి ఉంచాలనే బీజేపీ వ్యూహంలో భాగమే' అని సోనియా పేర్కొన్నారు. విపక్షాల సవరణలను మూజువాణి ఓటుతో తిరస్కరించాక, వక్ఫ్ బిల్లును బుధవారం అర్ధరాత్రి లోక్‌సభ 288–232తో ఆమోదించిన విషయం విదితమే. మహిళా రిజర్వేషన్ బిల్లును రెండేళ్ల క్రితమే ఇరుసభలు ఆమోదించాయని, దాన్ని తక్షణం అమలులోకి తేవాలనే కాంగ్రెస్ డిమాండ్‌ను బీజేపీ ఉద్దేశపూర్వకంగా పట్టించుకోవడం లేదని విమర్శించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మహిళలకు మూడింట ఒకవంతు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌పైనా బీజేపీ శీతకన్ను వేస్తోందన్నారు.

వక్ఫ్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం

రాజ్యసభలోనూ గట్టెక్కిన 'ఉమీద్' ● అనుకూలంగా 128, వ్యతిరేకంగా 95 ఓట్లు

రెండు రోజుల పాటు జరిగిన సుదీర్ఘ చర్చ, తీవ్ర స్థాయి వాదోపవాదాల అనంతరం వక్ఫ్ (సవరణ) బిల్లు-2025పై పార్లమెంటు ఆమోదముద్ర పడింది. విపక్షాల తీవ్ర అభ్యంతరాల మధ్యే లోక్‌సభ బుధవారం ఈ బిల్లును ఆమోదించడం తెలిసిందే. అది గురువారం రాజ్యసభ ఆమోదం కూడా పొందింది. 13 గంటలకు పైగా జరిగిన చర్చ అనంతరం అర్ధరాత్రి ఒంటి గంట దాటాక ఓటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా జరిగింది. దాదాపుగా ప్రతి సవరణపైనా ఓటింగ్‌కు విపక్షాలు పట్టుబట్టాయి. వాటి సవరణలన్నీ వీగిపోయాయి. చివరికి బిల్లు ఆమోదం పొందింది. దానికి అనుకూలంగా 128, వ్యతిరేకంగా 95 ఓట్లు పడ్డాయి. వక్ఫ్ బిల్లును కేంద్రం ఇక రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం అది చట్టంగా రూపుదాల్చుతుంది. వక్ఫ్ బిల్లును లోక్‌సభ 288-232 ఓట్లతో ఆమోదించడం తెలిసిందే.

సదుద్దేశమే: రిజిజు



న్యూఢిల్లీ: వక్ఫ్ బిల్లుపై గురువారం అర్ధరాత్రి దాకా జరిగిన వాడివేడి చర్చ పెద్దల సభను వేడెక్కించింది. ఉమీద్ (యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫీషియన్సీ అండ్ డెవలప్‌మెంట్)గా పేరు మార్చిన వక్ఫ్ (సవరణ) బిల్లు–2025ను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు సభలో ప్రవేశపెట్టారు. బిల్లుకు నిరసనగా పలువురు విపక్ష సభ్యులు నల్లదుస్తులు ధరించి సభకు వచ్చారు. బిల్లు రాజ్యాంగ విరుద్ధమంటూ మండిపడ్డారు. ముస్లింల భూములను లాక్కోవడమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని ఆరోపించారు. విపక్షాల వాదనను రిజిజు ఖండించారు. వాటి అభ్యంతరాలను తోసిపుచ్చారు. ''ముస్లింల హక్కులను ఎవరూ లాక్కోబోవడం లేదు. ఈ విషయమై విపక్షాలు చేస్తున్నదంతా దుష్ప్రచారమే'' అని పేర్కొన్నారు. ''2004లో 4.9 లక్షలుగా ఉన్న వక్ఫ్ ఆస్తులు ఇప్పుడు ఏకంగా 8.72 లక్షలకు పెరిగాయి. తద్వారా దేశంలో వక్ఫ్ అతి పెద్ద ప్రైవేటు భూ యజమానిగా అవతరించింది'' అని వివరించారు. ''వక్ఫ్ వ్యవహారాల్లో పారదర్శకత, జవాబుదారీతనం తేవడం, వాటి ఆస్తులను మరింత సమర్థంగా నిర్వహించడం, ముస్లిం మహిళలకు సాధికారత కల్పించడం, ముస్లింలలోని అన్ని తెగల హక్కులనూ పరిరక్షించడమే బిల్లు లక్ష్యం. అంతే తప్ప మతంతో ఈ బిల్లుకు ఎలాంటి సంబంధమూ లేదు'' అని పునరుద్ఘాటించారు. ''అందుకే సున్నీలు, షియాలతో పాటు ముస్లింలలోని ఇతర వెనకబడ్డ వర్గాల వారు కూడా వక్ఫ్ బోర్డుల్లో సభ్యులుగా ఉంటారు. తద్వారా వారి ప్రయోజనాలకూ న్యాయం జరుగుతుంది. ఇందుకు ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు'' అన్నారు. ''కేంద్ర వక్ఫ్ మండలి సభ్యుల్లో అధిక సంఖ్యాకులు ముస్లిమేతరులే ఉంటారనడం అవాస్తవం. 22 మందిలో వారి సంఖ్య 4కు మించబోదు. వక్ఫ్ బోర్డులు చట్టపరమైన సంస్థలు. అంతే తప్ప కేవలం ముస్లింలకు ప్రాతినిధ్యం వహించే సంస్థలు కాదు. వక్ఫ్ ట్రిబ్యునళ్ల ముందు 31,999 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వివాదాస్పద వక్ఫ్ భూముల్లో ఇప్పటికే కోర్టుల్లో పరిష్కారమైన వాటి జోలికి పోబోం. పసలేని ఆరోపణలు మాని బిల్లును ఆమోదించడంలో విపక్షాలు కూడా కలసి రావాలి'' అని కోరారు.

వక్ఫ్‌కు ముస్లిమేతరులూ విరాళాలు ఇవ్వొచ్చు: సిబల్



ముస్లిమేతరులకు కూడా వక్ఫ్ విరాళలిచ్చే హక్కుందని స్వతంత్ర సభ్యుడు కపిల్ సిబల్ అన్నారు. ''నా ఆస్తిని ఫలానా వారికి ఇవ్వొద్దని చట్టం చేయడానికి మీరెవరు? హిందువులు వక్ఫ్ విరాళాలు ఇవ్వడమే కాదు, స్వాతంత్ర్యానికి ముందే వక్ఫ్ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. దీన్ని పలు హైకోర్టులూ సమర్థించాయి'' అని చెప్పారు. దేశవ్యాప్తంగా నాలుగు రాష్ట్రాల్లో హిందూ మత సంస్థలకు 10 లక్షల ఎకరాలకు పైగా భూములున్నాయని ఆయన అన్నారు. ''హిందూ మతంలో స్వార్జిత ఆస్తిని కుమారులకు మాత్రమే ఇవ్వగలరు. దాన్ని కూతుళ్లకూ ఇచ్చేందుకు వీలు కల్పిస్తూ చట్టాన్ని మార్చండి'' అని సూచించారు. చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ జోక్యం చేసుకుంటూ కూతుళ్లతో పాటు ఎవరికైనా ఇచ్చేందుకు మన చట్టాలు వీలు కల్పిస్తున్నాయని చెప్పారు.

అయోమయం సృష్టిస్తున్నారు: రిజిజు

సిబల్ తీరును మంత్రి రిజిజు తీవ్రంగా దుయ్యబట్టారు. హిందూ మత సంస్థలకు చెందిన భూమిని వక్ఫ్ భూములతో పోల్చడాన్ని ఖండించారు. ''పలువురు సీనియర్ సభ్యులు ఏ అంశం పడితే అది లేవనెత్తడం ద్వారా అయోమయం సృష్టిస్తున్నారు. కానీ వాటిపై వివరణలు వినేదాకా కూడా సభలో ఉండటం లేదు'' అంటూ అసహనం వెలిబుచ్చారు.

దురుద్దేశాలు: విపక్షాలు

వక్ఫ్ (సవరణ) బిల్లు వెనక మోదీ సర్కారు దురుద్దేశాలు దాగున్నాయని ఆర్జేడీ సభ్యుడు మనోజ్ ఝా ఆరోపించారు. మోదీ ప్రభుత్వాన్ని ముస్లింలు విశ్వసించడం లేదని సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు రామ్‌గోపాల్ యాదవ్ అన్నారు. ప్రభుత్వం అన్ని మతాలనూ సమానంగా చూడాలన్నారు. బిల్లులో పలు అంశాలు పైకి బాగానే ఉన్నా దీని వెనక మోదీ సర్కారు ఉద్దేశమే అనుమానాలకు తావిస్తోందని బీఆర్ఎస్ సభ్యుడు కె.ఆర్.సురేశ్‌రెడ్డి అన్నారు. బిల్లులోని 75 శాతం అంశాలను బిల్లుతో నిమిత్తం లేకుండానే అమలు చేయొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. తిరుచ్చి శివ (డీఎంకే), వై.వి.సుబ్బారెడ్డి (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ), అభిషేక్ మను సింఘ్వీ, సయీద్ నసీర్ హుసేన్ (కాంగ్రెస్), సుష్మితా దేవి (టీఎంసీ), సంజయ్ రౌత్ (శివసేన–యూబీటీ), సంజయ్‌సింగ్ (ఆప్), ముజీబుల్లా ఖాన్ (బీజేడీ), జాన్ బ్రిటాస్ (సీపీఎం), పి.పి.సునీర్ (సీపీఐ), హారీస్ బీరన్ (ఐయూఎంఎల్), వైగో (ఎండీఎంకే) తదితర సభ్యులు బిల్లును వ్యతిరేకిస్తూ మాట్లాడారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ (జేడీఎస్) బిల్లుకు మద్దతుగా మాట్లాడారు.

కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే: ఖర్గే



వక్ఫ్ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని విపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. దానిపై చర్చలో ఆయన పాల్గొన్నారు. బిల్లు ముసుగులో సమాజంలో విభజన బీజాలు నాటేందుకు, ముస్లింలను వేధించేందుకు, వారి భూమిని లాక్కొని కార్పొరేట్ మిత్రులకు పంచేందుకు మోదీ సర్కారు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. ''ఈ బిల్లు ఆమోదం పొందితే ముస్లింల ఆస్తులను లాగేసుకుంటారు. వారి ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బ తింటాయి'' అని ఆరోపించారు. అస్మదీయులను వక్ఫ్ బోర్డుల్లోకి చొప్పించేందుకు వీలుగా సవరణలు చేశారంటూ బిల్లులోని పలు అంశాలపై తీవ్ర అభ్యంతరాలు వెలిబుచ్చారు. ''గత 11 ఏళ్లలో ముస్లింల సంక్షేమానికి కేటాయించిన రూ.18,274 కోట్ల నిధులనే పూర్తిగా వెచ్చించని చెత్త రికార్డు మోదీ సర్కారుది. అలాంటి వాళ్లు పస్మాంద వంటి పేద ముస్లింల సంక్షేమంపై మొసలి కన్నీరు కారుస్తున్నారు'' అంటూ తూర్పారబట్టారు. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులు ఉండాలన్న ప్రతిపాదనను ఖర్గే తీవ్రంగా తప్పుబట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం, రామమందిర్ ట్రస్ట్ వంటివాటిల్లో ఒక్కరైనా ముస్లిం ఉన్నారా అని ప్రశ్నించారు. ఆలయ ట్రస్టుల్లో కనీసం దళితులకు కూడా స్థానం కల్పించడం లేదని ఆక్షేపించారు. '''దేశంలో శాంతి, సామరస్యాలను దెబ్బ తీయకండి. ప్రతిష్టకు పోకుండా ఈ తప్పులతడక బిల్లును తక్షణం వెనక్కు తీసుకోండి'' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పాపమే: నడ్డా



కాంగ్రెస్ తన దశాబ్దాల పాలనలో ముస్లిం మహిళల అభ్యున్నతికి చేసిందేమీ లేదని రాజ్యసభ నాయకుడు జేపీ నడ్డా ఆక్షేపించారు. వారిని ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చిన పాపం ఆ పార్టీదేనంటూ దుయ్యబట్టారు. ''ముస్లిం మహిళలను ప్రధాన స్రవంతిలోకి తీసుకొచ్చేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోంది. ట్రిపుల్ తలాక్‌ను నిషేధించడంతో కోట్లాది మంది ముస్లిం మహిళలు గౌరవంగా జీవిస్తున్నారు. వక్ఫ్ బిల్లు జాతి ప్రయోజనాల కోసం ఉద్దేశించింది. వక్ఫ్ ఆస్తులు తీవ్రంగా దుర్వినియోగమవుతున్నాయి. దానికి పూర్తిగా అడ్డుకట్ట వేసి వక్ఫ్ వ్యవహారాల్లో జవాబుదారీతనం తేవడమే బిల్లు లక్ష్యం. వక్ఫ్ బిల్లులో సవరణలు సూచించేందుకు ఏకంగా 31 మంది సభ్యులతో జేపీసీ వేశాం. యూపీఏ హయాంలో కేవలం 13 మందితో జేపీసీ వేసి మమ అనిపించారు'' అని నడ్డా ఆరోపించారు. ''వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వ నియంత్రణలోకి తెచ్చి ప్రజా సంక్షేమానికి, అభివృద్ధి కార్యకలాపాలకు ఉపయోగించేందుకు వీలుగా సౌదీ అరేబియా, తుర్కియే వంటి ముస్లిం దేశాలు కూడా పలు చట్టాలు చేశాయి. వక్ఫ్ ఆస్తులను డిజిటైజ్ కూడా చేస్తున్నాయి. అదే పని భారత్‌లో చేస్తుంటే అభ్యంతరమెందుకు?'' అని విపక్షాలను ప్రశ్నించారు.

ట్రంప్ సుంకాల జోరు.. దేశాలన్నీ బేజారు

భారత్‌పై 26 కాదు, 27 శాతం

- మొత్తం 60 దేశాలపై వడ్డన
- ఆచితూచి స్పందించిన కేంద్రం
- మోదీ ప్రభుత్వ వైఫల్యం: కాంగ్రెస్



న్యూఢిల్లీ: అమెరికాకు 'విముక్తి దినం'గా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతూ వచ్చిన ఏప్రిల్ 2 మిగతా ప్రపంచం పాలిట దుర్దినంగా మిగిలిపోయింది. భారత్‌తో పాటు ఏకంగా 60 పై చిలుకు దేశాలపై ఆయన వాణిజ్య కొరడా ఝళిపించడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పెను కుదుపుకు లోనైంది. వాళ్లు, వీళ్లు అని తేడా చూపకుండా అన్ని దేశాల మీదా 10 నుంచి 50 శాతం దాకా సుంకాలు బాదడం ద్వారా ప్రపంచ వాణిజ్య యుద్ధానికి ట్రంప్ తెర తీశారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై బుధవారం సంతకం చేశారు. భారత్‌ను తప్పుడు వాణిజ్య విధానాలు అనుసరిస్తున్న 'దారుణ దేశం'గా ఈ సందర్భంగా అభివర్ణించారు! అన్నిరకాల భారత ఉత్పత్తుల మీదా 26 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించగా, అనంతరం దాన్ని 27 శాతంగా సవరించారు. అమెరికాకు అత్యవసరమైన ఫార్మాస్యూటికల్స్, సెమీ కండక్టర్లు, పలు ఖనిజాలు తదితరాలను మాత్రం సుంకాల బాదుడు నుంచి మినహాయించారు. అమెరికాలోకి ప్రవేశించే అన్ని వస్తూత్పత్తుల మీదా 10 శాతం బేసిక్ టారిఫ్ విధించారు. ఇది ఏప్రిల్ 5 నుంచి అమల్లోకి వస్తుంది. అమెరికా ఉత్పత్తులపై అధిక సుంకాలు వసూలు చేస్తున్న భారత్ తదితర దేశాలను వాణిజ్యపరంగా 'ధూర్త దేశాలు'గా ట్రంప్ ఆక్షేపిస్తుండటం తెలిసిందే. వాటిపై అదనపు సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. అవి ఏప్రిల్ 9 నుంచి అమల్లోకి రానున్నాయి. ఆ లెక్కన భారత ఉత్పత్తులపై 10 శాతం బేస్‌లైన్ టారిఫ్ ఏప్రిల్ 5 నుంచి, 27 శాతం అదనపు సుంకాల వసూలు ఏప్రిల్ 9 నుంచి మొదలవుతాయి. చైనాపై ఇటీవలే 20 శాతం సుంకాలు విధించగా మరో 34 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్టు ట్రంప్ తాజాగా ప్రకటించారు! ట్రంప్ నిర్ణయంతో అమెరికా వార్షిక పన్ను వసూళ్లు ఏటా 60 వేల కోట్ల డాలర్ల మేరకు పెరుగుతాయని వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో అంచనా వేశారు. ట్రంప్ ప్రకటనను దేశాలన్నీ దుయ్యబట్టాయి. అమెరికాపై ప్రతీకార సుంకాలు తప్పవని యూరోపియన్ యూనియన్, చైనా హెచ్చరించాయి. ట్రంప్ పునరాలోచించాలని పలు దేశాలు విజ్ఞప్తి చేశాయి. దీనిపై భారత్ ఆచితూచి స్పందించింది. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ''ట్రంప్‌కు అమెరికా ఫస్ట్ అయితే మోదీకి భారతే ఫస్ట్. దీనిపై ఎలా ముందుకెళ్లాలో ఆలోచిస్తాం'' అన్నారు.

పలు దేశాల సుంకాలు ఇలా...

దేశం	సుంకం (శాతాల్లో)
కాంబోడియా	49
వియత్నాం	46
శ్రీలంక	44
బంగ్లాదేశ్	37
థాయ్‌లాండ్	36
చైనా	34
పాకిస్తాన్	29
దక్షిణ కొరియా	26
జపాన్	24
యూరోపియన్ యూనియన్	20
బ్రిటన్	10

ట్రంప్ వలలో మోదీ: కాంగ్రెస్

భారత్‌పై అమెరికా తాజా సుంకాల మోతను మోదీ ప్రభుత్వ వైఫల్యంగా కాంగ్రెస్ అభివర్ణించింది. ''మోదీ తన మిత్రుడంటూ ట్రంప్ ఆప్యాయత కనబరుస్తారు. బహిరంగంగా కౌగిలించుకున్నారు. కానీ తాను పక్కా వ్యాపారినని నిరూపించుకుంటూ మోదీపై చాకచక్యంగా వల విసిరారు. మనవాడు అందులో ఇరుక్కుపోయాడు'' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. తాజా సుంకాలు భారత ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తాయని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ఆందోళన వెలిబుచ్చారు. వీటిని ఎలా ఎదుర్కోనున్నదీ కేంద్రం తక్షణం వివరించాలని డిమాండ్ చేశారు.

మెరుగ్గా, బలంగా, దృఢంగా: ట్రంప్

ప్రపంచ దేశాలపై తాను విధించిన తాజా సుంకాల మీద ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''ఆపరేషన్ ముగిసింది. రోగి బతికాడు. భేషుగ్గా ఉన్నాడు. చక్కగా కోలుకుంటున్నాడు. మునుపటి కంటే పెద్దగా, మెరుగ్గా, బలంగా, ఎన్నడూ లేనంత దృఢంగా తయారవుతాడని తేలింది'' అని ట్రూత్‌సోషల్‌లో కామెంట్ చేశారు.

ఇండియాపై ఇరవై ఆరా, ఇరవై ఏడా?

ట్రంప్ ప్రకటన నేపథ్యంలో భారత్‌తో పాటు పలు దేశాలపై అమెరికా విధించనున్న తాజా టారిఫ్‌లు ఎంతన్న దానిపై సందిగ్ధత నెలకొంది. భారత్‌తో పాటు 14 దేశాలపై ట్రంప్ ప్రకటించిన సుంకాలకు, అనంతరం వైట్‌హౌస్ విడుదల చేసిన వివరాలకు మధ్య తేడా ఉండటమే ఇందుకు కారణం. ట్రంప్ ప్రకటన అనంతరం ఆయా దేశాలపై టారిఫ్‌లను అమెరికా సవరించడమే ఇందుకు కారణమని బ్లూంబర్గ్ వివరించింది. ఆ మేరకు భారత్‌పైనా సుంకం ఒక శాతం పెరిగింది. దాన్ని 26 శాతంగా ట్రంప్ పేర్కొనగా తర్వాత దాన్ని 27 శాతంగా సవరించారు. గురువారం అనుబంధ ప్రకటనలో వైట్‌హౌస్ ఈ మేరకు పేర్కొంది. భారత్‌తో పాటు దక్షిణకొరియా సహా మొత్తం 14 దేశాలపై సుంకాలను సవరించారు.

కెనడా ప్రతీకార సుంకాలు

అమెరికా చర్యలకు ప్రతీకారం తప్పదని ఇప్పటికే ప్రకటించిన కెనడా అన్నంత పనీ చేసింది. అమెరికాకు చెందిన ఆటో ఉత్పత్తులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్టు గురువారం ప్రకటించింది. దీని ప్రభావం అమెరికా ఆటో రంగంపై తీవ్రంగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

కెనడా, మెక్సికోలకు మినహాయింపు

- ఐఈఈపీఏ స్టాండింగ్ ఆర్డరే కారణం
- ఆ దేశాలపై ఇప్పటికే 25 శాతం బాదుడు

డొనాల్డ్ ట్రంప్ వడ్డించిన తాజా సుంకాల నుంచి కెనడా, మెక్సికోలకు మినహాయింపు లభించింది. కెనడా, మెక్సికోలపై భారీ సుంకాలు తప్పవని పదేపదే చెబుతూ వచ్చినా తాజా టారిఫ్‌ల జాబితాలో వాటిని చేర్చలేదు. ఫెంటానిల్, వలసలకు సంబంధించిన ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ యాక్ట్ (ఐఈఈపీఏ) కింద స్టాండింగ్ ఆర్డర్ల కారణంగా కెనడా, మెక్సికోలకు కొత్త టారిఫ్‌లు వర్తించవని వైట్‌హౌస్ స్పష్టం చేసింది. అమెరికా–మెక్సికో–కెనడా ఒప్పందం (యూఎస్ఎంసీఏ) కింద అమెరికాలోకి ప్రవేశించే వస్తువులకు కూడా కొత్త సుంకాల నుంచి మినహాయింపు ఉంటుంది. అయితే చైనాతో పాటుగా కెనడా, మెక్సికోలపై ట్రంప్ ఇటీవలే 25 శాతం సుంకాలు విధించడం తెలిసిందే. కనుక తాజా మినహాయింపు వాటికి పెద్దగా ఉపశమనం కలిగించబోదు.

చైనా అధీనంలో 4 వేల చ.కి.మీ. భూభాగం

జీరో అవర్‌లో రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: నాలుగు వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనా ఆక్రమించిందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. మరోవైపు మనం భారత్‌– చైనా దౌత్య సంబంధాల వజ్రోత్సవాలను జరుపుకొంటున్నామని ధ్వజమెత్తారు. రాహుల్‌గాంధీ గురువారం లోక్‌సభలో జీరో అవర్‌లో మాట్లాడుతూ తీవ్ర ఆరోపణలు చేశారు. అమెరికా కొత్త టారిఫ్‌లు భారత ఆర్థికవ్యవస్థ నడ్డి విరుస్తాయని పేర్కొన్నారు. చైనా దురాక్రమణ, అమెరికా టారిఫ్‌లపై కేంద్ర ప్రభుత్వం సమాధానాలు చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. 'చైనా ఒకవైపు 4,000 చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించింది. మరోవైపు కొద్దికాలం కిందట మన విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ చైనా రాయబారితో కలిపి కేక్ కట్ చేశారు. ఇది చూసి నేను నివ్వెరపోయా. చైనా ఆక్రమించిన నాలుగు వేల చదరపు కిలోమీటర్ల భూభాగం సంగతేమిటి? అక్కడ ఏం జరుగుతోంది?' అని రాహుల్ నిలదీశారు. గాల్వాన్ లోయలో ఘర్షణలను ఉటంకిస్తూ 20 మంది భారత జవాన్లు అమరులయ్యారని గుర్తుచేశారు. 'ఒకవైపు వీరి త్యాగం.. మరోవైపు కేక్ కట్ చేసి (చైనా రాయబారితో కలిసి) సంబరాలు జరుపుకుంటున్నాం. ఏమిటిది? చైనాతో సరిహద్దుల్లో సాధారణ పరిస్థితులు నెలకొనడానికి మేము వ్యతిరేకం కాదు. కానీ దానికి మునుపు యథాతథస్థితిని పునరుద్ధరించాలి' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 'మొదట మన భూభాగాన్ని తిరిగిపొందాలి. ఆక్రమిత భూభాగానికి సంబంధించి రాష్ట్రపతి, ప్రధానమంత్రులు చైనాకు లేఖలు రాశారని నా దృష్టికి వచ్చింది. ఈ విషయం మనవాళ్ల ద్వారా తెలియలేదు. భారత్‌లోని చైనా రాయబారి లేఖల విషయాన్ని చెప్పారు' అని రాహుల్ అన్నారు. సమర్థ విదేశీ విధానం అంటే విదేశాలతో సమాన స్థాయిలో సంబంధ బాంధవ్యాలను నెరపడం. ఒకవైపు చైనా మన 4 వేల చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని ఆక్రమించింది. మరోవైపు అమెరికా అకస్మాత్తుగా భారత్‌పై టారిఫ్‌లు విధించింది అని కాంగ్రెస్ నేత పేర్కొన్నారు. అమెరికా టారిఫ్‌లు భారత్‌కు శరాఘాతమని అభిప్రాయపడ్డారు. మన ఆటోమొబైల్ రంగం, ఫార్మా పరిశ్రమ, వ్యవసాయంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు.



మోదీకి బౌద్ధుల పవిత్ర గ్రంథం త్రిపీటకాలను అందజేస్తున్న థాయ్‌లాండ్ ప్రధాని షినవత్రా

వ్యూహాత్మక భాగస్వామ్యం వైపు

భారత్, థాయ్‌లాండ్ నిర్ణయం

బ్యాంకాక్: ఇండో పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత, సమ్మిళిత, న్యాయబద్ధమైన విధానాలకు కట్టుబడి ఉంటామని భారత్, థాయ్‌లాండ్ ప్రకటించాయి. విస్తరణ వాదం కాదు, అభివృద్ధే తమ విధానమని స్పష్టం చేశాయి. రెండు దేశాల మధ్య సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాయి. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, థాయ్‌లాండ్ ప్రధాని పెటొంగ్‌టర్న్ షినవత్ర గురువారం బ్యాంకాక్‌లో సంయుక్త మీడియా సమావేశంలో ఈ విషయాలు వెల్లడించారు. అంతకుముందు, రెండు దేశాల ప్రతినిధుల స్థాయి మధ్య వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారంపై విస్తృత స్థాయి చర్చలు జరిగాయి. భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలు, థాయ్‌లాండ్ మధ్య పర్యాటకం, సాంస్కృతిక, విద్యా రంగాలతోపాటు పరస్పర వాణిజ్యం, పెట్టుబడుల్లో సహకారానికి గల అవకాశాలపై షినవత్రతో చర్చించినట్లు ప్రధాని మోదీ చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, చేనేత, హస్తకళల్లో సహకారంపై ఒప్పందాలు కుదిరాయన్నారు. ఇండో–పసిఫిక్, యాక్ట్ ఈస్ట్ విధానంలో థాయ్‌లాండ్‌కు భారత్ ప్రత్యేక స్థానం కల్పిస్తుందని తెలిపారు. భద్రతా విభాగాల మధ్య వ్యూహాత్మక సమావేశాలపైనా చర్చ జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా, మాజీ ప్రధాని థక్సిన్ షినవత్రాతోనూ మోదీ సమావేశమయ్యారు. తన పర్యటనను పురస్కరించుకుని 18వ శతాబ్దినాటి రామాయణ కుడ్య చిత్రాల ఆధారంగా ప్రత్యేక తపాలా బిళ్లను విడుదల చేసినందుకు థాయ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని షినవత్ర తనకు బహూకరించిన త్రి పీటకను బుద్ధుని భారత్ తరఫున వినమ్రుడనై స్వీకరించినట్లు తెలిపారు. బౌద్ధమత నియమాలతో కూడిన వినయ పీటకం, సుత్త పీటకం, అభిదమ్మ పీటకాలని త్రిపీటకాలని పేరు. మార్చి 28వ తేదీన భూకంపంతో సంభవించిన ప్రాణనష్టంపై భారత ప్రజల తరఫున నివాళులర్పించినట్లు ప్రధాని మోదీ చెప్పారు. అంతకుముందు, బిమ్‌స్టెక్ 6వ శిఖరాగ్రానికి హాజరయ్యేందుకు రెండు రోజుల పర్యటనలో భాగంగా బ్యాంకాక్ చేరుకున్న ప్రధాని మోదీకి ఉపప్రధాని సురియా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన థాయ్ రామాయణం, సిక్కులు ప్రదర్శించిన భాంగ్రా నృత్యం అలరించింది. అనంతరం ప్రధాని మోదీ బిమ్‌స్టెక్‌లోని బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు యూనుస్, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి, మయన్మార్ సైనిక పాలకుడు మిన్ ఔంగ్ తదితరులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. బ్యాంకాక్ నుంచి ఆయన శ్రీలంకకు వెళ్లనున్నారు.

ఆన్‌లైన్‌లో సుప్రీం జడ్జీల ఆస్తుల వివరాలు

న్యూఢిల్లీ: పారదర్శకతను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కీలక నిర్ణయం తీసుకున్నారు. స్థిర, చరాస్తుల వివరాలను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. గురువారం జరిగిన ఫుల్ కోర్టు సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సహా సుప్రీం కోర్టులోని 30 మంది జడ్జీలు ఆస్తులను ప్రకటించనున్నారు. అయితే, ఇది న్యాయమూర్తుల ఐచ్ఛికం మాత్రమేనని వెబ్‌సైట్ తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి సహా అందరు న్యాయమూర్తులు పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత గానీ, ఏదైనా గణనీయ స్థాయిలో ఆస్తి సముపార్జన జరిగినప్పుడు గానీ ఆ వివరాలను బహిర్గతం తెలియజేయాలని ఫుల్‌కోర్టు నిర్ణయించిందని వెబ్‌సైట్ తెలిపింది.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం ⋅ 4 ⋅ ఏప్రిల్ ⋅ 2025



'ఫ్యూచర్'కు ఫెన్సింగ్
భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఫార్మా సిటీకి సేకరించిన భూములను అధికారులు సర్వే చేసి, చుట్టూ ఫెన్సింగ్ వేసే పనులను ప్రారంభించారు. -8లో



కళ.. ఆలోచన భళా..
ప్రస్తుత వేసవి సీజన్‌లో విభిన్న కళలపై వివిధ సంస్థలు శిక్షణ అందించనున్నాయి. పలు ఆర్ట్ స్టూడియోలు ఆర్ట్ క్యాంపెయిన్స్ ప్రారంభించాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.0/24.0
నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 34, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.


పోలీస్ కంట్రోల్ రూం వద్ద..


చాదర్‌ఘాట్ రైల్వే బ్రిడ్జి కింద నీటమునిగిన ఆర్టీసీ బస్సు


చైతన్యపురిలో..

ఒక్క వానకే.. వణుకు..

ఎండల వేడిమితో, వేసవి తాపంతో అల్లాడుతున్న నగర ప్రజలకు ఒక్కసారిగా కురిసిన వాన ఎంతో ఉపశమనాన్నిచ్చినప్పటికీ, రాకపోకలు సాగించేవారికి తీవ్ర ఇబ్బందులు కలిగించింది. మాన్సూన్ యాక్షన్‌ప్లాన్‌ల పేరిట జీహెచ్‌ఎంసీ ప్రకటనలు తప్ప సమ్మర్‌లోని వానకే ప్రజలు అవస్థలు పడ్డారు. వరద నివారణకు తీసుకున్న చర్యలను వాన బట్టబయలు చేసింది. కేసీపీ గెస్ట్ హౌస్ దగ్గర జలాశయాన్ని నిర్మించినప్పటికీ, ఎప్పటిలాగే రోడ్డు చెరువుగా మారింది. అలాంటి రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ తొలిదశలో రూ. 100 కోట్లతో 50 నిర్మించేందుకు సిద్ధమయ్యారు. 11 ప్రాంతాల్లో 12 నిర్మాణాల పనులు ప్రారంభించారు. వాటి నీటి నిల్వ సామర్థ్యం 90వేల లీటర్ల నుంచి 10 లక్షల లీటర్లు. వాటిల్లో నాలుగింటి నిర్మాణం మాత్రం పూర్తయింది. మిగతావి గత డిసెంబర్–జనవరిల్లోనే పూర్తి చేస్తామన్నా ఇంకా పూర్తికాలేదు. పూర్తయిన వాటి వద్ద సైతం పరిస్థితి మారకపోవడంతో అధికారుల ప్లానింగ్‌పై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వర్షం కురిసిన వెంటనే ఆయా ప్రాంతాల్లో నీటిని తోడివేసేందుకు వెంటనే రంగంలోకి దిగే జీహెచ్‌ఎంసీ బృందాలు ఈసారి చాలా ప్రాంతాల్లో కనిపించలేదు.


బంజారాహిల్స్‌లో నీట మునిగిన బైక్‌లు

జీహెచ్‌ఎంసీ పరిధిలో రాత్రి 10 గంటల వరకు నమోదైన వర్షపాతం	ప్రాంతం	హిమాయత్‌నగర్	దబీర్‌పురా	ముషీరాబాద్	సరూర్‌నగర్	బేగం బజార్	మలక్‌పేట్	రెయిన్ బజార్	చార్మినార్	కంచన్‌బాగ్	బంజారాహిల్స్	మారేడుపల్లి	బోయిన్‌పల్లి	ఎల్‌బీనగర్	కుర్మగూడ	అంబర్‌పేట	ఎల్బీ స్టేడియం	చంపాపేట
	సెంటీ మీటర్లలో	9.6	9.4	9.4	9.3	9.3	9.0	8.8	8.7	8.5	8.5	8.1	8.0	7.9	7.9	7.7	7.6	7.5

ఎండల్లో కుండపోత


మెట్రో పిల్లర్ల కింద తలదాచుకుని..


గన్‌పార్కు వద్ద వరద నీటిలో..


అసెంబ్లీ వద్ద రహదారిపై వరద నీరు..

నగరాన్ని వణికించిన అకాల వర్షం

- ఈదురు గాలులతో విరిగిపడిన చెట్లు
- ఉరుములు, మెరుపులు, పిడుగులు
- అనేక చోట్ల తెగిపడిన విద్యుత్ తీగలు
- చెరువులను తలపించిన రహదారులు
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- కిలోమీటర్ల మేర ఆగిపోయిన వాహనాలు
- నరకయాతనకు గురైన చోదకులు
- అత్యధికంగా 9.6 సెం.మీ వర్షపాతం నమోదు


చింతల్ బస్తీలో..


నాంపల్లిలో..

నింగి నుంచి నేలకు ఏకధాటిగా ధార

ఎండా కాలంలో మేఘం గర్జించింది. అకాల వర్షం మహా నగరాన్ని గజగజ వణికించింది. నింగికి చిల్లు పడిందా అన్నట్లుగా గురువారం రాత్రి పొద్దుపోయేదాకా ఏకధాటిగా కురిసిన వర్షం.. ఉరుములు, మెరుపులు, పిడుగులతో భీతావహుల్ని చేసింది. రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. కిలో మీటర్ల మేర వాహనాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. వాహన చోదకులు నరకయాతనకు గురయ్యారు. గురువారం మధ్యాహ్నం వరకు ఎండ కొట్టగా.. ఆ తర్వాత నగరం ఒక్కసారిగా చల్లబడిపోయింది. హఠాత్తుగా పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నెలకొరిగాయి. చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. కొన్ని చోట్ల వాహనాలు వరదనీటిలో కొట్టుకుపోయాయి. చారిత్రక చార్మినార్ పైమీనార్ నుంచి భారీ పెచ్చు కింద ఊడిపడింది. వర్షం కారణంగా జనం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

– సాక్షి, సిటీబ్యూరో

నగరంలోని హిమాయత్‌నగర్, ముషీరాబాద్, చార్మినార్, సరూర్‌నగర్‌లలో అత్యధికంగా తొమ్మిది సెంటీమీటర్లపైగా వర్షపాతం నమోదైంది. గ్రేటర్ వ్యాప్తంగా వర్షం దంచికొట్టడంతో రహదారులపై మోకాలు లోతు నీరు నిలిచింది. పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ ఆవరణలోకి వరద నీరు చేరింది. బైక్‌లు సగానికి మునిగిపోయేంతగా వరద రావడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పలు బస్తీలలో ఇళ్లల్లోకి వరద నీరు పెద్ద ఎత్తున చేరింది. ఈదురుగాలులతో చెట్లు నేలకు ఒరిగాయి. నల్లకుంట స్ట్రీట్ నంబర్ 7లో ఓ ఇంటి ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్టు కొమ్మలు విరిగి పక్కనే ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలపై పడటంతో పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేసి అనంతరం సరఫరాను పునరుద్ధరించారు. వెస్ట్ మారేడుపల్లి తుమ్మలబస్తీలో బల్కాపూర్ నాలాలోని వ్యర్థాలు తీస్తున్న జేసీబీ పూర్తిగా మునిగిపోయింది. చాలా ప్రాంతాల్లో వృక్షాలు, కొమ్మలు విరిగిపడ్డాయి. ఇళ్ల ముందు పార్కు చేసిన కార్లు, బైక్‌లు నీట మునిగిపోయాయి.

మరో రెండు రోజులు..

మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. భూ ఉపరితలం వేడెక్కడంతో పాటు ద్రోణి ప్రభావంతో హైదరాబాద్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

మ్యాన్‌హోళ్ల మూతలు తెరవొద్దు

వర్షం నేపథ్యంలో మ్యాన్‌హోళ్ల మూతలు తెరవొద్దు. ఈఆర్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలి. ముంపునకు గురైన ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. డీప్ మ్యాన్‌హోళ్ల దగ్గర సీవరేజీ సూపర్‌వైజర్లు ఉండేలా చూడాలి. ఇతర వివరాలకు జలమండలి కస్టమర్ కేర్ 155313కు ఫోన్ చేయొచ్చు.

– అశోక్ రెడ్డి, జలమండలి ఎండీ

తార్నాకలో పిడుగుపాటు

లాలాపేట: తార్నాకలోని ఎస్‌వీఆర్ స్నిగ్ధ ఐదంతస్తుల భవనం ప్రహరీ అంచున పిడుగు పడింది. ఈ ఘటనలో ప్రహరీ స్వల్పంగా ధ్వంసమైంది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.


బంజారాహిల్స్ రోడ్డు నెం-1లో ట్రాఫిక్ జాం

ట్రాఫిక్ నరకం..

నగర రహదారులపై వాహనాలు గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు నత్తలతో పోటీ పడ్డాయి. అకాల వర్షానికి రోడ్లన్నీ జలమయమై ఎక్కడిక్కడ ట్రాఫిక్ ఆగిపోయింది. కొన్ని ప్రాంతాల్లో కిలోమీటరు దూరం దాటడానికి కనీసం అరగంటకు పైగా పట్టింది. ఇంకొన్ని చోట్ల గంటల తరబడి వాహనాలు ముందుకు కదలలేదు. వర్షం నేపథ్యంలో ద్విచక్ర వాహన చోదకులు మెట్రోరైల్ స్టేషన్ల కింద ఆగిపోవడంతో ఆ ప్రాంతాల్లో మరిన్ని ఇబ్బందులు వచ్చాయి. వర్షంతో పాటు ఈదురు గాలుల ప్రభావంతో నేలకొరిగిన చెట్లను హైడ్రా సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. నీరు నిలిచిన, చెట్లు కూలిన ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సహాయక చర్యల్ని పర్యవేక్షించారు. ఎల్బీనగర్, దిల్‌సుఖ్ నగర్, మలక్‌పేట్, చాదర్‌ఘాట్, ఎంజీబీఎస్, సికింద్రాబాద్, బేగంపేట, ముషీరాబాద్, అమీర్‌పేట్, అబిడ్స్, కోఠి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, నల్లకుంట, ఎంజే మార్కెట్, జీపీట, మెహిదీపట్నం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాసబ్‌ట్యాంక్, టోలిచౌకి, రవీంద్రభారతి, లక్డీకాపూల్, హిమాయత్‌నగర్, సోమాజిగూడ, పంజగుట్ట, ఎస్సార్‌నగర్, హబ్సిగూడ, కూకట్‌పల్లి, ఎర్రగడ్డ, తార్నాక తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నరకాన్ని తలపించింది.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

నగరంలో భారీ వర్షానికి 449 ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో కేవలం 15 నుంచి 30 నిమిషాల వ్యవధిలో 410 ఫీడర్ల పరిధిలో సరఫరాను పునరుద్ధరించారు.


పరిస్థితిని సమీక్షిస్తున్న రంగనాథ్


లేక్‌వ్యూ గెస్ట్ హౌస్ వద్ద వరద నీటిలో నిలిచిపోయిన వాహనాలు


సచివాలయం సమీపంలో సహాయక చర్యలు


ఎర్రమంజిల్ కేసీపీ సర్కిల్ వద్ద కారుపై కూలిన వృక్షం


చాదర్‌ఘాట్ వద్ద నిలిచిపోయిన కారును తోసుకువస్తున్న ట్రాఫిక్ పోలీసులు

శ్రీరామ నవమి శోభాయాత్రకు భారీ బందోబస్తు

నగర కొత్వాల్ సీవీ ఆనంద్

అబిడ్స్: శ్రీరామ నవమి శోభాయాత్రకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేపడుతున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఈ నెల 6న సీతారామ్‌బాగ్ నుంచి హనుమాన్ టేక్డీ వరకు కొనసాగే శోభాయాత్రకు ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో అన్ని విధాలా ఏర్పాట్లు చేపడతామని వెల్లడించారు. గురువారం సీతారామ్‌బాగ్‌లోని ద్రౌపది గార్డెన్‌లో జరిగిన పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఆదివారం సీతారామ్‌బాగ్ ఆలయం నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్రను శాంతియుతంగా, సంతోషంగా చేపట్టాలని సూచించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు శోభాయాత్ర ప్రారంభించేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. శోభాయాత్రలో డీజేలకు బదులుగా సౌండ్ బాక్సులు వాడుకోవాలని సీపీ పేర్కొన్నారు. సుమారు 20 వేల మంది పోలీసులతో శోభాయాత్రకు బందోబస్తుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్, డీసీపీలు జి.చంద్రమోహన్, బి.బాలస్వామి, చైతన్య కుమార్, జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, వాటర్‌బోర్డు అధికారి అమరేందర్ రెడ్డి, డీఎఫ్ఓ వెంకన్న, శోభాయాత్ర చైర్మన్ భగవంతరావు, వీహెచ్‌పీ రాష్ట్ర ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, ఇతర నాయకులు గోవింద్‌రాఠి, ఆనంద్ సింగ్, కృష్ణ, శ్రీరామ్ వ్యాస్, మెట్టు వైకుంఠం, ఆనంద్‌కుమార్ గౌడ్, పప్పుమాత్రే తదితరులు పాల్గొన్నారు. కాగా..శోభాయాత్ర రూట్‌ను నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు అధికారులు పరిశీలించారు. సీతారామ్‌బాగ్ నుంచి బోయిగూడ కమాన్, మంగళ్‌హాట్, పురానాపూల్, బేగంబజార్ ఛత్రి, సిద్దిఅంబర్‌బజార్, గౌలిగూడ, కోఠి హనుమాన్ టేక్డీ వరకు అధికారుల బృందం శోభాయాత్ర ఏర్పాట్లపై పరిశీలన చేపట్టారు.


శోభాయాత్ర రూట్‌ను పరిశీలిస్తున్న సీపీ

మేడ్చల్ కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

- తనిఖీలు చేపట్టిన బాంబు స్క్వాడ్
- అంతా ఉత్తిదేనని తేల్చిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్– మల్కాజిగిరి కలెక్టరేట్‌ను గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు పేల్చివేస్తామని ఓ ఆగంతకుడు జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు మెయిల్ పెట్టాడు. దీంతో ఈ విషయంపై విచారణ చేయాలని కలెక్టర్ గౌతమ్ రాచకొండ పోలీసు కమిషనర్‌కు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో డీసీపీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు మేడ్చల్ ఏసీపీ గురువారం మధ్యాహ్నం 3.45 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మేడ్చల్ కలెక్టరేట్‌లోని వివిధ శాఖల్లో బాంబు స్క్వాడుతో తనిఖీలు చేపట్టారు. ఎక్కడా ఎలాంటి బాంబు జాడ లేకపోవటంతో.. ఉత్తుత్తి బెదిరింపులేనని పోలీసులు తేల్చారు. దీంతో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. కాగా.. కలెక్టర్ గౌతమ్‌కు గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు పంపించారు? అనే అంశంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు నేపథ్యంలో పోలీసుల సూచనల మేరకు వివిధ విభాగాల జిల్లా ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మధ్యాహ్నం 3 గంటలకు తమ కార్యాలయాల నుంచి బయటకు వెళ్లిపోయారు. బాంబు బెదిరింపు మెయిల్ మావోయిస్టు ముప్పాళ్ల లక్ష్మణరావు పేరిట రావటంతో పాటు.. అందులో ముస్లిం సంస్థలకు సంబంధించిన పేర్లతో సహా అన్నాడీఎంకే తదితర పార్టీలు, సంస్థల పేర్లు ఉండటంతో.. కావాలనే ఎవరో ఆగంతకుడు మెయిల్ చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

చర్చోపచర్చలు..

మేడ్చల్ కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు మెయిల్ మెసేజ్‌పై పలు రకాలుగా చర్చ సాగుతోంది. జిల్లాలో పలువురు ఉన్నత స్థాయి అధికారులు తమ సమస్యలు విన్నవించేందుకు వచ్చిన ప్రజలకు సమయం కేటాయించక పోవటం వల్లే.. విసుగెత్తి ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బాంబు బెదిరింపుపై విచారణ చేయాలని పోలీసులను ఆదేశించినట్లు కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు.



లీజు ముగిసినా క్వారీని వదలట్లేదు

- హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదులు
- గాజులరామారంలో పర్యటించిన రంగనాథ్
- మరో మూడు ప్రాంతాలకు వెళ్లి పరిశీలనలు



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ జిల్లా గాజులరామారంలోని క్వారీపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామంలో క్వారీ లీజు గడువు ముగిసినా యజమానులు అక్కడ నుంచి ఖాళీ చేయకుండా స్థలం కబ్జాకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఆరా తీసేందుకు వెళ్లిన రంగనాథ్ సమీపంలోని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ భూముల కబ్జాలను పరిశీలించారు. ఆ ప్రాంతంలో దాదాపు 400ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిని కబ్జా కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతంలో 78 ఎకరాలను లీజుకు తీసుకున్న వారితో హైడ్రా కమిషనర్ వచ్చే వారం కీలక సమావేశం నిర్వహించనున్నారు. గాజులరామారం నుంచి శేరిలింగంపల్లి వెళ్లిన ఆయన నల్లగండ్ల చెరువు నాలాను పరిశీలించారు. నాలా విస్తీర్ణం తగ్గకుండా చూడాలని, అక్కడ పోసిన మట్టిని తొలగించాలని వెర్టెక్స్ నిర్మాణ సంస్థను ఆదేశించారు. ఈ సందర్భంగా నాలాతో పాటు బఫర్ జోన్‌కూ ఆటంకం లేకుండా నిర్మాణాలు చేయపడతామని నిర్మాణ సంస్థ హామీ ఇచ్చింది. గోపన్నపల్లి, పుప్పాలగూడలకు వెళ్లిన కమిషనర్ మేల్లకుంట, మామాసానికుంటలను పరిశీలించారు. సర్వే నంబర్ల ప్రకారం చెరువుల హద్దులపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన క్షేత్రస్థాయిలో సమీక్షించారు.



ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు



ఫెన్సింగ్‌ను పరిశీలిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి

'ఫ్యూచర్'కు ఫెన్సింగ్

- ఫార్మా భూ బాధిత గ్రామాల్లో మోహరించిన పోలీసులు
- సర్వే చేసి కంచె పనులు చేపట్టిన అధికారులు
- అడ్డుకునేందుకు యత్నించిన రైతులను స్టేషన్‌కు తరలించిన సిబ్బంది

యాచారం: భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఫార్మాసిటీకి సేకరించిన భూములను గురువారం అధికారులు సర్వే చేసి చుట్టూ ఫెన్సింగ్ వేసే పనులు ప్రారంభించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాసిటీ కోసం 7,640 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరించారు. అప్పట్లో సేకరించిన కొన్ని సర్వే నంబర్లల్లోని భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి మిగిలిన భూములను వదిలేశారు. పరిహారం పొంది ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులు సదరు భూములకు ఫెన్సింగ్ లేకపోవడంతో నాలుగేళ్లుగా పంటలు సాగు చేసుకుంటున్నారు. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లోనే ప్రస్తుత ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ప్రముఖ సంస్థలకు భూములు అప్పగించే సమయంలో రైతులు కబ్జాలో ఉంటే కష్టతరమని భావించిన ప్రభుత్వం గురువారం యాచారం తహసీల్దార్ అయ్యప్ప, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు ఆధ్వర్యంలో భూములను సర్వే చేసి ఫెన్సింగ్ వేసే పనులను ప్రారంభించారు. రైతులు ఆందోళన చేస్తారని ముందు జాగ్రత్తగా రాచకొండ సీపీ ఆదేశాల మేరకు భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

గ్రామాల చుట్టూ పోలీసు పహారా

నక్కర్తమేడిపల్లి గ్రామాన్ని పోలీసులు గురువారం ఉదయమే తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, మరో ఇద్దరు ఏసీపీలు, ఎనిమిది మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, 150 మందికి పైగా పోలీస్ సిబ్బంది, 40 మందికి పైగా టీజీఐఐసీ, రెవెన్యూ, సర్వే సిబ్బంది, 20కి పైగా జేసీబీలు, ఇతర యంత్రాలు, 50 మందికి పైగా కూలీలు సర్వే చేసే భూమి వద్దకు చేరుకున్నారు. అధికారులు సర్వే పనులు ప్రారంభించిన వెంటనే రైతులు అడ్డుకునేందుకు యత్నించారు. తమ అంగీకారం లేకుండానే పరిహారం డబ్బులు అథారిటీలో జమ చేశారని, కోర్టులో కేసులు నడుస్తున్నా సర్వే చేయడం, ఫెన్సింగ్ వేయడం సరికాదని పనులకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేయగా వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్‌కు తరలించారు. అనంతరం మాజీ సర్పంచ్‌లు పాశ్య భాషా, శ్రీనివాస్‌రెడ్డి, మొరుగు రమేష్ తదితరులు తీవ్ర గందరగోళం సృష్టించడంతో వారిని సైతం అడ్డుకున్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడం, రైతులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నక్కర్తమేడిపల్లి గ్రామంలోని సర్వే పనులను అడ్డుకోవడానికి నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల నుంచి వస్తున్న రైతులను నియంత్రించేందుకు నక్కర్తమేడిపల్లి-నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి-సరికొండ రోడ్లపై పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ప్లాట్లకు కబ్జాలు చూపండి

ఫార్మాసిటీకి సేకరించిన భూములకు పరిహారం ఇచ్చారు. ప్లాట్ల పంపిణీ చేసి కబ్జాలు చూపేవరకు సర్వే, ఫెన్సింగ్ పనులు ఆపాలని రైతులు ఆందోళన చేపట్టారు. కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ ఇందుకు హామీ ఇవ్వాలని రైతులు పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ అనంత్‌రెడ్డి ఘటనా స్థలానికి వచ్చిన వెంటనే రైతులు చుట్టుముట్టారు. మూడేళ్ల కింద ప్లాట్ల సర్టిఫికెట్లు ఇచ్చి నేటికి కబ్జా చూపించలేదు. ఫెన్సింగ్ వేసి మోసం చేస్తారా.. అంటూ నిలదీశారు. ఫార్మా ప్లాట్లకు లాటరీలు తీసి రిజిస్ట్రేషన్లు చేసి కబ్జాలు చూపిస్తామని హామీ ఇచ్చారు. కోర్టులో కేసులున్న భూములకు సర్వే చేసి, ఫెన్సింగ్ వేయమని హామీ ఇచ్చారు.

ఆ తర్వాత అంతా నిశ్శబ్దం

ఆర్డీఓ అనంత్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు రైతులతో మాట్లాడుతూ వారికి నచ్చజెబుతున్న సమయంలోనే ఫార్మాకు సేకరించిన భూముల చుట్టు సర్వే, ఫెన్సింగ్ పనులను చేపట్టారు. రైతులను అటుగా వెళ్లనీయకుండా కట్టడి చేశారు. కొందరు రైతులు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డికి, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డికి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఫిర్యాదు చేశారు. కోర్టు కేసులున్న భూములు, రైతుల వద్దకు వెళ్లవద్దని, పరిహారం పొందిన భూములనే సర్వే చేసి ఫెన్సింగ్ వేయాలని అధికారులకు సూచించారు. మధ్యాహ్నం వరకే రైతులు ఆందోళనలు, ధర్నాలు చేపట్టి ఆ తర్వాత అటు వైపు వెళ్లలేదు. దీంతో అధికారులు సాయంత్రం 6 గంటల వరకు సర్వే చేసి ఫెన్సింగ్ పనులు చేపట్టారు.

అప్రమత్తంగా ఉండాలి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కురుస్తున్న అకాల వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు.గురువారం సాయంత్రం భారీ వర్షాల నేపథ్యంలో మేయర్ జోనల్ కమిషనర్ల తో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులను అప్రమత్తం చేశారు. ఇంజనీరింగ్ ఐఆర్‌టీ వాహనాలను రంగంలోకి దింపినట్లు తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటికి రావాలని, రోడ్డుపై నిలిచిన నీటిలో చిన్న పిల్లలు, వృద్ధులు వెళ్లకూడదని, మ్యాన్ హోల్స్ తెరవ వద్దని మేయర్ సూచించారు. అత్యవసరమైతే జీహెచ్‌ఎంసీ కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలన్నారు.

సమష్టి కృషితోనే సత్ఫలితాలు

- సీవరేజీ స్పెషల్ డ్రైవ్ విజయవంతం
- జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్ లక్ష్యంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్ రెండో విడత విజయవంతంగా పూర్తయిందని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ అందరి సమష్టి కృషితో సత్ఫలితాలు ఇచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో ఇంతకు మించి కష్టపడతామని వెల్లడించారు. ఇదే స్ఫూర్తి తో జున్ నాటికి మిగతా మాన్ హోళ్లను కూడా డీ సిల్టింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. వర్షాకాలంలోగా సీవరేజ్ పైపులైన్లు, మ్యాన్ హోళ్లలో వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. అక్టోబర్ 2 నుంచి మార్చి 30 వరకు 180 రోజులు డీ సిల్టింగ్ పనులు చేపట్టారు. ఫలితంగా ఇప్పటి వరకు 24,146 ప్రాంతాల్లో 3,185 కిలో మీటర్ల సీవరేజ్ పైపులైన్, 2.50 లక్షల మ్యాన్ హోళ్లలో డీ-సిల్టింగ్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. స్పెషల్ డ్రైవ్ పకడ్బందీగా అమలు చేసేందుకు గత మూడేళ్లలో వచ్చిన సీవరేజ్ ఫిర్యాదులను విశ్లేషించినట్లు చెప్పారు. ప్రధానంగా వినియోగదారుల ఇళ్లల్లో చోకేజీ, రోడ్లపై సీవరేజ్ ఓవర్ ఫ్లో సమస్యలను గుర్తించామని, రోజూ వచ్చే ఫిర్యాదుల్లో 60 శాతం ఇవే రావడంతో వాటిపై దృష్టి సారించి పరిష్కరించినట్లు ఆయన వివరించారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

బంజారాహిల్స్: డ్రగ్స్ విక్రయిస్తున్న యువకుడిని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-11 తాడిపత్రి బిర్యానీ సెంటర్ సెంటర్ వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు బైక్‌పై అనుమానాస్పదంగా తిరుగుతున్న వెస్ట్‌గోదావరి జిల్లా, భీమవరానికి చెందిన కోపర్తి సాయి మణికంఠ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని తనిఖీ చేయగా 07 గ్రాముల కొకైన్, 3.7 గ్రాముల ఎక్టసీ పిల్స్ లభించాయి. ఓ పెడ్లర్ నుంచి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపాడు. పోలీసులు అతడి వద్ద నుంచి మత్తు పదార్థాలు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పాస్టర్ ప్రవీణ్ కుటుంబాన్ని పరామర్శించిన సునీల్ కుమార్



ప్రవీణ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్

కాప్రా: రాజమహేంద్రవరం సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల కుటుంబాన్ని అంబేడ్కర్ ఇండియా మిషన్ అధ్యక్షుడు, సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ పరామర్శించారు. గురువారం కాప్రా డివిజన్ ఈశ్వరిపురి కాలనీలోని వారి నివాసానికి వెళ్లిన సునీల్‌కుమార్ ప్రవీణ్ పగడాల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రవీణ్ తల్లి మరియమ్మ, సోదరుడు ఆంటోని కిషోర్, సోదరి జ్యోతితో మాట్లాడి అంబేడ్కర్ ఇండియా మిషన్(ఏఐఎం) అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సునీల్‌కుమార్‌తో పాటు కిషోర్, మదిర శేషయ్య, ఎం విల్సన్ ఉన్నారు.

నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్

డీసీపీ పద్మజారెడ్డి



జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధి వికలాంగుల కాలనీలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు మల్కాజిగిరి డీసీపీ పద్మజారెడ్డి ఆధ్వర్యంలో 120 మంది పోలీసులతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 24 బ్లాకుల్లో 200 ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ పద్మజారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు శాంతియుత వాతావరణం కల్పించడం కోసం పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారన్నారు. నేరాల నియంత్రణ కోసం కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. జవహర్‌నగర్‌లో గంజాయి విక్రయించినా, సేవించినా పోలీసులకు సమాచారం అందించాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సెర్చ్‌లో 202 వాహనాలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా అమ్ముతున్న 17 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుషాయిగూడ ఏసీపీ మహేష్, జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, అడ్మిన్ ఎస్సై ఇద్రీస్‌అలీ, రామునాయక్, లక్ష్మయ్య, వేణు, పోలీసులు తదితరులున్నారు.

బలహీనత ఖరీదు రూ.1.57 లక్షలు!

- ఆన్‌లైన్‌లో ఎస్కార్ట్ సర్వీస్ ప్రకటనలు
- ఆకర్షితుడైన నగరానికి చెందిన యువకుడు
- రిఫండ్ అంటూ ఎర వేసి ఆ మొత్తం స్వాహా
- సీసీఎస్‌లో కేసు నమోదు



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ యువకుడి చిన్న బలహీతన రూ.1.57 లక్షలు నష్టపోవడానికి కారణమైంది. ఆన్‌లైన్‌లో కనిపించిన ఎస్కార్ట్ సర్వీస్ ప్రకటనకు ఆకర్షితుడైన సదరు యువకుడు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న యువకుడిని నిర్ణీత మొత్తం చెల్లిస్తే ఏకాంత సేవలు అందిస్తాం అంటూ ఆన్‌లైన్‌లో వచ్చిన ప్రకటన ఆకర్షించింది. అందులో ఉన్న ఫోన్ నెంబర్‌లో సంప్రదించగా... ఈ సేవల కోసం రూ.4 వేలు చెల్లించాలని అవతలి వారు చెప్పారు. తొలుత తమకు రూ.500 చెల్లించాలని, ఆపై తాము సేవలు అందించే యువతితో పాటు చేరుకోవాల్సిన హోటల్ వివరాలు అందిస్తామన్నారు. అక్కడకు వెళ్లిన తర్వాత మిగిలిన మొత్తం ఇవ్వాలని సూచించారు. దీంతో సదరు యువకుడు వారు సూచించిన ఖాతాకు రూ.500 చెల్లించాడు. ఆపై ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు మిగిలిన మొత్తం కూడా బదిలీ చేయించుకున్నారు. అంతటితో ఆగకుండా యువకుడి నుంచి వీలున్నంత ఎక్కువ గుంజాలని పథకం వేశారు. దీనిని అమలులో పెడుతూ సెక్యూరిటీ డిపాజిట్, ఐడీ వెరిఫికేషన్ పేమెంట్, పోలీస్ వెరిఫికేషన్ అండ్ సేఫ్టీ పేమెంట్ పేరుతో డబ్బు వసూలు చేశారు. అతడికి అనుమానం వచ్చిన ప్రతిసారీ రూ.4 వేలు మినహా మిగిలింది రిఫండ్ అవుతుందని నమ్మించారు. ఓ దశలో రెండు నిమిషాల్లో రిఫండ్ మొత్తం వస్తుందంటూ మరికొంత, వేగంగా రిఫండ్ కావాలంటే తప్పదంటూ రెట్టింపు మొత్తం బదిలీ చేయించుకున్నారు. ఇలా మొత్తం రూ.1,57,381 బదిలీ చేయించుకున్న తర్వాత 'ప్రాసెస్ పూర్తయింది. నగదు రిఫండ్ చేయడానికి మీ బ్యాంకు ఖాతా వివరాలు పంపండి. మీ బుకింగ్ ఐడీ, హోటల్ పేరు, రూమ్ నెంబర్ తదితరాలు లోకంటో.కామ్ అనే వెబ్‌సైట్‌లో పొందుపరుస్తాం' అనే సందేశాన్ని యువకుడికి పంపారు. దీంతో అనుమానించిన అతగాడు ఇంటర్‌నెట్‌లో సెర్చ్ చేసి తాను మోసపోయినట్లు గుర్తించాడు. సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

సిగరెట్లు అమ్మడం లేదన్నందుకు..

హోటల్ నిర్వాహకులపై దాడి



మేడ్చల్‌రూరల్: సిగరెట్లు అమ్మడం లేదని చెప్పినందుకు హోటల్‌లో పని చేసి వ్యక్తితో పాటు యజమాని, అతడి కుమారుడు, కుమార్తెపై దాడి చేసిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక వినాయక్‌నగర్ కాలనీకి చెందిన రాజేశ్ చతుర్వేది సోమారం గ్రామ పరిధిలోని రిలాన్స్ గోదాం సమీపంలో హోటల్ నిర్వహిస్తున్నాడు. సదరు హోటల్‌లో దివాకర్ అనే వ్యక్తి పని చేస్తున్నాడు. గత నెల 30న రాత్రి సమీపంలోని బండమైలారం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు హోటల్‌కు వచ్చి సిగరెట్లు కావాలని అడిగారు. సిగరెట్లు అమ్మడం లేదని దివాకర్ చెప్పడంతో ఆగ్రహానికి లోనైన వారు అతడిపై దాడి చేశారు. దీనిపై అతను యజమాని రాజేశ్ చతుర్వేదికి సమాచారం అందించడంతో అతను తన కుమార్తె శివానీ, కుమారుడు కృష్ణతో కలిసి హోటల్ వద్దకు వచ్చి వారికి సర్దిచెప్పి పంపించారు. ఆ తర్వాత కొద్ది సేపటికే అక్కడికి వచ్చిన 20 మంది యువకులు కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో రాజేశ్ చతుర్వేదితో పాటు అతడి కుమార్తె, కుమారుడికి గాయాలయ్యాయి. అడ్డుగా వచ్చిన రాకేశ్ చతుర్వేది అనే వ్యక్తిపై కూడా వారు దాడి చేశారు. ఈ విషయం ఎవరికైనా చెపితే చంపుతానని బెదిరించారు. ఈ విషయమై బాధితులు మర్నాడు మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూసీ నదిలో చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులు

కాపాడిన హైడ్రా, జీహెచ్‌ఎంసీ రెస్క్యూ టీం



చైతన్యపురిలో మూసీ మధ్యలోని శివాలయంలో చిక్కుకున్న మేస్త్రీలు



కాపాడిన రెస్క్యూ టీం

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ నర్సింహస్వామి ఆలయం సమీపంలో మూసీ నది మధ్యలో ఉన్న శివాలయం వద్ద పనికి వెళ్లిన ఇద్దరు వ్యక్తులు వరద నీటిలో చిక్కుకున్నారు. గురువారం ఆలయం వద్ద దిమ్మకట్టేందుకు వీరయ్యతో పాటు మరో వ్యక్తి వెళ్లాడు. సాయంత్రం కురిసిన భారీ వర్షానికి మూసీలో ప్రవాహం పెరిగి నీటిమట్టం పెరిగింది. నది బయటికి వచ్చేందుకు దారిలేక తెలిసిన వారికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. స్థానిక కార్పొరేటర్ రంగానర్సింహ గుప్తా, సరూర్ నగర్ డిప్యూటి కమిషనర్ సుజాత అక్కడకు చేరుకున్నారు. హైడ్రా, జీహెచ్ ఎంసి రెస్క్యూ టీంను రంగంలోకి దింపి రాత్రి 8 గంటలకు మూసీ మధ్యలో చిక్కుకున్న ఇద్దరిని క్షేమంగా కాపాడారు.

బాలిక ఆత్మహత్య

జియాగూడ: ఓ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ.రాజేశ్వర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జియాగూడ భరత్‌నగర్‌కు చెందిన నిర్మల, కొమురయ్యల దంపతులకు ఇద్దరు సంతానం. ఈ నెల 2న ఉదయం వారిద్దరూ పనికి వెళ్లగా వారి పిల్లలు స్వాతి(14), మనీష్‌కుమార్ స్కూల్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన నిర్మల ఇంట్లోని ఓ గదిలో ఫ్యాన్‌ను చీర వేలాడుతుండగా, తలకు గాయాలతో అపస్మారస్థితిలో పడి ఉన్న స్వాతిని గుర్తించింది., స్థానికుల సహాయంతో ఆమెను ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి దారుణ హత్య



రహీం(ఫైల్)

అత్తాపూర్: గంజాయి మత్తులో జరిగిన ఘర్షణలో ఓ బాలుడిని బండరాళ్లతో మోది హత్య చేసిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు కథనంమేరకు వివరాలిలా ఉన్నాయి. గోల్డెన్ సిటీ హసన్‌నగర్ ప్రాంతానికి చెందిన రఫిక్ కుమారుడు రహీం(14) ఆవారాగా తిరుగుతున్నాడు. గంజాయికి అలవాటు పడిన అతను ఇతరులతో గొడవ పడుతూ ఉండేవాడు. గురువారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన రహీంకు అతని స్నేహితులతో జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో ఓ బాలుడు అతడి తలపై బండరాయితో మోది హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. మృతుడి తండ్రి రఫిక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులు తిరిగి ఇవ్వమన్నందుకు

ఎయిర్ పిస్టల్‌తో బెదిరింపులు

బంజారాహిల్స్: మెడికల్ సీటు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని సీటు ఇప్పించకపోగా డబ్బులు తిరిగి ఇవ్వమన్నందుకు ఎయిర్ పిస్టల్‌తో బెదిరించిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..స్వర్ణధామ నగర్‌కు చెందిన ఎస్‌వీ నాగిరెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. తన కుమార్తె పీజీ మెడికల్ సీటు కోసం చక్రధర్‌రెడ్డి అనే వ్యక్తిని సంప్రదించిన అతను రూ.20 లక్షలు ఇచ్చాడు. అయితే చక్రధర్‌రెడ్డి సీటు ఇప్పించకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని నాగిరెడ్డి ఒత్తిడి చేయడంతో రూ.5 లక్షలు తిరిగి ఇచ్చాడు. మిగతా డబ్బులు ఇవ్వాలని ఇవ్వాలని కోరగా డబ్బులు అడిగితే నీ అంతు చూస్తానంటూ ఎయిర్ పిస్టల్‌తో బెదిరించాడు. తనతో పాటు కుటుంబ సభ్యులకు చక్రధర్‌రెడ్డి నుంచి ప్రాణహాని ఉందని బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని టోకరా

హోంగార్డుపై కేసు నమోదు

పంజగుట్ట: ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేసిన హోంగార్డుపై పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పల్, ప్రతాప్ సింగారం ప్రాంతానికి చెందిన సునీల్ గౌడ్‌కు తన స్నేహితుల ద్వారా చంద్రప్రకాష్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. చంద్రప్రకాష్ ఒక పోలీస్ ఉన్నతాధికారి వద్ద డ్రైవర్‌గా పని చేసేవాడు. 2024లో సునీల్ తన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నానని, గ్రూప్ ఫోర్ ఉద్యోగానికి పరీక్ష రాసిందని చంద్రప్రకాష్‌కు చెప్పాడు. దీంతో చంద్రప్రకాష్ తాను ఉన్నతాధికారులతో మాట్లాడి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. ఇందుకు రూ.6 లక్షలు ఖర్చవుతుందని చెప్పి రూ. 3 లక్షలు తన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. మరో రూ.3 లక్షలకు చెక్కులు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోక పోగా ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సునీల్ పంజగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేఆర్ కాలేజీని సందర్శించిన ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎంఎస్ కుమార్

హిమాయత్‌నగర్: నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీని గురువారం సికింద్రాబాద్ ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎం.ఎస్.కుమార్, ఐటీ నేవీ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ రామచందర్ రావు సందర్శించారు. కాలేజీలోని నేవీ ఎన్‌సీసీ రూం, ఫైల్స్‌ను పర్యవేక్షించి, గ్రూప్ కమాండర్, ఎన్‌సీసీ యూనిట్‌కు సంబంధించి కాలేజీ కేడెట్లు రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికయ్యే వంటి విషయాలను తెలుసుకున్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్ కుమార్, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ వి.మనోజ్ కుమార్, నేవీ పీఐ స్టాఫ్ కిషోర్, యజ్ఞేశ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల స్వాధీనాన్ని విరమించుకోవాలి

హిమాయత్‌నగర్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) భూములను స్వాధీనపర్చుకోవాలనే ఆలోచనలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ నారాయణరావు డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ... విద్యార్థులపై బనాయించిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలన్నారు. విద్యార్థులపై పోలీసుల అత్యుత్సాహం, లాఠీచార్జి చేయడాన్ని ఖండించాలన్నారు. హెచ్‌సీయూ భూములను, పర్యావరణాన్ని పరిరక్షించడానికి ఉద్యమిస్తున్న యూనివర్సిటీ విద్యార్థులకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఆ భూములు ప్రభుత్వం యూనివర్సిటీకి అప్పగించి, యూనివర్సిటీ పేరున రిజిస్ట్రేషన్ చెయాలన్నారు. ప్రజాస్వామిక హక్కుగా శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై అత్యుత్సాహం ప్రదర్శిస్తూ లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు పి.ఎం.రాజు, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర స్తంభాన్ని మార్చాలి



స్తంభాన్ని పరిశీలిస్తున్న రామన్‌గౌడ్ తదితరులు

హిమాయత్‌నగర్: షంషీర్‌బాగ్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని మార్చాలని కార్పొరేటర్ మహాలక్ష్మి, స్థానిక కాంగ్రెస్ నేత రామన్‌గౌడ్ కోరారు. ప్రమాదకర స్తంభాన్ని సుల్తాన్ బజార్ ఏఈ విశ్వలికతో కలిసి ఆయన పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో బస్తీ నేతలు జె.కె.శీను, ప్రభు, బాబు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి అదృశ్యం



వెంకటేశ్వరశర్మ

ఫిలింనగర్: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... షేక్‌పేట ఓయూ కాలనీలో నివసించే వెంకటేశ్వరశర్మ(61) గత నెల 28వ తేదీన నల్లకుంటలో నివసించే తన కూతురు ఇంటికి వెళ్తున్నాని కొడుకు పృథ్వీకి చెప్పాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోయేసరికి తండ్రి గురించి వాకబు చేయగా తన దగ్గరకు రాలేదని ఆయన సోదరి తెలిపింది. దీంతో అన్ని ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో తన తండ్రి కనిపించడం లేదని పృథ్వీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిలింనగర్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87126 65182లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ప్రమాదం జరగకుండా చర్యలు

మోతీనగర్: అకాల వర్షానికి బబ్బుగూడ నాలా నిండి ఇళ్లలోకి నీరు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గురువారం ఆయన ఆ ప్రాంతంలో పర్యటించి నాలా ప్రవాహాన్ని పరిశీలించారు. నాలాలో చెత్తా, చెదారం పేరుకుపోయి ప్రవాహానికి అడ్డు తగులుతుందని గమనించి అధికారులకు సమస్యను వివరించి మాట్లాడారు. ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తిరుపతి, బోడ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వెంకటేష్, హరిబాబు, రాజ్‌కుమార్, సుందర్, మణిరాజ్ గౌడ్, అజామ్ నాయుడు పాల్గొన్నారు.

వరదనీటి సంప్‌ల పనితీరు అంతంతే..!

మోటార్ల ద్వారా కాలువల్లోకి తరలింపు

బంజారాహిల్స్: కుండపోత వర్షంతో వరదనీరు బీభత్సం సృష్టించింది. అయితే ఇటీవల వరదనీరు నిలిచిపోయే ప్రాంతాల్లో నిర్మించిన సంప్‌లు ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంది. ఆ సంప్‌ల పనితీరు అంతంతమాత్రంగానే ఉండటంతో పలుచోట్ల వరదనీరు నిలిచిపోయి కొంత సమస్య తలెత్తింది.

- ముఖ్యంగా సోమాజిగూడ మెర్క్యూరీ హోటల్ చౌరస్తాలో వరదనీరు చాలాసేపు నిలిచిపోయి సమస్యలు తలెత్తాయి.
- ఖైరతాబాద్ సర్కిల్-17 పరిధిలో సెక్రటేరియట్, లేక్ వ్యూ గెస్ట్ హౌస్, సోమాజిగూడ మెర్క్యూరీ హోటల్ వద్ద గత ఏడాది భారీ సంప్‌లను నిర్మించారు. వర్షాలు పడ్డప్పుడు వరదనీరు నిలిచిపోయి ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ఈ సంప్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.
- గురువారం కురిసిన వర్షానికి భారీగా వరదనీరు ఈ సంప్‌ల్లోకి వెళ్లి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూశారు. అయినా సరే సంప్‌ల వద్ద వరద నిలిచిపోయి కొన్ని ఇబ్బందులు తప్పలేదు.



లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ వద్ద వరదనీటి తరలింపును పరిశీలిస్తున్న ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి

- సంపులు నిండగానే మోటార్ల ద్వారా ఈ నీటిని వరదనీటి కాలువల్లోకి పంపించారు. ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి సంబంధిత ఇంజినీర్లతో కలిసి వరదనీటి సంపులను పరిశీలించారు. అన్ని సంపుల్లో మోటార్లను ఆన్ చేయించి వరదనీరు కాలువల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.
- గతంలో వర్షాలు పడ్డప్పుడు వరదనీరు ఈ ప్రాంతాల్లో మోకాలు లోతు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించిపోయేది. రాకపోకలు నిలిచిపోయేవి. దీనిని దృష్టిలో పెట్టుకుని గత ఏడాది జీహెచ్‌ఎంసీ అప్పటి కమిషనర్ రోనాల్‌రోస్ వరదనీటి సంపుల నిర్మాణానికి తెరతీశారు. కోట్లాది రూపాయలు వెచ్చించి పక్కా ప్రణాళికతో పటిష్టంగా వీటిని నిర్మించారు.
- ప్రణాళికాబద్ధంగా వీటి నిర్మాణం జరిగిందా? లేదా అన్నది ఈ వర్షాలతో తేలిపోనున్నది. వీటి వల్ల ఎంతవరకు ప్రయోజనం ఉందో, మరిన్ని భారీ వర్షాలు పడ్డప్పుడు కళ్లకు కట్టనుంది.

తుమ్మలబస్తీలో...

పంజగుట్ట: భారీ వర్షానికి పంజగుట్ట తదితర ప్రాంతాల్లో రోడ్లు మొత్తం జలమయమయ్యాయి. విపరీతంగా వీచిన ఈదురు గాలులవల్ల పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. తుమ్మలబస్తీలో బల్కాపూర్ నాలా మొత్తం నిండిపోయి ప్రవహిస్తూ నాసర్ స్కూల్ సమీపంలో నాలా ప్రహరీ పైనుంచి రోడ్డుపైకి మురుగు నీరు వచ్చాయి. నాలాలోని వ్యర్థాలు తీసేందుకు గత కొన్ని రోజులుగా జేసీబీ నాలా లోపల ఉండి వ్యర్థాలను బయటపడేస్తుంది. భారీ వర్షానికి నాలా లోపల ఉన్న జేసీబీ పూర్తిగా మునిగిపోయింది. కేవలం వ్యర్థాలను ఎత్తిపోసే క్యాప్ మాత్రమే కనిపిస్తుంది. కొద్దిసేపటికి వర్షం తగ్గాక వరద తగ్గడంతో బయటకు తేలింది. వెంటనే అక్కడకు చేరుకున్న జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ సెక్షన్ సిబ్బంది, డీఆర్‌ఎఫ్ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

- సోమాజిగూడ సూర్యకుటీర్ అపార్ట్‌మెంట్ ముందు ఒక భారీ చెట్టు పెద్ద కొమ్మ విరిగి రోడ్డుపై పడింది. ఖైరతాబాద్ కూడలి నుంచి ఆనంద్‌నగర్ కాలనీ వెల్లే మార్గంలో కూడా ఒక భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో కొద్దిసేపు వాహనరాకపోకలకు అంతరాయం కలిగింది. వెంటనే ట్రాఫిక్ పోలీసులు అక్కడకు వచ్చి సమస్యను పరిష్కరించారు.

హిమాయత్‌నగర్‌లో...

హిమాయత్‌నగర్: భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెం.6లో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు కొట్టుపోయాయి. దీంతో ఒక గంటపాటు వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు సకాలంలో చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. రోడ్లపై భారీగా వరద నీరు చేయడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



హిమాయత్‌నగర్‌లో కొట్టుకుపోయిన బారికేడ్లు

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో...

వెంగళరావునగర్: కొన్ని రోజులుగా ఎండలతో విలవిలలాడుతున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు గురువారం కురిసిన భారీ వర్షం కొంత ఉపశమనాన్నిచ్చింది. అనుకోని విధంగా కురిసిన వాన అటు సంతోషాన్ని కలిగించినా రోడ్డుమీద మరోసారి మోకాళ్లలోతు నీరు రావడంతో కొంత ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, మహిళలు రోడ్డు మీదకు రావాలంటేనే భయపడ్డారు. వానాకాలంలో చూసిన విధంగానే యూసుఫ్‌గూడ, శ్రీకృష్ణానగర్ ఏ-బ్లాక్, బీ-బ్లాక్, వెంకటగిరి, మధురానగర్‌కాలనీ, జవహర్‌నగర్, యాదగిరినగర్, వెస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీ, సారథి స్టుడియో పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు సగం వరకు మునిగిపోయి ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఏకధాటిగా మూడు గంటల పాటు వాన కురవడం అటు ఆనందం, ఇటు ఇబ్బంది రెండు ఏకకాలంలో చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



బల్కాపూర్ నాలాలో మునిగిన జేసీబీ



సోమాజిగూడ కూడలిలో కూలిన భారీ కొమ్మ

రోడ్లన్నీ జామ్



వరద నీటి ప్రాంతాల్లో పర్యటిస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-11 ఉదయనగర్ వీధులను ముంచెత్తిన వరద

బంజారాహిల్స్: దంచికొట్టిన వానతో రోడ్లన్నీ అతలాకుతలమయ్యాయి. గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా రెండు గంటల పాటు కురిసిన కుండపోత వర్షానికి వీధులన్నీ జలమయం కాగా ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. అంతర్గత రహదారులు వాగులను తలపించాయి. ప్రధాన రహదారుల్లో సైతం ఎక్కడికక్కడ మోకాలు లోతు నీళ్లు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-11లోని ఉదయనగర్, నాయుడు నగర్, సింగాడకుంట బస్తీలు నీట మునిగాయి. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ రాషమ్‌బాగ్ ప్రాంతాల్లో వరద బీభత్సం సృష్టించింది. కమలాపురికాలనీ, ఇందిరానగర్, శ్రీనగర్‌కాలనీలలో వరదనీరు రోడ్డుపై నిలిచి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. చింతల్ బస్తీ, పంజగుట్ట, ఖైరతాబాద్, సోమాజిగూడ ప్రాంతాల్లో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు వరదతో అతలాకుతలమయ్యాయి. కుండపోత వర్షంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరద ప్రభావానికి రోడ్లపై గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయింది. వరదనీరు నిలిచిన ప్రాంతాల్లో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో ట్రాఫిక్ పోలీసులు పర్యటించి వరద సమస్య లేకుండా పరిస్థితిని సమీక్షించారు. పలుచోట్ల ట్రాఫిక్ పోలీసులు వరద నిలిచిన చోట్ల మ్యాన్‌హోళ్లు శుభ్రం చేసి వరద వెళ్లేలా చేశారు. గంటల తరబడి శ్రమించారు.

షేక్‌పేట మండలంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు



కంట్రోల్ రూమ్‌లో తహసీల్దార్ అనితారెడ్డి

బంజారాహిల్స్: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో షేక్‌పేట మండల కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట, యూసుఫ్‌గూడ డివిజన్ల పరిధి కిందికి వచ్చే షేక్‌పేట మండలంలో ఏర్పాటు చేసిన ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలూ అందుబాటులో ఉంటుందని షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి తెలిపారు. గురువారం ఆమె కంట్రోల్ రూం ఏర్పాటుచేసిన అనంతరం మాట్లాడుతూ... వరదల నేపథ్యంలో ప్రజలు ఏవైనా సమస్యలు ఎదుర్కొన్నా, గోడలు కూలినా వెంటనే కంట్రోల్ రూంలో ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు.

కంట్రోల్‌రూంలో అందుబాటులో ఉండే అధికారులు, వారి నెంబర్లు..

- 3వ తేదీ రాత్రి 8 నుంచి 4వ తేదీ ఉదయం 8 గంటల వరకు రికార్డు అసిస్టెంట్ శైలు, వీఆర్వో నర్సింహారెడ్డిలు అందుబాటులో ఉంటారు. వారిని ఫోన్స్: 99633 82106, 97003 06601లలో సంప్రదించవచ్చు.
- 4వ తేదీన ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆర్ఐ భానుచందర్, సిద్ధిరాములు కంట్రోల్ రూంలో అందుబాటులో ఉంటారు. వీరిని ఫోన్స్: 90009 55071, 95535 14750లలో సంప్రదించవచ్చు.
- 4వ తేదీన రాత్రి 8 నుంచి 5వ తేదీ ఉదయం 8 గంటల వరకు వీఆర్వో మురళి, ఆర్ఐ నవీన్‌లు అందుబాటులో ఉంటారు. వీరిని ఫోన్స్: 93467 95894, 63090 68398లలో సంప్రదించవచ్చని తహసీల్దార్ అనితారెడ్డి వివరించారు.

వరంగల్ విమానాశ్రయానికి కొమురయ్య పేరు పెట్టాలి



నివాళులర్పిస్తున్న దొడ్డి చంద్రం తదితరులు

రహమత్‌నగర్: వరంగల్‌లో ఏర్పాటు చేయబోయే విమానాశ్రయానికి తన చిన్న తాత దొడ్డి కొమురయ్య పేరును పెట్టాలని దివంగత దొడ్డి కొమురయ్య అన్న మల్లయ్య మనవడు దొడ్డి చంద్రం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన కార్మికనగర్‌లో అక్క మహంకాళి మహిళా కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు సమావేశంలో ఆయన పాల్గొని దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రజాకార్ల దాడిలో తన చిన్న తాత దొడ్డి కొమురయ్య మృతి చెందగా, తన తాత మల్లయ్య రెండు కాళ్లను బుల్లెట్ గాయాలయ్యాయని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో అమరుడైన తన తాత దొడ్డి కొమురయ్య ప్రాణ త్యాగాన్ని గత ప్రభుత్వాలు ఏనాడూ గుర్తించలేదని ఆయన వాపోయారు. ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి దొడ్డి కుటుంబీకులను ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, ప్రముఖ పాత్రికేయులు పాశం యాదగిరి, భ్రమరాంబా మల్లికార్జున కురుమ సంఘం నాయకులు కడారి శివ, కంకట సురేందర్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ కురుమ సంఘం యువజన నాయకులు అనిల్ కురుమ, అల్లి శ్రీనివాస్, సదానంద్, దయ్యాల శ్రీనివాస్, రవిశేఖర్, లింగమూర్తి, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభ దశలో గుర్తిస్తే 'వెరికోస్'కు చెక్



మాట్లాడుతున్న డాక్టర్ నరేంద్రనాథ్ మేడా

బంజారాహిల్స్: వెరికోస్ వెయిన్స్ సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స చేయడం ద్వారా తీవ్రమైన అనారోగ్య సమస్యలను నివారించవచ్చని ది ఫుట్ డాక్టర్ వీన్ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్రనాథ్ మేడా స్పష్టం చేశారు. ది ఫుట్ డాక్టర్ హాస్పిటల్‌లో వీన్ క్లినిక్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... త్వరితగతిన రోగ నిర్ధారణ చేసి గ్లూ థెరపీ వంటి అధునాతన చికిత్సలు అందించడం ద్వారా మెరుగైన ఫలితాలను పొందవచ్చన్నారు. నూతన ఇమేజింగ్ పద్ధతుల ద్వారా ఖచ్చితమైన నిర్ధారణ పొందేందుకు వీలవుతుందన్నారు. అలాగే డయాబెటిస్ లేదా హృదయ సంబంధిత వ్యాధులు ఉన్న వారు సాంప్రదాయ శస్త్ర చికిత్సకు అర్హులు కానప్పుడు గ్లూ థెరపీ సరైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందన్నారు. అధిక బరువును నియంత్రించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఎక్కువ సేపు కూర్చోవడం లేదా, నిలబడి ఉండడం తగ్గించడం, పొగ తాగడం మానుకోవడం వంటి జీవన శైలిలో మార్పులు తీసుకురావడం ద్వారా సమస్యను నివారించుకోవచ్చన్నారు. ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించడం దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఎంతో ఉపయోగకరమన్నారు.

ప్రజల డిమాండ్ మేరకు బస్సులు : ఆర్‌ఎం

మూసాపేట: ప్రజల డిమాండ్ మేరకు కాలనీలు, మిగతా ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ కూకట్‌పల్లి డిప్యూటి రీజినల్ మేనేజర్ అపర్ణ కళ్యాణి అన్నారు. గురువారం కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లోని డిప్యూటి ఆర్‌ఎం కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూకట్‌పల్లి, మియాపూర్-2, జీడిమెట్ల, హెచ్‌సీయూ, మేడ్చల్ డిపోలు తమ పరిధిలో ఉన్నాయని, సుమారు 711 బస్సులు నడుస్తున్నాయన్నారు. మరో 25 మెట్రో డీలక్స్ బస్సులు కొత్తవి వస్తున్నాయని తెలిపారు. ప్రయాణికులతో మర్యాదగా నడుచుకునేలా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. గురువారం శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా శేరిలింగంపల్లిలోని హెచ్‌సీయూలో జరుగుతున్న విధ్వంసను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ఇప్పటికే ప్రజలు గమనిస్తున్నారని, నాడు కేసీఆర్ ప్రకృతిని కాపాడుతూ హరితహారం పేరుతో చెట్లు నాటారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని, ప్రతి కార్యకర్తనూ పార్టీ గుర్తు పెట్టుకుంటుందన్నారు.

అకారణంగా వైద్యుడిపై దాడి

భార్యపై కూడా దాడి చేశాడంటూ పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్: కారణం లేకుండా భౌతిక దాడులకు పాల్పడుతూ న్యూసెన్స్ చేస్తుండటమే కాకుండా అడగడానికి వెళ్లిన భార్యను అసభ్య పదజాలంతో దూషించిన పొరుగింటి వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఓ వైద్యుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లోని స్వర్ణ హెవెన్స్‌లో నివసించే గోపీనాథ్ వృత్తిరీత్యా వైద్యుడు. తన ప్లాట్ ఎదురుగా ముస్తఫ రాజు ఉంటున్నాడు. తరచూ తనపై అకారణంగా దాడి చేస్తున్నాడని, ఈ క్రమంలోనే ఈ నెల 1వ తేదీన తనపై దాడి చేసే క్రమంలో కిందకు నెట్టేయడంతో పడిపోయాయనని, అంతటి ఆగకుండా చెప్పులతో దాడి చేశాడని గోపీనాథ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయాన్ని అడిగేందుకు వెళ్లిన ఆయన భార్యను సైతం అసభ్య పదజాలంతో దూషించాడంటూ తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భారీ వాహనాలు వెళ్లకుండా గేట్ల ఏర్పాటు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కెపెస్ నగర్, రాజీవ్ గాంధీనగర్ మధ్యలోని రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి కింద నుంచి నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో స్థానికంగా నివసిస్తున్న ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్న ఫిర్యాదుతో కార్పొరేటర్ సబిహా బేగం గురువారం రైల్వే అధికారులతో మాట్లాడారు. తక్షణమే రైల్వే అధికారులు స్పందించి భారీ వాహనాలు వెళ్లకుండా భారీ గేట్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రియాజ్, అస్లాం, మల్లేష్, రాంబాబు పాల్గొన్నారు.

స్తంభించిన జీవనం

ఆగకుండా కురిసిన భారీ వర్షానికి అమీర్‌పేట చందన బ్రదర్స్ చౌరస్తా నీట మునిగి స్థానికంగా రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఎల్లారెడ్డిగూడ పూర్తిగా నీటమునిగింది. ఉదయనగర్ బస్తీలో వాహనాలు వరదనీటిలో కొట్టుకుపోయాయి. ఎటుచూసినా అతలాకుతలమైన రహదారులు స్థానికులకు ప్రత్యక్ష నరకాన్ని చూపించాయి. - బంజారాహిల్స్



అమీర్‌పేట చందన బ్రదర్స్ చౌరస్తాలో నిలిచిన వరదనీరు



జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-45లోని ఫ్లైఓవర్ కింద ఆగిన వాహనదారులు



కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ దారిలో...



బంజారాహిల్స్ పార్క్ హయత్ హోటల్ దాటిన తర్వాత...



జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36 పెద్దమ్మ గుడికమాన్ వద్ద...

అభివృద్ధిని అడ్డుకుంటున్న విపక్షాలు

- టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్



చనగాని దయాకర్

ఉస్మానియా యూనివర్సిటీ: హెచ్‌సీయూ విద్యార్థులను రెచ్చగొట్టి అభివృద్ధిని అడ్డుకుంటూ ప్రతిపక్షాలు రాక్షస ఆనందం పొందుతున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ చట్టపరంగా ప్రభుత్వ భూములైన 400 ఎకరాలు హెచ్‌సీయూ భూములంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విషప్రచారాన్ని తిప్పిగొడతామన్నారు. తెలంగాణ నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అభివృద్ధికి, ప్రజాపాలనకు అడ్డుపడుతున్న బీఆర్ఎస్, బీజేపీల నేతలను తరిమికొట్టే బాధ్యతను తెలంగాణ యువత తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ భవన్ నుంచి హెచ్‌సీయూ పోరాటం జరుగుతోందని, త్వరలో కుట్రలు బయటకు వస్తాయని పేర్కొన్నారు. హెచ్‌సీయూ పోరాటం వెనుక గుంటనక్కలు చేరాయని దయాకర్ ధ్వజమెత్తారు.

పీడియాట్రిక్స్ కోర్సు ప్రారంభం



రెండు రోజుల కోర్సును ప్రారంభిస్తున్న డాక్టర్ రవికుమార్

నాంపల్లి: పీడియాట్రిక్స్ కోసం రెండు రోజుల అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ కోర్సు(ఐఏపీ ఏఎల్ఎస్) గురువారం నిలోఫర్ ఆసుపత్రిలో ప్రారంభమైంది. నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ తరగతులకు తెలంగాణతో పాటుగా పొరుగు రాష్ట్రాలకు చెందిన పీడియాట్రిషియన్స్, పీడియాట్రిక్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ హాజరయ్యారు. వృత్తిపరమైన నైపుణ్యాలపై డాక్టర్ ఎస్.రవికుమార్ అవగాహన కల్పించారు. అనారోగ్యంతో ఉన్న శిశువులకు చికిత్స అందజేయడంపై ఆయన మెలకువలు నేర్పించారు. తన అనుభవాలను పీజీలతో పంచుకున్నారు. కార్యక్రమంలో పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ జి.విజయ్‌కుమార్, యశోద ఆసుపత్రి ఐఏపీ ఏఎల్ఎస్ సెంట్రల్ జోన్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.సురేష్‌కుమార్, స్థానిక కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ బి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వసుధ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం



వసుధ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న జీహెచ్ఎంసీ మాజీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి

బండ్లగూడ: ప్రజలు ఆరోగ్యాలపై శ్రద్ధ తీసుకుంటూ వాకింగ్, వ్యాయామం, యోగా వంటివి చేయాలని జీహెచ్ఎంసీ మాజీ కమిషనర్ జనార్దన్ రెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో గురువారం వసుధ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యసేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వై.పృథ్వీరెడ్డి, డాక్టర్ కె.పల్లవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కూతురిపై అఘాయిత్యం

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

విజయనగర్‌కాలనీ: మద్యం మత్తులో కామంతో కళ్లు మూసుకుపోయిన ఓ దుర్మార్గుడు కన్నకూతురిపైనే అఘాయిత్యానికి పాల్పడ్డాడు. టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని ఓ హోటల్‌లో కార్మికుడిగా పని చేసే అక్బర్(40) జిర్రా నట్రాజ్‌నగర్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. భార్య ఇళ్లల్లో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. వారికి కూతురు(17) సంతానం. మద్యం, ఇతర దురలవాట్లు ఉన్న అక్బర్ ప్రవర్తన సరిగా లేకపోవడంతో అతడిని కుటుంబసభ్యులు ఇంటి నుంచి తరిమేశారు. ఈ నెల 2న ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం తాగి వచ్చి కూతురును బలాత్కరించాడు. ప్రవర్తన మార్చుకున్నానంటూ తమను నమ్మించి ఇంట్లోకి ప్రవేశించి గతంలోనూ పలుమార్లు కూతురుపై అఘాయిత్యం చేసినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. బాధితురాలిని భరోసా కేంద్రానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఈ-వ్యర్థాలు.. అనర్థాలు



వాతావరణ, ఆరోగ్య సమస్యలు

- ఘన వ్యర్థాలతో కలుస్తున్న ఈ-వ్యర్థాలు

సాక్షి, సిటీబ్యూరో:

అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఈ- వ్యర్థాలు పెను అనర్థాలకు కారణాలవుతున్నాయి. నిత్యం వినియోగించే ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పరికరాలు, మెడికల్ డివైజ్ వంటివి టన్నుల కొద్దీ భూమిలో పేరుకుపోతున్నాయి. ఇవన్నీ ఘన వ్యర్థాల్లో కలిసి పోతున్నాయి. వీటి నుంచి వచ్చే ఉద్గారాలు పర్యావరణాన్ని ఊహించని స్థాయిలో కలుషితం చేయడమే కాకుండా, ఆరోగ్య సమస్యలపైనా తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. హెచ్ఎండీఏ పరిధిలో ఏటా సుమారు 60 వేల మెట్రిక్ టన్నుల ఈ-వ్యర్థాలు ఉత్పన్నమవుతున్నాయి. ఏటా 4 వేల నుంచి 7 వేల మెట్రిక్ టన్నుల పెరుగుదల కనిపిస్తోంది. సమీప భవిష్యత్తులో లక్షటన్నులకు చేరుకోనుందని పర్యావరణ నిపుణుల అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా ఏటా 3.13 లక్షల మెట్రిక్ టన్నుల ఈ-వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం కోసం 21 సంస్థలు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నాయి. వ్యర్థాలను మరమ్మతు చేయడం, పునర్వినియోగానికి ఆమోదయోగ్యంగా మార్చడానికి అవకాశం ఉంది. అయితే ఆచరణలో కొంత మేరకు ఇది దారి తప్పుతోంది. కోటి, అమీర్‌పేట్ హబ్, ఐటీసీ సికింద్రాబాద్, ఫైనాన్షియల్ జిల్లా, ఐటీ హబ్ తదితర ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలపై ఎలాంటి సమాచారం ఉండటంలేదు.

హెచ్ఎండీఏ పరిధిలో ఈ-వ్యర్థాలు (మెట్రిక్ టన్నుల్లో)	
2017-18	33,425
2018-19	37,456
2019-20	40,230
2020-21	44,945
2021-22	50,335

ఆ కంపెనీలదే అధికం

వెయ్యి కంటే ఎక్కువ యూనిట్లు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ (కంప్యూటర్, ప్రింటర్, టెలిఫోన్, టీవీ, ఏసీ మొదలైనవి) వస్తువులు వినియోగించే పరిశ్రమలు కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)లో నమోదు చేసుకోవాలి. ఈ-వ్యర్థాల ఉత్పత్తిలో ప్రధానంగా పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, ఆరోగ్య సంరక్షణ పరికరాల తయారీ సంస్థలు, బహుళజాతి కంపెనీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, టెలికం కంపెనీలు, విద్యాసంస్థలు అగ్రభాగాన ఉన్నాయని పీసీబీ అధికారులు పేర్కొంటున్నారు. ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరికరాలు, గాడ్జెట్స్‌లను తయారు చేసే పరిశ్రమలు రీ సైక్లింగ్ మార్గాలను సూచించాలనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిపట్ల కంపెనీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. మరోవైపు మహానగరంలో నిత్యం వేల టన్నుల్లో ఈ-వ్యర్థాలు ఉత్పన్నమవుతున్నా వాటిని రీ సైక్లింగ్ కేంద్రాలకు తరలించడంలోనూ అశ్రద్ధ చూపుతున్నాయి. ఫలితంగా సాధారణ ఘన వ్యర్థాలతోపాటు ఈ- వ్యర్థాలు కలిసిపోతున్నాయి. ఇది అత్యంత ప్రమాదకరమని నిపుణులు పేర్కొంటున్నారు.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం..

ఈ-వ్యర్థాలు సీసం, పాదరసం, కాడ్మియం వంటి విషపూరిత పదార్థాలను విడుదల చేస్తాయి. అవి భూమిలోకి హానికరమైన రసాయనాలను విడుదల చేస్తాయి. ఫలితంగా హెవీమెటల్ ఎక్స్‌పోజర్ ఎపిల్లల్లో మెదడు అభివృద్ధిని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. పర్యావరణంపైనా తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి.

ఈ-వ్యర్థాల నిర్వహణ నిబంధనలను పాటించాలి

ప్రజలు, పరిశ్రమలు, ఇతర సంస్థలు ఈ-వ్యర్థాల నిర్వహణపై జాగ్రత్తగా వ్యవహరించాలి. శాస్త్రీయ పద్ధతుల్లో రీసైక్లింగ్ చేయడం ద్వారా పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చు. చట్టవిరుద్ధంగా ఈ-వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో, పురపాలక చెత్త డబ్బాల్లో కలపరాదు. కొన్ని రకాల ఈ-వ్యర్థాలు భారీ లోహాలు కలిగి ఉంటాయి. నీళ్లు, మట్టి, చెత్తలో కలపడం వల్ల ప్రమాదకరమైన కెమికల్స్‌ను విడుదల చేస్తాయి. ఇది చాలా ప్రమాదకరం. ఫిర్యాదుల కోసం 10741 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

– బి.నాగేశ్వరరావు, పీఓ, తెలంగాణ పీసీబీ

ఓయూతో విండర్స్ వర్సిటీ ఒప్పందం



విండర్స్ వర్సిటీ బృందంతో ఓయూ అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో కెనడాకు చెందిన విండర్స్ యూనివర్సిటీ ప్రతినిధులు పలు ఒప్పందాలు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం విండర్స్ వర్సిటీ ప్రతినిధుల బృందం ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్‌తో వివిధ అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. తొలుత ఓయూలోని కోర్సులు, బోధన, పరిశోధన, మౌలిక వసతులు, విదేశీ విద్యార్థులు తదితర అంశాలను అధికారులు విండర్స్ వర్సిటీ బృందానికి వివరించారు. అనంతరం ఓయూతో కలసి పని చేసేందుకు ఉద్దేశించిన విభాగాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డ్యూయల్ డిగ్రీతోపాటు ఇతర డిగ్రీలు, పీజీ కోర్సులు, పరిశోధనల్లో భాగస్వామ్యం, స్టూడెంట్స్ ఎక్స్ఛేంజ్, ఉమ్మడి అకాడమి కార్యకలాపాలు, పరిశ్రమలతో అనుసంధానం, నూతన ఆవిష్కరణల్లో భాగస్వామ్యం కోసం ఓయూతో కలసి పనిచేసే అవకాశాల కోసం ఎదురు చూస్తున్నట్లు విండర్స్ వర్సిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఎంబీఏ, సైబర్ సెక్యూరిటీ ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, హెల్త్ కేర్, మెడికల్ సైన్స్ కోర్సులు, పలు సామాజిక శాస్త్రాల్లో కలసి పని చేసేందుకు పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు విండర్స్ వర్సిటీ ప్రతినిధి బృందం ఆసక్తి చూపినట్లు వివరించారు. కార్యక్రమంలో ఓయూ అధికారులతోపాటు విండర్స్ వర్సిటీ అధికారులు డా.క్రిస్‌బుచ్, డీన్ డా.బిల్ హైస్ట్ పాల్గొన్నారు.

12న వీర హనుమాన్ విజయ యాత్ర



వీర హనుమాన్ విజయ యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు

పంజగుట్ట: హిందువుల్లో చైతన్యం నింపేందుకు, యువతలో దేశభక్తి పెంపొందించేందుకు ఈ నెల 12వ తేదీన విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో 'వీర హనుమాన్ విజయ యాత్ర' నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి తెలిపారు. ఈ మేరకు యాత్ర పోస్టర్‌ను గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, శశిధర్, వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యాత్ర గౌలిగూడ రామ మందిరం నుంచి ప్రారంభమై తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు కొనసాగుతుందని, మధ్యలో కోఠీ బస్‌స్టాండ్ చౌరస్తాలో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీలు హిందువులను విడదీసేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. వక్ఫ్ బోర్డు బిల్లును సవరించడం కాదు, వక్ఫ్ బోర్డునే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. వక్ఫ్ పేరుతో కొందరు ల్యాండ్ మాఫియా నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ అధికారులు సౌండ్ పొల్యూషన్ పేరుతో యాత్రలకు ఆంక్షలు విధిస్తున్నారని, ఏ మతానికి లేనివి హిందూ మతానికే ఎందుకని అన్నారు.

వెయ్యి నియోజకవర్గాల్లో వర్గీకరణ సంబరాలు

సాక్షి, సిటీబ్యూరో: వెయ్యి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సంబరాలు నిర్వహించనున్నామని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. తెలంగాణలో మాదిగలకు 9 శాతం రిజర్వేషన్ కల్పించడంతో సనత్‌నగర్‌లో మాదిగ జేఏసీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు కంటే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చాలా మేలన్నారు. దేశంలో మొదటిసారి వర్గీకరణ అమలైన రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందిందని పేర్కొన్నారు.

'సూత్ర' ప్రదర్శన ప్రారంభం



నగరంలో సూత్ర భారతీయ సంప్రదాయ, ఫ్యాషన్ దుస్తుల ప్రదర్శన సందడి చేస్తోంది. గురువారం నుంచి మూడు రోజులపాటు హోటల్ తాజ్ కృష్ణాలో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుంది. అగ్రశ్రేణి డిజైనర్లు, ఉత్తమ లగ్జరీ బ్రాండ్లు, ప్రత్యేక కలెక్షన్లు ఒకేచోట అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. – సాక్షి, సిటీబ్యూరో

బీసీలను మోసగించేందుకు కొత్త డ్రామాలు

కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజారాం యాదవ్ ధ్వజం



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

పంజగుట్ట: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి బీసీలపట్ల ఏ మాత్రం ప్రేమ ఉన్నా బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం బిల్లును గవర్నర్‌తో ఆమోదింపజేయించి వెంటనే అమల్లోకి తీసుకురావాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ డిమాండ్ చేశారు. మొదట రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసుకుని, ఆ తరువాత అందరం కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్రంపై పోరాటం చేద్దామని సూచించారు. ఎన్నికలకు ముందు కులగణనే బీసీల సమస్యలకు పరిష్కారమని చెప్పి, ఇప్పుడు రాజ్యాంగ సవరణ, 9వ షెడ్యూల్ అంటూ బీసీలను మోసం చేసేందుకు కొత్త డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా ఆ విషయాన్ని అటకెక్కించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) ప్రకారం రాష్ట్రాలకు రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి పెంచడం ఇష్టంలేదని, ఈ అంశాన్ని కేంద్రంవైపు మళ్లించి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సమావేశంలో వివిధ బీసీ సంఘాల నాయకులు మేకల కృష్ణ యాదవ్, మేకల లలిత యాదవ్, ఓరుగంటి వెంకటేష్ గౌడ్, సాలూరి రామకృష్ణ, వాసుకే యాదవ్, జల్ల నరేందర్, కొంపెల్లి రాజు పాల్గొన్నారు.

ఆటోపై కూలిన ప్రహరీ.. ఇద్దరికి గాయాలు

కర్మన్‌ఘాట్ చౌరస్తాలో ఘటన

చైతన్యపురి: ప్రహరీ కూలి ఆటోపై పడటంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాలు... కర్మన్‌ఘాట్ చౌరస్తాలో గతంలో ఉన్న సుమంగళి గార్డెన్స్ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. గురువారం సాయంత్రం ఆ స్థలంలో చదును చేస్తున్న జేసీబీ ప్రహరీకి తగిలింది. అదే సమయంలో అటుగా వస్తున్న ఆటోపై గోడ కూలి పడటంతో అందులో ప్రయాణిస్తున్న సరోజ, సునీల్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



కర్మన్‌ఘాట్‌లో ఆటోపై పడిన ప్రహరీ (ఇన్‌సెట్‌లో.. గాయపడ్డ మహిళ

రోడ్డెక్కిన పింఛన్‌దారులు



కేంద్రీయ సదన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు

సుల్తాన్‌బజార్: సీసీఎస్ పెన్షన్ నిబంధనల సవరణలను వెనక్కి తీసుకోవాలని పలు పెన్షనర్ల సంఘాల నాయకులు నామాల సోమయ్య, కృష్ణమోహన్, గడ్డం అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కోఠిలోని కేంద్రీయ సదన్ వద్ద తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) రాష్ట్ర కమిటీ, రైల్వే, పోస్టల్, బీఎస్ఎన్ఎల్, ఇన్‌కం ట్యాక్స్, సేల్స్ ట్యాక్స్ పెన్షనర్లతో పాటు అనేక కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘాలు ధర్నాకు దిగాయి. అనంతరం వారు మాట్లాడుతూ ఈ సవరణలతో కూడిన చట్టం ద్వారా పెన్షనర్లను రెండు గ్రూపులుగా విభజిస్తున్నారని ఆరోపించారు. 8వ పే కమీషన్ ప్రకారం పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్.అరుణ, సీతారామ్, కృష్ణారావు, ఎస్.బ్రహ్మాచారి, నర్సింగ్‌రావు, అశోక్, రమేష్, స్వామి, రహీంల తోపాటు పెద్ద ఎత్తున పెన్షనర్లు పాల్గొన్నారు.

వరంగల్ విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి

ప్రొఫెసర్ కంచ ఐలయ్య



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య తదితరులు

గన్‌ఫౌండ్రీ: వరంగల్‌లో నిర్మించతలపెట్టిన అంతర్జాతీయ విమానాశ్రయానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. గురువారం రవీంద్రభారతిలో రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 98వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రొఫెసర్ ఐలయ్య మాట్లాడుతూ వరంగల్ విమానాశ్రయానికి రాణి రుద్రమ్మదేవి పేరు పెట్టాలని ఎమ్మెల్సీ కవిత ప్రతిపాదించడాన్ని తప్పుబట్టారు. రాజు, రాణుల కాలం చెల్లిందని, కొమురయ్య పేరు పెడితే ఆయన ఖ్యాతి ప్రపంచానికి తెలుస్తుందని అన్నారు. దొడ్డి కొమురయ్య కేవలం కురుమ కులానికి చెందిన వ్యక్తి మాత్రమే కాదని తెలంగాణ అస్తిత్వానికి నిదర్శనమని కొనియాడారు. కురుమలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని, కురుమల అభివృద్ధి కోసం కురుమ ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని ఉత్సవ కమిటీ చైర్మన్ తూంకుంట అరుణ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. అంతకు ముందు ఒగ్గు కళాకారుల జానపద సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నాయకులు మంగ వెంకట్, ఎంఎస్ సత్యనారాయణ, ప్రొఫెసర్ ఏలేందర్, మహిళా విభాగం అధ్యక్షురాలు బాలమణి, కె.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వాణిజ్యానికి 'హరప్పా నాగరికత' పునాది

ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ డాక్టర్ స్మితా ఎస్.కుమార్



హరప్పా కాలం నాటి వస్తువులను ప్రదర్శనలో ఉంచిన దృశ్యం

సుభాష్‌నగర్: ప్రపంచ వాణిజ్యానికి 'హరప్పా నాగరికత' పునాది వేసిందని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్టు డాక్టర్ స్మితా ఎస్.కుమార్ అన్నారు. హరప్పా నాగరికత కనుగొని వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బహదూర్‌పల్లిలోని మహీంద్రా యూనివర్సిటీలో గురువారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ స్మితా ఎస్.కుమార్ మాట్లాడుతూ ఈ నాగరికత ఆర్థిక, సాంస్కృతిక, భాషా, సాంకేతిక రంగాల్లో దీర్ఘకాల ప్రభావాన్ని కలిగి ఉందన్నారు. హరప్పా నాగరికత ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసిందని అభిప్రాయపడ్డారు. మహీంద్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ యాజులు మేడూరి మాట్లాడుతూ ఇండస్ లోయ నాగరికతపై మేధో సంపత్తిని పెంపొందించేందుకు విభిన్న రంగాల నిపుణులను ఒకేచోట చేర్చామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష సంవత్సరాల కంటే పురాతనమైన మానవ నిర్మిత శిలాయుగ పరికరాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హరప్పా నాగరికతకు చెందిన అరుదైన పురా వస్తువులు కూడా ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన పురావస్తు శాస్త్రవేత్త ప్రొఫెసర్ కేపీ రావు, చరిత్ర విభాగాధిపతి ప్రొఫెసర్ సుచంద్రా ఘోష్, ఐఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

స్కిన్ కేర్ సెంటర్లలో తనిఖీలు

20 కేంద్రాల్లో నిబంధనల ఉల్లంఘనలు



కూకట్‌పల్లిలోని ఓ క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న వైద్యబృందం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న స్కిన్ కేర్, బ్యూటీ క్లినిక్, ఎస్తటిక్ తదితర 20 కేంద్రాలపై గురువారం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం ఏకకాలంలో దాడులు నిర్వహించింది. మియాపూర్, కూకట్‌పల్లి, కొండాపూర్, బోరబండ ప్రాంతాల్లో హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, లేజర్ థెరపీ, పీఆర్‌పీ (ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీ), ఎస్తటిక్ వంటి చికిత్సలను ఎంబీబీఎస్, ఎండీ డెర్మటాలజీ, ప్లాస్టిక్ సర్జరీ వాళ్లు మాత్రమే చేయాలి. కానీ ఎలాంటి అర్హతలు లేని డెంటల్ వైద్యులు, యునానీ, ఆయుష్, ఇంటర్, డిప్లొమా చదువుకున్న వారు సైతం ఆ చికిత్సలు చేస్తున్నట్లు గుర్తించారు. మరికొన్ని చోట్ల ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేకుండానే సంస్థలను నడిపిస్తుండగా, కొన్ని సంస్థల్లో రిజిస్ట్రేషన్ సమయంలో నమోదు చేసుకున్న వైద్యులెవరూ అక్కడ పనిచేయడం లేదని తేలింది. మియాపూర్, కూకట్‌పల్లి కొండాపూర్‌లలో 20 క్లినిక్‌ల్లో తనిఖీలు నిర్వహించి, నిబంధనలుకు విరుద్ధంగా జరుగుతున్న వ్యవహారాలను వెలుగులోకి తీసుకువచ్చారు. ఇందులో పలు గుర్తింపు పొందిన క్లినిక్‌లు కూడా ఉండటం గమనార్హం. వీటిపై తదుపరి చర్యల నిమిత్తం కసరత్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దాడుల్లో తెలంగాణ వైద్య మండలి చైర్మన్ డా.మహేష్‌కుమార్, వైస్ చైర్మన్ డా.జి.శ్రీనివాస్, సభ్యులు డా.సన్నీ డేవిస్, కో ఆప్ట్ సభ్యులు డా.విజయ్, డా.రాజీవ్, డా.అరుంధతిల బృందాలు పాల్గొన్నాయి.

పాస్టర్ మృతిపై సిట్టింగ్ జడ్జిలతో విచారణ కమిషన్ వేయాలి

- మాజీ అడిషనల్ డీజీపీ బాబూరావు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి బాబూరావు

పంజగుట్ట: పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ముగ్గురు హైకోర్టు సిట్టింగ్ జడ్జిలతో ఒక జ్యుడీషియల్ కమిషన్ వేసి విచారణ చేయించాలని మాజీ అడిషనల్ డీజీపీ కె.బాబూరావు ఏపీ ప్రభుత్వాన్ని కోరారు. పాస్టర్ మరణంపై కూడా కొందరు వీడియోలు చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారని విచారం వ్యక్తం చేశారు. సమైక్య క్రిస్టియన్ వేదిక ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్ కుమార్, మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్, వివిధ క్రైస్తవ సంఘాల నాయకులు, పాస్టర్లతో కలిసి ఆయన మాట్లాడారు. ఒకవైపు పోలీస్ ఉన్నతాధికారులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రవీణ్ మృతిపై ఇంకా విచారణ జరుగుతోందని, పూర్తిస్థాయి పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పినా కొందరు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవీణ్‌ను రెండు రాష్ట్రాల్లోనే కాదు దేశం మొత్తం చాలామంది గుర్తిస్తారని, ఆయన రోడ్డుపై మద్యం కొనుగోలు చేస్తాడని, రోడ్డుపై మద్యం తాగి కూర్చుంటాడని అంటే ఎవరూ నమ్మబోరన్నారు. ప్రవీణ్ ఇంటి ముందు నుంచి బయలుదేరినప్పటి నుంచి ప్రమాదం జరిగిన చోటు వరకు అన్ని సీసీ ఫుటేజీలు పరిశీలించాలని పోలీసులను కోరారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఏ వర్గం వారు మాట్లాడినా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో విద్యాస్రవంతి, బిషప్ సింగం, మోహన్‌బాబు, భాస్కర్, జీవన్ కుమార్, సాల్మన్ రాజు, రావు తదితరులు పాల్గొన్నారు.

మనిషన్నాక కాస్తంత కళాపోషణుండాలోయ్.. లేదంటే మనిషికీ.. గొడ్డుకీ తేడా ఏంటి? అని అలనాటి నటుడు.. రావు గోపాలరావు అన్న మాటలను ఈ తరం యువత చెవికెక్కించుకుందో ఏమోగానీ.. చదువులతో పాటు ఏదో ఓ వృత్తిలోనో, కళలోనో ప్రావీణ్యం పొందుతున్నారు. దీనికి అనుగుణంగానే నగరవాసులు తమ ఆసక్తిని వివిధ రంగాలపై కనబరుస్తున్నారు. ఏదో ఒక కళను నేర్చుకునేందుకు అమితాసక్తి చూపిస్తున్నారు. దీనికి తగ్గట్లుగానే ఔత్సాహికులకు విభిన్న కళల్లో శిక్షణ ఇచ్చేందుకు పలు వేదికలు ఏర్పడుతున్నాయి. హస్తకళలు మొదలు, పెయింటింగ్, సంగీతం, నేచురల్ క్రాఫ్ట్స్, డ్రాయింగ్, డ్యాన్సింగ్ (కూచిపూడి, భరత నాట్యం, వెస్ట్రన్), వివిధ రకాల క్రీడలు, కళల్లో శిక్షణ పొందుతున్నారు. ప్రస్తుతం వేసవి సీజన్ కావడంతో చిన్నారులకు, విద్యార్థులకు, యువతకు విభిన్న కళలపై శిక్షణ అందించేందుకు వివిధ సంస్థలు ఇప్పటికే ఏర్పాట్లు చేశాయి. పలు ఆర్ట్ స్టూడియోలు ఆర్ట్ క్యాంపెయిన్స్ ప్రారంభించాయి.

– సాక్షి, సిటీబ్యూరో



నగరంలో నిత్యం కళాభిమానుల్ని పలుకరించే పలు ముఖ్యమైన కూడళ్లలో కనిపించే కళాత్మకత వెనుక ఆయన సృజన ఉంటుంది. నగరవాసులు, నగరేతరులైన కళాభిమానులు సందర్శించే పలు శిల్పాకృతుల వెనుక నగరం కళల రాజధాని కావాలనే కల సాకారం చేసుకోవాలనే తపన ఉంది. అలుపెరుగని ఆ తపన పేరు ఎంవీ.రమణారెడ్డి. దాదాపు మూడు దశాబ్దాల కళా ప్రయాణం పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నగర శిల్ప కళాకారునితో ముచ్చటించిన సందర్భంగా ఆయన పంచుకున్న జ్ఞాపకాల ప్రయాణం ఆయన మాటల్లోనే..

– సాక్షి, సిటీబ్యూరో

కమనీయం.. రమణీయం..



జన్మతః సిద్దిపేట వాస్తవ్యుడైనా నగరంలోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ నుంచి స్కల్ప్చర్ (శిల్పకళ)లో మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో గోల్డ్ మెడలిస్ట్‌గా నిలిచాడు.. ఆ తర్వాత నుంచి నా కళా ప్రయాణం నగరంతో మమేకమై సాగింది.

అడుగడుగునా.. ఆవిష్కరణ..

నగరానికి తలమానికమైన ఎయిర్‌పోర్ట్‌లోని నోవోటెల్ హోటల్‌తో మొదలుపెడితే.. నగరంలోని అనేక చోట్ల, ముఖ్య కూడళ్లలో కొలువుదీరిన కళాకృతులెన్నో రూపొందించాను. రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మక తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం రూపకల్పనలో ప్రధాన ఆర్కిటెక్ట్‌గా పనిచేయడం ద్వారా అందిన ఎన్నో భావోద్వేగాలను మరచిపోలేని అనుభవం. అదే విధంగా ఢిల్లీ రిపబ్లిక్ వేడుకల్లో మన రాష్ట్రం తరఫున శకటం రూపకల్పన మరో చిరస్మరణీయ జ్ఞాపకం. నగరం విశ్వనగరంగా మారనుందని ఆనాడే జోస్యం చెబుతూ.. విప్రో సర్కిల్లో ఏర్పాటైన తొలి అత్యాధునిక శిల్పాకృతి.. స్టేట్ గ్యాలరీలోని గాంధీజీ స్టీల్ వర్క్స్, రవీంద్రభారతిలోని శిల్పాకృతులు, మెట్రో రైల్ కోసం 30 అడుగుల స్టెయిన్ లెస్ స్టీల్ స్కల్ప్చర్ పైలాన్ కాన్సెప్ట్ డిజైన్, 'శిల్పారామం' కోసం 25 అడుగుల స్టెయిన్ లెస్ స్టీల్ శిల్పం.. అలాగే టీజీపీఎస్సీ లోగో కావచ్చు ప్రపంచ తెలుగు మహాసభల సదస్సు లోగో. వంటివెన్నో నా నగరం కోసం.. నా రాష్ట్రంలో నన్ను మమేకం చేశాయి.

కల సాకారం కావాలని..

ప్రస్తుతం నగరంలో కళలకు అటు ప్రభుత్వం ఇటు ప్రజలు ఇలా అన్ని వైపుల నుంచి మంచి సహకారం లభిస్తోంది. దీన్ని ఉపయోగించుకుని మరింత మంది కళాకారులు వెలుగులోకి రావాలి. ఆర్ట్ అనేది అభిరుచి మాత్రమే కాదు అద్భుతమైన కెరీర్ కూడా అనే నమ్మకం యువతలో రావాలి. నగరం కళాసాగరం కావాలి. అదే నా తపన.. ఆలోచన అందుకు అనుగుణంగానే నా కార్యాచరణ.



ఎన్నో హోదాలు.. పురస్కారాలు..

తెలంగాణ రాష్ట్రం నుంచి 2020లో న్యూఢిల్లీలో లలిత్ కళా అకాడమీ, మొదటి జనరల్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపికయ్యా. హైదరాబాద్ ఆర్ట్ సొసైటీకి అధ్యక్షుడిగా 2015 నుంచి 3 సార్లు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో పాటు సొసైటీ సభ్యుల సంఖ్య పెంచడంలోనూ కృషిచేశా. తద్వారా సొసైటీని చురుకుగా మార్చగలిగాను. నేను అందించిన సేవలకు గానూ రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అవార్డు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 'విశిష్ట పురస్కారం' అందుకున్నా. నేనే స్వయంగా 'బయో–డైవర్సిటీ ఈస్తటిక్స్' యాన్ ఆర్టిస్టిక్ రిఫ్లెక్షన్ అనే పుస్తకం రచించగా.. నా గురించి 'ఎంవి. రమణారెడ్డి.. పాత్ టూ ఆర్టిస్టిక్ బ్రిలియన్స్.. ఏ జర్నీ పేరిట నా ప్రయాణాన్ని రచయిత కోయిలీ ముఖర్జీ ఘోష్ లిఖించారు.

- వేసవి శిక్షణా శిబిరాలకు ఏర్పాట్లు పూర్తి
- శిక్షణకు సిద్ధమైన పలు వేదికలు
- ఆర్ట్, క్రాఫ్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు
- నటన నుంచి నాట్యం వరకూ వివిధ రంగాల్లో

కళ.. ఆలోచన భళా..

కళల పట్ల ఆసక్తి కనబరుస్తున్న నగర యువత





కళ ఒక వినూత్న వ్యక్తిత్వానికి నిదర్శనం. కళ సంతృప్తి, సాంత్వనకు ప్రతిబింబం.. కళ ఒత్తిడికి ఒక ఉపశమన మార్గం. కళ అంటే ఆరోగ్యం, ఐశ్వర్యం. ఒకప్పుడు కళలంటే 64 కళలని నిర్వచించే వారు. కానీ ప్రస్తుతం కళకు కాదేదీ అనర్హం అనేలా మారింది. పెయింటింగ్, డ్రాయింగ్, డ్యాన్సింగ్, మొదలు పేపర్ క్రాఫ్టింగ్, పాటరీ మేకింగ్, మ్యూజిక్, మ్యాజిక్, ఆర్కిటెక్చర్, రెసిన్ వర్క్స్, సాహిత్యం, ఫ్యాషన్ డిజైనింగ్, స్టైలింగ్ ఇలా చెప్పుకుంటూ పోతే వందల కళలు యువతను ఆహ్వానిస్తున్నాయి. సాంస్కృతిక కళలు ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ ప్రస్తుతం అధునాతన కళలు, కళాత్మక పద్ధతులు ఆవిష్కృతమవుతున్నాయి. ఈ కళలను కొందరు ట్రెండ్‌గా నేర్చుకుంటుంటే.. మరి కొందరు తమ భవిష్యత్తును కళారంగం వైపు మలచుకోవడంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ కళలను ఆదరించడంలో, ఆస్వాదించడంలో సాంస్కృతిక కళలు, మోడ్రన్ ఆర్ట్స్ ఒక దానితో ఒకటి పోటీ పడుతున్నాయి.

కళా విలాసం..

మొదటి నుంచీ కళలంటే సంగీతం, సాహిత్యం, సాంస్కృతిక నృతకళలపైనే ఎక్కువ ఆసక్తి చూపించే వారు. అయితే ప్రస్తుతం అవి విలాసవంతమైన కళలుగా మారిపోయాయి. ఈ కళలు నేర్పించే వారు, సంస్థలు తక్కువగా ఉండటం.. అదే సమయంలో ఔత్సాహికుల సంఖ్య పెరగడంతో సంప్రదాయ కళల విలువ అమాంతం పెరిగిపోయింది. ఈ కళలలో శిక్షణను అందించడానికి నగరం నలుమూలలా ట్రైనింగ్ సెంటర్లు వెలిశాయి. ఇంటికొచ్చి మరీ నేర్పించే వారు కూడా ఉన్నారు. నగర వేదికగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోనూ కొన్ని కేంద్రాలను ఏర్పాటు చేసి రెండు నెల నుంచి రెండేళ్ల వరకూ శిక్షణను అందించే కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. నగరంలోని రవీంద్రభారతి, శిల్పారామం, శిల్పకళావేదిక, త్యాగరాయ గాన సభ వంటి వేదికలు వీరందరికీ కళా ప్రదర్శనకు వేదికలుగా నిలుస్తున్నాయి.



డిజైనింగ్‌పై ఆసక్తి..

ఈ మధ్య కాలంలో ఫ్యాషన్ డిజైనింగ్ ఆర్ట్స్ సైతం ట్రెండ్‌గా మారాయి. మిగతా కళలు ఎలా ఉన్నా ఈ ఫ్యాషన్ సంబంధింత కళలు సంతృప్తితో పాటు వృత్తిపరమైన ఆర్థిక సౌలభ్యాన్ని సైతం అందిస్తుండటం విశేషం. నగరంలోని పలు బొటిక్‌లు, జ్యువెలరీ మేకింగ్ సంస్థలు ఈ ఫ్యాషన్ డిజైనర్లకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. దీంతో డిజైనర్లకు మంచి డిమాండ్ ఏర్పడుతోంది.

వినూత్న ఆవిష్కరణలు..

మారుతున్న కాలానికి అనుగుణంగా కళల్లోనూ వినూత్న ఆవిష్కరణలు వస్తున్నాయి. ముఖ్యంగా రెసిన్ ఆర్ట్ వర్క్స్, పాటరీ మేకింగ్, అక్రిలిక్ పెయింటింగ్, వెస్ట్రన్ మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్, సాల్సా డ్యాన్సింగ్ వంటి కళలకు మంచి క్రేజ్ పెరుగుతోంది. ఈ తరం యువతకు హస్తకళల పట్ల ఆసక్తి పెరిగింది. ప్రధానంగా గ్రామీణ, గిరిజన హస్తకళల్లో నైపుణ్యాలను పెంచుకుంటున్నారు. ఇలాంటి వారి కోసం నగరంలోని పలు ఆర్ట్ స్టూడియోలు వారాంతాల్లో, రెండు నెలల కోర్సులుగా వీటిపై శిక్షణ అందిస్తున్నారు. స్టోన్‌కార్వింగ్, పేపర్ క్రాఫ్ట్, లీఫ్ ఆర్ట్ వంటి వినూత్న కళలకు జై కొడుతున్నారు. మరికొందరు థియేటర్ ఆర్ట్స్ అంటూ సినిమాల వరకూ వెళుతున్నారు. కొందరైతే ఇల్యూజన్ పేరిట విభిన్న కళలకు శ్రీకారం చుడుతున్నారు.



ట్రెండ్‌గా ఇంటీరియర్ ఆర్ట్..



ఇంటీరియర్ కళ అన్నా, ఇంటీరియర్ కళాకృతులన్నా ఈ తరానికి ఇష్టం పెరిగింది. ఇందులో భాగంగా కళాకృతులను తయారు చేయడం నేర్చుకోడానికి అమితంగా ఇష్టపడుతున్నారు. ఇంటిని అందంగా అలంకరించే టెర్రకోట బొమ్మలు, మట్టి పాత్రలు, దారం అల్లికలు వంటివి తయారు చేయడంలో మేము శిక్షణ ఇస్తున్నాం. నగరంలోని కార్ఖానాలో ఎర్త్ అండ్ ఆర్ట్ అనే మా స్టూడియోలో స్టోన్ కార్వింగ్, బ్లాక్ ప్రింటింగ్, రేడియం తదితర వర్క్‌షాపులను నిర్వహిస్తున్నాం. అవసరమైన మెటీరియల్ మేమే అందిస్తాం.

– ఫాతిమా ఖుజీమా, ఎర్త్ అండ్ ఆర్ట్ స్టూడియో

కళాకారులదే భవిష్యత్తు..



జీవితాన్ని సరికొత్తగా ఆస్వాదించాలనుకునే వారు కనీసం ఏదో ఒక కళలో ప్రావీణ్యం సంపాదిస్తారు. కళాత్మకత అనేది ఒక జీవన విధానం. ఇందులో భాగంగా నేను చెక్కపై కళాకృతులను సృష్టించే ఆర్ట్‌లో ప్రావీణ్యం సాధించాను. గ్రామీణ వాతావరణం నుంచి వచ్చాను. కాబట్టి అందమైన గ్రామీణ ఇతివృత్తాలను చెక్కుతుంటాను. వీటికి నగరంలో మంచి ఆదరణ లభిస్తోంది. భవిష్యత్తులో కళతో ప్రయాణం చేసే వారికి ప్రత్యేక గౌరవం, గుర్తింపు లభిస్తుంది.

– సాయికుమార్, ప్రముఖ వుడ్ ఆర్టిస్ట్

ఆర్ట్ గ్యాలరీలో నేడు లైవ్ డ్రాయింగ్ ఎగ్జిబిషన్

మాదాపూర్ : మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో నేడు కాశ్మీర్ టూ కన్యాకుమారి లైవ్ డ్రాయింగ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రదర్శనను సాయంత్రం 5గంటలకు టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించనున్నారు. వీరితో పాటు పలువురు ప్రముఖులు, చిత్రకళాకారులు పాల్గొనున్నారు. ఈనెల 10వ తేదీ వరకూ ఈ ప్రదర్శనను ఉదయం 11గంటల నుంచి రాత్రి 7గంటల వరకూ సందర్శకులకు అందుబాటులో ఉంచనున్నారు.

జోయలుక్కాస్‌లో రాశీసింగ్ సందడి

పంజగుట్ట : సినీ నటి రాశీసింగ్ గురువారం సాయంత్రం పంజగుట్టలో సందడి చేశారు. జోయలుక్కాస్ బ్రిలియెన్స్ డైమండ్ జ్యువెలరీ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. గురువారం నుండి ఈనెల 20వ తేదీ వరకూ ఈ ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలు ఆభరణాలు ధరించి రాశీసింగ్ ర్యాంప్ వాక్ చేశారు. ఇందులో మునుపెన్నడూ చూడని స్టైల్స్, తమ సంస్థ ఉత్తమ కళా పనితనం చూస్తారని సంస్థ నిర్వాహకులు జాయ్ తెలిపారు.



నగరంలో వివా ఎక్స్‌పీరియన్స్ సెంటర్..



సాక్షి, సిటీబ్యూరో: ఎక్స్టీరియర్ ఆర్కిటెక్చర్‌లో ఆసియాలో అతిపెద్ద మెటల్ కాంపోజిట్ ప్యానెల్స్ తయారీదారు అయిన వివా ఆధ్వర్యంలో నగర వేదికగా సరికొత్త ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించింది. బంజారాహిల్స్‌లోని లుంబినీ జ్యువెల్ మాల్ వేదికగా ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో మారుతున్న అధునాతన కాలానికి అనుగుణంగా సృజనాత్మక డిజైన్‌లు అందుబాటులో ఉంటాయని వివా కాంపోజిట్ ప్యానెల్ చైర్మన్ ప్రకాష్ జైన్ తెలిపారు. ఈ రంగంలో క్రియేటివ్ హబ్‌గా ఏర్పాటైన ఎక్స్‌పీరియన్స్ సెంటర్లో శాంటా ఫే, టార్నిష్ మెటలమ్, అలుజింటో, లస్ట్రే, డి మేడెరా, గెలాక్సీ సిరీస్‌లతో సహా వివా సిరీస్ ప్రదర్శిస్తుందన్నారు.

పెళ్లి చీరలు, ఫ్యాషన్, పంజాబీ సూట్స్, ఫ్యాన్సీ, మహిళల సూట్స్‌కు జిగేల్‌మనిపించేలా చేసే వర్క్‌నే కార్చోబీ వర్క్ అంటారు. నగరంలోని పలువురు మహిళలు దశాబ్దాలుగా ఈ కళనే ఉపాధిగా ఎంచుకుని జీవిస్తున్నారు. ఇలాంటి వర్క్ చేసేవారిని కార్చోబీ కళాకారులు అంటారు. వీరు వివిధ రకాల వస్త్రాలకు జిగేల్ మనిపించే రీతిలో అల్లికలు, డిజైన్లను అద్దుతారు.

– గోల్కొండ

కార్చోబీ సొబగులు..

- వస్త్రాలకు కళాకారుల సృజన
- నగరంలో కుటీర పరిశ్రమగా ఉపాధి అవకాశాలు
- కార్చోబీ అల్లికలతో మహిళలకు చేతినిండా పని
- సూట్లు, చీరలకు జిగేల్‌మనే మెరుపులు

ఈ తరహా అలంకరణలు ఉన్న చీరలను ఎక్కువగా వివాహాలు లేదా ఇతర శుభకార్యాలకు వినియోగిస్తారు. దీంతో ఈ కళకు గిట్టుబాటు భారీగానే ఉంటుంది. సాదా చీర వెయ్యి రూపాయలు ఉంటే.. కార్చోబీ డిజైన్లు అద్దిన చీర ఖరీదు రూ.10 వేలకు పైమాటే అంటున్నారు కళాకారులు. ఈ కళకు డిమాండ్ ఉండడంతో అనేక మంది ఈ కార్చోబీ పనిలో ప్రత్యేక శిక్షణ పొంది దీనినే వృత్తిగా, ఉపాధిగా మలుచుకుంటున్నారు. డిజైన్‌ను బట్టి, చీర కొంగులు, బార్డర్, హాఫ్ శారీ, ఫుల్ బుటా తదితర రకాల పనిని బట్టి వీరికి కూలీ లభిస్తుంది.

తగ్గుతున్న ఆదాయం..

ప్రస్తుతం నగరంలో కార్చోబీ పని చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో ఈ పనిని చేయించుకునే వ్యాపారులు కార్మికులకు ఇచ్చే కూలిని తగ్గిస్తున్నారు. గతంలో ఒక్కో కార్చోబీ కార్మికుడు ఒక చీరపై పనిచేస్తే కనీసం రెండు వేలు సంపాదించేవాడు. ప్రస్తుతం కార్మికుల సంఖ్య పెరుగుదలతో చీరకు రూ.వెయ్యి కూడా లభించడంలేదని చెబుతున్నారు. పోటీ పెరుగుతుండడంతో, మెషీన్‌లతో డిజైన్స్ వేయించడం లాంటివి అందుబాటులోకి రావడంతో తమ ఉపాధికి గండిపడుతోందని గత 30 ఏళ్లుగా కార్చోబీ పనిచేస్తున్న అఫ్జల్ చెబుతున్నాడు.





గిట్టుబాటు ధరతో సరి..

వస్త్ర వ్యాపారులు నేరుగా పని ఇస్తుండడంతో గిట్టుబాటు ధర వస్తుందని, గతంలో కార్చోబీ పనిలో దళారులదే ఇష్టారాజ్యంగా ఉండేదని, ఇచ్చిందే తీసుకోవాలన్నట్లు ఉండేదని, అయితే ప్రస్తుతం ఒక్కో కార్మికుడు హాఫ్ శారీకి రూ.1500, చీర కొంగుకు వెయ్యి లభిస్తున్నాయి అని చెబుతున్నారు. అదే ఫ్యాన్సీ సూట్ అయితే ఫుల్ సూట్‌కు రూ.2వేలు, త్రీపీస్ సూట్‌కు మూడు వేలు లభిస్తున్నాయి. ఇక కార్చోబీ పనికి అవసరమయ్యే చంకీలు, దారాలు, ఇతర వస్తువులను వ్యాపారులే సరఫరా చేస్తారు. షోరూమ్‌లలో, షోకేజీలలో జిగేల్ మనిపించే సూట్లు, చీరల అందం వెనుక కార్చోబీ కళాకారుల పనితనం అద్భుతమైందని పలువురు వ్యాపారులు చెబుతున్నారు.

క్లుప్తంగా...

కేసీఆర్‌పై రైల్‌రోకో కేసు కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమం సమయంలో రైల్‌రోకో ఘటనకు సంబంధించి బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావుపై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. 2011, అక్టోబర్ 15న ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగంగా సికింద్రాబాద్‌లో రైల్‌రోకో చేపట్టారు. ఆ సమయంలో కేసు నమోదు చేసి పలువురిని అరెస్ట్ చేశారు. ఈ కేసు ప్రస్తుతం ప్రజాప్రతినిధుల కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో రైల్వే పోలీసులు నమోదు చేసిన ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ కేసీఆర్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. కేసీఆర్ పిలుపు మేరకే రైల్‌రోకో చేపట్టారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు కోర్టుకు తెలిపారు. అయితే రైల్‌రోకో జరిగిన సమయంలో అక్కడ కేసీఆర్ లేరని ఆయన తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కేసీఆర్‌పై కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు.

కులాల మార్పుపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక

రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ కేటగిరీలోని కొన్ని కులాల పేర్లు మార్చాలని కోరుతూ వచ్చిన వినతుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ వెల్లడించారు. గురువారం బీసీ కమిషన్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కులాల పేర్ల మార్పునకు సంబంధించి మార్చి 26, 27, 29 తేదీల్లో వేములవాడ, జగిత్యాల, సిరిసిల్ల, ధర్మపురి, ఆమన్‌గల్, అచ్చంపేట తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశామన్నారు. త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని, ఆ తర్వాత ప్రభుత్వ ఆమోదంతో పేర్ల మార్పునకు సంబంధించి ఉత్తర్వులు వెలువడతాయని చెప్పారు. ఈ సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, రంగు బాలలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు యాదాద్రి నిర్వాసితులకు నియామక పత్రాల పంపిణీ

సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణంతో భూములు కోల్పోయి నిర్వాసితులుగా మారిన కుటుంబాల్లోని నిరుద్యోగ యువతకి ప్రభుత్వం అదే విద్యుత్ కేంద్రంలో ఉద్యోగాలు ఇవ్వనుంది. నిర్వాసితుల కుటుంబాలకి చెందిన 112 మందిని జూనియర్ అసిస్టెంట్స్, జూనియర్ ప్లాంట్ అటెండెంట్స్, ఆఫీస్ సబార్డినేట్, హౌస్ కీపర్లుగా నియమించనుంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం ప్రజాభవన్‌లో వీరికి నియామక పత్రాలు అందజేస్తారు.

సీఎం ఫొటోల మార్ఫింగ్‌పై కేసు నమోదు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కొందరు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదుపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ)లో కేసు నమోదైంది, తెలంగాణ మత్స్య సహకార సంఘం చైర్మన్ మెట్టు సాయికుమార్ ఫిర్యాదు మేరకు గురువారం టీజీ సీఎస్‌బీ కేసు నమోదు చేసింది. సీఎం ఫొటోలను మార్ఫింగ్ చేసి అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. సాయికుమార్ అందించిన ఆధారాలతో సీఎస్‌బీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




జాయ్ అలూక్కాస్‌కు గౌరవ డాక్టరేట్

ఛండీగఢ్: భారతదేశపు జ్యువెలరీ వ్యాపారాన్ని అంతర్జాతీయంగా ఆధునీకరించడం, దాతృత్వంలో చేసిన కృషికిగాను జాయ్ అలూక్కాస్‌కు చిత్కారా యూనివర్సిటీ డాక్టర్ ఆఫ్ లిటరేచర్ (హనోరిస్ కాసా) డిగ్రీ అందజేసింది. ఈ సందర్భంగా జాయ్ అలూక్కాస్ విజయాలను, ఆయన నిబద్ధతను గౌరవించేలా యూనివర్సిటీలో స్నాతకోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాన్సలర్ డాక్టర్ అశోక్ చిత్కార, ప్రొ చాన్సలర్ డా. మధు చిత్కారా, వైస్ చాన్సలర్ డా. సంధీర్ శర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డా. కవిత తదితరులు పాల్గొన్నారు.

నాసా స్పేస్ కాంటెస్ట్‌లో శ్రీ చైతన్య హవా

సాక్షి, హైదరాబాద్: అమెరికా నాసా ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్–2025లో శ్రీచైతన్య స్కూల్ వరుసగా 13వ సారి విజయదుంధుభి మోగించింది. ప్రపంచవ్యాప్తంగా 25 దేశాలు పాల్గొన్న ఈ పోటీలో ఇండియాకు మొత్తం 60 అవార్డులు రాగా అందులో 30 అవార్డులు ఒక్క శ్రీ చైతన్య విద్యార్థులే సాధించడం ద్వారా భారత్‌ను ప్రపంచ నంబర్–1గా నిలబెట్టారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్ సీమ మాట్లాడుతూ వరుసగా మూడవసారి కూడా శ్రీచైతన్య స్కూల్ క్యాష్ అవార్డులను గెలుచుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు.

చెదురుతున్న అమెరికా కల...



విద్యార్థి వీసాలు 41% తిరస్కరణ

2014తో పోలిస్తే రెట్టింపు

భారత విద్యార్థుల వీసాల తిరస్కరణ 34%

వర్సిటీలో సీటు వచ్చినా అనుమతించని అధికారులు.. కారణాలు కూడా చెప్పకుండానే తిరస్కరణ

కన్సల్టెన్సీల తప్పులతో విద్యార్థులకు కష్టాలు.. అప్రమత్తంగా ఉండాలని ఎన్ఆర్ఐల సూచన

సాక్షి, హైదరాబాద్: భారతీయ విద్యార్థుల్లో చాలామందికి అమెరికాలో చదవటం ఒక కల. అప్పులు చేసైనా ఆ కలను నెరవేర్చుకునేందుకు కష్టపడుతుంటారు. కానీ, ఇప్పుడు ఆ కల చెదురుతోంది. అగ్రరాజ్యం విదేశీ విద్యార్థుల వీసాలకు భారీగా కత్తెరేస్తోంది. ఈ ఏడాది ఏకంగా 41 శాతం వీసాలను తిరస్కరించింది. వీటిలో భారత విద్యార్థుల వీసాలే 38 శాతం ఉన్నాయి. వీసాల తిరస్కరణకు కారణాలు కూడా చెప్పడం లేదని విద్యార్థులు అంటున్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ పరిస్థితి ఏర్పడిందని కన్సల్టెన్సీలు అంటున్నాయి. అమెరికా కాన్సులేట్ మాత్రం సరైన పత్రాలు లేకపోవడమే వీసాల తిరస్కరణకు కారణమంటోంది.

కొంప ముంచుతున్న కన్సల్టెన్సీలు

కన్సల్టెన్సీల తప్పుల వల్లే వీసాలు తిరస్కరణకు గురవుతున్నాయనే విమర్శలున్నాయి. వక్రమార్గంలో బ్యాంకు లావాదేవీల రుజువులు ఇవ్వడం, స్వదేశంలో విద్య పూర్తయిన తర్వాత ఉగ్యోగం చేసినట్లు నకిలీ పత్రాలు సమర్పించటం వంటివి వీసాల తిరస్కరణకు కారణమవుతున్నాయి. విద్యార్థి బ్యాంకు లావాదేవీలను అమెరికా అధికారులు ఈ మధ్య నిశితంగా పరిశీలిస్తున్నారు. అప్పటికప్పుడు ఖాతాలో డబ్బులు వేయడాన్ని తప్పుడు పత్రాల సృష్టిగానే భావిస్తున్నారు. దీంతో తిరస్కరణలు పెరుగుతున్నాయి.

వీసా తిరస్కరణ కారణాలు ఇవీ..

- అమెరికాలో విద్య కోసం వెళ్లేవాళ్లు ఉద్యోగం చేయడం నిషేధం. చదువు పూర్తయ్యే వరకు సొంత ఆర్థిక వనరులుండాలి. వీటిని నిరూపించే పత్రాల సమర్పణలో విఫలమవుతున్నారు.
- భాష లేదా కమ్యూనికేషన్ నైపుణ్యాలు నిరూపించే పరీక్షలో ఫెయిల్ అవుతున్నారు.
- ఇండియాలో చేసిన కోర్సు వేరు. అమెకన్ వర్సిటీలో చేయాలనుకుంటున్న కోర్సు వేరుగా ఉంటున్నాయి. ఇలా ఎంచుకోవడానికి గల కారణాలపై స్పష్టత ఇవ్వలేకపోతున్నారు.
- అమెరికాలో ఎంఎస్‌కు పునాదిగా భావించే ఇక్కడి ఇంజనీరింగ్ కోర్సులో కీలకమైన సబ్జెక్టులు పదేపదే బ్యాక్‌లాగ్ ఉండటమూ తిరస్కరణకు కారణమే.

సహేతుక కారణాలు ఉండటం లేదు

విద్యార్థి వీసాలను తిరస్కరించేప్పుడు కాన్సులేట్ సరైన కారణాలు చూపించడం లేదు. ఆర్థిక వనరులపై పదేపదే వాకబు చేస్తున్నారు. ట్రంప్ వచ్చిన తర్వాత వీసా ఇంటర్వ్యూల్లో గుచ్చిగుచ్చి ప్రశ్నలు వేస్తున్నారు. దీంతో కొంతమంది విద్యార్థులు కంగారు పడుతున్నారు. దీన్ని కూడా సాకుగానే భావిస్తున్నారు.

– వినీత్ బాత్రా, కన్సల్టెంట్ సంస్థ ఎండీ, ఢిల్లీ.

విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి

వీసా విధానం గతంలో మాదిరిగా సరళంగా లేదు. కన్సల్టెన్సీలను నమ్ముకుని మోసపోవద్దు. తప్పుడు పత్రాలపై వీసా వచ్చిన తర్వాత కూడా విచారణ ఉంటుంది. అడ్డదారుల్లో వెళ్లొద్దు.

– వాసుదేవరెడ్డి, ప్రవాస భారతీయుడు, అమెరికా.

భయపెట్టేలా ఇంటర్వ్యూ

అమెరికా వర్సిటీ నుంచి ఆఫర్ లెటర్ వచ్చింది. వీసా ఇంటర్వ్యూకు వెళ్తే సివిల్స్ మాదిరి ప్రశ్నలు వేశారు. ఆర్థిక మూలాలు అడిగారు. కోర్సులో మార్కుల గురించి ప్రశ్నించారు. అమెరికాలో ఎక్కడ ఉండేది? ఎంత రెంటు, జీవన వ్యయం అవుతుందనే ప్రశ్నలూ వేశారు. కాస్త తడబాటు వచ్చింది. అంతే, సారీ అంటూ పంపారు.

– శృతి పల్లవి, హైదరాబాద్ విద్యార్థి.

విద్యార్థుల్లో ఎఫ్-1 ఫీవర్

అమెరికన్ వర్సిటీలు ఏటా రెండుసార్లు ప్రవేశాలు కల్పిస్తాయి. ఆగస్టు–డిసెంబర్ మధ్య ఒక సెమిస్టర్, జనవరి–మే మధ్య మరో సెమిస్టర్ ఉంటుంది. భారతవిద్యార్థులు ఆగస్టు–డిసెంబర్ మధ్య సెమిస్టర్‌కే ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. విదేశీ విద్యార్థులకు ఎఫ్–1 వీసా ఇస్తారు. అయితే, అమెరికా కాన్సులేట్ ప్రకారం 2023– 24లో ఎఫ్–1 వీసాలను భారీగా తగ్గించారు. 2024లో తొలి 9 నెలల్లోనే భారతీయ విద్యార్థి వీసాలను 38 శాతం మేర తిరస్కరించింది. 2023లో భారత విద్యార్థులకు 1.03 లక్షల వీసాలు బ్యూరో ఆఫ్ కాన్సులేట్ అఫైర్స్ నెలవారీ నివేదిక పేర్కొంది. భారత్ నుంచి విదేశాలకు 7 లక్షల మంది వెళుతుండగా వారిలో 3 లక్షల మంది అమెరికాకే వెళ్తున్నారు.

కోర్సు	2022-23	2023-24
అండర్ గ్రాడ్యుయేట్	31,954	36,053
ఎంఎస్	1,65,936	1,96,567
ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్	69,062	97,556
డిగ్రీయేతర కోర్సులు	1,971	1,426

విద్యార్థి వీసా దరఖాస్తుల తిరస్కరణ ఇలా.. (అన్నిదేశాలవి కలిపి లక్షల్లో)

సంవత్సరం	వచ్చిన దరఖాస్తులు	తిరస్కరణకు గురైనవి
2023-24	6.79	2.79
2022-23	6.99	2.53
2013-14	7.69	1.73

కాంగ్రెస్ సర్కారు ఐదేళ్లు కొనసాగితేనే మంచిది

- రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పతనాన్ని మనం కోరుకోవొద్దు
- భూముల అమ్మకంపై తిరుగుబాటు ఆహ్వానించదగినదే
- రాష్ట్ర బీజేపీలో నాయకత్వ లేమి, నేతల కుమ్ములాటలు
- ఎర్రవల్లిలో కరీంనగర్, ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ నేతల భేటీలో మాజీ సీఎం కేసీఆర్




మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాల అధ్యక్షులు

సాక్షి, హైదరాబాద్ : 'ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ పతనాన్ని మనం కోరుకోవొద్దు. రేవంత్ ప్రభుత్వం ఐదేళ్ల పూర్తికాలం అధికారంలో కొనసాగితేనే.. మనం చేసిన మంచి ఏమిటో వెలుగు చూస్తుంది. ఈ ప్రభుత్వం పనితీరుపై ప్రజలు ఇప్పటికే విసిగివేసారిపోయారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు రావడం ఖాయం. కాంగ్రెస్ హామీలు అమలు చేయకపోవడంతో జనంలో తిరుగుబాటు మొదలైంది. బీఆర్‌ఎస్ నేతలు అనునిత్యం ప్రజాక్షేత్రంలో అందుబాటులో ఉంటే మన పట్ల సానుకూలత పెరుగుతుంది'అని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఎర్రవల్లిలో గురువారం ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ అయ్యారు. పార్టీ రజతోత్సవాల నిర్వహణ, వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభ ఏర్పాట్లపై ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జోగు రామన్న, కొప్పుల ఈశ్వర్ తదితరులు పాల్గొన్న ఈ భేటీలో కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

రేవంత్ సర్కారుపై జనం తిరుగుబాటు

'సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకం విషయంలో రేవంత్ సర్కారుపై జనం తిరుగుబాటు ఆహ్వానించదగిన పరిణామం. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపయోగంగా ఉన్న వాటితోపాటు ఆక్రమణలకు గురవుతున్న భూములను కాపాడి వాటిని పారదర్శకంగా వేలం వేసి ఖజానాకు ఆదాయం సమకూర్చాం. కానీ రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా భూముల విక్రయంలో విచక్షణ కోల్పోయి వ్యవహరిస్తోంది'అని కేసీఆర్ అన్నారు.

రాష్ట్ర బీజేపీలో నాయకత్వలేమి

'బీజేపీకి రాష్ట్రంలో సరైన నాయకుడు లేక నాయకత్వ లేమితో కొట్టుమిట్టాడుతోంది. పార్టీలోనూ అంతర్గతంగా నాయకుల నడుమ తీవ్ర విభేదాలు నెలకొన్నాయి. కాంగ్రెస్, బీజేపీ పట్ల ప్రజల్లో తీవ్రస్థాయిలో వ్యతిరేకత కనిపిస్తోంది. రాష్ట్రంలో ఉప ఎన్నికలతోపాటు ఏ ఇతర ఎన్నికలు జరిగినా ఆ రెండు పార్టీల పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ప్రతిఫలిస్తుంది'అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. వరంగల్ సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ప్రత్యేకించి మానకొండూరు, హుస్నాబాద్, హుజూరాబాద్ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలని సూచించారు. ఉమ్మడి కరీంనగర్ నుంచి 2 లక్షలు, ఆదిలాబాద్ నుంచి లక్షన్నరకు తగ్గకుండా జన సమీకరణ చేయాలన్నారు.

బండెనక బండి కట్టి.. గులాబీల జెండ పట్టి

రజతోత్సవ సభ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ రూపొందించిన 'బండెనక బండి కట్టి.. గులాబీల జెండ పట్టి'పాటను కేసీఆర్ ఆవిష్కరించారు. పార్టీ అవతరణ నాటి నుంచి నేటి వరకు ప్రస్థానాన్ని గుర్తు చేసేలా పాటలు, కళారూపాలు రూపొందించాలని రసమయి బాలకిషన్‌కు కేసీఆర్ సూచించారు.

బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు హాజరు

కేసీఆర్‌తో జరిగిన భేటీలో మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్ కుమార్, జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్ జాదవ్, కోవా లక్ష్మి, పార్టీ జిల్లా అధ్యక్షులు జీవీ రామకష్ణారావు (కరీంనగర్), తోట ఆగయ్య (సిరిసిల్ల) జోగు రామన్న (ఆదిలాబాద్), బాల్క సుమన్ (మంచిర్యాల) పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్ కుమార్, రసమయి బాలకిషన్ , సుంకే రవిశంకర్, దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, పుట్టా మధు, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు .

ఫార్మారంగానికి భారీ ఊరట

రాజ్యసభ ఎంపీ డి.పార్థసారథిరెడ్డి చొరవతో సుంకాల మినహాయింపు



సాక్షి, న్యూఢిల్లీ: భారత ఫార్మా రంగానికి భారీ ఊరట లభించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించబోయే ప్రతీకార సుంకాల వల్ల భారత ఫార్మారంగం ఎదుర్కోబోయే పెనుసవాళ్లపై మార్చి 26న రాజ్యసభలో బీఆర్‌ఎస్ ఎంపీ పార్థసారథిరెడ్డి చేసిన ప్రసంగంపై స్పందన వచ్చింది. భారత ప్రభుత్వం అత్యవసరంగా స్పందించి ద్వైపాక్షిక చర్చలు, సంప్రదింపుల ద్వారా భారత ఫార్మా ఉత్పత్తులపై అమెరికా ప్రతీకార సుంకాల విషయంలో మినహాయింపు, వెసులుబాటు పొందింది. ఫార్మా రంగానికి చెందిన ప్రతినిధిగా తాను రాజ్యసభలో ప్రస్తావించిన అంశానికి ప్రభుత్వ ప్రతిస్పందనను అభినందిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేస్తూ పార్థసారథిరెడ్డి గురువారం లేఖ రాశారు.

వక్ఫ్ బిల్లుతో సెక్యులర్ భావనకు ప్రమాదం

రాజ్యాసభలో బిల్లును వ్యతిరేకించిన బీఆర్‌ఎస్



సాక్షి, న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లు ద్వారా దేశ సెక్యులర్ భావనకు ప్రమాదం ఏర్పడుతుందని బీఆర్‌ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. వక్ఫ్ సవరణ బిల్లు ద్వారా ముస్లింల అభివృద్ధి కంటే ఏకీకరణపైనే కేంద్రం దృష్టి సారించిందన్నారు. అందువల్ల ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును బీఆర్‌ఎస్ పార్టీ తరపున వ్యతిరేకించిన సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని నాలుగు విభిన్న ప్రాంతాల్లో వక్ఫ్ బోర్డుకు సంబంధించిన వారితో సమావేశం ఏర్పాటు చేసి మార్పుల గురించి వారితో చర్చిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు.

కోటి విరాళం చెల్లిస్తే తిరుమలలో ప్రత్యేక సౌకర్యాలు

తిరుమల: తిరుమల శ్రీవారికి రూ.కోటి విరాళం ఇచ్చే వారికి ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తున్నట్లు టీటీడీ తెలిపింది. తిరుమలలో ప్రత్యేక ఉత్సవాలు జరిగే రోజుల్లో మినహా..మిగిలిన రోజుల్లో ఈ ప్రత్యేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవచ్చు. రూ.కోటి విరాళం ఇచ్చే దాతలకు జీవిత కాలంలో దాతతో పాటు నలుగురికి ఏడాదిలో 3 రోజులు సుప్రభాత సేవ, 3 రోజులు బ్రేక్ దర్శనం, 4 రోజుల పాటు సుపథం ప్రవేశ దర్శనం ద్వారా శ్రీవారి దర్శనం చేసుకోవచ్చు. రూ.3 వేలు విలువైన వసతి గదుల సదుపాయాన్ని 3 రోజులు కల్పిస్తారు.

50 శాతం భూసేకరణ వ్యయంపై రాష్ట్రం సంతకం చేయాల్సి ఉంది

రీజినల్ రింగ్ రోడ్‌పై కేంద్రమంత్రి గడ్కరీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నగరానికి ప్రాంతీయ రింగ్ రోడ్డు మంజూరు కోసం కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించిందని.. ప్రాజెక్ట్ భూసేకరణ వ్యయంలో 50 శాతం భరించేందుకు హామీ ఇచ్చిందని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. అయితే భూసేకరణ వ్యయాన్ని పంచుకోవడానికి సంబంధించిన త్రైపాక్షిక ఒప్పందంపై ఇంకా సంతకం చేయాల్సి ఉందన్నారు. కాగా హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి అలైన్‌మెంట్ ఖరారైందని ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలు అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి గురువారం లోక్‌సభలో సమాధానం ఇచ్చారు. అంతేగాక రూ.34,367.62 కోట్ల అంచనా వ్యయంతో ప్రాంతీయ రింగ్ రోడ్డు మంజూరు కోసం తెలంగాణ ప్రభుత్వం నుంచి అభ్యర్థన వచ్చిందన్నారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ ఉత్తర భాగానికి పర్యావరణ క్లియరెన్స్ 2025 మార్చి 18న మంజూరు అయ్యిందని చెప్పారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం కోసం డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) పురోగతిలో ఉందని.. డీపీఆర్ ఆధారంగా ప్రాజెక్ట్ చేపడతామన్నారు. 2019 ఏప్రిల్ నుంచి తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధి, నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.25,000 కోట్ల వ్యయం చేసిందని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డును ఉత్తర ప్రాంతీయ రింగ్ రోడ్డును కలుపుతూ గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ల అభివృద్ధి ప్రతిపాదన ఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని గడ్కరీ పేర్కొన్నారు.

రహదారులను అభివృద్ధి చేయండి

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో రహదారులను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ కడియం కావ్య కోరారు. ఈ మేరకు గురువారం కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. భూపాలపల్లి పట్టణానికి బైపాస్‌రోడ్డుతో సహా పలు రహదారుల వెంట సైడ్ డ్రైనేజీలు, ప్రమాదాల నివారణ కోసం ఆర్వోబీలు, జంక్షన్ పాయింట్లను ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి.. వెంటనే డీపీఆర్ తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారని కావ్య తెలిపారు. కాజీపేట రైల్వే ఫ్యాక్టరీకి సంబంధించిన పలు అంశాలను గురువారం కడియం కావ్య లోక్‌సభలో లేవనెత్తారు. కాజీపేట లోకో రన్నింగ్ డిపోలో సిబ్బంది కొరత ఉందని.. కాజీపేట, సికింద్రాబాద్ డివిజన్ విషయంలో రైల్వే అధికారులు పక్షపాత ధోరణి అవలంభిస్తున్నారని ఆరోపించారు.

గిఫ్ట్ డీడ్ చెల్లదు

- ఉన్నత న్యాయస్థానం స్టేటస్‌కో ఆదేశాలుండగా షేర్ల బదిలీ చట్టవిరుద్ధం
- కనీసం మా సంతకాలు కూడా లేకుండా జరిగిన షేర్ల బదిలీని నిలుపుదల చేయాలి
- గిఫ్ట్ ప్రక్రియ ఇంకా ముగియలేదు.. అలాంటప్పుడు షేర్ల బదిలీ సాధ్యం కాదు
- పిటిషనర్లకు తెలియకుండానే షేర్ల బదిలీ జరిగింది
- ఎన్సీఎల్‌టీలో వైఎస్ జగన్, వైఎస్ భారతి తరఫున వాదనలు
- తదుపరి విచారణ మే 7కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: వైఎస్ భారతి పేరిట, తన పేరిట సరస్వతి కంపెనీలో ఉన్న షేర్లను తల్లి విజయమ్మ ద్వారా చెల్లెలు షర్మిల అక్రమంగా.. గిఫ్ట్ డీడ్ ప్రక్రియ పూర్తి కాకుండానే బదిలీ చేసుకున్నారు కనక అది చెల్లదని వైఎస్సార్‌సీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. షేర్లకు సంబంధించిన డాక్యుమెంట్లు, సర్టిఫికెట్లు తన వద్దే ఉన్నాయని, కనక విజయమ్మ నుంచి షర్మిల షేర్లు బదిలీ చేసుకోవడం చట్ట విరుద్ధమని జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు(ఎన్సీఎల్‌టీ) నివేదించారు. 2019లో ఎంఓయూ చేసుకున్నా... 2021లో తల్లి విజయమ్మ పేరిట గిఫ్ట్ డీడ్ చేసినా... ఆ ప్రక్రియ ఇంకా ముగియలేదన్నారు. ఈ మేరకు వైఎస్ జగన్ తరఫున న్యాయవాది ఎస్. నిరంజన్ రెడ్డి ఈ వాదనలు వినిపించారు. ఉన్నత న్యాయస్థానం నుంచి స్టేటస్‌కో ఆదేశాలు కూడా ఉన్నాయని, వాటిని ధిక్కరించి షేర్ల బదిలీ చేయటం చట్టసమ్మతం కాదని, కనీసం తమ సంతకాలు కూడా లేకుండా జరిగిన ఈ షేర్ల బదిలీని నిలుపుదల చేస్తూ ఆదేశాలివ్వాలని ట్రిబ్యునల్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ వాదనలు విన్న తరవాత తదుపరి విచారణను బెంచ్ మే 7వ తేదీకి వాయిదా వేసింది. సరస్వతి కంపెనీలోని షేర్లను తల్లి విజయమ్మ ద్వారా చెల్లెలు షర్మిల అక్రమంగా బదిలీ చేసుకోవటంపై జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్సీఎల్‌టీ)లో 2024, సెప్టెంబర్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి తన వాదనలు వినిపిస్తూ... 'సరస్వతి కంపెనీ, సండూర్ పవర్ సహా పలు కంపెనీలపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సదరు ఆస్తులు, షేర్లపై ఉన్నత న్యాయస్థానం స్టేటస్‌కో ఆదేశాలు జారీ చేసింది. యథాతథస్థితి ఆదేశాలు అమల్లో ఉండగా షేర్లు బదిలీ చేయటం చట్టవిరుద్ధం. కాబట్టి ఈ బదిలీని రద్దు చేసి సరస్వతి పవర్ కంపెనీలో వైఎస్ జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీ పేరిట ఉన్న 51.01 శాతం వాటా యథాతథంగా కొనసాగించేలా ఆదేశాలివ్వాలి'అని నిరంజన్‌రెడ్డి కోరారు.

పిటిషనర్ల వద్దే వర్జినల్ డాక్యుమెంట్లు..

'షేర్‌కు సంబంధించిన డాక్యుమెంట్లు, సర్టిఫికెట్లు ఫిజికల్‌గా ఇవ్వాలి. అప్పుడు మాత్రమే గిఫ్ట్ డీడ్ ప్రక్రియ పూర్తవుతుంది. వాస్తవానికి ఒరిజినల్ డాక్యుమెంట్లన్నీ పిటిషనర్ల వద్దే ఉన్నాయి. పిటిషనర్లకు తెలియకుండానే... షేర్ల బదిలీ ఫారాలు, డాక్యుమెంట్లు, సంతకాలు కూడా లేకుండానే వాటి బదిలీ జరిగింది. ఇది కంపెనీ చట్టానికి విరుద్ధం. షేర్ల బదిలీపై షర్మిలతో చర్చించేందుకు ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన షేర్ల బదిలీని రద్దు చేస్తూ ఆదేశాలివ్వాలి'అని నిరంజన్‌రెడ్డి కోరారు.

ఏపీ మరో బిహార్‌లా..

- టీడీపీ కూటమి ప్రభుత్వంలో మా భూమి కబ్జాకు గురైంది
- ఆ ప్రభుత్వం కోసం ఎంతో కష్టపడ్డా.. ఇప్పుడు సిగ్గేస్తోంది
- ఈ సమస్యను పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినా స్పందనలేదు
- తిరుచానూరు పోలీసులు కబ్జారాయుళ్లతో కలిసిపోయారు
- జగన్ ప్రభుత్వంలో మా భూములు భద్రంగా ఉన్నాయి
- ఆస్ట్రేలియా నుంచి ఓ ఎన్ఆర్ఐ సెల్ఫీ వీడియో విడుదల

– సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: మీరు విదేశాల్లో స్థిరపడ్డ ప్రవాసాంధ్రులా.. అయితే, ఖచ్చితంగా మీ భూములకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు చెక్ చేసుకోండి. మీ భూములు భద్రంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోండి. ఎందుకంటే.. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్ఆర్ఐలకు చెందిన రూ.కోట్లు విలువైన స్థలాలను యథేచ్ఛగా కబ్జాచేసే ముఠాల ఆగడాలు శృతిమించుతున్నాయి. ప్రత్యేకించి పోలీసులతో కుమ్మక్కయి మరీ ఈ ముఠాలు చెలరేగిపోతున్నాయి. ఈ విషయంలో ఒక ఎన్ఆర్ఐ పడుతున్న ఆవేదన ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది. ఏపీ మరో బీహార్‌లా మారిందంటూ తిరుపతికి చెందిన ఎన్ఆర్ఐ బొర్రా రాజేంద్రప్రసాద్ ఆస్ట్రేలియాలోని సిడ్నీ నుంచి ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టిస్తోంది. అందులో ఆయన ఏమన్నారంటే..

ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తున్న నేను కష్టపడి సంపాదించిన డబ్బుతో తిరుచానూరు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 298/4లో 120 అంకణాల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేస్తే ప్రైవేట్ వ్యక్తులు కొందరు దానిని కబ్జాచేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. నిజానికి.. కిందటేడాది జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావడానికి జనసేన ఎన్ఆర్ఐ విభాగం తరపున ఆస్ట్రేలియాలో చురుగ్గా పనిచేశాను. మా నాన్న బొర్రా వెంకటరమణ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా రిటైరయ్యారు. ఆయన కూడా జనసేన నుంచి తిరుపతికి పోటీచేసిన ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి నుంచి పోటీచేసిన పులివర్తి నానిల గెలుపు కోసం చురుగ్గా పనిచేశారు. కూటమి ప్రభుత్వం కోసం కష్టపడినందుకు ఇదేనా మాకు దక్కుతున్న న్యాయం? మా నాన్న నాలుగుసార్లు తిరుపతి ఎస్పీ కార్యాలయంలో, తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదుచేస్తే పట్టించుకోలేదు. ఏపీ మరో బీహార్‌లా తయారైంది. నాలాంటి ఎన్ఆర్ఐలు చాలా మంది బాధితులుగా ఉన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి దారుణాలు ఎన్నడూ జరగలేదు. నిజానికి.. ఎన్ఆర్ఐలకు చెందిన స్థలాలను జగన్ ప్రభుత్వం జాగ్రత్తగా చూసుకుంది. ఈ సమస్యను ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లినా స్పందనలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం కోసం కష్టపడ్డా.. కానీ ఇప్పుడు సిగ్గేస్తోంది. ఇదిలా ఉంటే.. తిరుచానూరు పరిసరాల్లో ఎన్ఆర్ఐలకు చెందిన స్థలాలను ఎంచుకుని కబ్జారాయుళ్లు వాటిల్లోకి వాలిపోతున్నారని.. వీరికి పోలీసుల సహకారం ఉండటంతో ఎన్ఆర్ఐలు ఏమీ చేయలేకపోతున్నారని బొర్రా వెంకటరమణ మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. చివరికి.. తమ స్థలం విషయంలో పోలీసులు ప్రత్యర్థులతో సెటిల్ చేసుకోవాలని పరోక్షంగా చెబుతున్నారని మండిపడ్డారు.



సెల్ఫీ వీడియో విడుదల చేసిన ఎన్ఆర్ఐ రాజేంద్రప్రసాద్





సరైన ఫిటింగ్‌తో డ్రెస్సింగ్ ఉంటేనే బాగుంటుంది
అనేది చాలామందిలో ఉండే ఆలోచన.
ప్రస్తుత రోజుల్లో ఎంత వదులైన డ్రెస్ వేసుకుంటే
అంత స్టైలిష్‌గా ఉంటాం అనేది అసాధారణ ఆలోచనగా మారింది.
ట్యునిక్స్, కుర్తీస్, షర్ట్స్, టాప్స్, ఫ్రాక్స్..
ఏ మోడల్ డ్రెస్ అయినా వదులుగా ఉండటం వల్ల
ఈ వేసవికి తగినట్టు సౌకర్యంగానూ, స్టైలిష్‌గానూ ఉంటుంది.
ప్లస్ సైజ్ డ్రెస్సుల్లో ప్లస్ స్టైల్ మార్కులూ కొట్టేయవచ్చు.

ప్లస్ సైజ్.. ప్లస్ స్టైల్

ఫ్యాషన్ సీజన్



- చిన్నపిల్లలు పెద్దవాళ్ల డ్రెస్సులు వేసుకొని, వాటిలో మునిగిపోతున్నట్టు కనిపించినా ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తారు. అలాంటి ఆనందాన్ని ఈ సీజన్‌లో ఓవర్‌సైజ్డ్ డ్రెస్సులు ధరించి పొందవచ్చు. చూపరుల నుంచి 'ఎంత స్టైలిష్‌గా ఉన్నారు...' అనే కితాబులూ పొందవచ్చు.
- పూర్తిగా శరీరం అంతా కప్పేసినట్టుగా ఉన్నా ఈవెంట్‌లో ప్రత్యేకంగా కనిపిస్తారు. స్లిమ్‌గా ఉన్నవారు కూడా ఈ సీజన్‌లో ప్లస్ సైజ్ డ్రెస్సులు వేసుకొని హాయిగా తిరిగేయవచ్చు.



- ఈ స్టైల్‌ని ఎవరికి వారు వినూత్నంగా మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. వదులైన ట్యునిక్స్ ధరించినప్పుడు నడుము దగ్గర బెల్ట్‌తో ఓ స్టైల్‌ని, ముడి వేసి మరో స్టైల్‌ని సృష్టించవచ్చు.
- జీన్స్‌కి టాప్‌గా ఉపయోగించే వదులైన షర్ట్స్ ధరించినప్పుడు పూర్తిగా టక్ చేసి లేదా సగం టక్ చేసి స్టైలిష్‌గా కనిపించవచ్చు.
- స్ట్రీట్ స్టైల్‌ను పోలి ఉండే ఈ డ్రెస్సింగ్‌లో లేయర్డ్ ఔట్‌ఫిట్స్‌ను కూడా ధరించవచ్చు. ఒక ప్రింటెడ్ ట్యునిక్ వేస్తే, దాని మీదకు ట్రాన్స్‌పరెంట్ ప్లెయిన్ మరో ట్యునిక్‌ను వేసుకోవచ్చు. లేయర్డ్‌లోనూ లూజ్ టాప్స్‌నే ఎంచుకోవాలి.
- ఈ తరహా ఔట్‌ఫిట్స్‌తోనే స్టైల్‌ను క్రియేట్ చేయవచ్చు కాబట్టి ఇతరత్రా హంగులేవీ అక్కర్లేదు. సింపుల్ వెస్టర్న్ జ్యువెలరీ, లూజ్ అండ్ బన్ కేశాలంకరణ్, పాదరక్షల విషయంలో ఫ్లాట్స్ ధరిస్తే చాలు. సీజన్‌కి తగిన సౌకర్యవంతమైన స్టైల్‌లో మెరిసిపోవచ్చు.
- వదులుగా ఉంటాయి కాబట్టి సిల్క్, కాటన్, షిఫాన్, ఆర్గంజా... ఏ ఫ్యాబ్రిక్ అయినా ఎంచుకోవచ్చు. టాప్ టు బాటమ్ ప్లెయిన్, ప్రింట్స్ కూడా బాగుంటాయి.

బ్యూటీ

చర్మానికి రక్షణ



వేసవిలో చర్మ సంరక్షణ, మేకప్ గురించి కొంత ఆందోళన సహజం. ఎందుకు చర్మం కమిలిపోవడం, మేకప్ చెదిరిపోవడం సహజంగా జరుగుతుంటాయి. ఈ సమస్యకు పరిష్కారంగా...

- ఇంటి నుండి బయటకు వెళ్లినప్పుడు సన్‌స్క్రీన్ రాసుకోవాలి. లేదంటే ఎస్‌పిఎఫ్ ఉన్న మేకప్ ఉత్పత్తులను ఎంచుకోవాలి. దీనివల్ల చర్మానికి రక్షణ లభిస్తుంది.
- బయటకు వెళ్లినప్పుడు పట్టిన చెమటను తుడవడానికి టిష్యూ పేపర్‌ను ఉపయోగించాలి. చెమట పట్టిన చోట టిష్యూ పేపర్‌ను అద్దితే, త్వరగా పీల్చుకుంటుంది. దీని వల్ల మేకప్ చెదిరిపోకుండా ఉంటుంది.
- మేకప్ తొలగించిన తర్వాత చర్మం విశ్రాంతి పొందడానికి హైడ్రేటింగ్ షీట్ మాస్క్‌ను ఉపయోగించవచ్చు. జిడ్డు పోవడానికి కీర, దోస రసం, అలోవెరా జెల్ మాస్క్‌లా వాడి, ఐదు నిమిషాల్లో చల్లని నీటితో శుభ్రపరుచుకోవాలి. దీనివల్ల చర్మం తాజాగా మారుతుంది.
- చెమట వల్ల చర్మంపై దద్దుర్లు వస్తుంటాయి. సబ్బులకు బదులు బాడీ, ఫేస్ వాష్‌లతో శుభ్రపరుచుకోవాలి. దీని వల్ల చర్మంపై గల సూక్ష్మ రంధ్రాలు సహజ నూనెలు కోల్పోవు.
- ఈ కాలం త్వరగా అలసట వచ్చేస్తుంటుంది. అందుకని, రోజూ పడుకునేముందు కళ్ల కింద అవకాడో లేదా అలోవెరా క్రీమ్ లేదా ఫిష్ ఆయిల్‌తో మృదువుగా వేలి కొనలతో అప్లై చేయాలి. లేదంటే ఐ క్రీమ్ వాడచ్చు.
- వారంలో రెండు సార్లు పాదాలను స్క్రబ్ చేసి, ఫుట్ క్రీమ్‌ను ఉపయోగించాలి.



– సంతోషి, సౌందర్య నిపుణులు

న్యూస్‌మేకర్

వ్యక్తిగత కార్యదర్శి బాధ్యత జటిలమైనది.
బాస్ చెప్పింది అర్థం చేసుకుని చెప్పబోయేది గ్రహించి
చెబుతున్నది అమలు చేయాలి. మరి ఆ బాస్ ప్రధాని అయితే?
అలాంటి జటిలమైన బాధ్యతకు ఎంపికైంది నిధి తివారి.
వారణాసికి చెందిన ఈ ఇండియన్ ఫారిన్ సర్వీస్ ఆఫీసర్
పి.ఎం.ఓ.లో అంచెలంచెలుగా ఎదుగుతూ ఈ స్థాయికి వచ్చారు.
ఆమె వ్యక్తిత్వం,
వ్యక్తిగత వివరాలు.

ప్రధానికి ప్రైవేట్ సెక్రటరీ



నిధి తివారి

వారణాసి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుతున్నారు. ఉత్తర ప్రదేశ్ ప్రజలు కూడా తమ రాష్ట్రానికి చెందిన అమ్మాయి ఈ స్థానానికి చేరిందే అని గర్వంగా చూస్తున్నారు. ప్రధానికి ప్రయివేట్ సెక్రటరీగా నియమితురాలైన నిధి తివారి సొంత ఊరు వారణాసి అయితే సొంత రాష్ట్రం ఉత్తర ప్రదేశ్. మరి ఈ హర్షం సహజమే కదా. ఏ పార్లమెంట్ స్థానం నుంచి ప్రధాని ప్రాతినిధ్యం వహిస్తున్నారో ఆ స్థానానికి చెందిన మహిళకే ప్రధాని ఈ అవకాశం ఇవ్వడం వారణాసి ప్రజలకు నచ్చింది. ప్రధాని రోజువారి కార్యక్రమాల సమన్వయం చూసే వ్యక్తిగా నిధి తివారి పని చేయడం అంటే సామాన్యమా? సన్నివేశం కొంచెం అటు ఇటుగా మనం సినిమాల్లో చూసినట్టే ఉంటుంది.

ప్రధాని ముందు రోజు అడుగుతారు–
'రేపటి నా కార్యక్రమాలు ఏమిటి?'

నిధి తివారి చెప్తారు: 'సర్.. ఫలానా శాఖకు చెందిన మంత్రి మిమ్మల్ని కలవడానికి వస్తారు. ఫలానా శాఖ డైరెక్టర్ వచ్చి నివేదిక అందజేస్తారు. ఫలానా కార్యక్రమం ప్రారంభోత్సవానికి వెళతారు.

అయితే ఈ కార్యక్రమాలు ఫిక్స్‌డ్ కాదు. ఇంత పెద్ద దేశంలో ఎన్నో తక్షణ సమస్యలు వస్తాయి. వివిధ రాష్ట్రాల నుంచి ప్రధానిని అర్జెంట్‌గా కలవాలని ముఖ్యమంత్రుల దగ్గరి నుంచి ఉన్నత అధికారులు, ప్రతిపక్ష నాయకులు, వ్యాపారవేత్తలు అపాయింట్‌మెంట్లు అడుగుతారు. దేశాల నుంచి ఆహ్వానాలు వస్తుంటాయి. వాటన్నింటినీ సమన్వయం చేసి, ప్రధాని ప్రాధాన్యాలు గమనించి కార్యక్రమాల రూపకల్పన చేయాల్సి ఉంటుంది. ఈ కత్తి మీద సాముకే నిధి తివారి ఎంపికైంది.

ఎవరు ఈ నిధి?

నిధి తివారి.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వినిపిస్తున్న పేరు. దేశ ప్రధాని నరేంద్ర మోదీకి వ్యక్తిగత కార్యదర్శి (ప్రైవేట్ కార్యదర్శి)గా ఇటీవల ఆమె నియమితులవడంలో 'పిఎంఓ'లో స్త్రీల ప్రాధాన్యం పెరుగుతున్నదనడానికి మరో ఆనవాలుగా పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. 2022 నవంబర్ నుంచి ప్రధానమంత్రి కార్యాలయంలో డిప్యూటీ సెక్రటరీగా పని చేస్తున్న నిధి ఇప్పుడు ప్రధాన వ్యక్తిగత కార్యదర్శిగా ప్రమోట్ అయ్యారు. వారణాసిలోని మెహమర్‌గంజ్‌లో పుట్టి పెరిగిన నిధి బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ చేశారు. ఆ యూనివర్సిటీలోనే పరిచయమైన దియోరియా జిల్లాకు చెందిన వైద్యుడు డా.సుశీల్ జైస్వాల్‌ను 2006లో వివాహం చేసుకున్నారు.

పెళ్లి తర్వాత సివిల్స్

సివిల్ సర్వీసెస్‌లో చేరి దేశానికి తనవంతు సేవ చేయాలనేది చిన్ననాటి నుంచి నిధి లక్ష్యం. 'వివాహం విద్య నాశాయ' అన్న మాటను అబద్ధం చేస్తూ కష్టపడి చదివి, వారణాసిలో అసిస్టెంట్ కమిషనర్ (కమర్షియల్ ట్యాక్స్) ఉద్యోగం సాధించారు. ఆ ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కి సన్నద్ధమయ్యారు. కొడుకు పుట్టినా ఆమె తన లక్ష్యం వీడలేదు. 2013 సివిల్స్ ఫలితాల్లో 96వ ర్యాంకు సాధించారు. ఐఎఫ్ఎస్ అధికారిణిగా 2016లో శిక్షణలో ఉన్న సమయంలోనే ఆమె చూపిన ప్రతిభకు గుర్తింపుగా 'అంబాసిడర్ విమల్ సన్యాల్ స్మారక పతకం' అందుకున్నారు.

అజిత్ దోవల్ టీమ్‌లో

ప్రధానమంత్రి కార్యాలయంలో పని చేయడానికి ముందు ప్రభుత్వం ఆమెను విదేశీ వ్యవహారాల శాఖలో 'నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతా వ్యవహారాలు' (డిజార్మమెంట్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ అఫైర్స్) విభాగంలో అధికారిగా నియమించింది. దాంతోపాటు రాజస్థాన్‌కు సంబంధించిన పలు అంశాలపైనా ఆమె పనిచేశారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఆధ్వర్యంలో ఆమె చూపిన ప్రతిభ ఆమెపై గౌరవాన్ని పెంచింది. దేశ భద్రత, అణుశక్తి, విదేశీ వ్యవహారాల వంటి అంశాలను ఆమె చాకచక్యంగా నిర్వహించగలదన్న నమ్మకం కుదిరింది. ఆ తర్వాత 2023లో భారత్‌లో తొలిసారి జరిగిన జీ20 శిఖరాగ్ర సమావేశంలో నిధి తివారీ చురుకుదనం, వ్యవహార శైలి, దీక్ష, పట్టుదలపై ప్రధానికి ఆమె మీద విశ్వాసం ఏర్పడింది.



డా. సుశీల్ జైస్వాల్‌తో నిధి

మొదటి మహిళ

మోదీ ప్రధాని అయ్యాక ఈ 11 ఏళ్లలో వ్యక్తిగత కార్యదర్శులుగా వివేక్ కుమార్, హార్దిక్ సతీష్ చంద్ర షా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఆ స్థానంలో నిధి తివారీ మొదటి మహిళగా నియమితులయ్యారు. ప్రధాని వ్యక్తిగత కార్యదర్శిగా ఉన్న ఆమెకు నెలకు రూ.1.44 లక్షల వేతనంతోపాటు ఇతర సదుపాయాలన్నీ అందుతాయి. ప్రతిభ, సామర్థ్యం ఉంటే స్త్రీల ఉన్నతికి ఆకాశమే హద్దు అని నిరూపించేందుకు నిధి తివారి మరో గొప్ప ఉదాహరణగా నిలిచారు.

రక్షణ

న్యాయం కోసం..



బాధితుల పక్షాన నిలబడడం అంటే అంత సులువైన విషయం ఏమీ కాదు. కొన్నిసార్లు బెదిరింపులు కూడా ఎదురుకావచ్చు. కొన్నిసార్లు బాధితులు వెనక్కి తగ్గవచ్చు. వారికి ధైర్యం చెప్పి, న్యాయం జరిగేలా, నిందితులకు శిక్ష పడేలా చేయడానికి వృత్తిపరమైన అంకితభావం కావాలి. అలాంటి అంకితభావం మూర్తీభవించిన ఒక అధికారి స్రవంతి. లైంగిక వేధింపులు, అత్యాచార కేసులలో నిందితులకు శిక్ష పడేలా చేయడంలో కామారెడ్డి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న స్రవంతి కీలక పాత్ర పోషిస్తున్నారు. ఒక ఆఫీసర్‌లా కాకుండా కుటుంబ సభ్యురాలిగా బాధితుల తరఫున నిలుస్తున్నారు.

ఆడపిల్లలపై జరిగిన వేధింపుల విషయంలో బయటకు చెబితే పరువు పోతుందని చాలా మంది చెప్పుకోవడానికి కూడా ఇష్టపడడం లేదు. ఇలాంటి పరిస్థితులలో ఎవరి ద్వారానైనా విషయం తెలిస్తే చాలు ఆమె అక్కడికి చేరుకుంటారు. బాధిత బాలికల తల్లిదండ్రులతో మాట్లాడి పోలీసులకు ఫిర్యాదు చేయించి వారికి శిక్షలు పడేలా చేస్తున్నారు కామారెడ్డి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (డీసీపీవో)గా విధులు నిర్వహిస్తున్న స్రవంతి.

మెరుపు వేగంతో బాధితుల దగ్గరికి....

ఐదేళ్ల కాలంలో కామారెడ్డి జిల్లాలో 114 పోక్సో కేసులు నమోదయ్యాయి. ఇందులో చాలా మందికి శిక్షలు కూడా పడ్డాయి. జిల్లాలో ఏ ప్రాంతంలో అమ్మాయిలపై అఘాయిత్యాలు జరిగినా, వేధింపులు ఎదురైనా ముందుగా జిల్లా అధికారులకు విషయం తెలియజేసి అక్కడికి చేరుకుంటారు స్రవంతి. ఇటీవల నవోదయ విద్యాలయంలో కొందరు ఉపాధ్యాయులు, సిబ్బంది అరాచకాలతో అమ్మాయిలు పడుతున్న ఇబ్బందుల గురించి జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు సమాచారం వచ్చింది. వెంటనే విచారణ జరపమని స్రవంతిని పంపించారు. అక్కడికి వెళ్లిన స్రవంతి విద్యార్థినులతో మాట్లాడారు. ఎవరెవరు ఇబ్బంది పెడుతున్నారో తెలుసుకున్నారు. పదకొండు మంది అమ్మాయిలతో సంబంధిత ఉపాధ్యాయులు, సిబ్బందిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇప్పించారు. దీంతో నలుగురిపై పోక్సో కేసులు నమోదు చేసిన పోలీసులు వారిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు.

ఎన్నో కేసులు...

- ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల పాప ఇంటి దగ్గర ఆడుకుంటుండగా ఇరవై ఏళ్ల యువకుడు మ్యూజిక్ నేర్పిస్తానంటూ తీసుకువెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న డీసీపీవో స్రవంతి పాప తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసి పూర్తి వివరాలతో పోలీసు కేసు నమోదు చేయించారు. పాపకి వైద్యపరీక్షలు చేయించి పూర్తి వివరాలను కోర్టు ముందుంచారు. దీంతో ఈ కేసులో నిందితుడికి జీవితఖైదు పడింది.
- ఒక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను అదే పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుడు లైంగికంగా వేధించేవాడు. విషయం తెలిసిన స్రవంతి ఆ అమ్మాయికి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసి ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేయించారు. ఈ కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినందుకు గాను పది మందిపైనా పోక్సో కేసు నమోదు చేయించారు.
- ఒక అమ్మాయిపై అత్యాచారం జరిగిందని తెలియడంతో విచారణకు వెళ్లిన సందర్భంగా ఆ అమ్మాయి కడుపునొప్పితో బాధపడుతోంది. వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహిస్తే గర్భవతి అని నిర్ధారణ అయ్యింది. డాక్టర్‌తో ఫిర్యాదు చేయించి కేసు నమోదు చేశారు. కడుపులో పెరుగుతున్న పాప చనిపోగా డెలివరీ చేశారు. ఆ తరువాత అమ్మాయిని బాలసదనంలో చేర్పించి ఎంపీహెచ్‌డబ్ల్యు కోర్సు పూర్తి చేయించారు. అయితే సొంత అన్నే పలుసార్లు అత్యాచారం చేయగా ఆ అమ్మాయి గర్భం దాల్చినట్టు తేల్చారు. ఈ కేసులో నిందితుడికి ఇరవై ఏళ్ల జైలు శిక్ష పడింది.
- బాల్య వివాహాల విషయంలోనూ స్రవంతి సీరియస్‌గా పనిచేస్తున్నారు. బాల్యవివాహం చేయడానికి సిద్ధమవుతున్నారని తెలిస్తే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. చిన్నతనంలో పెళ్లి జరిగితే తలెత్తే సమస్యలను వివరించి బాల్య వివాహాలు జరగకుండా కృషి చేస్తున్నారు.

– ఎస్.వేణుగోపాలచారి, సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

బాధితులు బయటికి చెప్పుకోలేకపోతున్నారు



చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌గా నేను చేయాల్సిన బాధ్యతను నిర్వర్తిస్తున్నాను. ఇంటా, బయటా ఆడపిల్లలపై లైంగిక వేధింపులు పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. చాలా కేసుల్లో కుటుంబ సభ్యులే నిందితులుగా ఉంటున్నారు. కన్నతండ్రి, తోడబుట్టిన అన్న, తండ్రి తర్వాత తండ్రిలాంటి బాబాయ్... ఇలా రక్తసంబంధీకులే కాటేయాలని చూస్తున్న సంఘటనలతో సమాజం ఎటు పోతోందో అర్థం కావడం లేదు. చాలా సందర్భాల్లో తమ సమస్యల గురించి బాధితులకు బయటకు చెప్పుకోలేకపోతున్నారు. విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని అనుకుంటున్నారు. కానీ అలాగే వదిలేస్తే వేధింపులు, అఘాయిత్యాలు మరింత పెరుగుతాయి. ప్రతిచోటా పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పిస్తున్నాం.

– స్రవంతి, డీసీపీవో, కామారెడ్డి

సోషల్ మీడియా

తాతయ్య కళ



ఒకప్పటి దృశ్యం...

తాతగారు తన మనవళ్లు, మనవరాళ్లను దగ్గర కూర్చోబెట్టుకొని సరదాగా ముచ్చటించేవాడు. చందమామ కథలు చెప్పేవాడు. హాయిగా నవ్వించేవాడు.

ఇప్పటి దృశ్యం.....

తాతయ్య ఎప్పుడూ ఒంటరిగానే కనిపిస్తాడు. ఎప్పుడూ ఒకేలా కనిపిస్తాడు. పిల్లలు హోంవర్క్ అనే ప్రపంచం నుంచి ఎప్పుడోగానీ బయటికి రారు. బయటికి వచ్చినా తాతయ్యతో పొడి పొడి మాటలే ఉంటాయి. ఈ నేపథ్యంలో అలనాటి బంగారు కాలాన్ని గుర్తుకు తెచ్చే వీడియో నెటిజనులలో భావోద్వేగాలను రేకెత్తిస్తోంది.

96 ఏళ్ల తాతయ్య తన ముని మనవరాలితో ఆడుకుంటున్న వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.

చిన్నారి నవ్యతో బొమ్మలాట ఆడుకుంటున్నప్పుడు తాతయ్య కనులలో కోటి పండగల కళ కనిపించింది. ఈ వీడియో క్లిప్‌ను చూస్తూ చాలా మంది తమ బాల్యంలోకి వెళ్లి తాతయ్య, అమ్మమ్మ, నానమ్మలను గుర్తు తెచ్చుకున్నారు.

కుడి ఎడమైతే పొరపాటు లేదోయి...



శ్రీలంక ఆల్‌రౌండర్ కమిందు మెండిస్ ఈ మ్యాచ్‌తోనే ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. కుడి చేత్తో ఆఫ్ స్పిన్, ఎడమ చేత్తో లెఫ్టార్మ్ స్పిన్ బౌలింగ్ వేయగల నైపుణ్యం అతని సొంతం. దీనిని అతను తన తొలి ఓవర్లోనే చూపించాడు. ఈ ఓవర్లో కుడి చేతి వాటం బ్యాటర్ రఘు వంశీకి లెఫ్టార్మ్ స్పిన్‌తో 3 బంతులు వేసిన మెండిస్... ఎడంచేతి వాటం బ్యాటర్లు వెంకటేశ్ అయ్యర్, రింకూ సింగ్‌లకు ఆఫ్‌స్పిన్‌తో మరో 3 బంతులు వేశాడు. ఈ క్రమంలో రఘువంశీ వికెట్ కూడా దక్కింది. అయితే అతడిని సమర్థంగా వాడుకోవడంలో రైజర్స్ కెప్టెన్ కమిన్స్ విఫలమయ్యాడు. ఇన్నింగ్స్‌లో 13వ ఓవర్ కమిందు బౌలింగ్ చేయగా... ఆ తర్వాత పేసర్ల బౌలింగ్‌లో కేకేఆర్ విరుచుకుపడుతున్న సమయం లోనూ కనీసం మరో ఓవర్ కూడా వేయించకుండా ఒక ఓవర్‌కే పరిమితం చేశాడు. బ్యాటింగ్‌లో '0' వద్ద రసెల్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన కమిందు... రసెల్ ఓవర్లోనే 2 సిక్స్‌లు, ఫోర్ బాదాడు.





సెమీస్‌లో మనీశ్, హితేశ్, అభినాశ్



మనీశ్ హితేశ్ అభినాశ్

న్యూఢిల్లీ: వరల్డ్ బాక్సింగ్ కప్ టోర్నమెంట్‌లో మూడో రోజు ముగ్గురు భారత బాక్సర్లు అదరగొట్టారు. బ్రెజిల్‌లోని ఫాజ్ డు లుగాకు పట్టణంలో జరుగుతున్న ఈ టోర్నీలో మనీశ్ రాథోడ్ (55 కేజీలు), హితేశ్ (70 కేజీలు), అభినాశ్ జమ్వాల్ (65 కేజీలు) సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాలను ఖాయం చేసుకున్నారు. క్వార్టర్ ఫైనల్స్‌లో హితేశ్ 5–0తో గాబ్రియెల్ గిడి రొంటాని (ఇటలీ)పై, అభినాశ్ 5–0తో డెనిస్ బ్రిల్ (జర్మనీ)పై, మనీశ్ 3–0తో యూసుఫ్ చోథియా (ఆస్ట్రేలియా)పై విజయం సాధించారు.

వరుణ్‌కు 'ఐదు'... రవీందర్‌కు 'ఆరు'



వరుణ్



రవీందర్

బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) సీజన్ తొలి ప్రపంచకప్ టోర్నమెంట్‌లో మొదటిరోజు భారత్‌కు నిరాశ ఎదురైంది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత్ నుంచి వరుణ్ తోమర్, రవీందర్ సింగ్ ఫైనల్లోకి ప్రవేశించినా... పతకాలు మాత్రం గెలవలేకపోయారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో వరుణ్ తోమర్ 179.9 పాయింట్లతో ఐదో స్థానంలో... రవీందర్ సింగ్ 160 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచారు. హు కాయ్ (చైనా; 244.7 పాయింట్లు) స్వర్ణం... ఆంటోన్ అరిస్టర్ఖోవ్ (రష్యా; 243.3 పాయింట్లు) రజతం... జేసన్ సొలారి (స్విట్జర్లాండ్; 223 పాయింట్లు) కాంస్యం సాధించారు. 46 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్ రౌండ్‌లో 580 పాయింట్లు స్కోరు చేసిన రవీందర్, వరుణ్ వరుసగా ఏడు, ఎనిమిది స్థానాల్లో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు. భారత్‌కే చెందిన సౌరభ్ చౌధరీ 577 పాయింట్లతో 18వ ర్యాంక్‌లో, ఆకాశ్ భరద్వాజ్ 577 పాయింట్లతో 19వ ర్యాంక్‌లో నిలిచి ఫైనల్‌కు దూరమయ్యారు.

సన్‌రైజర్స్ పరాజయాల 'హ్యాట్రిక్'



ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ వైభవ్ అరోరా

గత ఐపీఎల్ సీజన్ రన్నరప్ జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్ మళ్లీ ఓడింది. తొలి పోరులో మెరుపు బ్యాటింగ్‌తో భారీ విజయం సాధించిన టీమ్ అదే బ్యాటింగ్ వైఫల్యాలతో వరుసగా మూడో పరాజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. 2024 ఫైనలిస్ట్‌ల మధ్య జరిగిన సమరంలో చివరకు కోల్‌కతా నైట్‌రైడర్స్‌దే పైచేయి అయింది. సొంత మైదానంలో ముందుగా బ్యాటింగ్‌లో చెలరేగి భారీ స్కోరు సాధించిన కేకేఆర్ ఆపై చక్కటి బౌలింగ్‌తో రైజర్స్‌ను నిలువరించింది. ఛేదనలో 9 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన హైదరాబాద్ ఆపై కోలుకోలేకపోయింది.

వరుసగా మూడో మ్యాచ్‌లో ఓడిన హైదరాబాద్

- 80 పరుగులతో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఘనవిజయం
- వెంకటేశ్ అయ్యర్, రఘువంశీ అర్ధ సెంచరీలు
- బంతితో మెరిసిన వైభవ్, వరుణ్

కోల్‌కతా: మూడు రోజుల క్రితం ముంబై చేతిలో చిత్తుగా ఓడి పట్టికలో చివరి స్థానానికి పడిపోయిన కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) వెంటనే భారీ విజయాన్ని అందుకుంది. ఈడెన్ గార్డెన్స్‌లో గురువారం జరిగిన పోరులో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా 80 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (29 బంతుల్లో 60; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), అంగ్‌క్రిష్ రఘువంశీ (32 బంతుల్లో 50; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేయగా... కెప్టెన్ అజింక్య రహానే (27 బంతుల్లో 38; 1 ఫోర్, 4 సిక్స్‌లు), రింకూ సింగ్ (17 బంతుల్లో 32 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. రఘువంశీ, రహానే మూడో వికెట్‌కు 51 బంతుల్లోనే 81 పరుగులు జోడించగా... వెంకటేశ్, రింకూ ఐదో వికెట్‌కు 41 బంతుల్లోనే 91 పరుగులు జత చేయడం విశేషం. అనంతరం రైజర్స్ 16.4 ఓవర్లలో 120 పరుగులకే కుప్పకూలింది. హెన్రిచ్ క్లాసెన్ (21 బంతుల్లో 33; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా... 20 బంతులు మిగిలి ఉండగానే సన్‌రైజర్స్ ఆట ముగిసింది.

కీలక భాగస్వామ్యాలు...

నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్ మూడు భిన్న దశల్లో సాగింది. ఓపెనర్లు డికాక్ (1), నరైన్ (7) విఫలం కావడంతో 16 పరుగులకే జట్టు 2 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో రహానే, రఘువంశీ కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు కొన్ని చక్కటి షాట్లు ఆడటంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 53 పరుగులకు చేరింది. అన్సారీ ఓవర్లో రఘువంశీ వరుసగా సిక్స్, ఫోర్ కొట్టిన తర్వాత అదే ఓవర్లో రహానే వెనుదిరిగాడు. 43 పరుగుల వద్ద నితీశ్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన రఘువంశీ 30 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఆ వెంటనే అతను అవుటయ్యాడు. ఇక్కడ కేకేఆర్ బ్యాటింగ్ కొద్దిసేపు తడబడింది. వరుసగా 18 బంతుల పాటు బౌండరీ రాలేదు. 15 ఓవర్లలో జట్టు స్కోరు 122/4. సన్‌రైజర్స్ పట్టు బిగిస్తున్నట్లు కనిపించిన దశలో ఆఖరి 5 ఓవర్లలో కోల్‌కతా ఆటను మార్చేసింది. వెంకటేశ్, రింకూ ఒకరితో మరొకరు పోటీ పడి పరుగులు సాధించారు. హర్షల్ ఓవర్లో రింకూ వరుసగా 3 ఫోర్లు కొట్టగా, సిమర్జిత్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 17 పరుగులు వచ్చాయి. కమిన్స్ వేసిన 19వ ఓవర్లో వెంకటేశ్ వరుస బంతుల్లో 4, 6, 4, 4తో పండగ చేసుకున్నాడు. 25 బంతుల్లోనే అతని హాఫ్ సెంచరీని అందుకున్నాడు. ఆఖరి 5 ఓవర్లలో జట్టు 78 పరుగులు సాధించింది.



వెంకటేశ్ అయ్యర్


టపటపా...

ఛేదనలో రైజర్స్ ఇన్నింగ్స్ పేలవంగా మొదలైంది. తొలి 13 బంతుల్లోనే హెడ్ (4), అభిషేక్ శర్మ (2), ఇషాన్ కిషన్ (2) వెనుదిరిగారు. ఆ తర్వాత నితీశ్ కుమార్ రెడ్డి (15 బంతుల్లో 19; 2 ఫోర్లు, 1 సిక్స్) కూడా పేలవ షాట్ ఆడి అవుట్ కాగా, కమిందు మెండిస్ (20 బంతుల్లో 27; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఎక్కువసేపు నిలవలేదు. క్లాసెన్ కొద్దిసేపు పోరాడినా అది ఏమాత్రం సరిపోలేదు.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) అన్సారీ (బి) కమిన్స్ 1; నరైన్ (సి) క్లాసెన్ (బి) షమీ 7; రహానే (సి) క్లాసెన్ (బి) అన్సారీ 38; రఘువంశీ (సి) హర్షల్ (బి) మెండిస్ 50; వెంకటేశ్ (సి) అనికేత్ (బి) హర్షల్ 60; రింకూ సింగ్ (నాటౌట్) 32; రసెల్ (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 200. వికెట్ల పతనం: 1–14, 2–16, 3–97, 4–106, 5–197, 6–200. బౌలింగ్: షమీ 4–0–29–1, కమిన్స్ 4–0–44–1, సిమర్జీత్ సింగ్ 4–0–47–0, జీషాన్ అన్సారీ 3–0–25–1, హర్షల్ 4–0–43–1, కమిందు మెండిస్ 1–0–4–1

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి) రాణా (బి) వైభవ్ అరోరా 4; అభిషేక్ (సి) వెంకటేశ్ (బి) రాణా 2; ఇషాన్ కిషన్ (సి) రహానే (బి) వైభవ్ అరోరా 2; నితీశ్ రెడ్డి (సి) నరైన్ (బి) రసెల్ 19; కమిందు (సి) (సబ్) అనుకూల్ (బి) నరైన్ 27; క్లాసెన్ (సి) మొయిన్ అలీ (బి) వైభవ్ అరోరా 33; అనికేత్ (సి) వెంకటేశ్ (బి) వరుణ్ 6; కమిన్స్ (సి) రాణా (బి) వరుణ్ 14; హర్షల్ (సి అండ్ బి) రసెల్ 3, సిమర్జీత్ (బి) వరుణ్ 0; షమీ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (16.4 ఓవర్లలో ఆలౌట్) 120. వికెట్ల పతనం: 1–4, 2–9, 3–9, 4–44, 5–66, 6–75, 7–112, 8–114, 9–114, 10–120. బౌలింగ్: వైభవ్ అరోరా 4–1–29–3, హర్షిత్ రాణా 3–0–15–1, వరుణ్ చక్రవర్తి 4–0–22–3, ఆంద్రీ రసెల్ 1.4–0–21–2, నరైన్ 4–0–30–1.



నితీశ్ రెడ్డి

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
పంజాబ్	2	2	0	4	1.485
ఢిల్లీ	2	2	0	4	1.320
బెంగళూరు	3	2	1	4	1.149
గుజరాత్	3	2	1	4	0.807
కోల్‌కతా	4	2	2	4	0.070
ముంబై	3	1	2	2	0.309
లక్నో	3	1	2	2	-0.150
చెన్నై	3	1	2	2	-0.771
రాజస్తాన్	3	1	2	2	-1.112
హైదరాబాద్	4	1	3	2	-1.612

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో X ముంబై
వేదిక: లక్నో
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా



"'28 డిగ్రీ సెల్సియస్' కథను అనిల్ చెప్పినప్పుడు ఇందులోని థ్రిల్లింగ్ పాయింట్ నచ్చి, అంగీకరించాను. ఈ మూవీని ఒప్పుకున్నప్పుడు (2017) యూనిట్‌లో నేనొక్కడినే కాస్త అనుభవం ఉన్న ఆర్టిస్టుని. మిగతా అందరూ కొత్తవారే. ఈ సినిమా ఇద్దరు స్నేహితుల కల (దర్శకుడు అనిల్ విశ్వనాథ్, నిర్మాత సాయి అభిషేక్‌లను ఉద్దేశించి). కోవిడ్ పరిస్థితుల వల్ల ఈ సినిమా అప్పట్లో రిలీజ్ కాలేదు. నిర్మాత వంశీ నందిపాటిగారు '28 డిగ్రీ సెల్సియస్'ని చూసి, థియేటర్స్‌లో రిలీజ్ చేయడానికి ముందుకొచ్చారు" అని నవీన్ చంద్ర అన్నారు. నవీన్ చంద్ర, షాలినీ వడ్నికట్టి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం '28 డిగ్రీ సెల్సియస్'. సాయి అభిషేక్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో నవీన్ చంద్ర మాట్లాడుతూ– "మెడికల్ స్టూడెంట్స్ అయిన కార్తీక్ (నవీన్ చంద్ర పాత్ర), అంజలి (షాలిని పాత్ర) ప్రేమించి, పెళ్లి చేసుకుని డాక్టర్స్‌గా సెటిల్ అవుతారు. అయితే అంజలికి అనారోగ్య సమస్య వల్ల ఆమెను 28 డిగ్రీ సెల్సియస్ టెంపరేచర్‌లోనే ఉంచి, జాగ్రత్తగా చూసుకోవాలి. ఈ సమస్యను కార్తీక్, అంజలి ఎలా అధిగమించారు? అన్నదే ఈ చిత్రకథ. మనకు ఇష్టమైనవారికి కష్టం వస్తే జాగ్రత్తగా చూసుకుంటాం. ఒకవేళ కష్టమైనా ఇష్టంగానే అనిపిస్తుంది. ఇదీ ఈ సినిమా థీమ్" అన్నారు. ఇంకా మాట్లాడుతూ– "ఒక అవకాశం వచ్చినప్పుడు మనం వద్దనుకుంటే ఆ అవకాశాన్ని అందిపుచ్చుకునేవారు ఇప్పుడు చాలామంది ఉన్నారు. యాక్టర్‌గా స్ట్రగుల్ అవుతున్నాను. లైవ్లీహుడ్ కోసం కొన్ని పాత్రలు చేస్తున్నాను. కానీ నటుడిగా నెక్ట్స్ లెవల్‌కు వెళ్లేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నాను. ఇక ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు ఇండస్ట్రీపై ప్రభావం చూపిస్తున్నాయి. ఓటీటీల విషయంలో దర్శక-నిర్మాతలు కొందరు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఓటీటీల ప్రీ అప్రూవల్‌కు నోచుకోక క్యాన్సిల్ అయిన సినిమాలు కూడా ఉన్నాయి. ఆ సంగతలా ఉంచితే... ఓటీటీలో నేను చేస్తున్న సినిమాలకు మంచి రెస్పాన్స్ వస్తున్నందుకు సంతోషంగా ఉంది. నేను సోలోగా 'షో టైమ్, ఎలెవన్' సినిమాలు చేశాను. రవితేజగారి 'మాస్ జాతర'లో ఓ మంచి పాత్ర చేస్తున్నాను. నా 'ఇన్‌స్పెక్టర్ రిషి' వెబ్ సిరీస్ అందర్నీ ఆకట్టుకునేలా రూపొందుతోంది. ఇక 'గేమ్ చేంజర్' సినిమా వల్ల సూర్యగారి 'రెట్రో' మూవీలో విలన్‌గా నటించే అవకాశాన్ని కోల్పోయాను" అని నవీన్ చంద్ర తెలిపారు.

ఇద్దరు స్నేహితుల కలే ఈ సినిమా
- నవీన్ చంద్ర

జాక్ ఐడియానే అద్భుతంగా ఉంటుంది
- సిద్ధు జొన్నలగడ్డ

"'జాక్' మూవీ ఐడియానే అద్భుతంగా ఉంటుంది. భాస్కర్‌గారు ఈ సినిమా కోసం రెండేళ్లు పని చేశారు. ఆయన ఐడియా నుంచి వచ్చిన సీక్వెన్స్ ఇంకా బాగుంటాయి. రొటీన్ యాక్షన్ సినిమాలా కాకుండా చాలా రేసీగా ఉంటుంది. జాక్ అనేది నిజంగానే క్రాక్ లాంటి పాత్ర. చాలా ట్విస్టులు ఉంటాయి. స్క్రీన్‌ప్లే అద్భుతంగా ఉంటుంది. మా చిత్రం తప్పకుండా అందర్నీ అలరించేలా ఉంటుంది" అన్నారు సిద్ధు జొన్నలగడ్డ. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ, వైష్ణవీ చైతన్య జంటగా నటించిన చిత్రం 'జాక్'. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. గురువారం నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో 'బొమ్మరిల్లు' భాస్కర్ మాట్లాడుతూ– "సిద్ధు లాంటి నటుడితో పని చేయడం ఏ దర్శకుడికైనా చాలా సులభం. 'జాక్' థీమ్ మాత్రమే నేను రాశాను. క్యారెక్టరైజేషన్, డైలాగ్ మాడ్యులేషన్‌లో తనకి ఫ్రీ హ్యాండ్ ఇచ్చాను. నన్ను నమ్మి ఈ సినిమాకి వచ్చే ఫ్యామిలీ ఆడియన్స్‌ను నిరాశపరచను. వైష్ణవి కళ్లతోనే నటించేశారు" అన్నారు. వైష్ణవీ చైతన్య మాట్లాడుతూ– "భాస్కర్‌గారి దర్శకత్వంలో సినిమా చేసే అవకాశం రావడం నా అదృష్టం. సిద్ధు లాంటి గొప్ప నటుడితో నటించడం హ్యాపీగా ఉంది. మా మూవీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను" అని తెలిపారు. బీవీఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ– "ట్రైలర్ అందరికీ నచ్చిందని భావిస్తున్నా. సినిమా కూడా ఆకట్టుకునేలా ఉంటుంది... అందరూ చూడండి" అని చెప్పారు.



వైష్ణవీ చైతన్య, సిద్ధు జొన్నలగడ్డ

డేట్ ఫిక్స్



కల్యాణ్ రామ్

కల్యాణ్ రామ్ హీరోగా నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' విడుదల తేదీ ఫిక్స్ అయింది. ఈ నెల 18న ఈ సినిమాని రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన ఈ మూవీలో విజయశాంతి కీలక పాత్రలో, సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటించారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈ చిత్రాన్ని ఈ నెల 18న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, కల్యాణ్ రామ్ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. "యాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ఇంతకు ముందెన్నడూ చూడని మాస్, యాక్షన్ లుక్‌లో కల్యాణ్ రామ్ కనిపిస్తారు. వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని ఈ రిలీజ్ డేట్ ఫిక్స్ చేశాం. ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తుంది" అని చిత్రబృందం పేర్కొంది.

ఎలాగా అయిపోయానే...



సుహాస్, మాళవికా మనోజ్

సుహాస్, మాళవికా మనోజ్ జంటగా నటించిన చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. రామ్ గోధల దర్శకత్వంలో హరీష్ నల్ల నిర్మించారు. ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ఈ చిత్రాన్ని ఈ వేసవిలో విడుదల చేయనుంది. కాగా 'ఎలా గుండే వాడ్నే... ఎలాగా అయిపోయానే...' అంటూ సాగే ఈ చిత్రం టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను గురువారం విడుదల చేశారు. చిత్రసంగీత దర్శకుడు రథన్ స్వరాలందించిన ఈ పాటకు శ్రీహర్ష ఈమని సాహిత్యం అందించగా శరత్ సంతోష్ ఆలపించారు. మొయిన్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. "యూత్‌ఫుల్‌గా సాగే ఈ పాటలో హీరో, హీరోయిన్ ఎనర్జీ ప్లస్ అయ్యే విధంగా ఉంటుంది. ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మూవీ ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది" అని హరీష్ నల్ల పేర్కొన్నారు. "ఈ సినిమాలోని ప్రతి పాత్ర బాగుంటుంది" అని రామ్ గోధల అన్నారు.

జలియన్‌వాలా బాగ్ నేపథ్యంలో...



అక్షయ్ కుమార్, అనన్యా పాండే

అక్షయ్ కుమార్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కేసరి చాప్టర్ 2'. 'అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ జలియన్‌వాలా బాగ్' అనేది ఉపశీర్షిక. కరణ్ సింగ్ త్యాగి దర్శకత్వం వహించిన ఈ మూవీలో మాధవన్, అనన్యా పాండే, రెజీనా కీలక పాత్రలు పోషించారు. కరణ్ జోహార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అత్యంత దురదృష్టకర, హేయమైన సంఘటనగా నిలిచిపోయిన ఘటనల్లో జలియన్‌వాలా బాగ్ ఉదంతం ఒకటి. 1919 ఏప్రిల్ 13న అమృత్‌సర్‌లోని జలియన్‌వాలా బాగ్‌లో జరిగిన కాల్పులు, తొక్కిసలాటలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందింది. ట్రైలర్‌లో అక్షయ్, మాధవన్‌ల మధ్య వచ్చే డైలాగులు సినిమాపై ఆసక్తి పెంచేలా ఉన్నాయి.

సీక్వెల్ ఉంటుందని అప్పుడు ఊహించలేదు
- హెబ్బా పటేల్



"'కుమారి 21ఎఫ్' సినిమా నాకో ఫేమ్ తీసుకొస్తే, 'ఓదెల రైల్వేస్టేషన్' (2022) నటిగా ఓ క్రెడిబిలిటీ తీసుకొచ్చింది. నేను విభిన్నమైన పాత్రలు చేయగలనన్న నమ్మకాన్ని కల్పించింది" అని హెబ్బా పటేల్ అన్నారు. తమన్నా ప్రధాన పాత్రలో, హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహా ఇతర ముఖ్య పాత్రల్లో నటించిన సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీ 'ఓదెల 2'. దర్శకుడు సంపత్ నంది సూపర్ విజన్‌లో అశోక్ తేజ దర్శకత్వం వహించారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ పతాకాలపై డి. మధు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో హెబ్బా పటేల్ మాట్లాడుతూ– "'ఓదెల రైల్వేస్టేషన్' సినిమాలోని మెయిన్ లీడ్ రోల్ రాధ పాత్రకు సంపత్ నందిగారు నన్ను అప్రోచ్ అయినప్పుడు నాకు షాకింగ్‌గా అనిపించింది. ఈ పాత్రకు నేను సరిపోనేమో అనుకుని, ఇదే విషయం ఆయనకూ చెప్పాను. కానీ ఓసారి ప్రయత్నించమని ప్రోత్సహించారు. అలా నేను రాధ పాత్ర చేశాను. నటిగా నాకు మంచి పేరు వచ్చింది. ఇక ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ఓదెల 2' ఉంటుందని నేనప్పుడు ఊహించలేదు. తొలి భాగం మర్డర్ మిస్టరీగా ఉంటుంది. రెండో భాగం సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా ఉంటుంది. ఈ సీక్వెల్‌లో తమన్నాగారు మెయిన్ లీడ్ రోల్ చేశారు. కథ రీత్యా తొలి భాగంలో నేను తిరుపతిని చంపి జైలుకు వెళ్లాను. సో... నా సీన్స్ జైల్లో ఉన్నట్లుగా ఉంటాయి. అయితే ఈ మూవీలో నాకు సోదరిగా తమన్నా కనిపిస్తారు. ఈ సినిమాలో నా స్క్రీన్ టైమ్ తక్కువే అయినా... కథలో నా క్యారెక్టర్ ఇంపాక్ట్ బలంగా ఉంటుంది. ఏమో... 'ఓదెల 3' ఉంటే... అందులో నా పాత్ర ఇంకా బలంగా ఉండొచ్చేమో. ఇక దర్శకుడు శ్రీనివాస్ రాగతో ఓ హారర్ ఫిల్మ్, కల్యాణ్ గోగనతో ఓ క్రైమ్ థ్రిల్లర్ మూవీ చేశాను. అవి రిలీజ్‌కు రెడీ అవుతున్నాయి. ఓ కన్నడ చిత్రం కమిట్ అయ్యాను. వచ్చే నెల షూటింగ్ స్టార్ట్ అవుతుంది" అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ – "నటిగా ఇండస్ట్రీలో పదేళ్ల కెరీర్ పూర్తయింది. ఎత్తుపల్లాలు చూశాను. సక్సెస్ కావొచ్చు... ఫెయిల్యూర్ కావొచ్చు... ఏదీ ఫైనల్ కాదని తెలుసుకున్నాను. మరో పదేళ్లు ఇండస్ట్రీలో కొనసాగాలని ఉంది" చెప్పారు.

శివాజ్ఞ



వెంకట్ గోవాడ

సీనియర్ నటుడు భానుచందర్ అతిథి పాత్రలో, వెంకట్ గోవాడ ఓ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'శివాజ్ఞ'. శివ పరమాత్మ జ్ఞాన మందిరం ట్రస్ట్ ఆధ్వర్యంలో శివపరమాత్మ క్రియేషన్స్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదల కానుంది. "మనసుకి శాంతి, ఆత్మకు శక్తి నింపే భక్తి రసాత్మక చిత్రం 'శివాజ్ఞ'. ఆధ్యాత్మికతకు కుటుంబ కథాంశాన్ని జోడించి, ఈ చిత్రాన్ని రూపొందించాం. ఒక మంచి చిత్రాన్ని అందరికీ చేరవ చేయాలని విడుదలైన తొలి రోజున ఆంధ్ర, తెలంగాణలోని 108 థియేటర్లలో నాలుగు ఆటలూ ఉచితంగా ప్రదర్శిస్తున్నాం. ప్రేక్షకులకు ఓ సరికొత్త ఆధ్యాత్మిక అనుభూతినిచ్చే చిత్రం ఇది" అని చిత్రబృందం పేర్కొంది.

సాక్షి బిజినెస్
శుక్రవారం
4-4-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
322	82
76,295	23,250

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,640	▽ 961
డోజోన్స్	41,047	▽ 1,178
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,475	▽ 134
డాక్స్	21,717	▽ 149
షాంఘై	3,342	▽ 9
నికాయ్	35,736	▽ 990

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

	విలువ	మార్పు
బంగారం (99.9 స్వచ్ఛత)	90,345	▽ 651
బంగారం (99.5 స్వచ్ఛత)	89,983	▽ 649
వెండి (కిలో)	95,957	▽ 3,579


ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధారణేతర	83.06	87.28
£	బ్రిటన్ పౌండ్	ధారణేతర	109.94	114.85
€	యూరో	ధారణేతర	92.52	97.02
¥	జపాన్ ఎన్ (100)	ధారణేతర	47.00	69.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ధారణేతర	52.03	56.89
S$	సింగపూర్ డాలర్	ధారణేతర	61.71	66.39
SAR	సౌదీ రియాల్	ధారణేతర	21.88	23.44
UAE D	యూఏఈ దిర్హామ్	ధారణేతర	22.37	24.15
¥	చైనా యువాన్	ధారణేతర	10.86	12.68

ప్రపంచానికి.. ట్రంప్ టారిఫ్ షాక్!

వాణిజ్య యుద్ధాలకు ఆజ్యం
- నెమ్మదించనున్న ప్రపంచ జీడీపీ వృద్ధి
- సరఫరా వ్యవస్థలు, వాణిజ్యానికి అంతరాయాలు
- మారనున్న గ్లోబల్ ఎకానమీ ముఖచిత్రం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై ప్రకటించిన టారిఫ్‌ల యుద్ధం .. అంతర్జాతీయంగా వాణిజ్యం, సరఫరా వ్యవస్థల ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేయనుంది. ఇకపై అమెరికా భవిష్యత్ వాణిజ్య విధానాలన్నీ, చైనా ఆర్థిక ప్రాబల్యానికి అడ్డుకట్ట వేయడం, దేశీయంగా పరిశ్రమలను పటిష్టపర్చుకోవడం, సరఫరా వ్యవస్థలను మెరుగుపర్చుకోవడం లాంటి అంశాలపైనే ఆధారపడి ఉంటాయని అంచనాలు నెలకొన్నాయి. రాబోయే రోజుల్లో ఒకవేళ కొన్ని రంగాల విషయంలో టారిఫ్‌లను సడలించినప్పటికీ కీలక పరిశ్రమలపై మాత్రం సుంకాల మోత యథాప్రకారం కొనసాగవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ట్రంప్ టారిఫ్‌లతో ఇప్పటికే ప్రపంచ ఎకానమీలో పలు పరిణామాలు చోటు చేసుకున్నాయి. రాబోయే రోజుల్లోనూ దేశాలు, పరిశ్రమలు, అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితులను బట్టి ప్రపంచంపై టారిఫ్‌ల ప్రభావాలు రకరకాలుగా ఉండబోతున్నాయి.



ట్రంప్ గత హయాంలో చైనాపై విధించిన టారిఫ్‌లు వాణిజ్య యుద్ధానికి దారి తీశాయి. అంతర్జాతీయంగా వాణిజ్యానికి భారీగా అవరోధాలు ఏర్పడ్డాయి. సుంకాల భారాన్ని తప్పించుకునేందుకు చాలా మటుకు కంపెనీలు చైనా నుంచి తయారీ కార్యకలాపాలను వేరే దేశాలకు మళ్లించాయి. దీంతో భారత్, వియత్నాం, మెక్సికోలాంటివి ప్రత్యామ్నాయ తయారీ హబ్‌లుగా మారాయి.

సరఫరా వ్యవస్థ పునర్‌వ్యవస్థీకరణ ..

టారిఫ్‌ల ధాటితో ప్రపంచ దేశాలు .. అమెరికా, చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, ఉత్పత్తులు, సేవల సరఫరా కోసం ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టే ధోరణి మరింత వేగవంతమైంది. ఫలితంగా ఆగ్నేయాసియా, ఉత్తర అమెరికా లాంటి ప్రాంతాల్లో పెట్టుబడులు మరింత పెరుగుతున్నాయి. ఈ మార్పులకు అలవాటుపడే వరకు కంపెనీలు కాస్త వ్యయాల భారాన్ని మోయక తప్పని పరిస్థితి ఉంటోంది.

ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు..

సుంకాల వల్ల సాధారణంగా దిగుమతి చేసుకున్న ఉత్పత్తుల రేటు పెరుగుతుంది. దీనితో ద్రవ్యోల్బణమూ పెరుగుతుంది. కంపెనీలు సుంకాల భారాన్ని కొంత తాము భరించి, కొంత బదలాయించినా ఆ ప్రభావం వ్యాపారాల మీద, వినియోగదారుల మీద పడుతుంది.

ప్రతీకార టారిఫ్‌లు ..

అమెరికా టారిఫ్‌ల బారిన పడ్డ యూరోపియన్ యూనియన్, చైనా వంటి దేశాలు.. ప్రతీకార సుంకాలకు శ్రీకారం చుట్టాయి. అమెరికా ఎగుమతులపై ఇప్పటికే దీని ప్రభావం కనిపించడం మొదలైంది. ముఖ్యంగా వ్యవసాయం, తయారీ, టెక్నాలజీలాంటి రంగాలపై ఇది ఎక్కువగా ఉంటోంది.

పెట్టుబడి ధోరణుల్లో మార్పులు..

సుంకాల భారం ఉండని ప్రాంతాలకు వ్యాపార సంస్థలు తమ పెట్టుబడులు మళ్లిస్తున్నాయి. చైనాలాంటి దేశాలు ఎగుమతులకు కొత్త మార్కెట్లను అన్వేషిస్తున్నాయి. ప్రాంతీయంగా వాణిజ్య బంధాలను బలపర్చుకుంటున్నాయి.

గ్లోబల్ వృద్ధిపై ప్రభావం..

టారిఫ్‌లపరమైన అనిశ్చితి అనేది ప్రపంచ ఆర్థిక వృద్ధి నెమ్మదించడానికి కారణమవుతోంది. వాణిజ్య ఉద్రిక్తతలు సుదీర్ఘకాలం కొనసాగడం వల్ల పెట్టుబడులతో పాటు వ్యాపార విశ్వాసం తగ్గిపోయి, ప్రపంచ జీడీపీ వృద్ధి మరింత మందగించవచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి, (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్ అంచనా వేస్తున్నాయి.

భవిష్యత్తులో అమెరికా పాలసీ ఎలా మారొచ్చంటే..

చైనాపై కఠిన వైఖరి కొనసాగొచ్చు..

భవిష్యత్తులో అమెరికాలో ప్రభుత్వం మారినా కూడా చైనాపై టారిఫ్‌లను పూర్తిగా వెనక్కి తీసుకోకపోవచ్చు. మేధోహక్కులు, జాతీయ భద్రత, వాణిజ్య అసమానతల్లాంటి అంశాలపై ఆందోళన వల్ల ఇరు దేశాల సంబంధాల్లో టారిఫ్‌లు ఇకపైనా కీలకాస్త్రంగా కొనసాగే అవకాశం ఉంది.

మిత్రదేశాలకు మరింత చేరువ ..

ముఖ్యమైన ఉత్పత్తుల కోసం ప్రత్యర్థి దేశాలపై ఆధారపడటం కాకుండా అమెరికా తన మిత్ర దేశాలతో ఆర్థిక సంబంధాలను మరింతగా పటిష్టపర్చుకోవడంపై దృష్టి పెట్టొచ్చు. యూరప్, భారత్, దక్షిణ కొరియాలాంటి దేశాలపై టారిఫ్‌లు తగ్గించడం, కొత్త వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం వంటి పరిణామాలకు అవకాశం ఉంది.

హరిత పరిశ్రమలపై సుంకాలు..

దేశీయంగా పరిశ్రమలకు మద్దతునిచ్చేందుకు, చైనా ప్రభుత్వ దన్ను ఉన్న కంపెనీలతో పోటీపడేందుకు స్వచ్ఛ ఇంధనం, సెమీకండక్టర్లు, ఇతరత్రా పర్యావరణహిత రంగాలపై అమెరికా కొత్తగా టారిఫ్‌లు విధించవచ్చు.

ఈయూపై మరిన్ని టారిఫ్‌లు..

ఎలక్ట్రిక్ వాహనాల్లాంటి వాటి మీద సబ్సిడీలపై వివాదాల కారణంగా యూరోపియన్ యూనియన్‌లోని మిత్రదేశాలపైనా కొత్త టారిఫ్‌లు పడొచ్చు. దీంతో అంతర్జాతీయంగా వాణిజ్య సంబంధాలు మరింత సంక్లిష్టంగా మారొచ్చు.

ద్వైపాక్షిక, ప్రాంతీయ ఒప్పందాలు

అన్ని దేశాలతో విస్తృతస్థాయి వాణిజ్య ఒప్పందాలకు బదులుగా అమెరికా.. ఏవో కొన్ని దేశాలతోను, ప్రాంతీయంగాను వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడంపై మొగ్గుచూపొచ్చు. ఆగ్నేయాసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలు ఈ జాబితాలో ఉండొచ్చు.

భారత్‌పై ప్రభావం స్వల్పమే...



కనీసం 10 శాతం సుంకాలకు అదనంగా 27 శాతం విధించడంతో.. టారిఫ్‌ల పరంగా భారత్ మధ్యస్థ స్థితిలో ఉంది. నికరంగా చూస్తే అమెరికా మార్కెట్‌కు సంబంధించి భారత ఎగుమతుల పోటీతత్వంపై తక్కువ ప్రభావమే పడనున్నట్లు తెలుస్తోంది. ఎగుమతుల సామర్థ్యాన్ని, విలువ జోడింపును పెంచేందుకు, టారిఫ్‌ల ప్రభావాన్ని అధిగమించేందుకు పరిశ్రమ సమిష్టి కృషి చేయాల్సి ఉంటుంది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ద్వారా అమెరికాతో సహకారాన్ని ఇతోధికం చేసుకోవచ్చు.

– సంజయ్ నాయర్, అసోచామ్ ప్రెసిడెంట్

జీడీపీపై 0.1 శాతం ఎఫెక్ట్



భారత పరిశ్రమలకు ఉన్న బలమైన పోటీతత్వం అమెరికా టారిఫ్‌ల ప్రభావాన్ని సమతుల్యం చేస్తుంది. స్వల్పకాలంలో జీడీపీపై 0.1 శాతం ప్రభావం పడొచ్చు, మధ్యకాలంలో విధానాలు పూర్తిగా అమల్లోకి వచ్చే నాటికి ఈ లోటును అధిగమించగలం"

– హేమంత్ జైన్, పీహెచ్‌డీసీసీఐ ప్రెసిడెంట్

ఎగుమతులకు సవాళ్లు...

టారిఫ్‌ల పెరుగుదలతో భారత ఎగుమతుల రంగం సవాళ్లను ఎదుర్కోవాల్సి రావొచ్చు. అమెరికాకు ఎగుమతుల ఎక్స్‌పోజర్ ఎక్కువగా ఉన్న టెక్స్‌టైల్స్, ఫార్మాస్యూటికల్స్, ఆటోమోటివ్ విడిభాగాలు స్వల్పకాలంలో డిమాండ్ క్షీణతను ఎదుర్కోవచ్చు. ఇది ఉత్పత్తి, ఉపాధిపై ప్రభావం చూపిస్తుంది"

– బజాజ్ బ్రోకింగ్ రీసెర్చ్

పోటీతత్వం బలపడుతుంది...



అమెరికా విధించిన 27% టారిఫ్‌లు భారత ఎగుమతులకు అవరోధాలే అయినప్పటికీ తయారీలో బలంగా ఉన్న ఇతర ఆసియా దేశాలతో పోల్చితే మనపై టారిఫ్‌లు తక్కువగా ఉండడం వల్ల భారత్ ఎగుమతుల పోటీతత్వం నిలబడుతుంది.

– పరితోష్ ప్రజాపతి, జీఎక్స్ గ్రూప్ సీఈవో

ద్వైపాక్షిక ఒప్పందమే మేలు..

స్వల్పకాలంలో అమెరికాకు భారత్ నుంచి 10 బిలియన్ డాలర్ల రత్నాభరణాల ఎగుమతులకు సవాళ్లు ఎదురుకానున్నాయి. భారత్–అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం దిశగా పురోగతికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– రత్నాభరణాల ఎగుమతుల ప్రోత్సాహక మండలి

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
టారిఫ్‌ల పెంపు అమెరికా సెల్ఫ్‌గోల్ | సుంకాల ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నాం



ట్రేడ్ వార్.. మార్కెట్ టెర్రర్

- ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకటన
- కుప్పకూలిన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు
- 3% క్షీణించిన ఆసియా మార్కెట్లు
- అరశాతం నష్టపోయిన దలాల్ స్ట్రీట్

ముంబై: అమెరికాతో వాణిజ్య భాగస్వాములుగా ఉన్న 60 దేశాలపై డొనాల్డ్ ట్రంప్ భారీ సుంకాల విధింపుతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు వణికిపోయాయి. ఏ దేశంపై ఎంత టారిఫ్‌ల విధింపు ఉంటుందో అని లెక్కలతో సహా ట్రంప్ వివరణతో ఆసియా నుంచి అమెరికా వరకు ఈక్విటీ మార్కెట్లు 'బేర్'మన్నాయి. ప్రతీకార సుంకాలతో వాణిజ్య యుద్ధం తీవ్రతరమై అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుకుంటాయనే భయాలు అధికమయ్యాయి. ప్రపంచ దేశాలపై ట్రంప్ వాణిజ్య యుద్ధ ప్రభావం ఈక్విటీ మార్కెట్‌ను కుదిపేసింది.

- ఆసియాలో జపాన్ నికాయ్ 3% క్షీణించింది. హాంగ్‌కాంగ్ సూచీ 1.50%, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా ఇండెక్స్‌లు 1%, సింగపూర్ సూచీ అరశాతం చొప్పున నష్టపోయాయి.
- యూరోపియన్ యూనియన్‌పై 20% సుంకాల విధింపుతో యూరప్ మార్కెట్లు సైతం కుప్పకూలాయి. ఫ్రాన్స్ ఇండెక్స్ సీఏసీ 3.50%, జర్మనీ సూచీ డాక్స్ 3%, బ్రిటన్ ఇండెక్స్ ఎఫ్‌టీఎస్ఈ 1.50% నష్టపోయాయి.

దలాల్ స్ట్రీట్ అరశాతం డౌన్...

భారత ఈక్విటీ మార్కెట్ అరశాతం నష్టపోయింది. ఐటీ, ఆటో షేర్లలో అమ్మకాలు ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్ 322 పాయింట్లు నష్టపోయి 76,295 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 82 పాయింట్లు పతనమై 23,250 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ ప్రారంభమైన క్షణాల్లో సెన్సెక్స్ 809 పాయింట్లు క్షీణించి 75,808 వద్ద, నిఫ్టీ 187 పతనమై 23,145 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. ఫార్మాతో పాటు కొన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఆరంభ నష్టాల నుంచి కోలుకోగలిగాయి.

- ప్రతీకార సుంకాల నుంచి ఫార్మా ఉత్పత్తులను మినహాయించడంతో ఫార్మా షేర్లకు డిమాండ్ నెలకొంది. జుబిలెంట్ ఫార్మోవా 7%, ఇప్కా ల్యాబ్స్ 5%, లుపిన్ 4%, సన్‌ఫార్మా 3% లాభపడ్డాయి. సిప్లా 2.50%, దివీస్ ల్యాబ్స్, గ్లెన్‌మార్క్ ఫార్మా 2%, అరబిందో ఫార్మా 1.50% పెరిగాయి.
- అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లిపోవచ్చనే భయాలతో ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. పెర్సిస్టెంట్ 10%, కోఫోర్జ్, కేపీఐటీ 8%, టీసీఎస్, టెక్ మహీంద్రా 4% పతనమయ్యాయి. హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్ 3.50%, విప్రో 3% నష్టపోయాయి.
- ఆరంభ నష్టాలు భర్తీ చేసుకున్న రూపాయి డాలర్ మారకంలో 22 పైసలు పెరిగి 85.30 వద్ద స్థిరపడింది.

వాల్‌స్ట్రీట్ విలవిల



ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకటన ప్రభావం అమెరికా ఈక్విటీ మార్కెట్లనూ వెంటాడింది. ఇప్పటికే ద్రవ్యోల్బణంతో వినిమయం తగ్గిన నేపథ్యంలో తాజా టారిఫ్‌లతో పరిస్థితులు మరింత దిగజారి ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్తున్న భయాలు నెలకొన్నాయి. డోజోన్స్ సూచీ 1,118 పాయింట్లు క్షీణించి 41,047 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 1500 పాయింట్ల పతమైంది. నాస్‌డాక్ 4% ఎస్అండ్‌పీ 3.50 శాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి. యూఎస్ మార్కెట్లో చిన్న కంపెనీల షేర్లకు ప్రాతినిధ్యం వహించే రస్సెల్స్ 2000 ఇండెక్స్ 5% క్షీణించింది. అమెరికా మార్కెట్ క్యాపిటలైజేషన్ 1.65 ట్రిలియన్ డాలర్లు హరించుకుపోయింది.

- ఐఫోన్లకు ప్రధాన సప్లయర్‌గా ఉన్న చైనాపై అమెరికా భారీ సుంకాలు విధించడంతో సప్లయ్ చైన్‌కు అవరోధం ఏర్పడుతుందన్న ఆందోళనలతో యాపిల్ షేర్లు 9 శాతం మేర నష్టాల్లో ట్రేడవుతున్నాయి. షేరు భారీ పతనంతో కంపెనీ విలువ 250 బిలియన్ డాలర్లు పడిపోయింది. 2020 తర్వాత యాపిల్ స్టాక్ ఈ స్థాయిలోపతనం కావడం ఇదే తొలిసారి. వీటితో పాటు అమెజాన్ 6%, ఎన్విడియా 5%, టెస్లా 4.50% గూగుల్ 3%, మెటా 6%, మైక్రోసాఫ్ట్ 2% నష్టపోయాయి.

కమోడిటీలకూ సెగ

- పసిడి, వెండి ధరల పతనం
- చల్లబడిన చమురు ధరలు



పలు దేశాలపై ట్రంప్ తెరతీసిన టారిఫ్‌లతో కమోడిటీలకు సైతం సెగ తగులుతోంది. దీంతో ఇటీవల తళతళ మెరుస్తున్న పసిడి, వెండి ధరలు ఒక్కసారిగా కరగడం మొదలైంది. ముడిచమురు ధరలు సైతం భారీగా చల్లబడ్డాయి. న్యూయార్క్ కామెక్స్‌లో పసిడి ఔన్స్(31.1 గ్రాములు) 40 డాలర్లు(1.3 శాతం) క్షీణించి 3,126 డాలర్లకు చేరింది. ఒకదశలో 3,198 డాలర్ల ఆల్‌టైమ్ గరిష్టాన్ని తాకి, తర్వాత 3,074 డాలర్ల వరకూ పతనమైంది. ఈ బాటలో వెండి మరింత అధికంగా ఔన్స్ 2.66 డాలర్లు(7.7 శాతం) కుప్పకూలింది. 31.9 డాలర్ల వద్ద కదులుతోంది. బ్రెంట్ చమురు బ్యారల్ 6.8% పతనమై 69.8 డాలర్లను తాకింది. న్యూయార్క్‌లో నైమెక్స్ చమురు బ్యారల్ 7%పైగా పడిపోయి 66.65 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ట్రంప్ టారిఫ్‌లతో యూఎస్ జీడీపీపై 2025 రెండో క్వార్టర్(ఏప్రిల్–జూన్)లో 10 శాతం ప్రతికూల ప్రభావం పడే వీలున్నట్లు ఆర్థికవేత్తలు అంచనా వేయడం స్టాక్స్, కమోడిటీలలో భారీ అమ్మకాలకు కారణమైనట్లు విశ్లేషకులు తెలియజేశారు.

కొన్నింటికి మోదం.. కొన్నింటికి ఖేదం

- ఫార్మా, సెమీకండక్టర్, ఇంధనాలకు మినహాయింపులు
- టెక్స్‌టైల్స్, ఫార్మా, ఎలక్ట్రానిక్స్ రంగాలకు సానుకూలం
- పోటీ దేశాలకంటే భారత్‌పై టారిఫ్‌లు తక్కువే
- రత్నాభరణాలు, ఆటోమొబైల్స్, వైద్య పరికరాలపై ప్రభావం
- జీడీపీ అరశాతం వరకు తగ్గిపోవచ్చు
- ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందమే పరిష్కారం: నిపుణులు

న్యూఢిల్లీ/ముంబై: భారత ఎగుమతులపై అమెరికా విధించిన ప్రతీకార సుంకాలు కొన్ని రంగాలపై ప్రతికూల ప్రభావం చూపించనుండగా.. అదే సమయంలో కొన్ని రంగాలకు ఎగుమతి అవకాశాలను విస్తృతం చేయనుంది. ముఖ్యంగా భారత ఫార్మాస్యూటికల్స్, సెమీకండక్టర్లు, ఇంధన ఉత్పత్తులు, అమెరికాలో లభించని కొన్ని రకాల అరుదైన ఖనిజాలకు ట్రంప్ సర్కారు టారిఫ్‌ల నుంచి మినహాయింపు కల్పించింది. మిగిలిన అన్ని ఉత్పత్తులపైనా 27 శాతం అదనపు సుంకాన్ని మోపింది. దీంతో ఆటోమొబైల్ వాహనాలు, వాటి విడిభాగాలు, వైద్య పరికరాలు, రత్నాభరణాల ఎగుమతులపై ఎక్కువ ప్రభావం పడుతుందన్న అంచనాలు నెలకొన్నాయి.


రత్నాభరణాల ఎగుమతులకు ఎదురుదెబ్బ: జీజేఈపీసీ



అమెరికా విధించిన 27 శాతం ప్రతీకార సుంకాలు భారత జెమ్స్ అండ్ జ్యుయలరీ (రత్నాలు, ఆభరణాలు) ఎగుమతులకు పెద్ద ఎదురుదెబ్బగా జెమ్స్ అండ్ జ్యుయలరీ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) పేర్కొంది. అమెరికాకు భారత్ నుంచి ఏటా 10 బిలియన్ డాలర్ల రత్నాభరణాల ఎగుమతులు జరుగుతుండగా, వీటికి సవాళ్లు ఎదురుకానున్నట్లు పేర్కొంది. ''భారత్–అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం దిశగా పురోగతికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. టారిఫ్‌లను అధిగమించేందుకు ఇది కీలకం''అని జీజేఈపీసీ పేర్కొంది. భారత్ నుంచి అమెరికా ఏటా 11.58 బిలియన్ డాలర్ల మేర జెమ్స్, జ్యుయలరీని దిగుమతి చేసుకుంటుంటే.. అదే సమయంలో భారత్‌కు అమెరికా 5.31 బిలియన్ డాలర్ల రత్నాభరణాలను ఎగుమతి చేస్తోంది.

వైద్య పరికరాలకు ప్రతికూలం..

ప్రతీకార టారిఫ్‌లతో మెడికల్ డివైజ్‌ల ఎగుమతులపై ప్రభావం పడనుందని, పరిశ్రమ వృద్ధికి సవాలుగా మారుతుందని ఇండియన్ మెడికల్ డివైజ్ ఇండస్ట్రీ అసోసియేషన్ (ఏఐఎంఈడీ) ఫోరం కోఆర్డినేటర్ రాజీవ్ నాథ్ తెలిపారు.



2023–24లో భారత్ నుంచి అమెరికాకు 714.38 మిలియన్ డాలర్ల విలువైన పరికరాలు ఎగుమతయ్యాయి.

ఫార్మాకు ఊరట



చౌకగా ఔషధాలు అందిస్తున్న భారత ఫార్మాకి ప్రతీకార టారిఫ్‌ల నుంచి ట్రంప్ సర్కార్ మినహాయింపునిచ్చింది. అమెరికాకు భారత ఫార్మా ఎగుమతులు 9 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నాయి. 2022లో అక్కడి ప్రతి పది ప్రిస్క్రిప్షన్లలో నాలుగు ప్రిస్క్రిప్షన్లకు సంబంధించిన ఔషధాలు మన కంపెనీలు సరఫరా చేసినవే.

వాహనాలపై ప్రభావం కొంతే..



ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం వాహన రంగంపై పెద్దగా ఉండకపోవచ్చని ఆటోమొబైల్ సంస్థల సమాఖ్య సియామ్ తెలిపింది. మార్చి 26 నాటి ఆదేశాల ప్రకారం ఇప్పటికే 25 శాతం సుంకాలు అమలవుతుండడాన్ని ప్రస్తావించింది. అమెరికా మార్కెట్లో చెప్పుకోతగ్గ విక్రయాలు కలిగిన టాటా మోటర్స్ అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్‌రోవర్, రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థలకు మాత్రం.. ఎగుమతుల వృద్ధి నెమ్మదించే అవకాశం ఉంది. 2024 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు భారత్ నుంచి ఆటో విడిభాగాల ఎగుమతులు 6.79 బిలియన్ డాలర్లుగా ఉండగా, అక్కడినుంచి దిగుమతులు 1.4 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

జీడీపీ వృద్ధికి నష్టం

ట్రంప్ ప్రతీకార సుంకాలతో భారత జీడీపీ వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అర శాతం తగ్గిపోయి 6%కి పరిమితం కావొచ్చని ఈవై చీఫ్ పాలసీ అడ్వైజర్ డీకే శ్రీవాస్తవ తెలిపారు. అదనపు సుంకాలు విధించడం వల్ల భారత జీడీపీపై గరిష్టంగా 35–40 బేసిస్ పాయింట్ల మేర ప్రభావం పడుతుందని స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ ఇండియా హెడ్ అనుభూతి సహాయ్ అభిప్రాయపడ్డారు.

టెక్స్‌టైల్స్ ఎగుమతులకు సానుకూలం




అమెరికా సుంకాల మోత భారత టెక్స్‌టైల్స్ ఎగుమతులకు సానుకూలమేనని పరిశ్రమ అభిప్రాయపడుతోంది. అమెరికాకు టెక్స్‌టైల్స్‌ను పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తున్న పోటీ దేశాలు చైనాపై 34%, వియత్నాంపై 46%, బంగ్లాదేశ్‌పై 37% సుంకాల విధింపు భారత్ కంటే అధికంగా ఉండడాన్ని ప్రస్తావించింది. 'మా వద్ద మిగిలి ఉన్న ఖాళీ సామర్థ్యం గురించి ఇప్పటికే అమెరికా కస్టమర్ల నుంచి విచారణలు మొదలయ్యాయి'అని రేమండ్ గ్రూప్ సీఎఫ్‌వో అమిత్ అగర్వాల్ తెలిపారు. భారత్ నుంచి అమెరికా ఏటా 36 బిలియన్ డాలర్ల (రూ.3 లక్షల కోట్లు) టెక్స్‌టైల్స్‌ను దిగుమతి చేసుకుంటోంది.

ఐటీ సేవలపై పరోక్ష ప్రభావం



ఎగుమతి ఆధారిత దేశీ ఐటీ సేవల రంగంపై టారిఫ్‌ల ప్రభావం ప్రత్యక్షంగా పడకపోయినా, తదనంతర పరిమాణాల వల్ల పరోక్ష ప్రభావం ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అమెరికాలో మందగమనం వస్తే తయారీ, లాజిస్టిక్స్, రిటైల్ తదితర రంగాల్లో డిమాండ్ పడిపోవచ్చని ఆందోళన నెలకొంది. దీంతో ఆ రంగాల్లోని సంస్థలకు సర్వీసులు అందించే భారత ఐటీ కంపెనీలకు ఇబ్బందులు ఎదురుకావొచ్చని విశ్లేషకులు చెప్పారు. 2024 ఆర్థిక సంవత్సరంలో భారతీయ ఐటీ సేవల కంపెనీలు ఆర్జించిన 193 బిలియన్ డాలర్ల ఆదాయాల్లో అమెరికా వాటా 57 శాతంగా నమోదైంది.

ఏఐకి అంతా చెప్పేస్తున్నారా?



వ్యక్తిగత వివరాలు ఇవ్వటం ఎప్పటికైనా ప్రమాదమే	ఆర్థిక, వైద్య, న్యాయపరమైన సమాచారం ఇవ్వొద్దు

- మన డేటాతోనే లార్జ్ లాంగ్వేజ్ మోడళ్ల ట్రైనింగ్
- చాటింగ్ టైంలో సెట్టింగ్ మార్చుకోవటం మేలు

సాక్షి, స్పెషల్ డెస్క్: కొత్త వస్తువైనా, టెక్నాలజీ అయినా కంటపడితే దాని అంతుచూడందే కొందరికి నిద్ర పట్టదు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విషయంలోనూ చాలామంది పరిస్థితి ఇలాగే ఉంది. చాట్‌జీపీటీ, జెమినీ, గ్రోక్ వంటి ఏఐ టూల్స్‌తోనే ఎక్కువ సమయం గడుపుతున్నవాళ్లు చాలామందే ఉన్నారు. పనులు చక్కబెట్టుకోవటం కోసం, నాలెడ్జ్ కోసం వీటిని వాడుకోవటం మంచిదే. కానీ, విచక్షణ లేకుండా వీటిని మన వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఏఐ టూల్స్‌కు ఏ సమాచారం ఇవ్వచ్చో.. ఏది మన సమాచారంతోనే ఎల్ఎల్ఎం ట్రైనింగ్

టీచర్ల బోధన, పాఠ్యపుస్తకంలోని పాఠాలు, గైడ్లు, నిజ జీవిత అనుభవాలన్నింటి సాయంతో ఎలాగైతే విద్యార్థులు నేర్చుకుంటారో.. లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లు (ఎల్ఎల్ఎం) కూడా అందుబాటులో ఉన్న సమాచారం, మనం వేసే ప్రశ్నల సాయంతో కొత్త విషయాలు నేర్చుకుంటాయి. దీన్నే ట్రైనింగ్ అని పిలుస్తుంటారు. చాట్‌జీపీటీ వంటివాటికి నిత్యవ్యవహారాల తాలూకు సమాచారం అందుబాటులో ఉంటే.. డాలీవంటి ఇమేజ్ జనరేటర్లకు వేల, లక్షల ఫొటోలు అందించి శిక్షణ ఇస్తుంటారు. ఈ శిక్షణ ఎంత ఎక్కువ ఉంటే, వచ్చే ఫలితాలు అంత కచ్చితంగా ఉంటాయి. అయితే, ఈ శిక్షణ సందర్భంగా వ్యక్తుల వ్యక్తిగత సమాచారం కూడా లభిస్తే దాన్ని కూడా అవి ఎక్కడో ఒకచోట వాడుకుంటాయి. కాబట్టి భవిష్యత్తులో మనకు ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే చాట్‌జీపీటీ, జెమినీ లాంటి ఎల్ఎల్ఎంలు 'మీ సంభాషణల్లో సున్నితమైన సమాచారం లేకుండా చూసుకోండి' అని, 'మీకు మాత్రమే తెలిసిన సమాచారాన్ని పంచుకోవద్దు' అని చెబుతుంటాయి.

1 మీ ఇంటి అడ్రస్ లేదా ఫోన్ నంబర్, ఆధార్, ఓటర్ ఐడీ, బ్యాంక్ అకౌంట్ వివరాలు ఎల్ఎల్ఎంలతో అస్సలు పంచుకోవద్దు. 2023లో చాట్‌జీపీటీ కోడ్‌లో చిన్న పొరబాటు దొర్లింది. ఫలితంగా ఇతరులు అడుగుతున్న ప్రశ్నలు అందరికి కనిపించడం మొదలైంది. హ్యాకర్లు ఈ సమాచారం చూస్తే ఇక అంతే సంగతులు.

2 పాస్‌వర్డ్‌లు, లాగిన్ వివరాలను ఎల్ఎల్ఎంలతో పంచుకోవడం ఏమంత మంచిది కాదు. పడకూడని వారి చేతుల్లో పడితే ఈ సమాచారంతో మీ జేబులు ఖాళీ కావచ్చు. పాస్‌వర్డ్ మేనేజ్‌మెంట్ టూల్స్ మాదిరిగా ఎల్ఎల్ఎంలలో ఈ వివరాలు సంకేత భాషలో స్టోర్ కావు. మోడల్‌ను రివ్యూ చేసేవారికి అందుబాటులో ఉంటాయి. లేదా ఇతరులతో మాట్లాడే టప్పుడు ఎల్ఎల్ఎంలు పొరపాటుగానైనా ఈ సమాచారాన్ని పంచుకునే అవకాశం ఉంది.

3 ఎల్ఎల్ఎంలతో పంచుకోకూడని మరో అంశం వృత్తిపరమైన సమాచారం. దీనివల్ల మనం పనిచేసే సంస్థలకు నష్టం జరగవచ్చు.

4 వైద్యులు, లాయర్ల వద్ద ఏదీ దాచకూడదని చెబుతారు. కానీ, ఎల్ఎల్ఎంల వద్ద మాత్రం వైద్య సమాచారం అస్సలు పంచుకోకూడదు. ఎల్ఎల్ఎంలకు వైద్యపరమైన సమాచారాన్ని భద్రపరిచే చట్టాలు వర్తించకపోవచ్చు. ఫలితంగా మనం ఇచ్చే సమాచారం దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉంటుంది.

విరుగుడు మంత్రాలు

- ఎల్ఎల్ఎంలలో మన సంభాషణలు రికార్డు కాకుండా కొన్ని చిట్కాలున్నాయి.
- చాట్‌జీపీటీ 4.0లో సంభాషణలను టెంపరరీ మోడ్‌లో ఉంచుకోవచ్చు.
- డక్.ఏఐని వాడుకుంటే మన పేరు వివరాలు లేకుండా చేస్తుంది.
- మైక్రోసాఫ్ట్ కో-పైలట్, గూగుల్ జెమినీలో సంభాషణలను రికార్డు చేస్తారు కానీ సెట్టింగ్స్‌లో మార్పులు చేసుకుని దాన్ని గోప్యంగా ఉంచుకోవచ్చు.
- మన సంభాషణలను అప్పుడప్పుడూ డిలీట్ చేస్తుండటం ద్వారా సమాచార దుర్వినియోగాన్ని నివారించవచ్చు.
- చైనీస్ ఏఐ డీప్‌సీక్ మాత్రం మీ సంభాషణలన్నీ రికార్డు చేసి ట్రెయినింగ్ కోసం వాడుకుంటుంది. మార్పులు చేసుకునే, తప్పించుకునే అవకాశాల్లేవు.

క్లుప్తంగా...

హైదరాబాద్ నుంచి హాంగ్‌కాంగ్ విమాన సర్వీసు పునరుద్ధరణ

శంషాబాద్: హైదరాబాద్-హాంగ్‌కాంగ్‌ల మధ్యన గతంలో ఉన్న విమాన సర్వీసును తిరిగి పునరుద్ధరించారు. కాథే పసిఫిక్ ఎయిర్‌లైన్స్ మార్చి 31 నుంచి ఈ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు గురువారం వెల్లడించారు. సోమ, గురు, ఆదివారాల్లో ఈ సర్వీసులుంటాయన్నారు. ఈ సర్వీసు పునరుద్ధరణతో హాంగ్‌కాంగ్‌తో పాటు మధ్యప్రాచ్య దేశాల రాకపోకలకు అనుసంధానంగా మారుతుందని ఎయిర్‌లైన్స్ ప్రాంతీయ జనరల్ మేనేజర్ రాకేశ్ రైకార్ అన్నారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నైతో పాటు హైదరాబాద్ ప్రయాణికులకు తమ సర్వీసులు సేవలందిస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్-హాంగ్‌కాంగ్‌ల మధ్యన సర్వీసు పునరుద్ధరణతో అంతర్జాతీయంగా ప్రయాణికుల సేవలు మరింత మెరుగుపడనున్నాయని ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ ఫణీకర్ అన్నారు.

సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రైళ్ల మళ్లింపు

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనుల దృష్ట్యా సికింద్రాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే పలు రైళ్లను చర్లపల్లి, నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌ల మీదుగా నడిపేందుకు చర్యలు చేపట్టినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్ నుంచి విజయవాడకు రాకపోకలు సాగించే శాతవాహన ఎక్స్‌ప్రెస్ (12713/12714) ఈ నెల 14 నుంచి కాచిగూడ నుంచి బయలుదేరనుంది. పోర్‌బందర్-సికింద్రాబాద్ (20968/20967) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుంచి ఉందానగర్ - పోర్‌బందర్ ఎక్స్‌ప్రెస్‌గా రాకపోకలు సాగించనుంది. సిద్దిపేట్-సికింద్రాబాద్ మధ్య నడిచే డెము (77656/77653) ఈ నెల 14 నుంచి మల్కాజిగిరి నుంచి బయలుదేరనుంది. పుణే-సికింద్రాబాద్ (12025/12026) శతాబ్ది ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16 నుంచి నాంపల్లి-పుణే ఎక్స్‌ప్రెస్‌గా నడవనుంది. సికింద్రాబాద్-మణుగూర్ ఎక్స్‌ప్రెస్ (12745/ 12746) ఈ నెల 15 నుంచి చర్లపల్లి -మణుగూర్ ఎక్స్‌ప్రెస్‌గా నడవనుంది. రేపల్లె-సికింద్రాబాద్ (17645/17646) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15వ తేదీ నుంచి చర్లపల్లి నుంచి బయలుదేరనుంది. అలాగే సిల్చర్-సికింద్రాబాద్ (12514/12513), సికింద్రాబాద్-దర్భంగా (17007/17008) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-యశ్వంత్‌పూర్ (12735/12736) ఎక్స్‌ప్రెస్ రైళ్లు చర్లపల్లి నుంచి రాకపోకలు సాగించనున్నాయి.

డ్రైవర్లు, కొందరు కండక్టర్లకే జీతాలు!

- నిధులు లేకపోవడంతో విడతల వారీగా చెల్లిస్తున్న ఆర్టీసీ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు విడుదల కాకపోవటంతో ఉద్యోగులకు జీతాలు చెల్లించటం ఆర్టీసీకి మళ్లీ ఇబ్బందిగా మారింది. ఇంతకాలం ఒకటో తేదీనే జీతాలు చెల్లించే పద్ధతి కొనసాగిస్తుండగా, తాజాగా దానికి అవాంతరం ఎదురైంది. చేతిలో నిధులు లేక సిబ్బంది అందరికీ ఒకేసారి జీతాలు చెల్లించే పరిస్థితి లేకపోవటంతో విడతల పద్ధతిలో చెల్లింపు చేస్తుండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మూడో తేదీ సాయంత్రం వరకు డ్రైవర్లు, కొన్ని ప్రాంతాల్లో కండక్టర్ల వరకు మాత్రమే ఆర్టీసీ జీతాలు చెల్లించగలిగింది. సంస్థలో అతి తక్కువ జీతాలుండే శ్రామిక్, మెకానిక్, భద్రతా సిబ్బందికి జీతాలు అందకపోవటం ఆందోళన కలిగిస్తోంది. వీరితోపాటు ఇతర ఉద్యోగులు, అధికారులకు కూడా చెల్లించలేకపోయారు. ఆర్థిక సంవత్సరం ముగింపు వేళ అప్పులపై వడ్డీలు, ఇతర బకాయిలు చెల్లించాల్సి ఉంటుంది. కొద్దిరోజుల క్రితం వడ్డీలకే రూ.265 కోట్లు చెల్లించినట్టు తెలిసింది. అందుబాటులో ఉన్న నిధులను వడ్డీలు, ఇతర బకాయిలకు చెల్లించి, ప్రభుత్వం చెల్లించాల్సిన మహాలక్ష్మి బకాయిలతో జీతాలు చెల్లించాలని ఆర్టీసీ భావించింది. మహాలక్ష్మి బకాయిలు దాదాపు రూ.600 కోట్ల వరకు సకాలంలో విడుదల కాకపోవటంతో జీతాలకు కష్టాలు తప్పలేదు. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేసి ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలు అందేలా చూడాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

తీరనున్న మెడికల్ బోధన కష్టాలు

మెడికల్ కాలేజీల్లో త్వరలో ప్రొఫెసర్ల నియామకం

- మేలో 1,300 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక నోటిఫికేషన్
- ఆ తరువాత 631 ప్రొఫెసర్లు, 837 అసోసియేట్ల నియామకం
- 34 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉండాల్సింది 6,378 మంది
- ప్రస్తుతం ఉన్నది 3,610.. ఇంకా 2,768 మంది అవసరం
- రాష్ట్ర ప్రభుత్వానికి డీఎంఈ నివేదిక



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్య విద్యార్థులకు త్వరలోనే బోధన కష్టాలు తీరనున్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో అధ్యాపకుల నియామకం పూర్తి చేయాలని నిర్ణయించారు. మే నెలలో 1,300 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక నోటిఫికేషన్ జారీ చేయాలని భావిస్తోంది. ఆ తర్వాత దశలవారీగా అవసరమైన 631 మంది ప్రొఫెసర్లు, 837 మంది అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకాల ప్రక్రియను కూడా పూర్తి చేయనుంది. కొత్తగా అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమిస్తే ఇప్పటికే కళాశాలల్లో పనిచేస్తున్న 2,305 మందిలో అర్హత గలవారికి పదోన్నతుల ద్వారా అసోసియేట్ ప్రొఫెసర్లుగా, అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా అవకాశం లభించనుంది. కొత్తగా ఏర్పాటైన మెడికల్ కాలేజీల్లో బోధన సిబ్బంది కొరత తీవ్ర సమస్యగా మారింది. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సరిపడా లేకపోవడంతో జాతీయ మెడికల్ కౌన్సిల్ విధి విధానాలకు అనుగుణంగా బోధన సాగటంలేదు. దీంతో తమకు బ్యాక్‌లాగ్స్ పెరిగిపోతున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2,768 మంది అవసరం

రాష్ట్రంలోని 34 మెడికల్ కాలేజీల్లో 6,378 మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అవసరం. ప్రస్తుతం మూడు కేడర్లలో 3,610 మంది మాత్రమే ఉన్నారు. బోధన సాఫీగా సాగాలంటే ఇప్పటికిప్పుడు 2,768 మంది నియామకం కావాలి. ఈ సమస్యలను వైద్య విద్య డైరెక్టరేట్ (డీఎంఈ) ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా నియామకాలు చేపట్టాలని కోరింది. దీంతో ప్రభుత్వం నియామక ప్రక్రియను వేగవంతం చేయడానికి ఆమోదం తెలిపినట్లు సమాచారం.

కాలేజీలకు అనుబంధ గుర్తింపు దరఖాస్తుల స్వీకరణ

- నోటిఫికేషన్ ఇచ్చిన ఇంటర్ బోర్డ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ఇంటర్మీడియెట్ కాలేజీలు 2025-26 విద్యా సంవత్సరానికి అనుబంధ గుర్తింపు కోసం ఏప్రిల్ 5 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్ బోర్డ్ తెలిపింది. కాలేజీల షిఫ్టింగ్‌కు కూడా ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య గురువారం విడుదల చేశారు. అదనపు సెక్షన్లు కోరే కాలేజీలు అవసరమైన మౌలిక వసతులు చూపించాలని సూచించింది. ప్లే గ్రౌండ్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, శానిటరీ సర్టిఫికెట్, ధ్వని కాలుష్యం లేదని ధ్రువపత్రాలను ఆన్‌లైన్ దరఖాస్తుతో జత చేయాలని తెలిపింది. దరఖాస్తులను పరిశీలించిన తర్వాత నిబంధనల ప్రకారం అనుబంధ గుర్తింపు ఇస్తామని, ఇది పొందకుండా కాలేజీల్లో ప్రవేశాలు చేపట్టవద్దని ఆదేశించింది. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా మే 4 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామని, ఫైన్‌తో జూన్ 8 వరకూ దరఖాస్తులు తీసుకుంటున్నట్టు తెలిపింది.

ఈసారైనా నిబంధనలు పాటించేనా?

రాష్ట్రవ్యాప్తంగా 1,200 ప్రైవేటు కాలేజీలున్నాయి. వీటిల్లో 350పైగా కాలేజీలు గృహ, వాణిజ్య సముదాయాల్లో నడుస్తున్నాయి. వీటిల్లో 80 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటిల్లో కాలేజీల నిర్వహణ నిబంధనలకు విరుద్ధమని అగ్నిమాపక శాఖ అభ్యంతరాలు చెబుతూ ప్రతి సంవత్సరం అనుమతులు నిరాకరిస్తోంది. ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్ లేని కారణంగా ఇంటర్ బోర్డ్ కూడా అనుమతి నిరాకరిస్తూ వస్తోంది. కానీ ప్రభుత్వాల ఒత్తిడి కారణంగా ఈ ఒక్క సంవత్సరమే అంటూ అనుమతులు ఇవ్వడం పరిపాటిగా మారింది. ఎన్వోసీ ఇచ్చేది లేదని 2020లో హోంశాఖ జీవో కూడా జారీ చేసింది. వీటిల్లో కాలేజీలు నిర్వహిస్తే ప్రమాదాలు జరిగే వీలుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో బోర్డ్ ఎంతవరకు నిక్కచ్చిగా ఉంటుందన్నది వేచి చూడాల్సిందే.



ఔరా.. కాంచన కోక..

చేనేత కళాకారుడు నల్ల విజయ్‌కుమార్ పసిడి వన్నెల చీరను మగ్గంపై గురువారం ఆవిష్కరించారు. బళ్లారికి చెందిన ఓ ప్రముఖ వ్యాపారవేత్త తన కుమార్తెకోసం 20 గ్రాముల బంగారంతో చీరను రూపొందించాలని విజయ్‌కుమార్‌ను సంప్రదించగా.. పది రోజులపాటు శ్రమించి పసిడి పోగులతో నేశారు. ఐదున్నర మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పు, 800 గ్రాముల బరువుతో ఈ చీరను ఆవిష్కరించారు. చీరలో బంగారు పూల డిజైన్ పొదిగారు. ఈ చీర ఖరీదు రూ.2.28 లక్షలు. నాలుగు దశాబ్దాల కిందటే అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేసి ప్రపంచానికి సిరిసిల్ల చేనేత కళావైభవాన్ని చాటిచెప్పిన చేనేత శిల్పి నల్ల పరంధాములు తనయుడే నల్ల విజయ్ కుమార్. ఈయన చేనేత మగ్గంపై, పవర్‌లూమ్స్‌పై ప్రయోగాలు చేస్తూ పలు ఆవిష్కరణలు చేశారు. తాజాగా పసిడి వన్నెల చీరను మగ్గంపై నేసి ఔరా అనిపించారు.

సిరిసిల్ల



దారి మధ్యలో బోరు.. చుట్టూ రోడ్డు

ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోతే ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో చెప్పడానికి ఇది మరో ఉదాహరణగా నిలుస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లిలోని వైఎస్సార్ నగర్‌లో రూ.40 లక్షల వ్యయంతో ఇటీవల ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ (పీఆర్) ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణలో ఈ పనులు చేశారు. అయితే చాలా కాలం కిందట కాలిబాటగా ఉన్న సమయంలో అక్కడ ఓ చేటచేతిపంపును వేశారు. ప్రస్తుతం దానిని విస్తరించి అక్కడ రోడ్డు వేయడంతో బోరు దారి మధ్యలోకి వచ్చింది. అయితే దానిని తొలగించకుండానే చుట్టూ రోడ్డు వేయడం.. రోడ్డు మధ్యలో ఉన్న బోరును తొలగించే పని తమది కాదన్నట్లు అధికారులు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి సంబంధించిన ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో గురువారం పీఆర్ డీఈ సైదులురెడ్డి వచ్చి పరిశీలించారు. ఆ తర్వాత అక్కడి నుంచి బోరును తొలగించి ఆ ప్రాంతం వరకు మళ్లీ రోడ్డు వేశారు.

ములకలపల్లి

ఎట్టకేలకు డైరెక్టర్ పోస్టుల భర్తీలో కదలిక

ఈ నెల 9, 10న విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

- ఒక్కో పోస్టుకు ముగ్గురిని ఎంపిక చేయనున్న ఎంపిక కమిటీ.. వారిలో ఒకరిని డైరెక్టర్‌గా నియమించనున్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో కీలకమైన డైరెక్టర్ల నియామక ప్రక్రియలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఈ నెల 9న ఉత్తర/దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎన్పీడీసీఎల్/టీజీఎస్పీడీసీఎల్)ల్లో, 10న తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో), ట్రాన్స్‌కోలో డైరెక్టర్ల నియామకానికి ఇంటర్వ్యూలు చేపడతారు. వాస్తవానికి ఆయా డైరెక్టర్ల పోస్టుల భర్తీకి 2024 జనవరి 29న నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఏడాది గడిచిన తర్వాత అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించబోతున్నారు. అన్ని విద్యుత్ సంస్థల్లోని డైరెక్టర్ల పోస్టులకు కలిపి మొత్తం 150కి పైగా దరఖాస్తులు రాగా, నియామక ప్రక్రియలో తీవ్రజాప్యం జరిగింది. దీంతో పెద్దఎత్తున పైరవీలకు ఆస్కారం కలిగిందని ఆరోపణలు వచ్చాయి.

ఉద్వాసన ఉత్తర్వులతో కదలిక..

జెన్‌కో డైరెక్టర్లందరితోపాటు ట్రాన్స్‌కో జేఎండీ, డైరెక్టర్లందరి నియామకంలో నిబంధనలు పాటించలేదని ప్రకటిస్తూ 2024 జనవరి 27న ఇంధనశాఖ ఉత్తర్వులు (జీవో ఆర్టీ నం.3) జారీ చేసింది. మరోవైపు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, విభాగాధిపతుల కార్యాలయాలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న 6,729 మంది రిటైర్డు అధికారులు, ఉద్యోగులందరినీ మార్చి 31లోగా తొలగించాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పాత డైరెక్టర్లను తొలగించక తప్పని పరిస్థితి నెలకొంది. దీంతో ఎట్టకేలకు ఇంధనశాఖ కొత్త డైరెక్టర్ నియామక ప్రక్రియను చేపట్టింది. సీఎస్ ఆదేశాల మేరకు గత మార్చి31తోనే పాత డైరెక్టర్లను తొలగిస్తూ జెన్‌కో, ట్రాన్స్‌కోలు ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉండగా, కొత్త డైరెక్టర్ల నియామకం వరకు కొనసాగించాలని ఇంధనశాఖ నిర్ణయం తీసుకుంది. ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించి ఒక్కో డైరెక్టర్ పోస్టుకు ముగ్గురి పేర్లతో షార్ట్‌లిస్టును రూపొందించి ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. అందులో నుంచి ఒకరిని డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

'ఇంటర్' పనిదినాలు 226 రోజులు

- 2025-26 వార్షిక విద్యా క్యాలెండర్ విడుదల.. మార్చిలో ఇంటర్ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ కాలేజీలు 226 రోజులు తరగతులు నిర్వహిస్తాయని ఇంటర్ బోర్డ్ పేర్కొంది. 2026 మార్చిలో వార్షిక పరీక్షలు ఉంటాయని వెల్లడించింది. 2025-26 వార్షిక విద్యా క్యాలెండర్‌ను ఇంటర్ బోర్డ్ గురువారం విడుదల చేసింది. జూన్ నుంచి మార్చి వరకూ మొత్తం 303 రోజులు ఉంటే, ఇందులో 77 పబ్లిక్ సెలవులున్నాయి. 226 రోజులు ఇంటర్ క్లాసులు కొనసాగుతాయి. 2026 జూన్ 1వ తేదీన కాలేజీలు మొదలవుతాయని, మార్చి 31 చివరి పనిదినంగా ఉంటుందని తెలిపింది. ఏప్రిల్ 1 నుంచి 31 మే 2026 వరకూ వేసవి సెలవులుగా ప్రకటించింది.

అకడమిక్ క్యాలెండర్

2-6-25	కాలేజీల పునఃప్రారంభం
28-9 నుంచి 5-10-25	దసరా సెలవులు
10-11 నుంచి 15-11-25	అర్ధ వార్షిక పరీక్షలు
11-1 నుంచి 18-1-26	సంక్రాంతిసెలవులు
19-1 నుంచి 24-1-26	ప్రీ ఫైనల్ పరీక్షలు
ఫిబ్రవరి మొదటి వారం	ప్రాక్టికల్ పరీక్షలు
మార్చి మొదటి వారం	వార్షిక థియరీ పరీక్షలు
31-3-26	చివరి పనిదినం
1-4 నుంచి 31-5-2026	వేసవి సెలవులు

లక్ష కోట్లు ఒక్కరోజే చెల్లించారు



మార్చిలో యూపీఐ లావాదేవీలు

విలువ రూ.24,77,221 కోట్లు

ఏడాదిలో వృద్ధి 25%

రోజుకు సగటు లావాదేవీలు

విలువ	సంఖ్య
రూ.79,910 కోట్లు	59 కోట్లు

యూపీఐ సేవలు అందిస్తున్న సంస్థలు - 661

మార్చి లావాదేవీలు	వ్యక్తుల మధ్య	వర్తకులకు చేసినవి
విలువ	73%	27%
సంఖ్య	37%	63%

సాక్షి, స్పెషల్ డెస్క్

స్మార్ట్‌ఫోన్ల వాడకంలో, డేటా వినియోగంలోనే కాదు.. డిజిటల్ చెల్లింపుల్లోనూ మనవాళ్లు తగ్గేదేలే అంటున్నారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఆధారిత చెల్లింపుల్లో తాజాగా సరికొత్త రికార్డు 'టచ్' చేశారు. ఒక్కరోజే లక్ష కోట్లకు పైగా చెల్లింపులు జరిపారు. 2025 మార్చి 1న దేశవ్యాప్తంగా యూపీఐ పేమెంట్స్ యాప్స్ ద్వారా రూ.1,01,627.92 కోట్ల విలువైన లావాదేవీలు నమోదు చేసి వాడకం మామూలుగా లేదనిపించారు. తొమ్మిదేళ్ల యూపీఐ చరిత్రలో ఈ స్థాయి లావాదేవీలు జరగడం ఇదే తొలిసారి. ఇక సంఖ్య పరంగా ఈ ఏడాది అత్యధికంగా మార్చి 13న గత రికార్డుకు చేరువగా 64.2 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. ఇప్పటివరకు 2024 అక్టోబర్ 31న అత్యధికంగా 64.4 కోట్ల లావాదేవీలు జరిగాయి.

కొనసాగుతున్న రికార్డులు..

యూపీఐ లావాదేవీల విలువ, సంఖ్య విషయంలో రికార్డుల పరంపర కొనసాగుతూనే ఉంది. అత్యధికంగా 2025 మార్చిలో రూ.24,77,221.59 కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. లావాదేవీల సంఖ్య గత నెలలో 1,830 కోట్లకు చేరింది. విలువ, పరిమాణం పరంగా ఒక నెలలో ఇప్పటివరకు ఇవే అత్యధికం. సగటున రోజుకు లావాదేవీల విలువ రూ.79,910 కోట్లకు, లావాదేవీల సంఖ్య 59 కోట్లను తాకింది. ఇక దేశంలో 661 బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, పేమెంట్ యాప్స్ యూపీఐ సేవలను అందిస్తున్నాయి. మార్చి నెల విలువలో వ్యక్తుల నుంచి వ్యక్తులకు 73 శాతం, వ్యక్తుల నుంచి వర్తకులకు 27 శాతం లావాదేవీలు జరిగాయి. అలాగే సంఖ్యలో వ్యక్తుల నుంచి వర్తకులకు 63 శాతం, వ్యక్తుల మధ్య 37 శాతం నమోదయ్యాయి.

ఐఐటీహెచ్‌కు ఐఎన్ఈ హోదా..



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్ (ఐఐటీహెచ్)కు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఎమినెన్స్ (ఐఎన్ఈ) హోదా లభించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ నిర్ణయం తీసుకుందని ఐఐటీహెచ్ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ హోదా లభిస్తే ఐఐటీహెచ్‌కు ఇచ్చే విరాళాలపై వంద శాతం ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది. ఇప్పటివరకు ఈ ప్రతిష్టాత్మక విద్యా సంస్థకు ఇచ్చే విరాళాలపై కేవలం 50 శాతం మాత్రమే ఆదాయపు పన్ను మినహాయింపు ఉండేది. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ, తమ సంస్థ విప్లవాత్మక విద్యా వ్యవస్థను, భారతీయ సాంకేతిక అభివృద్ధిని, పరిశోధన రంగాన్ని, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు దాతలు, కార్పొరేట్ సంస్థలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా వంద శాతం ఆదాయపు పన్ను మినహాయింపుతో పాటు, వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు దోహదపడుతుందని అన్నారు.

'ఐదు'లో ప్రవేశానికి 36,334 మంది అర్హత



- టీజీవీసెట్ ఫలితాలు విడుదల.. వెబ్‌సైట్‌లో అర్హుల వివరాలు
- మిగిలిన 13,130 సీట్ల భర్తీకి త్వరలో మరో జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో ఐదో తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీవీసెట్-2025 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఎస్సీ గురుకుల సొసైటీ కార్యాలయంలో సెట్ చీఫ్ కన్వీనర్ అలగు వర్షిణి వీటిని విడుదల చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల సొసైటీల పరిధిలోని పాఠశాలల్లో ఐదో తరగతిలో 51,408 సీట్లు ఉన్నాయి. వీటిని ప్రవేశ పరీక్ష ద్వారా మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు. ఈ ఏడాది 89,246 మంది విద్యార్థులు సెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అర్హత పరీక్ష నిర్వహించిన అనంతరం తాజాగా ఫలితాలు విడుదలయ్యాయి. నాలుగు గురుకుల సొసైటీల పరిధిలో 36,334 సీట్లకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్, ఎస్ఎంఎస్ ద్వారా సంక్షిప్త సమాచారాన్ని కూడా పంపినట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక కేటగిరీలో భాగంగా దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, అనాథలు, మత్స్యకారులు, ఏజెన్సీ ఎంప్లాయీ కేటగిరీ, ఎంబీఈలకు చెందిన 1,944 మంది విద్యార్థులకు ఇప్పటికే ప్రవేశాలకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మిగిలిన 13,130 సీట్ల భర్తీకి సంబంధించి త్వరలో మరో జాబితా విడుదల చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

త్వరగా ఫలితాల విడుదలతో విద్యార్థులకు వెసులుబాటు

ప్రవేశాల ప్రక్రియను పాఠశాలల ప్రారంభం నాటికే పూర్తి చేయాలనే లక్ష్యంతో టీజీవీసెట్ ఫలితాల విడుదలను వేగవంతం చేశారు. వాస్తవానికి ఈ ఫలితాలు మే నెలాఖరులో విడుదల కావాల్సి ఉంది. ఈసారి ఏప్రిల్ తొలి వారంలోనే విడుదల చేయడంతో అర్హత సాధించిన విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు సమయం ఇచ్చినట్టయింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.





ముత్తారంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవాయలం



ఆలయంలోని యాగశాల

ముక్తవరం.. రెండో భద్రాద్రి

భద్రాద్రి రాముడి ప్రతిరూపం ఆవిర్భవించిన క్షేత్రమిది.. • శ్రీ సీతారాముల కల్యాణం సాయంత్రం జరపడం ఇక్కడ ప్రత్యేకం



ఆలయ సింహ ముఖద్వారం

ముదిగొండ: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం..కంచర్ల గోపన్న కీర్తనలతో పులకించిన నేలకొండపల్లి రెండూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఉన్నాయి. వీటి నడుమ భద్రాద్రి రాముడి ప్రతిరూపం ఆవిర్భవించిన క్షేత్రమే ముత్తారం. పూర్వకాలంలో దీనిని ముక్తవరంగా పిలిచేవారు. ప్రస్తుత ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో ముత్తారంగా పిలవబడే ఈ గ్రామానికి ప్రత్యేక చరిత్ర ఉంది.

నేనే మీ వద్దకు వస్తా...

ముత్తారం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు కాలినడకన వెళ్లేవారట. అలా వెళ్లేవారిలో ఆసఫ్‌జాహి నిజాం ప్రభువు ఆస్థానంలో ఉద్యోగం చేసే వనం కృష్ణరాయలు కూడా ఉన్నారట. రామతత్వాన్ని నరనరాన జీర్ణించుకున్న ఆయన వృద్ధాప్యం పైబడినా తన భద్రాచలం ప్రయాణాన్ని ఆపలేదట. అయితే.. ఓ ఏడాది వృద్ధాప్యంతో నడక మందగించగా ప్రయాణం ఆలస్యమై కల్యాణ సమయానికి గోదావరి నది ఈవలి ఒడ్డునే ఆగిపోయారట. దీంతో స్వామి కల్యాణం తిలకించలేని ఈ జన్మ వృథా అంటూ రోదిస్తూ సొమ్మసిల్లి పడిపోయాడట. అప్పుడు ఆయనకు స్వప్నంలో స్వామివారు సాక్షాత్కరించి 'భక్తా నీవు బాధపడకు.. నీ వద్దకు నేనే వస్తాను.. దేవాలయ నిర్మాణం చేయించు.. ఎలాంటి పరిణామాలు ఎదురైనా వెనక్కి చూడకుండా వెళ్లు.. నీ వెంటే నేను వస్తాను'అని చెప్పాడట. దీంతో వనం కృష్ణరాయలు వెళ్తుండగా విచిత్ర శబ్దాలు, అరుపులు, మాటలు వినిపిచ్చినా ముందుకు సాగాడు. కొద్దిసేపటికి నిశ్శబ్దం ఆవరించడంతో స్వామి తన వెంట రావడం లేదేమోనని వెనక్కి చూడగా మెరుపు మెరిసి మాయమైంది. అప్పటికే ముత్తారం సమీపాన మున్నేరు తీరానికి చేరగా స్వామి పాదముద్రలు కనిపించాయి. దీంతో కృష్ణరాయలు రోదిస్తూ ఇంటికి వచ్చి స్వామి గమనాన్ని చూడలేకపోయానని బాధపడుతుండగా మళ్లీ కలలో సాక్షాత్కరించిన స్వామి 'నీ తోటలోని పుట్టలో నేను ఉద్భవించి ఉన్నాను. ఆలయాన్ని నిర్మించి ప్రతిష్ఠ కార్యం చేపట్టు' అని చెప్పాడట.

ఆలయ నిర్మాణం..

స్వామి సూచనలతో కృష్ణరాయలు ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పుట్టలో స్వామి వెలసిన చోట చిన్నపాటి ఆలయం నిర్మించి పూజలు చేయడం మొదలుపెట్టారు. చాలా ఏళ్ల ఇదే ఆలయం ఉండగా.. సుమారు 20 ఏళ్ల క్రితం వనంవారి కిష్టాపురానికి చెందిన పరుచూరి ప్రసాదరావు ఆలయ పునర్ నిర్మాణం చేపట్టారు. ఆలయంలో నిజమూర్తులు, ఏకాంతసేవా మందిరం, యాగశాల, తిరువంటపడి, తూర్పు ద్వారం, దక్షిణద్వారం, ఉత్తర ద్వారం, రథశాల, కల్యాణ మండపం, అద్దాలమేడ చూడముచ్చటగా ఉంటాయి.

కల్యాణం... ప్రత్యేకం

ఈ ఆలయంలో ఆది నుంచి శ్రీసీతారాముల కల్యాణం ప్రత్యేకంగా నిలుస్తోంది. దేశమంతటా శ్రీరామకల్యాణం ఉదయంవేళ నిర్వహిస్తే ముత్తారంలో మాత్రం సాయంసంధ్యా సమయాన జరపడం విశేషం. ఈ కల్యాణాన్ని తిలకించడానికి ముదిగొండ మండలంలోని పలు గ్రామాల నుంచే కాక జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు హాజరవుతారు. సాయంకాలం కల్యాణం నిర్వహించడానికి ప్రత్యేక కారణముందని చెబుతారు. భద్రాచలం శ్రీరాముడే స్వయంభూగా వెలిసి సంధ్యాసమయాన దర్శనమిచ్చాడనే విశ్వాసంతో అదే సమయానికి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, ఓ సంవత్సరం కల్యాణాన్ని పగటిపూట జరిపించగా అదే ఏడాది దేవాలయ ముంతజీమ్(చైర్మన్) అకస్మాత్తుగా మృతి చెందాడట. అప్పటి నుంచి పగటిపూట కల్యాణం జరిపించడానికి ఎవరూ సాహసం చేయరు.



శ్రీరామనవమి రోజున సాయంకాలం సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు (ఫైల్)



తలంబ్రాలు, పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న వంశ పారంపర్య ధర్మకర్త (ఫైల్)



రెండో భద్రాద్రిగా ప్రసిద్ధి

అపర భద్రాద్రిగా పేరొందిన ముత్తారం ఆలయంలో నిత్య పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నాం. కోరిన కోర్కెలు నెరవేర్చే దేవుడిగా భక్తజనం కొలుస్తారు. మాజీ సీఎం కేసీఆర్ సైతం ఆలయాన్ని దర్శించారు. ఎందరో అతిరథులు, ఇతర జిల్లా, రాష్ట్రాల ప్రముఖులు వస్తుంటారు.

– బొర్రా వాసుదేవాచార్యులు,
ఆలయ అర్చకుడు

వైభవోతపేతంగా పూజలు



అనాదిగా వస్తున్న ఆచార సంప్రదాయాలు, ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్య పూజలు, ఇతర కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహిస్తుంటాం. ఈ ఆలయానికి చైర్మన్‌గా ఉండడం నా అదృష్టంగా భావిస్తా. భక్తులు పెద్దసంఖ్యలో వస్తుండగా.. కమిటీ అంతా పూజల్లో నిష్టగా పాల్గొంటాం.

– తుళ్లూరి జీవన్‌బాబు,
ఆలయ చైర్మన్



కల్యాణానికి స్థలదానం

శ్రీరాముడి భక్తులుగా ఆయన సేవలో తరించే భాగ్యం దక్కింది. ఏటా శ్రీరాముడి కల్యాణం ఘనంగా జరిపిస్తుండగా.. భక్తులు కనులారా వీక్షించేందుకు అనుకూలంగా దేవస్థానం ముందు మాకు ఉన్న ఎకరం భూమి ఇచ్చాం. ఇది దేవుడి సేవగానే భావిస్తాం.

– కంకిపాటి హన్మంతరావు, భారతి

జన్మ జన్మల పుణ్యఫలమే..



వందల ఏళ్లుగా ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయాలు కొనసాగిస్తున్నాం. పూజలను ముందుండి నడిపించే భాగ్యం ఏడోతరం వారసుడిగా నా జన్మజన్మల పుణ్యఫలం. ఆనాడు వనం కృష్ణరాయలు నిర్మాణదాతగా నిలిచి.. 150 ఎకరాలు ఇచ్చారు. 1956లో ఉమ్మడి ఏపీగా ఉన్నప్పుడు ఆలయం దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్లింది.

– వనం వెంకటనాగేశ్వరరావు,
ఆలయ ఏడోతరం వంశపారంపర్య ధర్మకర్త

ఫీజుల చెల్లింపుపై ఒత్తిడి వద్దు

మెడికల్ కాలేజీలను ఆదేశించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: బ్లాక్ పీరియడ్ (2023–26)లో పెంచిన ఫీజుల చెల్లింపుపై విద్యార్థులను ఒత్తిడి చేయవద్దని పీజీ మెడికల్, డెంటల్ కాలేజీలను హైకోర్టు ఆదేశించింది. అయితే, ఈ ఉత్తర్వులు పిటిషన్ దాఖలు చేసిన విద్యార్థులకు మాత్రమే వర్తిస్తాయని స్పష్టం చేసింది. బ్లాక్ పీరియడ్ (ఫీజులు పెంచే పీరియడ్)లో భాగంగా మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీటు ఫీజును రూ.5.8 లక్షల నుంచి రూ.24 లక్షలు, కన్వీనర్ కోటాకు రూ.3.2 లక్షల నుంచి రూ.7.75 లక్షలకు పెంచుతూ సర్కార్ జీవో జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ డాక్టర్ అద్వైత శంకర్ సహా 124 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సింగిల్ జడ్జి విచారణ చేపట్టి.. పిటిషన్‌ను కొట్టివేశారు. దీన్ని సవాల్ చేస్తూ విద్యార్థులు అప్పీల్ దాఖలు చేశారు. అప్పీల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు ఎస్.రవి, సామ సందీప్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అంతకు ముందు బ్లాక్ పీరియడ్(2020–23)కు సంబంధించి పిటిషన్లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సర్కార్ జారీచేసిన జీవోల్లోని ఫీజుల్లో 50 నుంచి 60 శాతం మాత్రమే వసూలు చేయాలని గతంలో ఇదే కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని వెల్లడించారు. అలాగే తాజా బ్లాక్ పీరియడ్‌కు కూడా 70 శాతానికి మించి వసూలు చేయవద్దని కూడా ఇదే న్యాయస్థానం ఆదేశాలున్నాయన్నారు. విద్యార్థులపై కాలేజీ ఒత్తిడి తెస్తూ తరగతులకు హాజరుకావొద్దని చెబుతున్నాయని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఫీజు చెల్లింపుపై విద్యార్థులను ఒత్తిడి చేయవద్దని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా బీసీల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకొని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని.. లేదా ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలును కేంద్రంపై నెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. దీనిని బహిర్గతం చేసి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ కుట్రలను ఎండగడతామని తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా బీసీలకిచ్చిన హామీల అమలు విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. స్థానికంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉన్నా, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బిల్లును కేంద్రానికి పంపి, 9వ షెడ్యూల్ పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. కేంద్రం ఆమోదం లేకుండానే రిజర్వేషన్లు అమలు చేసే అవకాశాలున్నా, కాంగ్రెస్ ఎందుకు ఆలస్యం చేస్తోందని ఆనంద్‌గౌడ్ ప్రశ్నించారు.

శబరీమాతాజీ బ్రహ్మలీనమై పాతికేళ్లు

- నలుగురికి అన్నం పెట్టాలన్న ఆమె ఆశయం నిరంతరం కొనసాగుతోంది
- ఈ నెల 5,6 తేదీలలో ఉత్సవాలు... వేలాదిగా తరలిరానున్న భక్తులు



తాడ్వాయిలోని శబరీమాత ఆశ్రమం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: లక్షలాది మంది భక్తులను కలిగి ఉన్న శబరీమాతాజీ బ్రహ్మలీనమై పాతికేళ్లవుతోంది. 2000 ఏప్రిల్ 3న శబరీమాత తన జీవితాన్ని ముగించారు. 25 ఏళ్ల అవుతున్న సందర్భంగా ఈ నెల 5,6 తేదీల్లో శబరీమాతాజీ బ్రహ్మలీన వార్షికోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 5న రుద్రసహిత నవచండీ హోమం, మహాత్ముల దివ్య ప్రవచనములు, 6న శబరీమాత దివ్యపాదుకా పూజ, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. కామారెడ్డి జిల్లాలోని తాడ్వాయి మండల కేంద్రంలో శబరీమాత ఆశ్రమంలో వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కామారెడ్డి, నిజామాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోనే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు ఉత్సవాలకు హాజరవుతారు. ఆమె లేకున్నా నలుగురికి అన్నం పెట్టాలన్న సంకల్పాన్ని భక్తులు నిరంతరం కొనసాగిస్తున్నారు.

ఇదీ శబరీమాత చరిత్ర...

మెదక్ జిల్లా తొగుట గ్రామంలో జన్మించిన శబరీమాత చిన్ననాటి నుంచే భక్తిని అలవర్చుకొని శ్రీరాముడి భక్తురాలిగా మారింది. పసి ప్రాయంలోనే ఇంటిని వదిలి పుణ్యక్షేత్రాలను సందర్శించింది. పన్నెండేళ్ల వయసులో ఏడుపాయల ప్రాంతంలో తపస్సు చేసినట్టు చెబుతారు. అర్ధ శతాబ్దం క్రితం తాడ్వాయి మండల కేంద్రానికి చేరుకున్న శబరీమాతను గమనించిన గ్రామస్తులు గ్రామ సమీపంలో చిన్న కుటీరం ఏర్పాటు చేసి అక్కడ ఉంచారు. శబరీమాత చెప్పిన ఆధ్యాత్మిక బోధనలను ఆసక్తిగా వింటూ వచ్చిన గ్రామస్తులు ఆమెను ప్రత్యక్ష దైవంగా కొలిచారు. అనతి కాలంలోనే శబరీమాత అందరికీ దైవమయ్యారు. నిత్యం వేలాదిమంది భక్తులతో ఆశ్రమం కళకళలాడింది. 25 ఏళ్ల క్రితం శబరీమాత బ్రహ్మలీనమయ్యారు. ఆమె ప్రత్యక్షంగా దూరమైనా, ఆమె ఇచ్చిన సందేశంతో నిరంతరం భజనలు, పూజా కార్యక్రమాలతో ఆశ్రమం ఇప్పటికీ సందడిగా ఉంటుంది. కాగా ఆశ్రమంలో ప్రతి నిత్యం ఉదయం ఆరు గంటల లోపు అభిషేకం, మధ్యాహ్నం 12 గంటలు, సాయంత్రం 6 గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి ఆశ్రమంలో భజనలు నిత్యం కొనసాగుతాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులే కాకుండా స్థానికంగా ఉన్న భక్తులు భజనల్లో పాల్గొంటారు. కాగా శబరీమాత ఆశ్రమంలో ప్రతి ఏటా దత్తాత్రేయ జయంతి, గురుపౌర్ణమి, శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాలకు వేలాదిమంది భక్తులు హాజరవుతారు. మూడు, నాలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి దర్శించుకుని వెళుతుంటారు.

ఆశ్రమంలో నిత్య అన్నదానం...

శబరీమాత లేకున్నా అమ్మ భక్తులు ఆమె ఆశయాలను కొనసాగిస్తున్నారు. తన దగ్గరకు వచ్చే భక్తులకు కడుపునిండా అన్నం పెట్టి పంపించే శబరీమాత తాను లేకున్నా తన భక్తుల ఆకలి తీర్చాలని ఆశించారు. ఆమె చెప్పినట్టుగానే ఆశ్రమ నిర్వాహకులు భక్తులకు నిత్య అన్నదానం చేస్తూ ఆకలి తీరుస్తున్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ఉన్న శబరీమాత ఆశ్రమానికి నిత్యం భక్తుల తాకిడి ఉంటుంది. శబరీమాత బార్లి గింజల నీళ్లు, మామిడి పండ్లు మాత్రమే స్వీకరించేదని, కానీ తన భక్తులకు కడుపునిండా భోజనం పెట్టాలన్న ఉద్దేశంతో 1993లో అన్నదానం ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతి రోజూ రెండు పూటలా భక్తులకు కడుపునిండా అన్నం పెడుతున్నారు. మూడు దశాబ్దాలుగా అన్నదానం నిరంతరం కొనసాగిస్తున్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం, సాయంత్రం దాదాపు రెండు వందల మంది భక్తులు ఆశ్రమంలో భోజనం చేస్తున్నారు. ఆశ్రమానికి వచ్చిన భక్తులే కాకుండా రోడ్డున వెళ్లేవారు సైతం ఆశ్రమంలో భోజనం చేసి వెళుతుంటారు. నిరుపేదలు, నిరాశ్రయులు కూడా భోజనం చేస్తారు.



ఆశ్రమంలో శబరీమాత విగ్రహం





మల్లెలు కావివి.. కాఫీ పూలు

అల్లూరి జిల్లాలోని కాఫీ తోటలు విరబూసి, సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలోనే కాఫీ తోటలు పూతకొచ్చాయి. ప్రస్తుతం పచ్చని ఆకుల్లో మల్లెల మాదిరిగా శ్వేత వర్ణ పుష్పాలు ఆకర్షణీయంగా కనిపిస్తూ సువాసనలు వెదజల్లుతున్నాయి. ఇటీవల పలుచోట్ల వర్షాలు కురిసి కాఫీతోటలకు మేలు చేశాయి. పాడేరు మండలం వనుగుపల్లి, లగిశపల్లి, మినుములూరు ప్రాంతాలలో ముందస్తుగానే పూలు పూస్తూ ఆకర్షిస్తున్నాయి. – సాక్షి, పాడేరు

క్లుప్తంగా...

బీసీలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించాలి

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ ప్రభుత్వం గతంలో చేసిన.. బీసీలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణం ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం ఏపీ అధ్యక్షుడు కేశన శంకర్‌రావు డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఢిల్లీలో మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీల వాటా ఎంతో తేల్చాలని కోరారు. జాతీయ సమగ్ర జనగణనలో బీసీ కుల జనగణన చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లపై హర్షం వ్యక్తం చేశారు.

సైన్స్‌సిటీ సీఈవోగా వెంకటేశ్వర్లు

సాక్షి, అమరావతి: ఏపీ సైన్స్‌సిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా కె.వెంకటేశ్వర్లను ఏడాది కాలానికి నియమిస్తూ రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు

కేరళలో ప్రకృతి సాగుకు సహకరించండి

సాక్షి, అమరావతి: తమ రాష్ట్రంలో 64 క్షేత్రాల్లో చేపట్టనున్న ప్రకృతి వ్యవసాయానికి సహకరించాలని కేరళ వ్యవసాయశాఖ మంత్రి పి.ప్రసాద్ ఏపీ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడిని కోరారు. ఆయన గురువారం విజయవాడలో అచ్చెన్నాయుడితో సమావేశమయ్యారు. ఏపీలో అమలవుతున్న ప్రకృతి సాగు విధానం బాగుందని చెప్పారు.

రూ.39.05 కోట్లతో బుడమేరు డైవర్షన్ చానల్‌కు మరమ్మతులు

సాక్షి, అమరావతి: గతేడాది భారీ వరదలకు గండ్లు పడిన బుడమేరు డైవర్షన్ చానల్ (బీడీసీ)కి, వెలగలేరు రెగ్యులేటర్‌కు రూ.39.05 కోట్లతో మరమ్మతులు చేయించాలని జలవనరులశాఖ మంత్రి రామానాయుడు అధికారులను ఆదేశించారు. వెంటనే టెండర్లు పిలిచి పనులు చేయాలన్నారు. ఆయన గురువారం సచివాలయంలో ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులతో సమీక్ష నిర్వహించారు.

వంశీపై కేసులో పూర్తి వివరాలివ్వండి: హైకోర్టు

సాక్షి, అమరావతి: గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్‌ను కులంపేరుతో దూషించారంటూ నమోదు చేసిన కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై గురువారం విచారించిన హైకోర్టు.. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని పోలీసులను ఆదేశించింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఉత్తర్వులు జారీచేశారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

కడపలో కేఐఎస్‌సీఈ

రాజ్యసభ

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలోని వైఎస్సార్ జిల్లా కడపలో గల వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్.. క్రీడా భారత్ పథకం కింద భారత్ రాష్ట్ర శ్రేష్ఠత కేంద్రం (కేఐఎస్‌సీఈ)గా ఉందని కేంద్ర క్రీడలశాఖ మంత్రి మనసూఖ్ మాండవీయ తెలిపారు. రాజ్యసభలో గురువారం వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. ఈ కేంద్రంలో ఆర్చరీ, అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్ వంటి క్రీడల్లో తర్ఫీదు ఇస్తున్నట్లు చెప్పారు.

కొవ్వాడలో అణు రియాక్టర్ కోసం భూసేకరణ

రాష్ట్రంలోని కొవ్వాడలో అణు రియాక్టర్ నిర్మాణం కోసం భూమి సేకరించినట్లు కేంద్ర ప్రజావ్యవహారాల (ప్రధానమంత్రి కార్యాలయం) శాఖ సహాయమంత్రి డాక్టర్ జితేంద్రసింగ్.. వైవీ సుబ్బారెడ్డి అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

30.84 లక్షల చదరపు కిలోమీటర్ల అడవి

ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 30.84 లక్షల చదరపు కిలోమీటర్ల అటవీప్రాంతం ఉందని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి క్రితివర్ధన్ సింగ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్‌నత్వానీ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

హతవిధీ.. ఇప్పుడేంటి?



లోకేశ్ కోటరీ తీరుతో టీడీపీ సీనియర్లలో నైరాశ్యం

ఎంత హంగామా చేసినా పదవులివ్వని చంద్రబాబు

దేవినేని ఉమ, ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ, బుద్దా వెంకన్న వంటి వారికి మొండిచేయి

ప్రభాకర్ చౌదరి, కేఎస్ జవహర్, హనుమంతరాయ చౌదరిలకూ నిరాశే

పార్టీ ఆస్థాన విద్వాంసులైన వర్ల రామయ్య, టీడీ జనార్దన్‌లకూ అవకాశం నిల్

అవసరానికి ఉపయోగించుకుని పట్టించుకోవడం లేదని ఆవేదన

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం నుంచి కొనసాగుతూ గతంలో చక్రం తిప్పిన ముఖ్య నేతలను ప్రస్తుతం పూచిక పుల్లల్లా తీసి పారేయడం చర్చనీయాంశమైంది. గత టీడీపీ ప్రభుత్వాల్లో, పార్టీలో చురుగ్గా వ్యవహరించిన వారిని ఒక వ్యూహం ప్రకారం పక్కన పెట్టేశారు. సీఎం చంద్రబాబు తనయుడు, ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్ కోటరీకి చెందిన వ్యక్తుల మాటే పార్టీలో, ప్రభుత్వంలో వేదంగా మారడంతో సీనియర్లు, ముఖ్య నాయకులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. జనసేనతో పొత్తులో భాగంగా కాకినాడ జిల్లా పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ ఎమ్మెల్యే స్థానాన్ని బలవంతంగా వదులుకునేలా చేసి, ఇప్పుడు అవమానాలపాలు చేయడంతో పార్టీలో ఆందోళన నెలకొంది. జనసేన ప్లీనరీలో ఆయన్ను అవమానించేలా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబు వ్యాఖ్యలు చేయడం టీడీపీ క్యాడర్‌ను ఆగ్రహానికి గురిచేస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే సముచిత ప్రాధాన్యం ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు.. వర్మకు హామీ ఇచ్చినా, ప్రస్తుతం పట్టించుకోవడం మానేశారు. పవన్ చెప్పడంతో వర్మను పక్కన పెట్టేశారనే ప్రచారం జరుగుతోంది.

అపాయింట్‌మెంట్ ప్లీజ్..

కృష్ణా జిల్లా టీడీపీని గతంలో తన గుప్పిట్లో పెట్టుకుని చక్రం తిప్పిన దేవినేని ఉమామహేశ్వరరావు పరిస్థితి ప్రస్తుతం గల్లీ లీడర్ కంటే కిందకు పడిపోయింది. గత ఎన్నికల్లో ఆయనకు మైలవరం ఎమ్మెల్యే సీటు ఇవ్వకుండా పక్కన పెట్టారు. అధికారంలోకి వచ్చాక మంచి పదవి ఇస్తామని ఆశ చూపినా, ప్రస్తుతం ఆయనకు చంద్రబాబు అపాయింట్‌మెంట్ దొరకడమే గగనంగా మారింది. కనీసం టీడీపీ ఆఫీసులో మీడియా సమావేశం నిర్వహించేందుకు కూడా ఆయనకు అనుమతి లేదంటే ఆయన్ను ఏ స్థాయికి దిగజార్చారో ఊహించుకోవచ్చు. ఇటీవల మూడు ఎమ్మెల్సీ పదవుల్లో ఆయనకు ఒకటి ఖాయమని ప్రచారం జరిగినా, చివరికి ఆయనకు నిరాశే మిగిలింది. పరిస్థితి చూస్తే ఇప్పట్లో ఆయనకు పదవి వచ్చే అవకాశం కనిపించడం లేదు. పార్టీలోని ఆయన ప్రత్యర్థులు తెరవెనుక గట్టిగా దెబ్బ కొట్టడంతో ఉమాకు పదవి దక్కలేదని తెలుస్తోంది. విజయవాడ నగరానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న వంటి వారు చంద్రబాబు, లోకేశ్‌ను మెప్పించేందుకు ఎన్ని ఫీట్లు చేస్తున్నా, వైఎస్ జగన్‌ను కొత్త రకంగా విమర్శిస్తున్నా, రక్తంతో బ్యానర్లు రాసినా అలాంటి వారిని పట్టించుకునే పరిస్థితి ఏమాత్రం కనిపించడం లేదు.

అప్పుడు బుజ్జగించి.. ఇప్పుడు పక్కనపెట్టి..

గత ఎన్నికల్లో సీట్లు ఇవ్వని అనంతపురానికి చెందిన ప్రభాకర్ చౌదరి, గుంతకల్లుకు చెందిన జితేందర్‌గౌడ్, కళ్యాణదుర్గానికి చెందిన హనుమంతరాయ చౌదరి, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు, రాయచోటికి చెందిన రమేష్‌రెడ్డి, నిడదవోలుకు చెందిన బూరుగుపల్లి శేషారావు, ఉంగుటూరుకు చెందిన గన్ని వీరాంజనేయులు, తిరువూరుకు చెందిన కేఎస్ జవహర్ వంటి నేతలు తమకు ఏదో ఒక పదవి దక్కుతుందని ఆశతో ఉన్నా, అది నెరవేరే అవకాశాలు కనిపించడం లేదు. ఎన్నికల సమయంలో డబ్బు కట్టలతో వచ్చిన కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, పైరవీకారులకు సీట్లు ఇవ్వడంతో ఇలాంటి వారికి మొండిచేయి చూపించారు. అప్పట్లోనే ప్రభాకర్ చౌదరి, రమేష్ రెడ్డి, కొండపల్లి అప్పలనాయుడు వంటి నేతలు రాజీనామాలకు సిద్ధమవ్వగా, వారిని బుజ్జగించి అధికారంలోకి వచ్చాక మంచి పదవులిస్తామని చెప్పారు. కానీ ఇప్పటి వరకు తమను పట్టించుకోలేదని, తమకు పదవులు వస్తాయనే ఆశ కూడా పోయిందని వారంతా వాపోతున్నారు.

ఆస్థాన విద్వాంసులకూ నిరాశే

టీడీపీ కార్యాలయంలో ఎంతో కాలంగా ఆస్థాన విద్వాంసులుగా చెలామణి అవుతున్న వర్ల రామయ్య, టీడీ జనార్దన్, అశోక్‌బాబు వంటి వారికి ప్రస్తుతం కష్టకాలం నడుస్తోందని చెబుతున్నారు. గతంలో టీడీ జనార్దన్ పార్టీ వ్యవహారాలన్నింటినీ చంద్రబాబు తరపున చక్కబెట్టేవారు. ప్రస్తుతం ఆయన పార్టీ కార్యాలయానికి అప్పుడప్పుడు వచ్చి వెళ్లే సాధారణ నేతగానే మిగిలిపోయారు. అధికారంలో లేనప్పుడు సీనియర్ నేత వర్ల రామయ్యను అన్ని పనులకు వినియోగించుకున్నా, ప్రస్తుతం ఏ పని లేకుండా ఖాళీగా కూర్చోబెట్టారు. ఆయనకు ఏ పదవి ఇచ్చే ఉద్దేశం కూడా లేదని చెబుతున్నారు. పార్టీలో ప్రస్తుతం లోకేశ్ హవా నడుస్తుండడంతో ఇలాంటి నేతలందరికీ చెక్ పెట్టినట్లు స్పష్టమవుతోంది. యనమల రామకృష్ణుడు, అశోక్ గజపతి రాజు వంటి సూపర్ సీనియర్లనే పక్కన పెట్టగా.. బుచ్చయ్య చౌదరి, గంటా శ్రీనివాసరావు, పత్తిపాటి పుల్లారావు, ధూళిపాళ నరేంద్ర, యరపతినేని శ్రీనివాసరావు వంటి సీనియర్ల పరిస్థితి అంతంత మాత్రంగా ఉంది. వీరు ఎమ్మెల్యేలుగా ఉన్నా మంత్రి పదవులు దక్కలేదు. లోకేశ్ కోటరీలోని సానా సతీష్, కిలారు రాజేష్ వంటి వారు తెర వెనుక అన్ని వ్యవహారాలను చక్కబెడుతున్నారు. దీంతో సీనియర్లు, ముఖ్య నాయకుల పరిస్థితి దయనీయంగా మారిపోయింది.

సృష్టిలో అమ్మ స్థానం అత్యున్నతం. అమ్మ గొప్పతనం వర్ణనాతీతం.. అమ్మ త్యాగం అనన్యసామాన్యం.. పురిటి నొప్పులను సైతం పంటి బిగువున భరిస్తూ బిడ్డకు జన్మనిస్తుంది. కంటికి రెప్పలా కాపాడుకునేందుకు ప్రాణం పెట్టేస్తుంది. అందుకే అమ్మను మించిన దైవం ఉండదు అంటారు. అయితే కొంతమంది తల్లులు అనివార్యకారణాలతో శిశువుకు ముర్రెపాలు అందించలేక తల్లడిల్లిపోతున్నారు. అలాంటి సమయంలో బిడ్డ ఆకలి తీర్చడమే కాకుండా రోగనిరోధకశక్తిని పెంచే తల్లిపాలను అందించేందుకు కొందరు అమ్మలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. అమ్మతనానికి మరింత వన్నె తీసుకువస్తున్నారు. ఈ పక్రియకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హ్యూమన్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో సేవలు అందిస్తున్నారు.



ప్రసూతి ఆసుపత్రిలోని హ్యూమన్ మిల్క్ బ్యాంక్

మనసు నిండుగా.. మురిపాల పండుగ

- తిరుపతి మెటర్నిటీ ఆస్పత్రిలో మదర్ మిల్క్ బ్యాంక్
- నవజాత శిశువులకు వరంలా విశిష్ట సేవలు
- పాల వితరణకు స్వచ్ఛందంగా వస్తున్న తల్లులు

తిరుపతి తుడా : తల్లి పాలు అవసరం ఉన్న నవజాత శిశువులకు అవసరమైన పాలను మదర్ మిల్క్ బ్యాంకు అందిస్తుంది. అమ్మపాలు శిశువు ఎదుగుదలకు, సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో కీలకం, తల్లి పాల ప్రాధాన్యత తెలియకపోవడంతో కొందరు పిల్లలకు పాలిస్తే తమ శరీర ఆకృతి పాడైపోతుందని ఆవు, గేదె పాలను, మిల్క్ పౌడర్‌ను బాటిల్స్‌తో పట్టిస్తుంటారు. మరికొందరు బాలింతల విషయంలో శిశువుకు తగినంత పాలు లేకపోవడం, తల్లి అనారోగ్యం కారణంగా పాల వృద్ధి క్షీణిస్తుంది. ఇటువంటి వారికోసం మదర్ మిల్క్ కేంద్రం ఓ వరంగా పనిచేస్తోంది.

247 లీటర్ల సేకరణ

ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోని తల్లి పాల కేంద్రంలో ఏడాదిగా సుమారు 247లీటర్ల పాలను సేకరించి సుమారు 3,475మంది శిశువులకు అందించారు. ప్రతి నెల సుమారు 23 నుంచి 25 లీటర్ల పాలను డోనర్స్ నుంచి సేకరిస్తున్నారు. పాలు డొనేట్ చేసిన తల్లులకు సుమారు 6రకాల డ్రైఫ్రూట్స్ అందించి ప్రోత్సహిస్తున్నారు. మదర్ మిల్క్ కావలసిన వారు, డోనర్స్ 8919469744 నంబర్‌లో సంప్రదించవచ్చు.

ఎలాంటి శిశువులకు అందిస్తారంటే...

డెలివరీ అయిన వెంటనే తల్లి చనిపోయిన శిశువులకు, 2కేజీల కంటే బరువు తక్కువగా పుట్టిన పిల్లలకు, తల్లి ఆరోగ్యంగా ఉండి చనుపాల ద్వారం (నిప్పిల్స్) మూసుకుపోయిన పాలు రాని పరిస్థితి ఏర్పడిన శిశువులకు, తల్లిపాలు పడని బిడ్డలకు, దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతున్న బాలింతల పిల్లలకు పాలు అందిస్తున్నారు. ఒక్కో ఫీడింగ్‌కు 30ఎమ్ఎల్ చొప్పున రోజుకు 12సార్లు పాలు ఇస్తారు. ఇలా ఒకటి నుంచి 6నెలల వరకు శిశువుకు పాలు అందిస్తారు.

సేకరణ ఇలా...

స్వచ్ఛందంగా వచ్చే డోనర్స్ నుంచి తల్లి వయసు, డెలివరీ, ఆధార్‌కార్డుతో పూర్తి వివరాలను దరఖాస్తు రూపంలో నమోదు చేసుకుంటారు. అనంతరం తల్లి ఆరోగ్య సమాచారం సేకరించి అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తారు. తల్లి శరీరంపై టాటూస్ (పచ్చబొట్టులు) ఉన్నా, బ్రెస్ట్ సమీపంలో మచ్చలు, ఇన్‌ఫెక్షన్స్ ఉన్నా, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న బాలింతల నుంచి పాలు సేకరించరు. సంపూర్ణ ఆరోగ్యవంతులైన తల్లుల నుంచి మాత్రమే పాల సేకరణ చేస్తున్నారు. ప్రధానంగా హెచ్ఐవీ, హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్ఏజీ, వీడీఆర్ఎల్ పరీక్షలు



పాలను దానం చేస్తున్న బాలింత

ప్రతి తల్లికీ తప్పని సరిగా చేసి నెగటివ్ రిపోర్టు ఉంటేనే పాల డొనేషన్‌కు అనుమతిస్తున్నారు. ఈ క్రమంలోనే బాలింతలు తమ బిడ్డకు సరిపోగా మిగులు పాలను మాత్రమే డొనేట్ చేయాల్సి ఉంటుంది.

స్టోరేజ్ ఇలా...

ఆరోగ్యవంతులైన తల్లుల నుంచి సుమారు 200ఎమ్ఎల్‌కు పైబడి ఒక సిట్టింగ్‌లో పాలు సేకరిస్తారు. ఇందులో 10ఎమ్ఎల్ శాంపిల్ పాలను పరీక్షల నిమిత్తం మైక్రోబయోలజీ విభాగానికి పంపుతారు. మిగిలిన పాలను మిక్స్ చేసి రిఫ్రిజిరేటర్‌లో భద్రపరుస్తారు. అనంతరం యూవీ రేస్‌లో ఉంచి పూలింగ్ ప్రక్రియ కొనసాగిస్తారు. సుమారు 3గంటల పాటు శుద్ధి చేసి 62.4 టెంపరేచర్‌లో వేడి చేస్తారు. అనంతరం సుమారు అరగంట పాటు కూలింగ్ ప్రాసెసర్‌లో ఉంచు



సేకరించిన పాలను ఫ్రిజ్లో భద్రపరుస్తున్న సిబ్బంది

తారు. సుమారు ఆరు నెలలపాటు పాలు సురక్షితంగా ఉండేందుకు మిల్క్ బ్యాంకు అధికారులు. సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

శిశు మరణాల నివారణకే..



శిశు మరణాలను తగ్గించాలనే సంకల్పంతోనే హ్యూమన్ మిల్క్ బ్యాంకుకు శ్రీకారం చుట్టాం. సుమారు రూ.35లక్షల వ్యయంతో ఏర్పాటు చేశాం. చాలా మంచి స్పందన వస్తోంది. ఇప్పటి వరకు 3,475 మంది పసికందుల గొంతు తడిపాం. వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేశాం.

– టి.దామోదరం, మిల్క్ బ్యాంక్ ప్రాజెక్ట్ చైర్మన్, తిరుపతి

తల్లిపాలే తొలి వ్యాక్సిన్



నవజాత శిశువుకు తొలి వ్యాక్సిన్ తల్లి పాలే. గైనకాలజిస్టా తల్లిపాల శ్రేష్ఠతపై స్పష్టమైన అవగాహన ఉంది. నేను ఇప్పటివరకు 34 లీటర్లకు పైగా పాలను మిల్క్ బ్యాంకుకు అందించా. బాలింతలు తమ మిగులు పాలను ఇచ్చేందుకు ముందుకు రావాలి. పసికందుల ప్రాణరక్షణకు సహకారం అందించాలి.

– డాక్టర్ సోనా తేజస్వి, గైనకాలజిస్ట్

'వినండహో' మా డప్పు

పింఛన్ల పంపిణీలో చంద్రబాబు ప్రభుత్వ ప్రచార హోరు

ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీకి

సీఎం ఏర్పాటు చేశారంటూ 50 సెకన్ల ఆడియో సందేశం

దానిని విన్నాకే పంపిణీ ప్రక్రియ ముందుకుసాగేలా యాప్

ఈ నెలలో పైలట్ ప్రాజెక్టుగా 257 సచివాలయాల్లో అమలు

మరోవైపు లబ్ధిదారు ఇంటి వద్ద పంపిణీకి ఎసరు

300 మీటర్లు దాటి పంపిణీకి వీలు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం

సాక్షి, అమరావతి: కూటమి సర్కారులో ప్రచారం ఎక్కువ.. పని తక్కువ..! రాష్ట్రంలో అవ్వాతాతలకు ప్రతి నెల పింఛను డబ్బులు ఇవ్వడం ఈ ప్రభుత్వం వచ్చాకే మొదలు కాలేదు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు ఇవ్వడం సైతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే ప్రారంభమైంది. ఐదేళ్ల పాటు ప్రతినెలా లబ్ధిదారు ఎక్కడ ఉంటే అక్కడ పింఛన్లు అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పెన్షనర్లను నానా ఇక్కట్లకు గురిచేశారు. ఇప్పుడు సచివాలయ సిబ్బందితో వీటిని ఇప్పిస్తున్నారు. కానీ, ప్రతినెలా జరిగే పింఛన్ల పంపిణీని ముఖ్యమంత్రి చంద్రబాబు గొప్పగా ప్రచారం చేసుకోవడానికి పెద్ద ప్లాన్ వేశారు. లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పింఛను డబ్బు అందజేసే ముందు 'చంద్రబాబును కీర్తించేలా' ప్రభుత్వం రూపొందించిన ఓ ఆడియో క్లిప్‌ను వినిపిస్తున్నారు. ఆ తర్వాతే చేతికి డబ్బులు ఇచ్చే విధానం తీసుకొచ్చారు. అంతేకాదు.. మామూలుగా అయితే పింఛన్లు పంపిణీ చేసే సిబ్బంది ఈ ప్రచార ఆడియో క్లిప్‌ను లబ్ధిదారులకు వినిపించరేమోనని అనుమానించారు. అందుకని డబ్బులు అందజేసే ముందు.. వేలి ముద్ర (బయోమెట్రిక్) తీసుకునేందుకు ఈ 50 సెకన్ల ఆడియో విన్న తర్వాతనే ప్రక్రియ మొదలయ్యేలా మొబైల్ యాప్‌లోనే ప్రభుత్వ ప్రచార సందేశాన్ని అనుసంధానం చేశారు. ప్రతి లబ్ధిదారు దానిని తప్పనిసరిగా విన్న తర్వాతే వారి చేతికి డబ్బులు అందజేస్తున్నారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లోని 125 వార్డు సచివాలయాలలో, 132 గ్రామ సచివాలయాల పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా చంద్రబాబును కీర్తించే 50 సెకన్ల ఆడియో క్లిప్‌ను లబ్ధిదారులకు వినిపించే విధానం మొదలుపెట్టారు. ఒకటి రెండు నెలల్లో రాష్ట్రమంతటా ఆ ఆడియో ప్రచారం అమల్లోకి తీసుకరానున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.



ఇంటివద్ద పంపిణీకి ఎసరు

లబ్ధిదారు ఇంటి వద్ద పింఛన్ల పంపిణీ ప్రక్రియకు ఎసరు పెట్టే చర్యలు సైతం కూటమి ప్రభుత్వం మొదలుపెట్టింది. రెండు, మూడు నెలలుగా పింఛను లబ్ధిదారుని ఇంటి నుంచి 300 మీటర్ల పరిధిలో ఎక్కడైనా అందజేసేందుకు అవకాశం కల్పించారు. తాజాగా ఆ 300 మీటర్ల పరిధి దాటి కూడా పంపిణీకి నిర్ణయించింది. ఎక్కడైనా లబ్ధిదారుని ఇంటి నుంచి 300 మీటర్ల దాటి కూడా సంబంధిత సిబ్బంది డబ్బులు అందజేస్తే అందుకు కారణాన్ని యాప్‌లో నమోదు చేస్తే చాలు అన్న విధానం తీసుకొచ్చారు. రాష్ట్రంలో అత్యధిక గ్రామాల్లో 2 వేల లోపే జనాభా ఉంటారు. అంటే ఆయా గ్రామాల మొత్తం విస్తీర్ణం 300 మీటర్ల పరిధి లోపే ఉండే అవకాశం ఉంది. ఈ లెక్కన సిబ్బంది చిన్న కారణాలు చెప్పి అధికారికంగా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వమే అవకాశం ఇచ్చినట్లయింది.


● తమన్నా


● నయనతార


● అనుష్క

అందమైన భామలు... అదిరిపోయే లుక్కులు

సిల్వర్ స్క్రీన్‌పై అందంగా మెరిసిపోతుంటారు కథానాయిలు. ఫర్ ఎ చేంజ్ డీ గ్లామరస్‌గా కనిపించే అవకాశం వస్తే... 'సై' అంటారు. అలాంటి పాత్రలు చేసినప్పుడు దక్కే కిక్కే వేరు అంటున్నారు ఈ భామలు. గ్లామర్.. డీ గ్లామర్... ఏదైనా కొందరు తారలు ప్రస్తుతం అదిరిపోయే లుక్కుల్లో కనిపించడం మాత్రమే కాదు... నటనపరంగానూ విజృంభిస్తున్నారు. అదిరిపోయే లుక్కుల్లో కనిపించనున్న ఆ అందాల భామల గురించి తెలుసుకుందాం.

ప్రతీకారంతో...

'అరుంధతి', 'రుద్రమదేవి', 'భాగమతి', 'నిశ్శబ్దం' వంటి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ చేసిన హీరోయిన్ అనుష్కా శెట్టి నటించిన తాజా సినిమా 'ఘాటీ'. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' (2023) మూవీ తర్వాత అనుష్క టాలీవుడ్‌లో కమిటైన చిత్ర మిది. 'వేదం' (2010) వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క, డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా 'ఘాటీ'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. ఒడిశాలోని ఒక మహిళ జీవితంలో జరిగిన వాస్తవ ఘటన నేపథ్యంలో ఈ మూవీని తెరకెక్కించారట. బిజినెస్ ఉమన్‌గా సత్తా చాటుతున్న ఆమెను కొందరు కావాలని టార్గెట్ చేస్తారు. ఈ కారణంగా వ్యాపారంలో నష్టాలపాలైన ఆ మహిళ అందుకు కారకులైన వారిపై ఎలా ప్రతీకారం తీర్చుకుంది? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుందని టాక్. ఈ చిత్రంలో దేశీ రాజు అనే లీడ్ క్యారెక్టర్‌ని తమిళ నటుడు విక్రమ్ ప్రభు పోషించారు. అత్యధిక బడ్జెట్‌తో, అత్యున్నత స్థాయి సాంకేతిక ప్రమాణాలతో భారీ స్థాయిలో రూపొందిన 'ఘాటీ'ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీతో సహా పలు భాషల్లో ఈ నెల 18న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే ఏప్రిల్ ఆరంభమైనా చిత్ర యూనిట్ ఎలాంటి ప్రమోషన్స్ చేపట్టక పోవడంతో విడుదల ఉంటుందా? వాయిదా పడుతుందా? అనే చర్చ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది.

ఇటు అమ్మోరు తల్లి... అటు రాక్షసి...

ఉమెన్ సెంట్రిక్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌లా ఉంటారు నయనతార. అలాగే డిఫరెంట్ రోల్స్ చేయడంలోనూ ఆమె ముందుంటారు. నటనలో వైవిధ్యం చూపిస్తుంటారు. ప్రస్తుతం నయనతార తమిళంలో 'మూక్కుత్తి అమ్మన్ 2' చిత్రంలో లీడ్ రోల్ చేస్తున్నారు. సుందర్.సి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో నయనతార అమ్మవారి పాత్రలో కనిపిస్తారు. వేల్స్ ఫిల్మ్ ఇంటర్‌నేషనల్, అవ్నీ సినీ మ్యాక్స్, రౌడీ పిక్చర్స్, ఐవీవై ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. రూ. వంద కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ఇటీవల మొదలైంది. ఇక 2020లో నయనతార లీడ్ రోల్‌లో నటించిన తమిళ చిత్రం 'మూక్కుత్తి అమ్మన్' (తెలుగులో అమ్మోరు తల్లి) సినిమాకు సీక్వెల్‌గా 'మూక్కుత్తి అమ్మన్ 2' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు 'రాక్కాయి' సినిమాలో తన చిన్నారిని రక్షించేందుకు ఎంతటి సాహసాలనైనా చేసే తల్లి పాత్రలో నయనతార నటిస్తున్నారు. ఈ చిత్రంలో నయనతార గెటప్ కొత్తగా ఉంటుంది. సెంథిల్ నల్లస్వామి డైరెక్షన్‌లో డ్రమ్‌స్టిక్స్ ప్రొడక్షన్, మూవీ వెర్స్ ఇండియా సంస్థలు నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.

నాగ సాధువుగా...

ఓ వైపు హీరోయిన్‌గా, మరో వైపు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో పాటు ప్రత్యేక పాటల్లో సందడి చేస్తున్నారు తమన్నా. ఆమె లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'ఓదెల 2'. 'ఓదెల రైల్వేస్టేషన్' (2021)కి సీక్వెల్‌గా 'ఓదెల 2' రూపొందింది. తొలి భాగానికి దర్శకత్వం వహించిన అశోక్ తేజయే రెండో భాగాన్ని కూడా తెరకెక్కించారు. డైరెక్టర్ సంపత్ నంది ఈ చిత్రానికి క్రియేటర్‌గా వ్యవహరించారు. తొలి భాగంలో జోడీగా నటించిన హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహా మలిభాగంలోనూ నటించారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి. మధు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదలవుతోంది. సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాలో తొలిసారిగా శివశక్తి (నాగ సాధు) పాత్రలో నటించారు తమన్నా. ఓదెల గ్రామానికి ఊహించని కష్టం వస్తుంది. ఆ ఊరిలో కొలువై ఉన్న ఓదెల మల్లన్న స్వామి నాగ సాధు (తమన్నా) పాత్ర ద్వారా ఆ సమస్యని ఎలా పరిష్కరించారు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది. ఈ సినిమా నుంచి విడుదలైన తమన్నా ఫస్ట్ లుక్ పోస్టర్‌కి అనూహ్యమైన స్పందన వచ్చింది. అలాగే టీజర్ సినిమాపై అంచనాలు పెంచింది. పైగా 'ఓదెల రైల్వేస్టేషన్' సూపర్ హిట్ కావడంతో 'ఓదెల 2'పై భారీ అంచనాలున్నాయి.

రివాల్వర్ పట్టిన రీటా...

'నేను శైలజ' (2016) సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు కీర్తీ సురేశ్. ఆ తర్వాత 'నేను లోకల్, అజ్ఞాతవాసి, రంగ్ దే, సర్కారువారి పాట, దసరా, భోళా శంకర్' వంటి సినిమాలతో ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారామె. మహానటి సావిత్రి బయోపిక్‌గా రూపొందిన 'మహానటి' (2018) చిత్రానికిగాను ఉత్తమ నటిగా జాతీయ అవార్డు అందుకున్నారు కీర్తి. ఆమె టైటిల్ పాత్రలో నటించిన తాజా చిత్రం 'రివాల్వర్ రీటా'. జేకే చంద్రు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్, రెడిన్ కింగ్స్ కీలక పాత్రలు పోషించారు. ప్యాషన్ స్టూడియోస్ అండ్ ది రూట్ బ్యానర్స్‌పై సుధన్ సుందరం, జగదీష్ పళనీస్వామి నిర్మించారు. కామెడీ నేపథ్యంలో సాగే యాక్షన్ థ్రిల్లర్ మూవీ ఇది. సాధారణ జీవితం గడుపుతున్న ఓ మధ్య తరగతి కుటుంబానికి చెందిన రీటా అనుకోని పరిస్థితుల్లో తుపాకీ చేతపట్టాల్సి వస్తుంది. ఆ తర్వాత ఆమె ఎదుర్కొన్న సవాళ్లేంటి? అనేది ఈ సినిమాలో ఆసక్తిగా ఉంటుందని చిత్ర యూనిట్ పేర్కొంది. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా తెలుగు విడుదల హక్కులను హాస్య మూవీస్ అధినేత, నిర్మాత రాజేశ్ దండా సొంతం చేసుకున్నారు.

డీ గ్లామరస్‌గా బుట్టబొమ్మ...

తెలుగు తెరపై బుట్టబొమ్మలా పూజా హెగ్డే ఎంతో అందంగా కనిపించారు. ఎన్నో గ్లామరస్ రోల్స్ కూడా చేశారు. కానీ రొటీన్‌కి డిఫరెంట్‌గా పూజా హెగ్డే తొలిసారిగా ఓ డీ గ్లామరస్ రోల్ చేశారు. సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన పీరియాడికల్ లవ్ అండ్ యాక్షన్ డ్రామా ఫిల్మ్ 'రెట్రో'. ఈ మూవీలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించారు. ఈ 'రెట్రో' మూవీ లోనే పూజా హెగ్డే డీ గ్లామరస్ రోల్ చేశారు. స్టోన్ బెంచ్ క్రియేషన్స్, 2డీ ఎంటర్‌టైన్మెంట్ సంస్థలు నిర్మించిన 'రెట్రో' మే1న విడుదల కానుంది. ఇంకా రాఘవా లారెన్స్ సక్సెస్‌ఫుల్ హారర్ ఫ్రాంచైజీ 'కాంచన' లేటెస్ట్ మూవీ 'కాంచన 5'లో పూజా హెగ్డే ఘోస్ట్ రోల్ చేస్తున్నారని కోలీవుడ్ సమాచారం. ఇదే నిజమైతే... పూజాకు ఈ రోల్, గెటప్ కూడా సరికొత్తదే.


● కీర్తీ సురేశ్


● పూజా హెగ్డే


● సాయిపల్లవి

సీతగా సాయిపల్లవి...

పల్లెటూరి అమ్మాయిలా, స్టూడెంట్‌లా... ఇలా హీరోయిన్ సాయిపల్లవి ఇప్పటివరకు విభిన్నమైన పాత్రలు చేశారు. కానీ ఇప్పటివరకు 'రామాయణం, మహాభారతం' వంటి ఇతిహాసాల నేపథ్యంలో రూపొందిన సినిమాల్లో సాయి పల్లవి స్క్రీన్‌పై కనిపించలేదు. అయితే సీతగా సాయిపల్లవి ఎంత అద్భుతంగా వెండితెరపై మెరిసిపోతారో, వచ్చే ఏడాది దీపావళికి సిల్వర్ స్క్రీన్‌పై చూడొచ్చు. రామాయణం ఆధారంగా బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారి 'రామాయణ' మూవీ తీస్తున్నారు. ఈ చిత్రంలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి నటిస్తున్నారు. లక్ష్మణుడిగా రవిదుబే, హనుమంతుని పాత్రలో సన్నీ డియోల్, రావణుడిగా యశ్ నటిస్తున్నారని సమాచారం. నితీష్ మల్హోత్రా, యశ్ నిర్మిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళి సందర్భంగా రిలీజ్ కానున్నాయి. ఈ సంగతి ఇలా ఉంచితే... బాలీవుడ్‌లో సాయిపల్లవి నటిస్తున్న తొలి చిత్రం ఇదే కావడం విశేషం. అలాగే హిందీలో సాయి పల్లవి 'ఏక్ దిన్' అనే లవ్‌స్టోరీ మూవీ కూడా చేశారు. ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ నటించిన ఈ చిత్రం విడుదల తేదీ ఇంకా ఖరారు కాలేదు.


● అనుపమ


● నిధీ అగర్వాల్

మహిళల చుట్టూ పరదా...

అనుపమా పరమేశ్వరన్ కూడా జోరుమీదున్నారు. అటు హీరోయిన్‌గా, ఇటు లేడీ ఓరియంటెడ్ చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్నారామె. తాజాగా ఆమె లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'పరదా'. 'ఇన్ ద నేమ్ ఆఫ్ లవ్' అనేది ఉపశీర్షిక. 'సినిమా బండి' మూవీ ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహించారు. దర్శనా రాజేంద్రన్, సంగీత ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఆనంద మీడియాపై విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మించిన ఈ మూవీ త్వరలో విడుదల కానుంది. వైవిధ్యమైన సోషియో డ్రామా, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రంలో సుబ్బు పాత్రలో నటించారు అనుపమ. ఆమె పుట్టినరోజు (ఫిబ్రవరి 18) సందర్భంగా చిత్రబృందం ఓ ప్రత్యేక వీడియోను రిలీజ్ చేసింది. 'పరదాలమ్మా పరదాలు... రంగురంగుల పరదాలు... డిజైనర్ పరదాలు.... తీసుకోవాలమ్మా తీసుకోవాలి' అంటూ అనుపమ చెప్పే డైలాగులకి మంచి స్పందన వచ్చింది. మహిళల చుట్టూ సాగే కథాంశంతో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకుల్ని మరో ప్రపంచంలోకి తీసుకెళుతుందని యూనిట్ పేర్కొంది. త్వరలో ఈ మూవీ రిలీజ్ డేటిని ప్రకటించనున్నారు మేకర్స్.

స్వారీకి సై...

'భీమ్లా నాయక్' (2022) చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయమయ్యారు సంయుక్త. ఆ తర్వాత 'బింబిసార, సార్, విరూపాక్ష' వంటి హిట్ సినిమాల్లో నటించారామె. ప్రస్తుతం తెలుగులోనూ చేతి నిండా ప్రాజెక్టులతో దూసుకెళుతున్నారు. 'స్వయంభూ, నారి నారి నడుమ మురారి, హైందవ, అఖండ 2: తాండవం' వంటి తెలుగు చిత్రాల్లో హీరోయిన్‌గా నటిస్తున్నారామె. అదే విధంగా తొలిసారి ఓ లేడీ ఓరియంటెడ్ సినిమాలోనూ నటిస్తున్నారు. ఇదిలా ఉంటే... నిఖిల్ హీరోగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'స్వయంభూ'. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ పాన్ ఇండియా స్థాయిలో ఈ మూవీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో యోధుడి పాత్ర కోసం నిఖిల్ మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. భారీ యుద్ధ సన్నివేశాలు ఉన్న ఈ మూవీలో సంయుక్త కూడా పోరాట సన్నివేశాలు చేయాల్సి ఉందట. ఈ స్టంట్స్ చేయడానికి గుర్రపు స్వారీ నేర్చుకున్నారు సంయుక్త. మరి.. ఆమె పోరాటాలు ఏ స్థాయిలో ఉంటాయో తెలియాలంటే సినిమా విడుదల వరకూ వేచి చూడాలి. ఇదిలా ఉంటే... సంయుక్త టిస్తున్న తొలి హిందీ చిత్రం 'మహారాజ్ఞి- క్వీన్ ఆఫ్ క్వీన్స్'. ఈ మూవీకి చరణ్ తేజ్ ఉప్పలపాటి దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే మోహన్‌లాల్ హీరోగా రూపొందుతోన్న మలయాళ చిత్రం 'రామ్'లోనూ నటిస్తున్నారు సంయుక్త.


● సంయుక్తా మీనన్

యువరాణి పంచమి

'సవ్యసాచి' (2018) సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమయ్యారు నిధీ అగర్వాల్. 'మిస్టర్ మజ్ను, ఇస్మార్ట్ శంకర్, హీరో' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఆమె నటించిన తాజా చిత్రం 'హరి హర వీర మల్లు: పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'. పవన్ కల్యాణ్ హీరోగా జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. నిర్మాత ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్‌పై ఎ. దయాకర్ రావు నిర్మించిన ఈ మూవీ మే 9న విడుదల కానుంది. పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీగా రూపొందిన 'హరి హర వీరమల్లు'లో చారిత్రాత్మక యోధుడు వీరమల్లు పాత్రలో పవన్ కల్యాణ్ నటించగా.. పంచమి అనే యువరాణి పాత్రలో నిధీ అగర్వాల్ సరికొత్తగా కనిపించనున్నారు. ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంటుందట.

ఈ కథానాయికలే కాదు... ఇంకొందరు కూడా వైవిధ్యమైన పాత్రల్లో కనిపించి, మెప్పించనున్నారు.

త్వరలో చూస్తారు!


● నాని

'దసరా'(2023) వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా స్క్రిప్ట్ విషయంలో నాని సంతృప్తిగా లేరని, అదేవిధంగా బడ్జెట్ బాగా పెరిగిపోవడంతో సినిమా ఆగిపోయిందంటూ గత కొద్ది రోజులుగా ఆన్‌లైన్‌లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ వార్తలపై చిత్ర యూనిట్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించింది. ''ది ప్యారడైజ్'పై ఎలాంటి అనుమానాలొద్దు. మేము అనుకున్నవిధంగానే పనులు జరుగుతున్నాయి. ఎవరూ కంగారుపడాల్సిన పనిలేదు. ఈ మూవీని ఎంత గొప్పగా తీర్చిదిద్దుతున్నామో త్వరలోనే చూస్తారు. ఆ సమయం వరకు పుకార్లు సృష్టిస్తూ కొందరు బతికేయచ్చు. ఎందుకంటే ఏనుగు నడుస్తుంటే కుక్కలు అరుస్తుంటాయి కదా! మా సినిమాపై అభిమానులు చూపించే ప్రేమను చాలా దగ్గరగా చూస్తున్నాం. అదేవిధంగా ఈ మూవీపై తప్పుడు ప్రచారం చేస్తున్నవారిని కూడా గమనిస్తున్నాం. ప్రేమ, ద్వేషాన్ని రెండింటినీ తీసుకుని.. వాటన్నిటితో ఒక శక్తిగా మీ ముందుకు తిరిగొస్తాం. తెలుగులో ఉండే గొప్ప చిత్రాల్లో ఒకటిగా 'ది ప్యారడైజ్' ఉంటుంది. సినిమాపై పుకార్లు సృష్టిస్తున్న వారందరూ త్వరగా కోలుకోవాలి. అభిమానులంతా గర్వపడే చిత్రంతో నాని మీ ముందుకు వస్తారని మాట ఇస్తున్నాం'' అని యూనిట్ పోస్ట్ చేసింది. ఈ సినిమా 2026 మార్చి 26న విడుదలకానుంది. ఈ చిత్రానికి కెమేరా: ఏఓ విష్ణు, సంగీతం: అనిరుధ్ రవిచందర్.

సొంత ఊరి జ్ఞాపకాలు గుర్తొస్తాయి

- రాజీవ్ కనకాల

రాజీవ్ కనకాల, ఝాన్సీ, ప్రజ్వల్ యాద్మ, సాయిరామ్, అనీ, అనిరుధ్, జ్యోతి ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'హోమ్ టౌన్'. శ్రీకాంత్ రెడ్డి పల్లే దర్శకత్వంలో నవీన్ మేడారం, శేఖర్ మేడారం నిర్మించిన ఈ సిరీస్ నేటి నుంచి ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది. కాగా ఈ సిరీస్ ప్రివ్యూను హైదరాబాద్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో రాజీవ్ కనకాల మాట్లాడుతూ– ''హోమ్ టౌన్' వెబ్ సిరీస్‌లో నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ సిరీస్ ప్రివ్యూ చూసిన వారిలో కొందరికి తమ సొంత ఊరు, మరికొందరికి తమ గత జ్ఞాపకాలు గుర్తుకు వచ్చి ఉంటాయి. ఈ సిరీస్‌లో పిల్లల అల్లరి చూస్తుంటే 35 ఏళ్ల వెనక్కి వెళ్లిన ఫీలింగ్ కలిగింది. నవీన్ మేడారంగారు ఈ సిరీస్‌కు బ్యాక్‌బోన్‌లా నిలబడ్డారు. నాతో కలిసి నటించిన ఝాన్సీగారికి, ఇతర టీమ్ కి ఆల్ ది బెస్ట్'' అన్నారు. ''90s: ఎ మిడిల్ క్లాస్ బయోపిక్' తర్వాత మా సంస్థలో చేసిన వెబ్ సిరీస్ 'హోమ్ టౌన్'.'90s: ఎ మిడిల్ క్లాస్ బయోపిక్' సిరీస్‌లో నటించిన ఆ ముగ్గురు పిల్లలు ఓవర్ నైట్ స్టార్స్ ఎలా అయ్యారో, 'హోం టౌన్' సిరీస్ స్ట్రీమింగ్ తర్వాత ఈ ముగ్గురు పిల్లలకు కూడా అంతే పేరు వస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు నవీన్ మేడారం. ''సొంతూరుతో ముడిపడిన జ్ఞాపకాలను మర్చిపోలేం. అలాంటి భావోద్వేగాలు ఈ 'హోమ్ టౌన్' వెబ్ సిరీస్‌లో ఉంటాయి. సిరీస్‌లోని అందరు వారి బెస్ట్ పెర్ఫార్మెన్స్‌లు ఇచ్చారు. అవకాశం ఇచ్చిన నిర్మాత నవీన్, ఆహాకు థ్యాంక్స్'' అని తెలిపారు శ్రీకాంత్‌రెడ్డి పల్లే. ఈ కార్యక్రమంలో ప్రజ్వల్ యాద్మ, సాయిరామ్, అనిరుధ్, అనీ, శ్రావ్య, మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడారు.


● శ్రావ్య, అనీ, రాజీవ్ కనకాల, ప్రజ్వల్

బిజినెస్ రీల్

మూడేళ్లలో బిలియన్ డాలర్ల ఆదాయం

'బిర్లానూ' లక్ష్యం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ రంగ ఉత్పత్తుల సంస్థ 'బిర్లానూ' (గతంలో హెచ్ఐఎల్) వచ్చే మూడేళ్లలో ఆదాయాన్ని రెట్టింపు చేసుకుని, దాదాపు బిలియన్ డాలర్లకు చేరుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా రూ. 1,200–1,300 కోట్లు ఇన్వెస్ట్ చేస్తోంది. కంపెనీ కొత్త బ్రాండింగ్, కార్యకలాపాల విస్తరణ వివరాలను వెల్లడించేందుకు గురువారమిక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో కంపెనీ ఎండీ అక్షత్ సేథ్ ఈ విషయాలు చెప్పారు. సీకే బిర్లా గ్రూప్‌లో భాగమైన బిర్లానూ, 2024 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ. 3,500 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. చార్మినార్ బ్రాండ్ రేకులతో హైదరాబాద్ కేంద్రంగా 1946లో కార్యకలాపాలు ప్రారంభించి,దేశవ్యాప్తంగా విస్తరించినట్లు అక్షత్ చెప్పారు. రూఫింగ్, పైపులు, ఇంటీరియర్స్ మొదలైన ఉత్పత్తులకు సంబంధించి దేశవిదేశాల్లో మొత్తం 32 తయారీ ప్లాంట్లు ఉండగా, తెలుగు రాష్ట్రాల్లో భారీ స్థాయి ప్లాంట్లు అయిదు ఉన్నాయని వివరించారు. మొత్తం ఆదాయాల్లో 15శాతం వాటాతో కీలకంగా ఉంటున్న రెండు రాష్ట్రాల్లోనూ కార్యకలాపాలను మరింతగా విస్తరించడంపై దృష్టి పెడుతున్నామని చీఫ్ బిజినెస్ ఆఫీసర్ విజయ్ లహోటీ చెప్పారు.

రియల్టీ పెట్టుబడులు జూమ్

జనవరి–మార్చిలో 1.3 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: దేశీ రియల్టీ రంగంలో సంస్థాగత పెట్టుబడులు 2025 జనవరి–మార్చిలో 31 శాతం జంప్‌చేసినట్లు రియల్టీ కన్సల్టెంట్ కొలియర్స్ ఇండియా పేర్కొంది. ప్రధానంగా రెసిడెన్షియల్ విభాగంలో పెట్టుబడులు పుంజుకోవడంతో 1.3 బిలియన్ డాలర్లను తాకినట్లు ఒక నివేదికలో వెల్లడించింది. నివేదిక ప్రకారం వీటిలో 60 శాతం వాటాతో దేశీ ఇన్వెస్టర్లు ప్రధాన పాత్ర పోషించారు. వార్షికంగా 75 శాతం వృద్ధితో 0.8 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేశారు. పెట్టుబడుల్లో ఇండస్ట్రియల్, వేర్‌హౌసింగ్, ఆఫీస్ విభాగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. హౌసింగ్ విభాగంలో నిధులు 3 రెట్లు ఎగసి 30.29 కోట్ల డాలర్లకు చేరగా.. గతేడాది ఇదే కాలంలో 10.26 కోట్ల డాలర్లు మాత్రమే లభించాయి. ఆఫీస్ కాంప్లెక్సులలో సంస్థాగత పెట్టుబడులు 23 శాతం క్షీణించి 43.42 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి. గత జనవరి–మార్చిలో 56.3 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-4-2025

విశాఖ	440-00
చిత్తూరు	495-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	430-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	400-00
వరంగల్	402-00
రిటైల్ ధర	4.85

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
POWERGRID	299.95	4.6
SUNPHARMA	1,772.00	3.41
CIPLA	1,500.00	3.28
ULTRACEMCO	11,595.10	3.06
SHRIRAMFIN	654.1	2.3

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TCS	3,403.30	-3.97
HCLTECH	1,468.40	-3.87
TECHM	1,370.00	-3.73
INFY	1,495.80	-3.51
ONGC	243.59	-2.81

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,238
ఎన్ఎస్ఈ	90,489
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,51,488
ఎఫ్ఐఐ	- 2,806
డీఐఐ	+ 221

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	66.98	$	71.71
బ్రెంట్	70.16	$	74.95

అభివృద్ధి చెందిన దేశంగా భారత్

- స్టార్టప్ మహాకుంభ్‌లో జితిన్ ప్రసాద
- వికసిత్ భారత్‌లో సామాన్యుడికీ పాత్ర
- సంస్కరణ, ఆచరణ, పరివర్తనకు రెడీ



న్యూఢిల్లీ: స్టార్టప్ ఎకోసిస్టమ్ ద్వారా సంస్కరణ, ఆచరణ, పరివర్తనకు భారత్ సంసిద్ధంగా ఉన్నట్లు కేంద్ర సహాయ మంత్రి జితిన్ ప్రసాద పేర్కొన్నారు. 2047కల్లా అభివృద్ధి చెందిన దేశంగా లేదా వికసిత్ భారత్‌గా ఆవిర్భవించడంలో సామాన్యుడు సైతం కీలక పాత్ర పోషించవలసి ఉన్నట్లు అభిప్రాయపడ్డారు. ప్రజలు సుస్థిర, పటిష్ట ప్రభుత్వానికి ఓటు వేయడంతో దేశం ధృడంగా ఉన్నట్లు స్టార్టప్ మహాకుంభ్ సందర్భంగా వాణిజ్యం, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్, ఐటీ పరిశ్రమల సహాయ మంత్రి ప్రసాద వ్యాఖ్యానించారు. నూతన ఆవిష్కరణల స్టార్టప్ కమ్యూనిటీ, కొత్త ఆలోచనలతో ప్రధాని మోదీ లక్ష్యాలైన సంస్కరణ, ఆచరణ, పరివర్తనా భారత్‌కు మద్దతుగా నిలుస్తారని భావిస్తున్నట్లు చెప్పారు. సామర్థ్యం, నైపుణ్యాలు గల భారత్ సవాళ్లకు సిద్ధమని ప్రపంచానికి చాటాలని సూచించారు.

7 ట్రిలియన్ డాలర్లకు

భారత్ 2030కల్లా భారత్ 7 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించే వీలున్నట్లు స్టార్టప్ మహాకుంభ్ సందర్భంగా ఐటీ పరిశ్రమల సమాఖ్య నాస్కామ్ ప్రెసిడెంట్ రాజేష్ నంబియార్ అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ రంగం జీడీపీలో ట్రిలియన్ డాలర్లను సమకూర్చడం ద్వారా ఇందుకు కీలక పాత్ర పోషించనున్నట్లు పేర్కొన్నారు. ఆవిష్కరణలతో దేశ, విదేశీ సమస్యల పరిష్కారంలో టెక్నాలజీ రంగం ప్రాధాన్యత వహించనున్నట్లు తెలియజేశారు. దేశ భవిష్యత్ మార్పులలో టెక్నాలజీదే ప్రధాన పాత్రగా నిలవనున్నట్లు వ్యాఖ్యానించారు. డీప్ టెక్ ద్వారా హెల్త్‌కేర్, ఫైనాన్షియల్ సర్వీసెస్ తదితర రంగాల పరివర్తనలో ఐటీ నాయకత్వం వహించనున్నట్లు అంచనా వేశారు. 2047కల్లా వికసిత్ భారత్‌గా ఆవిర్భవించే ప్రణాళికల్లో ఆర్థిక వృద్ధితోపాటు.. సాంకేతిక ఆవిష్కరణలు సైతం కీలక పాత్ర పోషించనున్నట్లు వివరించారు.

గ్రోసరీ డెలివరీలు, ఐస్‌క్రీమ్ తయారీకాదు!

- స్టార్టప్‌లు హైటెక్‌పై దృష్టి పెట్టాలి
- వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్యలు

దేశీ స్టార్టప్ కమ్యూనిటీ గ్రోసరీ డెలివరీలు, ఐస్‌క్రీమ్, చిప్స్ తయారీ నుంచి దృష్టి మరల్చాలని వాణిజ్యం, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్యానించారు. సెమీకండక్టర్, మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఏఐ తదితర హైటెక్ రంగాలపై దృష్టి పెట్టాలని స్టార్టప్ మహాకుంభ్ సందర్భంగా సూచించారు. నిజానికి మరింతమంది దేశీ ఇన్వెస్టర్లు స్టార్టప్ ఎకోసిస్టమ్‌లోకి ప్రవేశించవలసిన అవసరం ఉన్నట్లు పేర్కొన్నారు. 'డెలివరీ బాయ్‌లతో మనం సంతోషంగా ఉన్నామా? ఇదేనా భారత్ భవిష్యత్' అంటూ ప్రశ్నించారు. ఇది స్టార్టప్‌కాదని, ఇది ఎంట్రప్రెన్యూర్‌షిప్ అని వ్యాఖ్యానించారు. మరోపక్క రోబోటిక్స్, మెషీన్ లెర్నింగ్, 3డీ మ్యాన్యుఫాక్చరింగ్, తదుపరి తరం ఫ్యాక్టరీలు తయారవుతున్నట్లు తెలియజేశారు. కొత్త స్టార్టప్‌లు దేశ భవిష్యత్‌వైపు దృష్టి పెట్టాలని సూచించారు. అయితే దేశ ఆర్థిక వ్యవస్థ, టెక్నలాజికల్ వృద్ధికి స్టార్టప్‌లు దోహదపడుతున్నట్లు తెలియజేశారు.

టారిఫ్‌ల పెంపు అమెరికా సెల్ఫ్‌గోల్

భారత్‌పై స్వల్ప ప్రభావమే • రఘురామ్ రాజన్

న్యూఢిల్లీ: అమెరికా 60 దేశాలపై ప్రతీకార సుంకాలు మోపడం అన్నది తనకు తాను నష్టం చేసుకోవడమేనని (సెల్ఫ్ గోల్) ప్రముఖ ఆర్థికవేత్త, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. వీటి కారణంగా భారత్‌పై స్వల్ప ప్రభావమే ఉంటుందన్నారు. ''స్వల్పకాలంలో అమెరికా ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం పడనుంది. ఫుట్‌బాల్ ఆటగాళ్లు చెప్పినట్టు ఇదొక సెల్ఫ్ గోల్ (తన చర్యతో ప్రత్యర్థి టీమ్‌కు పాయింట్ వచ్చేలా చేసేవాడు). భారత ఎగుమతులపై అమెరికా ప్రత్యక్ష టారిఫ్‌లు ప్రభావం చూపిస్తే అది యూఎస్‌లో ధరల పెరుగుదలకు దారితీస్తుంది. దాంతో డిమాండ్ తగ్గుతుంది. అప్పుడు భారత వృద్ధిపైనా ప్రభావం పడుతుంది. అయితే ఇతర దేశాలపైనా అమెరికా టారిఫ్‌లు మోపింది. కనుక ఆయా దేశాల ఉత్పత్తిదారులతో భారత్ పోటీపడుతుంది. కేవలం భారత్‌కు మాత్రమే విధించే టారిఫ్‌లతో పోల్చి చూస్తే ప్రస్తుత నిర్ణయం కారణంగా పడే ప్రభావం తక్కువే''అని రఘురామ్ రాజన్ వివరించారు.



యూనివర్సిటీ ఆఫ్ చికాగో బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో రాజన్ ప్రస్తుతం ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అమెరికా ఉత్పత్తిని పెంచాలన్నది ట్రంప్ దీర్ఘకాల ఉద్దేశ్యమని, దీని ఫలితం ఏదైనా దీర్ఘకాలంలోనే కనిపిస్తుందన్నారు. దేశీ వినియోగంతో పోల్చితే ఎగుమతులు తక్కువగానే ఉన్నందున.. అమెరికా ప్రతి సుంకాలు భారత్‌లో ప్రతిద్రవ్యోల్బణాన్ని కలిగించొచ్చన్నారు. అమెరికా మార్కెట్‌కు దారులు మూసుకుపోవడంతో భారత మార్కెట్‌కు ఎగుమతులకు చైనా ప్రయత్నించొచ్చని రాజన్ అంచనా వేశారు. ప్రపంచం మరింత రక్షణాత్మకంగా మారుతుండడంతో వాణిజ్యం విషయంలో తెలివిగా వ్యవహరించాలని సూచించారు. చైనాతో మరింత తటస్థ సంబంధాలకు ప్రాధాన్యం ఇవ్వాలని.. సార్క్, పొరుగు దేశాలతోనూ బలమైన సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఆర్థికానికి కుంభమేళా బూస్ట్

- రూ.2.8 లక్షల కోట్ల కార్యకలాపాలు
- ప్రత్యక్ష, పరోక్ష వినియోగం రూపంలో ప్రయోజనం
- డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ నివేదిక

ముంబై: ప్రయాగ్‌రాజ్ వేదికగా నెల రోజులకు పైగా జరిగిన మహా కుంభమేళా కార్యక్రమం దేశ ఆర్థిక రంగానికి మంచి బూస్ట్ (బలం) ఇచ్చినట్టయిందని డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ నివేదిక పేర్కొంది. రూ.2.8 లక్షల కోట్ల ఆర్థిక కార్యకలాపాలు మహా కుంభమేళా సందర్భంగా జరిగినట్టు తెలిపింది. ప్రత్యక్ష, పరోక్ష వినియోగం రూపంలో ఈ మేరకు ఆర్థిక రంగానికి ఉత్పాదకత సమకూరినట్టు వివరించింది. డేటా ఆధారంగా ఈ అంచనాలకు వచ్చినట్టు తెలిపింది. మేళాకు హాజరైన వారు రవాణా, వసతి, ఆహారం, పర్యాటక సేవలు, స్థానిక కొనుగోళ్ల రూపంలో రూ.90,000 కోట్లు ప్రత్యక్షంగా ఆర్థిక వ్యవస్థకు సమకూరినట్టు నివేదికలో పేర్కొంది. పరోక్ష రూపంలో ఎయిర్‌లైన్స్, హోటల్స్ తదితర రంగాలకు రూ.80,000 కోట్ల వ్యాపారం లభించినట్టు వివరించింది. మహాకుంభ మేళా సందర్భంగా చోటుచేసుకున్న వ్యాపార లావాదేవీలు ఆర్థిక వ్యవస్థపై ఎంతో సానుకూల ప్రభావం చూపిస్తాయని తెలిపింది. ఈ సందర్భంగా ఆదాయం సంపాదించుకున్న వర్గాలు ఇళ్లు, విద్య, ఆరోగ్యం, రోజువారీ అవసరాల కోసం చేసే ఖర్చులతో ఆర్థిక వ్యవస్థకు రూ.1.1 లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూరుతుందని వెల్లడించింది. మొత్తం రూ.2.8 లక్షల కోట్ల కార్యకలాపాల్లో రూ.2.3 లక్షల కోట్లు వినియోగ వ్యయంగాను, మిగిలిన రూ.50,000 కోట్లు మౌలిక సదుపాయాలపై చేసిన వ్యయాల రూపంలోను ఉన్నట్టు పేర్కొంది. మహా కుంభమేళా సందర్భంగా రూ.2 లక్షల కోట్ల ఆర్థిక లావాదేవీలు చోటుచేసుకుని ఉండొచ్చని ఇప్పటికే పలు అంచనాలు వ్యక్తం కావడం గమనార్హం.

రవాణా కోసమే రూ.37వేల కోట్లు

మొత్తం వినియోగ వ్యయంలో రవాణా కోసం చేసింది సగం మేర ఉంటుందని డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ నివేదిక తెలిపింది. రూ.37,000 కోట్లు రవాణా కోసం వ్యయం చేయగా, ఇందులో రూ.17,700 కోట్లు రైల్వేకు సమకూరినట్టు అంచనా వేసింది.



హెలీకాప్టర్ జాయ్ రైడ్స్, హాట్ ఎయిర్ బెలూన్ రైడ్స్, అమ్యూజ్‌మెంట్‌పార్క్ ప్రవేశాలు, యోగ తదితర వాటి కోసమే భక్తులు రూ.10,000 కోట్ల వరకు వ్యయం చేసినట్టు వివరించింది. 2 లక్షల మంది రిటైల్ వర్తకులు కుంభమేళా సందర్భంగా రూ.7,000 కోట్ల వ్యాపారం నిర్వహించినట్టు తెలిపింది. ఆహార సేవలకు రూ.6,500 కోట్లు సమకూరినట్టు పేర్కొంది. టీ స్టాళ్ల యజమానులు ఒక్కొక్కరు రోజుకు రూ. 30,000 సంపాదించుకున్నారని వెల్లడించింది.

ఈపీఎఫ్‌వో క్లెయిమ్‌లు ఇక ఈజీ

- క్యాన్సిల్డ్ చెక్ ఇమేజ్ అప్‌లోడ్‌కు నో
- బ్యాంక్ ఖాతా ధృవీకరణకు సైతం చెక్



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ద్వారా ప్రావిడెంట్ ఫండ్ ఉపసంహరణ విధానాలను రిటైర్‌మెంట్ ఫండ్ సంస్థ ఈపీఎఫ్‌వో తాజాగా సరళీకరించింది. దీనిలో భాగంగా క్యాన్సిల్ చేసిన చెక్ ఫొటో(ఇమేజ్)ను అప్‌లోడ్ చేయవలసిన అవసరం ఉండదు. అంతేకాకుండా దరఖాస్తుదారు బ్యాంక్ ఖాతాను యాజమాన్య సంస్థ ధృవీకరించవలసిన పరిస్థితి సైతం తలెత్తదు. తద్వారా క్లెయిమ్ సెటిల్‌మెంట్ విధానాన్ని వేగవంతం చేసేందుకు ఈపీఎఫ్‌వో చర్యలు తీసుకుంది. దీంతో దాదాపు 8 కోట్లమంది సభ్యులకు లబ్ధి చేకూరనుంది. యాజమాన్య సంస్థలకు సైతం సులభతర బిజినెస్ నిర్వహణకు వీలు చిక్కనుంది. ప్రస్తుతం ఈపీఎఫ్‌వో సభ్యులు ఆన్‌లైన్‌లో పీఎఫ్ ఖాతాల నుంచి నిధులను ఉపసంహరించుకోదలిస్తే క్యాన్సిల్డ్ చెక్ లీఫ్‌తోపాటు.. అటెస్ట్ చేసిన పాస్‌బుక్ ఫొటో కాపీని యూఏఎన్ సంఖ్యకు అనుసంధానించవలసి ఉంటుంది. అంతేకాకుండా యాజమాన్య సంస్థ సభ్యుడి బ్యాంక్ ఖాతాలను ధృవీకరించవలసి ఉంటుంది. అయితే ఆన్‌లైన్ క్లెయిములలో ఇకపై చెక్ లీఫ్ ఇమేజ్, బ్యాంక్ ఖాతా ధృవీకరణ నిబంధనలను తొలగిస్తున్నట్లు కార్మిక శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. తొలుత పరిశీలనార్థం కేవైసీ అప్‌డేట్ చేసిన సభ్యులకు తాజా నిబంధనలను 2024 మే 28 నుంచి అమలు చేసినట్లు తెలియజేసింది. ఫలితంగా 1.7 కోట్లమంది ఈపీఎఫ్ సభ్యులు లబ్ధి పొందడంతో ప్రస్తుతం సభ్యులందరికీ వర్తింపచేసేందుకు నిర్ణయించుకున్నట్లు వెల్లడించింది. యూఏఎన్‌తో బ్యాంక్ ఖాతాలను అనుసంధానించేటప్పుడే ధృవీకరణ పూర్తవుతున్నందున అదనపు డాక్యుమెంటేషన్ అవసరంలేదని కార్మిక శాఖ పేర్కొంది. ప్రస్తుతం 7.74 కోట్లమంది సభ్యులు ప్రతీ నెలా సొమ్మును జమ చేస్తున్నారని, వీరిలో 4.83 కోట్లమంది యూఏఎన్‌తో బ్యాంక్ ఖాతాలను అనుసంధానించినట్లు వివరించింది. 14.95 లక్షల ధృవీకరణలు యాజమాన్య సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించింది. తాజా నిబంధనలతో వీరంతా లబ్ధి పొందనున్నట్లు తెలియజేసింది.

డిజిటల్ లావాదేవీలకు ఏఐతో భద్రత

ఎన్‌పీసీఐ సీఆర్‌పీ విశ్వనాథ్ కృష్ణమూర్తి

చెన్నై: యూపీఐ లావాదేవీలు పెద్ద ఎత్తున పెరుగుతున్న నేపథ్యంలో, డిజిటల్ లావాదేవీల్లో కస్టమర్ల భద్రతను పెంచేందుకు కృత్రిమ మేధ (ఏఐ)ను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) చీఫ్ రిస్క్ ఆఫీసర్ (సీఆర్‌పీ) విశ్వనాథ్ కృష్ణమూర్తి తెలిపారు. ఏఐతోపాటు మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్)ను అనుసంధానించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల సహకారంతో ప్రయోగాత్మక అధ్యయనం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. యూపీఐ చెల్లింపులను పర్యవేక్షించే ఎన్‌పీసీఐని ఆర్‌బీఐ, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ ఏడాది ఒక్క మార్చి నెలలోనే 1830 కోట్ల యూపీఐ లావాదేవీలు (36 శాతం వృద్ధి) నమోదైనట్టు కృష్ణమూర్తి తెలిపారు. వీటి విలువ రూ.24 లక్షల కోట్లుగా (25 శాతం వృద్ధి) ఉన్నట్టు చెప్పారు. గత ఐదేళ్లలో యూపీఐ వినియోగం ఏటా 74 శాతం పెరుగుతూ వచ్చినట్టు తెలిపారు.

ప్రతీకార సుంకాల ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నాం

- కేంద్ర వాణిజ్య, ఆర్థిక శాఖల ప్రకటన
- దేశీ పరిశ్రమతో సంప్రదింపులు
- కొత్తగా ఏర్పడే అవకాశాలను పరిశీలిస్తున్నట్టు వెల్లడి



న్యూఢిల్లీ: అమెరికా ప్రతీకార సుంకాలతో భారత్‌పై ప్రడే ప్రభావాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్టు కేంద్ర వాణిజ్య శాఖతోపాటు, ఆర్థిక శాఖ ప్రకటించాయి. దేశీ పరిశ్రమ, ఎగుమతిదారులు సహా భాగస్వాములు అందరితో సంప్రదింపులు నిర్వహిస్తున్నట్టు, వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నట్టు వాణిజ్య శాఖ తెలిపింది. అమెరికా కొత్త వాణిజ్య విధానం ఫలితంగా ఏర్పడే కొత్త అవకాశాలపైనా అధ్యయనం చేస్తున్నట్టు ప్రకటించింది. పరస్పర ప్రయోజనకరమైన, బహుళ రంగాల ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై (బీటీఏ) త్వరగా అంగీకారానికి వచ్చేందుకు భారత్–అమెరికా వాణిజ్య బృందాలు చర్చిస్తున్నట్టు తెలిపింది. అమెరికాతో సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాన్ని భారత్ గౌరవిస్తుందని.. రెండు దేశాల ప్రయోజనాల విషయంలో అమెరికాతో కలసి పనిచేసేందుకు కట్టుబడి ఉన్నట్టు వాణిజ్య శాఖ పేర్కొంది. ఢిల్లీలో ఒక కార్యక్రమానికి హాజరైన సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మాట్లాడుతూ.. ''ట్రంప్‌నకు అమెరికాయే ప్రథమం. మోదీకి భారతే ప్రథమం. అమెరికా మోపిన ప్రతీకార సుంకాల ప్రభావాన్ని అంచనా వేస్తున్నాం''అని చెప్పారు. భారత్ నుంచి వచ్చే ఫార్మా, సెమీకండక్టర్, ఇంధన ఉత్పత్తుల దిగుమతులను టారిఫ్‌ల నుంచి అమెరికా మినహాయించగా, మిగిలిన దిగుమతులపై 10 శాతం బేసిక్ డ్యూటీకి అదనంగా 26 శాతం సుంకాలు మోపింది.

నిదానించిన సూక్ష్మ రుణ వితరణ



- పెరిగిపోయిన మొండి బాకీలు
- డిసెంబర్ క్వార్టర్‌పై క్రిఫ్ హైమార్క్ నివేదిక

ముంబై: సూక్ష్మ రుణ రంగంలో సంక్షోభం కొనసాగుతోంది. డిసెంబర్ త్రైమాసికంలో రుణ వితరణ క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చిచూసినప్పుడు 42 శాతం మేర తగ్గిపోయినట్టు క్రిఫ్ హైమార్క్ నివేదిక తెలిపింది. మొత్తం 1.19 కోట్ల రుణ దరఖాస్తులకు ఆమోదం లభించినట్టు.. వీటి ద్వారా రూ.63,400 కోట్ల రుణాలు జారీ చేసినట్టు తెలిపింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రుణ వితరణ రూ.97,400 కోట్లుగా ఉంది. పేదలు, తక్కువ ఆదాయ వర్గాలు సూక్ష్మ రుణ ఖాతాదారులుగా ఉండడం గమనార్హం. 31–180 రోజుల వరకు చెల్లింపుల్లేని రుణాలు (మొండి బాకీలు) మొత్తం రుణాల్లో 6.4 శాతానికి పెరిగాయి. 2023 డిసెంబర్ చివరికి ఇవి 2 శాతంగానే ఉన్నాయి. ఈ ప్రకారం సూక్ష్మ రుణ రంగంలో తీవ్ర ఒత్తిళ్లు నెలకొన్నట్టు తెలుస్తోంది. సూక్ష్మ రుణ సంస్థల నిర్వహణలోని మొత్తం రుణ ఆస్తులు 2023 డిసెంబర్‌తో పోల్చి చూస్తే 4 శాతం మేర, 2024 సెప్టెంబర్ త్రైమాసికంతో పోల్చి చూస్తే 5.4 శాతం క్షీణించి రూ.3.91 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఒక్కో వ్యక్తికి గరిష్టంగా కొన్ని సంస్థల పరిధిలోనే రుణాల మంజూరు పరిమితులు ప్రభావం చూపించినట్టు ఈ నివేదిక తెలిపింది. యాక్టివ్ రుణాలు (లావాదేవీలు కలిగిన) డిసెంబర్ చివరికి 14.6 కోట్లకు తగ్గాయి. ఏడాది క్రితం ఇవి 15.7 కోట్లుగా ఉన్నాయి. అత్యధికంగా కేరళలో 15.8 శాతం, రాజస్థాన్‌లో 11.6 శాతం, ఒడిశాలో 9 శాతం, తమిళనాడులో 8.3 శాతం చొప్పున సూక్ష్మ రుణ వితరణ తగ్గింది. యూపీలో మాత్రం 1.2 శాతం వృద్ధి నమోదైంది.

కంపెనీల రేటింగ్ భేష్

- పెరుగుతున్న అప్‌గ్రేడ్‌లు
- కనిష్ట స్థాయికి డౌన్‌గ్రేడ్‌లు
- ముున్ముందు మెరుగైన పరిస్థితి
- రేటింగ్ ఏజెన్సీల వెల్లడి



న్యూఢిల్లీ: దేశీ కంపెనీల ఆర్థిక ఆరోగ్యం మెరుగుపడుతోంది. వాటి పరపతి రేటింగ్ బలపడుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ కంపెనీల రేటింగ్‌లు అప్‌గ్రేడ్ కావడం దీన్ని తెలియజేస్తోంది. ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా 2024-25 సంవత్సరంలో 301 కంపెనీల రేటింగ్‌లను అప్‌గ్రేడ్ (అప్పటి వరకు ఉన్న రేటింగ్ కంటే మెరుగైనది) చేయగా, 150 కంపెనీల రేటింగ్‌ను డౌన్‌గ్రేడ్ చేసినట్టు తెలిపింది. కంపెనీల రుణ పరపతి మెరుగుపడడం వరుసగా నాలుగో ఏడాది కావడం గమనార్హం. ''బ్యాలన్స్ షీట్ల బలోపేతం వల్ల భారత కంపెనీల క్రెడిట్ ప్రొఫైల్ మెరుగుపడడం సుదీర్ఘకాలంగా కొనసాగుతోంది. గత దశాబ్ద కాలంలో మేము విశ్లేషించిన 6,000 లిస్టెడ్, అన్ లిస్టెడ్ కంపెనీల నిర్వహణ లాభం ఏటా 12 శాతం చొప్పున కాంపౌండెడ్‌గా పెరిగింది. వాటి మొత్తం రుణం కేవలం 4 శాతమే పెరిగింది''అని ఇక్రా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ రేటింగ్ ఆఫీసర్ కె.రవిచంద్రన్ తెలిపారు. ఇక ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్-రా) సైతం 2024-25లో కార్పొరేట్ రుణ పరపతి మెరుగుపడినట్టు తెలిపింది. రేటింగ్‌ల డౌన్‌గ్రేడ్-అప్‌గ్రేడ్ నిష్పత్తి వరుసగా నాలుగో సంవత్సరంలోనూ చారిత్రక కనిష్ట స్థాయిలో ఉన్నట్టు ప్రకటించింది. 2023-24లో ఉన్న 0.37 నుంచి 0.28కి మెరుగుపడినట్టు వెల్లడించింది. ఇండియా రేటింగ్స్ గత ఆర్థిక సంవత్సరంలో 330 కంపెనీల ఇష్యూలకు రేటింగ్‌లను అప్‌గ్రేడ్ చేయగా, 94 డెట్ ఇష్యూల రేటింగ్‌లను డౌన్‌గ్రేడ్ చేసింది. బలమైన బ్యాలన్స్ షీట్ల కారణంగా కార్పొరేట్ కంపెనీలు రుణ పరపతి ప్రయోజనం పొందుతున్నట్టు ఇండియా రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అరవింద్ రావు తెలిపారు.

సానుకూల దృక్పథం

మరో ప్రముఖ రేటింగ్ సంస్థ క్రిసిల్ సైతం గత ఆర్థిక సంవత్సరం ద్వితీయ ఆరు నెలల్లో 423 కంపెనీలకు రేటింగ్ అప్‌గ్రేడ్ ఇవ్వగా, 160 కంపెనీలకు డౌన్‌గ్రేడ్ ఇచ్చినట్టు వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో క్రిసిల్ రేటింగ్స్ క్రెడిట్ రేషియో 2.75గా ఉంటే, ద్వితీయ ఆరు నెలల్లో 2.64 రెట్లకు తగ్గింది. భారత కంపెనీలకు సంబంధించి రుణ నాణ్యత పరంగా సానుకూల దృక్పథంతో ఉన్నట్టు తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో డౌన్‌గ్రేడ్‌లను మించి అప్‌గ్రేడ్‌లు ఉంటాయన్న అంచనా వ్యక్తం చేసింది. ''బడ్జెట్‌లో పన్ను తగ్గింపులు, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం, వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు పట్టణ వినియోగాన్ని పెంచనున్నాయి. దీన్నుంచి కార్పొరేట్ ఇండియా ప్రయోజనం పొందుతుంది. ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనపై చేస్తున్న మూలధన వ్యయాలు అనుబంధ రంగాలపై ఎన్నో అంచల సానుకూల ప్రభావాన్ని చూపిస్తుంది''అని క్రిసిల్ రేటింగ్స్ ఎండీ సుబోధ్ రాయ్ వివరించారు. తాను రేటింగ్ ఇస్తున్న కంపెనీల మధ్యస్థ ఆదాయ వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 8 శాతానికి పెరగొచ్చని క్రిసిల్ తెలిపింది. దేశీ డిమాండ్ బలోపేతంతో క్యాపిటల్ గూడ్స్, నిర్మాణ రంగం, రిటైల్ ఎక్కువగా ప్రయోజనం పొందుతాయని అంచనా వేసింది. అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానమైన రసాయనాలు, డైమండ్ పాలిషర్స్, ఆగ్రోకెమికల్స్ పనితీరును పరిశీలించాల్సి ఉందని పేర్కొంది.

సూర్య 'ముంబై'తోనే ఉంటాడు: ఎంసీఏ



ముంబై: భారత బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ దేశవాళీ క్రికెట్‌లో తన సొంత జట్టు ముంబైని వీడి... వచ్చే సీజన్‌లో గోవా తరఫున ఆడబోతున్నట్లు కథనాలు వచ్చాయి. అయితే వీటిని ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) ఖండించింది. ఇప్పటికే యశస్వి జైస్వాల్ గోవాకు వెళ్లడం అధికారికంగా ఖాయం అయింది. ఇదే బాటలో సూర్య కూడా టీమ్ మారుతున్నట్లు వార్తలు వినిపించాయి. 'సూర్యకుమార్ యాదవ్ గురించి మీడియాలో వస్తున్న వదంతుల గురించి మాకు సమాచారం ఉంది. అయితే ఈ విషయంపై మేం ఇప్పటికే సూర్యతో మాట్లాడాం. అతను తాను ముంబైకే ఆడుతున్నట్లు స్పష్టం చేశాడు. ఆ వార్తలన్నీ నిరాధారం. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చెందించకుండా ఆటగాళ్లకు మద్దతుగా నిలవాలని అందరినీ కోరుతున్నాం' అని ఎంసీఏ కార్యదర్శి అభయ్ హడప్ పేర్కొన్నారు. సూర్య కూడా సోషల్ మీడియా ద్వారా నేరుగా ఈ వార్తలను కొట్టిపారేశాడు. 'ఈ వార్త రాసింది జర్నలిస్టా, స్క్రిప్ట్ రైటరా. కామెడీ సినిమాలు చూడటం మానేసి ఈ కథనాలు చదువుకుంటే చాలు. అర్థంపర్థం లేని విషయమిది' అని సూర్య వ్యాఖ్యానించాడు.

తిలక్ వర్మ హైదరాబాద్‌తోనే...



మరోవైపు ఇదే కథనంలో మరో భారత ఆటగాడు తిలక్ వర్మ కూడా హైదరాబాద్‌ను వీడి గోవాకు ఆడబోతున్నట్లుగా వచ్చింది. దీనిపై హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) స్పష్టతనిచ్చింది. తిలక్ వర్మతో వ్యక్తిగతంగా మాట్లాడానని, అతను హైదరాబాద్‌కే ఆడతానని చెప్పినట్లు హెచ్‌సీఏ కార్యదర్శి ఆర్. దేవరాజ్ స్పందించారు.

రోహిత్, పంత్‌కు పరీక్ష!



రబడ ఇంటి బాట

వ్యక్తిగత కారణాలతో ఐపీఎల్‌ను వీడిన దక్షిణాఫ్రికా పేసర్



న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబడ ఐపీఎల్ నుంచి స్వదేశానికి తిరుగు పయనమయ్యాడు. లీగ్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ సఫారీ పేసర్... వ్యక్తిగత కారణాలతో ఇంటికి వెళ్లినట్లు టీమ్ మేనేజ్‌మెంట్ గురువారం వెల్లడించింది. తాజా సీజన్‌లో గుజరాత్ జట్టు ఇప్పటి వరకు 3 మ్యాచ్‌లు ఆడగా... అందులో రెండింట్లో బరిలోకి దిగిన రబడ 2 వికెట్లు పడగొట్టాడు. బుధవారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో జరిగిన మ్యాచ్‌లో అతడికి తుది జట్టులో అవకాశం దక్కలేదు. 'ముఖ్యమైన వ్యక్తిగత కారణాలతో రబడ దక్షిణాఫ్రికాకు వెళ్లాడు' అని గుజరాత్ ఫ్రాంచైజీ ఒక ప్రకటనలో తెలిపింది. అతడు తిరిగి వస్తాడా లేదా అనే అంశంపై స్పష్టత ఇవ్వలేదు. రబడ సేవలు దూరమైనా... మొహమ్మద్ సిరాజ్, ఇషాంత్ శర్మ, ప్రసిధ్ కృష్ణ రూపంలో గుజరాత్ టైటాన్స్‌కు నాణ్యమైన పేసర్లు అందుబాటులో ఉన్నారు. దక్షిణాఫ్రికాకే చెందిన గెరాల్డ్ కోట్జీ, అఫ్గానిస్తాన్ ఆల్‌రౌండర్ కరీమ్ జనత్‌లో ఒకరిని విదేశీ పేసర్ కోటాలో ఎంపిక చేసుకునే అవకాశం ఉంది.

ఫామ్ కోల్పోయి సతమతమవుతున్న స్టార్లు

- నేడు లక్నో సూపర్ జెయింట్స్‌తో ముంబై ఇండియన్స్ 'ఢీ'
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

లక్నో: భారీ అంచనాలతో బరిలోకి దిగి ఈ సీజన్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్న ఇరు జట్ల మధ్య శుక్రవారం కీలక పోరు జరగనుంది. లక్నో సూపర్ జెయింట్స్‌ను ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ 'ఢీ' కొట్టనుంది. తాజా సీజన్‌లో చెరో 3 మ్యాచ్‌లాడిన ఇరు జట్లు ఒక్కో విజయం సాధించి రెండేసి పరాజయాలు మూటగట్టుకున్నాయి. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర (రూ. 27 కోట్లు) దక్కించుకున్న లక్నో సారథి పంత్... ఇప్పటి వరకు ఆకట్టుకోలేకపోయాడు. గత మూడు మ్యాచ్‌ల్లో అతడు వరుసగా 0, 15, 2 పరుగులు చేశాడు. దీంతో అతడిపై తీవ్ర ఒత్తిడి ఉండగా... ఐపీఎల్‌లో కెప్టెన్సీకి దూరమైనప్పటి నుంచి కేవలం ఇంపాక్ట్ ప్లేయర్‌గానే ఆడుతున్న రోహిత్ శర్మ కూడా ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. తాజా సీజన్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో 'హిట్‌మ్యాన్' వరుసగా 0, 8, 13 పరుగులు చేశాడు. వీరిద్దరు ఎలాంటి ప్రణాళికలతో బరిలోకి దిగుతారో చూడాలి. మరోవైపు ఐపీఎల్‌లో ముంబైపై మెరుగైన రికార్డు ఉన్న లక్నో సూపర్ జెయింట్స్ దాన్నే కొనసాగించాలని భావిస్తోంది. ఇప్పటి వరకు ఇరు జట్ల మధ్య 6 మ్యాచ్‌లు జరగగా... అందులో ఐదింట లక్నో గెలుపొందింది. మరి స్పిన్‌కు సహకరిస్తున్న లక్నో పిచ్‌పై విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి!

బుమ్రా లేకపోయినా బలంగానే...

ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అందుబాటులో లేకపోయినా... ముంబై ఇండియన్స్ బౌలింగ్ దళం పటిష్టంగానే కనిపిస్తోంది. నైపుణ్యం ఉన్న దేశీయ ఆటగాళ్లను గుర్తించి వారిని సానబెట్టే అలవాటు ఉన్న ముంబై ఫ్రాంచైజీ ఇప్పటికి ఎందరో స్టార్ ఆటగాళ్లను తయారు చేసింది. బుమ్రా, సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ ఇలా వెలుగులోకి వచ్చిన వారే. ఇప్పుడా జాబితాలో మరో రెండు కొత్త పేర్లు చేరేలా కనిపిస్తున్నాయి. గాయం కారణంగా తొలి దశ మ్యాచ్‌లకు బుమ్రా దూరం కావడంతో... జట్టు బౌలింగ్ బలహీనపడుతుంది అనుకుంటే... మేమున్నామంటూ బాధ్యత తీసుకునేందుకు యువ ఆటగాళ్లు ముందుకు వచ్చారు. లెఫ్టార్మ్ పేసర్ అశ్వని కుమార్, మణికట్టు స్పిన్నర్ విఘ్నేశ్ పుథుర్ చెరో 4 వికెట్లతో ఆకట్టుకున్నారు. యంగ్ ప్లేయర్లకు దిశానిర్దేశం చేయడంలో మెరుగైన రికార్డు ఉన్న ముంబై ఫ్రాంచైజీ వీరిద్దరినీ జాగ్రత్తగా తీర్చిదిద్దుతోంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడినప్పటికీ డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆడిన చివరి మ్యాచ్‌లో ముంబై సాధికారిక విజయం సాధించింది. దక్షిణాఫ్రికా ప్లేయర్ రికెల్టన్ మెరుపులు మెరిపిస్తుండగా... హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ చక్కటి టచ్‌లో ఉన్నాడు. గత మ్యాచ్‌తో సూర్యకుమార్ కూడా లయ అందుకోగా... రోహిత్ శర్మ నుంచి మేనేజ్‌మెంట్ భారీ ఇన్నింగ్స్ ఆశిస్తోంది. కెప్టెన్ హార్దిక్‌తో పాటు బౌల్ట్, అశ్వని, దీపక్ చాహర్, సాంట్నర్ బౌలింగ్‌లో కీలకం కానున్నారు.

ఫుల్ ఫామ్‌లో పూరన్, మార్ష్...

కొత్త సారథి రిషభ్ పంత్ భారీ స్కోర్లు చేయలేకపోతున్నా... లక్నో జట్టుకు బ్యాటింగ్‌లో పెద్దగా సమస్యలు కనిపించడం లేదు. టి20 స్పెషలిస్ట్, విండీస్ స్టార్ నికోలస్ పూరన్ భారీ సిక్సర్లతో విరుచుకు పడుతుంటే... ఆస్ట్రేలియా బ్యాటర్ మిషెల్ మార్ష్ జట్టుకు మెరుగైన ఆరంభాలు అందిస్తున్నాడు. గత మూడు మ్యాచ్‌ల్లో ఈ ఇద్దరు రెండేసి హాఫ్ సెంచరీలు సాధించారు. క్షణాల్లో ప్రత్యర్థి నుంచి మ్యాచ్‌ను లాగేసుకోగల సామర్థ్యం ఉన్న వీరి నుంచి మేనేజ్‌మెంట్ ఇలాంటి మెరుపులే ఆశిస్తోంది. మార్క్‌రమ్, డేవిడ్ మిల్లర్ రూపంలో మరో ఇద్దరు విదేశీ ఆటగాళ్లు కూడా ధాటిగా ఆడగలిగే వాళ్లే కావడం... లక్నోకు కలిసి రానుంది. ఆయుశ్ బదోని, శార్దుల్ ఠాకూర్, షాబాజ్ నదీమ్ రూపంలో ముగ్గురు స్వదేశీ ప్లేయర్లు లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసేందుకు సిద్ధం. ఎటొచ్చి పంత్ ఫామ్ మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. చాంపియన్స్ ట్రోఫీలో భారత తుది జట్టులో చోటు దక్కకపోవడంతో బెంచ్‌కే పరిమితమైన రిషభ్... ఈ మ్యాచ్‌లోనైనా దంచికొట్టాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఇతర జట్లతో పోల్చుకుంటే... బౌలింగ్‌లో కాస్త బలహీనంగా కనిపించిన లక్నో... శార్దుల్ ఠాకూర్ రాకతో బలంగా తయారైంది. గాయం నుంచి కోలుకున్న ఆకాశ్‌దీప్ ఈ మ్యాచ్‌లో ఆడటం ఖాయమే. రవి బిష్ణోయ్, దిగ్వేశ్ రాఠీ కీలకం కానున్నారు.

తుది జట్లు (అంచనా)

లక్నో సూపర్ జెయింట్స్: పంత్ (కెప్టెన్), మార్క్‌రమ్, మార్ష్, పూరన్, బదోని, మిల్లర్, సమద్, శార్దుల్, దిగ్వేశ్ రాఠి, ఆకాశ్‌దీప్, రవి బిష్ణోయ్, సిద్దార్థ్.

ముంబై ఇండియన్స్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), రోహిత్, రికెల్టన్, సూర్యకుమార్, తిలక్ వర్మ, నమన్ ధీర్, సాంట్నర్, దీపక్ చాహర్, బౌల్ట్, అశ్వని కుమార్, విఘ్నేశ్ పుథుర్, ముజీబ్.

6 ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్ మధ్య 6 మ్యాచ్‌లు జరిగాయి. ఐదింటిలో లక్నో గెలుపొందగా... ఒక మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ విజయం సాధించింది.

127వ స్థానంలో...

ప్రపంచ ఫుట్‌బాల్ ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం పడిపోయిన భారత పురుషుల జట్టు



లుసానే (స్విట్జర్లాండ్): ఏడాది కాలంగా అంతర్జాతీయస్థాయి మ్యాచ్‌ల్లో ఆశించిన ఫలితాలు సాధించడంలో భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు విఫలమవుతోంది. ఈ నిరాశాజనక ప్రదర్శన ప్రభావం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత జట్టుపై పడింది. గురువారం విడుదల చేసిన ప్రపంచ ఫుట్‌బాల్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు 127వ స్థానానికి చేరుకుంది. క్రితంసారి భారత జట్టు 126వ స్థానంలో ఉంది. షిల్లాంగ్‌లో ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన ఆసియా కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌ను భారత్ 'డ్రా' చేసుకుంది. తమకంటే మెరుగైన స్థానంలో ఉన్న భారత జట్టుతో మ్యాచ్‌ను 0–0తో 'డ్రా' చేసుకోవడం బంగ్లాదేశ్ జట్టుకు కలిసొచ్చింది. ర్యాంకింగ్స్‌లో బంగ్లాదేశ్ రెండు స్థానాలు పురోగతి సాధించి 183 ర్యాంక్‌లో నిలిచింది. గత ఏడాది జూన్‌లో భారత స్టార్ ప్లేయర్ సునీల్ ఛెత్రి అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి వీడ్కోలు తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. సునీల్ ఛెత్రి గుడ్‌బై చెప్పాక భారత ప్రదర్శన తీసికట్టుగా మారింది. దాంతో గత నెలలో సునీల్ ఛెత్రి రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకొని మళ్లీ జాతీయ జట్టులోకి వచ్చాడు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో, అంతకుముందు మాల్దీవులుతో జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో భారత జట్టుకు సునీల్ ఛెత్రి నాయకత్వం వహించాడు. కొత్త కోచ్ మనోలో మార్క్వెజ్ వచ్చాక భారత జట్టు ఆడిన 13 మ్యాచ్‌ల్లో ఒక్క మ్యాచ్‌లో మాత్రమే విజయం సాధించింది. భారత్ తమ అత్యుత్తమ ర్యాంక్ 94ను 1996లో సాధించింది. ఆ తర్వాత టీమిండియా తమ అత్యుత్తమ ర్యాంక్‌ను అధిగమించడంలో విఫలమవుతోంది. వరుసగా మూడోసారి ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధించాలనే లక్ష్యంతో ఉన్న భారత జట్టు గ్రూప్ 'సి'లో తమ తదుపరి మ్యాచ్‌ను జూన్ 10న హాంకాంగ్‌తో ఆడుతుంది. మరోవైపు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుత విశ్వవిజేత అర్జెంటీనా టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... స్పెయిన్ ఒక స్థానం మెరుగుపర్చుకొని రెండో ర్యాంక్‌కు చేరుకోగా... ఫ్రాన్స్ ఒక స్థానం పడిపోయి మూడో ర్యాంక్‌లో నిలిచింది. ఇప్పటికే 2026 ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించిన ఆసియా దేశాలు జపాన్ 15వ స్థానంలో, ఇరాన్ 18వ స్థానంలో ఉన్నాయి.



పోరాడి ఓడిన శ్రీజ

ఇంచియోన్ (దక్షిణ కొరియా): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చాంపియన్స్ లెవెల్ టోర్నీలో భారత రెండో ర్యాంకర్ ఆకుల శ్రీజకు నిరాశ ఎదురైంది. తొలి రౌండ్‌లోనే ఆమె ఓటమితో వెనుదిరిగింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 32వ ర్యాంకర్ శ్రీజ 11-9, 10-12, 11-7, 5-11, 2-11తో ప్రపంచ ఏడో ర్యాంకర్ కుయి మాన్ (చైనా) చేతిలో పోరాడి ఓడిపోయింది. 35 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీజ తన సర్వీస్‌లో 19 పాయింట్లు సాధించింది. ప్రత్యర్థి సర్వీస్‌లో 20 పాయింట్లు గెలిచింది. తొలి రౌండ్‌లో ఓడిన శ్రీజకు 4,500 డాలర్ల (రూ. 3 లక్షల 84 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 15 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

సాకేత్ జోడీ ఓటమి

సాక్షి, హైదరాబాద్: మెనోర్కా ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టెన్నిస్ టోర్నీలో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాకేత్ మైనేని పోరాటం ముగిసింది. స్పెయిన్‌లోని మెనోర్కా నగరంలో ఈ టోర్నీ జరుగుతోంది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాకేత్–రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) ద్వయం 5-7, 7-6 (7/2), 4-10తో 'సూపర్ టైబ్రేక్'లో మూడో సీడ్ కుకెర్మన్ (ఇజ్రాయెల్)–జోషువా పారిస్ (బ్రిటన్) జంట చేతిలో ఓడింది. మరో క్వార్టర్ ఫైనల్లో నిక్కీ పునాచా (భారత్)–సెర్జియో గోర్నెస్ (స్పెయిన్) జోడీ 4-6, 7-5, 5-10తో హసన్ (లెబనాన్)–ఆఫ్నెర్ (ఆస్ట్రియా) జంట చేతిలో ఓటమి పాలైంది.

ఒడిశా టైటిల్ నిలబెట్టుకునేనా!



- నేటి నుంచి జాతీయ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్
- తొలిసారి 'త్రీ డివిజన్' ఫార్మాట్‌లో పోటీలు
- ఈ నెల 15న ఫైనల్
- 'బి' డివిజన్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

ఝాన్సీ (ఉత్తరప్రదేశ్): పురుషుల సీనియర్ హాకీ నేషనల్ చాంపియన్‌షిప్‌నకు వేళైంది. శుక్రవారం ప్రారంభం కానున్న ఈ టోర్నమెంట్ ఈనెల 15న జరగనున్న ఫైనల్‌తో ముగియనుంది. 'త్రీ డివిజన్' ఫార్మాట్‌లో జరగనున్న ఈ టోర్నీలో మొత్తం 30 జట్లు పాల్గొంటున్నాయి. గత ఏడాది తమిళనాడులో జరిగిన జాతీయ చాంపియన్‌షిప్‌లో ఒడిశా జట్టు టైటిల్ సాధించి సంచలనం సృష్టించింది. వరుసగా రెండో ఏడాది ఒడిశా తమ జోరు కొనసాగించి టైటిల్ నిలబెట్టుకుంటుందో లేదో వేచి చూడాలి. 'ఎ' డివిజన్‌లో ఉన్న 12 జట్లు టైటిల్ కోసం పోటీ పడుతుండగా... 'బి' డివిజన్‌లోని 10 జట్లు, 'సి' డివిజన్‌లోని 8 జట్లు ప్రమోషన్ కోసం ప్రయత్నించనున్నాయి. ప్రదర్శన ఆధారంగా వచ్చే ఏడాది తిరిగి డివిజన్‌ల మార్పు జరుగుతుంది. 'సి' డివిజన్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు... వచ్చే ఏడాది 'బి' డివిజన్‌కు... 'బి' డివిజన్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన రెండు జట్లు 'ఎ' డివిజన్‌కు చేరనున్నాయి. ప్రతి డివిజన్‌లో కింది స్థానాల్లో నిలిచిన రెండు జట్లు... డిమోషన్ పొందుతాయి. 'మహిళల సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్‌ను ఈ ఫార్మాట్‌లో నిర్వహించడం వల్ల ఆటకు మేలు జరిగింది. అందుకే పురుషుల విభాగంలోనూ దీన్ని కొనసాగిస్తున్నాం. దీంతో ప్రతి డివిజన్‌లోని జట్టు మరింత మెరుగైన స్థితిలో నిలిచేందుకు ప్రయత్నిస్తుంది' అని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ అన్నాడు.

- 'ఎ' డివిజన్‌లోని 12 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో మూడు టీమ్‌ల చొప్పున పోటీ పడనున్నాయి. లీగ్ దశ ముగిసేసరికి గ్రూప్ అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుతాయి.
- ఈనెల 13న సెమీఫైనల్స్, 15న ఫైనల్ నిర్వహించనున్నారు.
- డిఫెండింగ్ చాంపియన్ ఒడిశాతో పాటు రన్నరప్ హరియాణా జట్లు 'ఎ' డివిజన్ నుంచి బరిలోకి దిగనున్నాయి. ఈ రెండు జట్లతో పాటు పంజాబ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, బెంగాల్, కర్ణాటక, పుదుచ్చేరి జట్లు 'ఎ' డివిజన్‌లో చోటు దక్కించుకున్నాయి.
- 'బి', 'సి'డివిజన్ మ్యాచ్‌లు నేటి నుంచి ప్రారంభం కానుండగా... 'ఎ' డివిజన్ మ్యాచ్‌లు ఈ నెల 8న ఆరంభమవుతాయి.
- ఇది 15వ పురుషుల సీనియర్ హాకీ జాతీయ చాంపియన్‌షిప్ కాగా... గత ప్రదర్శన ఆధారంగా జట్లను విభజించారు.
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జట్లు ప్రస్తుతం 'బి' డివిజన్‌లో ఉన్నాయి. వీటితో పాటు చండీగఢ్, గోవా, ఉత్తరాఖండ్, ఢిల్లీ, మిజోరం, దాద్రా నగర్ హవేలీ–దామన్ దియు, కేరళ, అస్సాం జట్లు కూడా ఇదే గ్రూప్‌లో రెండు 'పూల్స్'గా పోటీ పడనున్నాయి.
- 'సి' డివిజన్‌లో రాజస్తాన్, అరుణాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, త్రిపుర, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, బిహార్, గుజరాత్ జట్లున్నాయి.
- ఒక్కో మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు 3 పాయింట్లు లభిస్తాయి. మ్యాచ్ 'డ్రా' అయితే ఇరు జట్లకు చెరో పాయింట్ దక్కుతుంది.

నోబెల్ గ్రహీత వీసా రద్దు

ట్రంప్‌ను విమర్శించినందుకే



శాన్‌జోస్: నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, కోస్టారికా మాజీ అధ్యక్షుడు ఆస్కార్ అరియాస్ (84) వీసాను అమెరికా రద్దు చేసింది. దీనిపై అరియాస్ ఆశ్చర్యం వెలిబుచ్చారు. రద్దుకు కారణమేమిటో తనకు తెలియదని కోస్టారికా రాజధాని శాన్ జోస్‌లో మీడియాతో అన్నారు. ''వీసా రద్దు చేస్తున్నట్టు అమెరికా అధికారులు మెయిల్ పంపారు. కానీ ఈ విషయమై ఎలాంటి వివరణా ఇవ్వలేదు''అని చెప్పారు. ''అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరును రోమన్ చక్రవర్తితో పోలుస్తూ నేను బహిరంగ విమర్శలు చేశా. నేను అధ్యక్షుడిగా ఉండగా చైనాతో కోస్టారికా దౌత్య బంధాన్ని పునరుద్ధరించా. బహుశా ఇవన్నీ కారణమై ఉంటాయి''అని అభిప్రాయపడ్డారు. సెంట్రల్ అమెరికాలో ఘర్షణల నివారణకు చేసిన కృషికి అరియాస్‌కు 1987లో నోబెల్ శాంతి బహుమతి దక్కింది. ఆయన 1986-1990, 2006-2010 మధ్య ఎనిమిదేళ్ల కోస్టారికా అధ్యక్షుడిగా ఉన్నారు. రెండో పదవీకాలంలో అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ప్రోత్సహించారు. 2007లో తైవాన్‌కు దూరమై చైనాతో దౌత్య సంబంధాలను ఏర్పరచుకున్నారు.

కోస్టారికా అధ్యక్షుడు రోడ్రిగో చావెజ్ అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గి దేశంలో 5జీ సదుపాయాల అభివృద్ధి పనుల నుంచి చైనా సంస్థలను పక్కన పెట్టారు. దీన్ని వ్యతిరేకించిన ముగ్గురు కోస్టారిక చట్టసభ సభ్యుల వీసాలను అమెరికా రద్దు చేసింది. ఈ పరిణామాలపై అరియాస్ మండిపడ్డారు. అమెరికా ఒత్తిడికి రోడ్రిగో లొంగుతున్నారని సోషల్ మీడియా వేదికగా దుయ్యబట్టారు. ''ఒక చిన్న దేశం అమెరికాతో విభేదించడం సులువు కాదు. అందులోనూ అమెరికా అధ్యక్షుడు రోమన్ చక్రవర్తిలా ప్రవర్తిస్తూ మిగతా ప్రపంచానికి ఏం చేయాలో, ఏం చేయొద్దో పొద్దస్తమానం చెబుతున్నప్పుడు మరింత కష్టం''అంటూ ఎద్దేవా చేశారు. కోస్టారికాకు చెందిన మరో ప్రతిపక్ష శాసనసభ్యురాలి వీసాను కూడా అమెరికా మంగళవారం రద్దు చేసింది.

డోజ్ నుంచి వైదొలగను: మస్క్



వాషింగ్టన్: అమెరికా ప్రభుత్వ బాధ్యతల నుంచి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) సారథ్యం నుంచి వైదొలగుతున్నట్లు వస్తున్న వార్తలను టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ ఖండించారు. ''అవన్నీ పుకార్లే. పని పూర్తయ్యేదాకా పదవిలో కొనసాగుతా''అని ఎక్స్ పోస్టులో స్పష్టం చేశారు. వైట్‌హౌస్ కూడా ఈ వార్తలను ఖండించింది. ''అవన్నీ చెత్త వార్తలు. పదవీకాలం పూర్తయ్యాకే మస్క్ తన బాధ్యతల నుంచి వైదొలుగుతారు. మస్క్, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇద్దరూ ఈ మేరకు గతంలోనే బహిరంగంగా ప్రకటించారు''అని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లివిట్ అన్నారు. ట్రంప్ అంతర్గత వ్యవహారాల నుంచి మస్క్ పూర్తిగా తప్పుకుంటారని ఎవరైనా అనుకుంటే అది వాళ్లను వాళ్లు మోసగించుకోవడమేనని సీనియర్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఒకరన్నారు. డోజ్ నుంచి మస్క్ కొద్ది వారాల్లో తప్పుకుంటారని ట్రంప్ స్వయంగా కేబినెట్‌కు తెలిపినట్లు పొలిటికో నివేదిక పేర్కొనడం తెలిసిందే. ''ఆయన త్వరలో సొంత వ్యాపారాలపై పూర్తిగా దృష్టి పెట్టనున్నారు. అందుకు ట్రంప్ కూడా అంగీకరించారు. మస్క్ ఇక అనధికారిక సలహాదారు పాత్ర పోషిస్తారు''అని చెప్పుకొచ్చింది.

జనవరిలో డోజ్ బాధ్యతలు చేపట్టిన మస్క్ ఫెడరల్ వ్యయాలను తగ్గింపు, ప్రభుత్వోద్యోగుల ఉద్వాసనలో దూకుడుగా వ్యవహరిస్తున్నారు. అమెరికాను సమూలంగా మెరుగు పరచడానికి ఈ చర్యలు అవసరమంటున్నారు. ఆయన నాయకత్వంలో డోజ్ ఇప్పటికే ప్రభుత్వ కాంట్రాక్టులు, శ్రామిక శక్తిలో భారీ కోతలు పెట్టింది. ఇవన్నీ అంతిమంగా ప్రభుత్వానికి లక్ష కోట్ల డాలర్ల దాకా ఆదా చేయగలవని పలు నివేదికలు అంచనా వేస్తునఆనయి. ప్రత్యేక ప్రభుత్వోద్యోగిగా మస్క్ పదవీ కాలం మే నెలాఖరుతో ముగియనుందని భావిస్తున్నారు. ఆలోగా ఫెడరల్ వ్యయాన్ని లక్ష కోట్ల డాలర్ల మేరకు తగ్గించే పనిని పూర్తి చేయగలనని ఆయన చెబుతున్నారు.

ప్రతీకారం తప్పదు

ట్రంప్ సుంకాలపై దేశాల ధ్వజం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన తాజా టారిఫ్‌లపై ప్రపంచ దేశాలన్నీ మండిపడుతున్నాయి. ప్రపంచ వాణిజ్య యుద్ధానికి తెర తీశారంటూ దుయ్యబడుతున్నాయి. ప్రతీకారం తప్పదని ఆయా దేశాల అధినేతలు స్పష్టం చేశారు. వాణిజ్య యుద్ధాలు ఇరు పక్షాలను దెబ్బ తీస్తాయని జర్మనీ హెచ్చరించింది. తమపై ట్రంప్ విధించిన 10 శాతం సుంకాన్ని ఎదుర్కోవడానికి లాటిన్ అమెరికాలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన బ్రెజిల్ బుధవారం ఒక చట్టాన్ని ఆమోదించింది.

దెబ్బకు దెబ్బ: ఈయూ

యూరోపియన్ యూనియన్‌పై 20 శాతం సుంకాలను యూరప్ దేశాలన్నీ తీవ్రంగా ఖండించాయి. ఇది పూర్తిగా అన్యాయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ''అమెరికా వస్తువులకు ఈయూ అతి పెద్ద మార్కెటని ట్రంప్ మర్చిపోయినట్టున్నారు. యూఎస్‌పై ప్రతీకార సుంకాలు విధిస్తాం''అని హెచ్చరించాయి. ''ఈయూ ఉక్కుపై అమెరికా సుంకాలకు ప్రతిస్పందనగా ప్రతీకార ప్యాకేజీని ఖరారు చేస్తున్నట్టు ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా వాండెడెర్ లెయన్ ప్రకటించారు. చర్చలు విఫలమైతే తమ ప్రయోజనాలను, వ్యాపారాలను రక్షించుకోవడానికి మరిన్ని ప్రతీకార సుంకాలు తప్పవని స్పష్టం చేశారు. అయితే ఈ సుంకాల యుద్ధంతో అంతిమంగా నష్టపోయేది ప్రపంచ ఆర్థిక వ్యవస్థేనంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

...సమరమే: కెనడా

ప్రపంచ వాణిజ్య వ్యవస్థనే అతలాకుతలం చేసే ట్రంప్ సుంకాలపై పోరాడతామని కెనడా ప్రధాని మార్క్ కార్నీ ప్రతిజ్ఞ చేశారు. ఇతర దేశాలతో పోలిస్తే కెనడాపై తాజా టారిఫ్‌ల ప్రభావం పరిమితమే. అయినా ఉక్కు, అల్యూమినియం, ఆటోమొబైల్స్‌పై అమెరికా సుంకాలు లక్షలాది కెనడియన్లను నేరుగా ప్రభావితం చేస్తాయని కార్నీ ఆక్షేపించారు. ఈ సుంకాలను ప్రతిదాడులతో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

మంచిది కాదు: బ్రిటన్

వాణిజ్య యుద్ధం ఎవరికీ మంచిది కాదని బ్రిటన్ ప్రధాని కియిర్ స్టార్మర్ వ్యాఖ్యానించారు. ''అన్ని పరిస్థితులకూ మేం సిద్ధంగా ఉన్నాం. ప్రతిస్పందనగా మావైపు నుంచి ఏ చర్యలనూ తోసిపుచ్చలేం''అని పార్లమెంటుకు చెప్పారు.

విచారకరం: జపాన్

ఈ దిగుమతి సుంకాలు చాలా విచారకరమని జపాన్ వ్యాఖ్యానించింది. అవి ప్రపంచ వాణిజ్య సంస్థ, యూఎస్-జపాన్ ఒప్పందాలను ఉల్లంఘించడమేనని పేర్కొంది. అమెరికా తమపై విధించిన 36 శాతం సుంకంపై చర్చలు జరుపుతామని అయితే థాయిలాండ్ తెలిపింది. సుంకాల ప్రకటనకు ఒక రోజు ముందే.. అమెరికా దిగుమతులపై ఇజ్రాయెల్ అన్ని సుంకాలను రద్దు చేసినా.. ఫలితం లేకపోయింది. ఇజ్రాయెల్ వస్తువులపై ట్రంప్ 17 శాతం సుంకాలను విధించడంపై ఆ దేశం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

భారీ మూల్యం తప్పదు: ఆస్ట్రేలియా

ఆస్ట్రేలియా గొడ్డు మాంసంపై ట్రంప్ కఠిన ఆంక్షలు దారుణమని ప్రధాని ఆంటోనీ అల్బనీస్ విమర్శించారు. ఇందుకు అమెరికా ప్రజలు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. అయితే, ''మేం పరస్పర సుంకాలకు దిగబోం. అధిక ధరలకు, ఆర్థిక మందగమనానికి దారితీసే రేసులో చేరబోం''అని స్పష్టం చేశారు.

తక్షణం రద్దు చేయాలి: చైనా

ఏకపక్ష టారిఫ్‌లను అమెరికా తక్షణం రద్దు చేయాలని చైనా డిమాండ్ చేసింది. ప్రపంచ ఆర్థికాభివృద్ధికి ఇవి గొడ్డలి పెట్టని అభిప్రాయపడింది. అమెరికా ప్రయోజనాలతో పాటు అంతర్జాతీయ సరఫరా గొలుసులను కూడా దెబ్బతీస్తాయని హెచ్చరించింది. విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని అమెరికాకు సూచించింది.



వైట్ హౌస్‌లో బుధవారం టారిఫ్ ఉత్తర్వులపై సంతకం చేసినట్టు చూపుతున్న ట్రంప్

కంపెనీలను కాపాడుకుంటాం: స్పెయిన్

దేశీయ కంపెనీలను, పరిశ్రమలను, మొత్తంగా ఆర్థిక రంగాన్ని ఈ సుంకాల ప్రభావం బారినుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుని తీరతామని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ ప్రకటించారు. స్వేచ్ఛా వాణిజ్య ప్రపంచమే తమ లక్ష్యమన్నారు.

గొడవలొద్దు: స్వీడన్

వాణిజ్య అడ్డంకులను కోరుకోవడం లేదని స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెర్సన్ అన్నారు. ''మాకు వాణిజ్య యుద్ధం వద్దు. అమెరికాతో కలిసి వాణిజ్యం, సహకార మార్గంలో పయనించాలని, తద్వారా ఇరు దేశాల ప్రజలు మెరుగైన జీవితాన్ని ఆస్వాదించాలని కోరుకుంటున్నాం''అని చెప్పారు.

హానికరమైన సుంకాలు: ఇటలీ

ట్రంప్ సుంకాలను ఆయన మిత్రురాలు, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని ఘాటుగా విమర్శించారు. ఈ సుంకాలు హానికరమని హెచ్చరించారు, ''వాణిజ్య యుద్ధాన్ని నివారించాలి. అది తీవ్రతరం కాకముందే పరిష్కారం కోసం అమెరికా ప్రయత్నించాలి''అని సూచించారు.

ఆర్థిక సంక్షోభం: ఫ్రాన్స్

ట్రంప్ సుంకాలు అతి పెద్ద ఆర్థిక సంక్షోభానికి దారి తీస్తాయని ఫ్రాన్స్ ఆందోళన వెలిబుచ్చింది. ఫ్రెంచ్ వైన్, స్పిరిట్స్ ఎగుమతులపై ఇవి గణనీయ ప్రభావం చూపుతాయని ప్రభుత్వ ప్రతినిధి సోఫీ ప్రైమాస్ వ్యాఖ్యానించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

చర్చలే మార్గం: దక్షిణ కొరియా

ఈ సమస్యకు చర్చలే మార్గమని దక్షిణ కొరియా అభిప్రాయపడింది. ప్రపంచ వాణిజ్య యుద్ధం వాస్తవ రూపం దాల్చిందని తాత్కాలిక అధ్యక్షుడు హాన్ డక్ సూ అన్నారు. ఆర్థిక మంత్రి, ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష జరిపారు. ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి శక్తి సామర్థ్యాలన్నింటినీ ధారపోద్దామని చెప్పారు.

ఒకే రోజు జీరో అవర్‌లో 202 మంది ఎంపీల భాగస్వామ్యం

న్యూఢిల్లీ: లోక్‌సభలో గురువారం జీరో అవర్‌లో రికార్డు స్థాయిలో 202 మంది ఎంపీలు మాట్లాడారని లోక్‌సభ సచివాలయం వెల్లడించింది. ఐదు గంటల పాటు సాగిన జీరో అవర్‌లో 202 మంది ఎంపీలు భాగస్వాములయ్యారని వివరించింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చొరవతో జీరో అవర్‌ను పొడిగించి సాధ్యమైనంత మంది ఎక్కువ సభ్యులకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. గతంలో జులై 18, 2019న లోక్‌సభ జీరో అవర్‌లో అత్యధికంగా 161 మంది ఎంపీలు మాట్లాడారు. ఎంపీలు ముఖ్యమైన అంశాలను లేవనెత్తడానికి వీలుగా సాధ్యమైనంత మందికి అవకాశం కల్పిస్తానని బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో స్పీకర్ ఓం బిర్లా హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఏకంగా 202 మంది ఎంపీలు జీరో అవర్‌లో ప్రజా సమస్యలను లేవనెత్తారని లోక్‌సభ సచివాలయం తెలిపింది. బడ్జెట్ సెషన్ శుక్రవారంతో ముగియనుంది.

విపక్షాల వాకౌట్: మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో క్రైస్తవ మతప్రబోధకుడిపై దాడిని నిరసిస్తూ గురువారం విపక్షాలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశాయి. సభ సమావేశం కాగానే ఈ అంశంపై చర్చించాలని విపక్షాలు నినాదాలు చేశాయి. స్పీకర్ ఓం బిర్లా ఇందుకు సమ్మతించకపోవడంతో విపక్షాలు వాకౌట్ చేశాయి.

దేశాన్ని విభజించేందుకే వక్ఫ్ బిల్లు: మమత

కోల్‌కతా: దేశాన్ని మతపరంగా విభజించేందుకే బీజేపీ వక్ఫ్ సవరణ బిల్లును తెచ్చిందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. ప్రస్తుత బీజేపీ సర్కారును ఓడించి కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక.. వక్ఫ్ బిల్లు సవరణలను రద్దు చేస్తామని పేర్కొన్నారు. 12 గంటల సుదీర్ఘ చర్చ తర్వాత వక్ఫ్ బిల్లును లోక్‌సభ బుధవారం అర్ధరాత్రి ఆమోదించిన విషయం తెలిసిందే. విపక్ష కూటమి సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక బీజేపీ వక్ఫ్ చట్టానికి చేసిన సవరణలను రద్దు చేయడానికి తాము తాజా సవరణలు తెస్తామని మమత తెలిపారు. దేశాన్ని విభజించేందుకే బీజేపీ వక్ఫ్ సవరణ చట్టాన్ని తెచ్చిందని ఆరోపించారు. బీజేపీకి ఒకటే అజెండా ఉందని, విభజించి పాలించడమే వారి ఉద్దేశమని ధ్వజమెత్తారు.

డీఎన్‌ఏ నిర్ధారించేది పితృత్వాన్ని మాత్రమే..

ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యలు • రేప్ కేసు నిందితుడిపై కేసు కొట్టివేత

న్యూఢిల్లీ: డీఎన్‌ఏ నివేదికతో పితృత్వాన్ని మాత్రమే నిర్ధారించగలమని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. ఈ రిపోర్టుతో అత్యాచారం జరిగినట్లు రుజువు చేయలేమని స్పష్టం చేస్తూ ఈ కేసులో నిందితుడిని వదిలేసింది. బాధితురాలికి జన్మించిన సంతానానికి నిందితుడే తండ్రి అన్న విషయాన్ని డీఎన్‌ఏ నివేదికతో స్పష్టమైందని జస్టిస్ అమిత్ మహాజన్ పేర్కొన్నారు. సమ్మతి లేకుండా లైంగిక చర్యలో పాల్గొన్నట్లు రుజువులు చూపిస్తేనే ఐపీసీలోని సెక్షన్ 376 ప్రకారం అత్యాచారం కిందికి వస్తుందని మార్చి 20వ తేదీన విడుదల చేసిన తీర్పులో పేర్కొన్నారు. పొరుగింట్లో ఉండే వ్యక్తి లుడో గేమ్ ఆడటానికంటూ పిలిచి పలుమార్లు అత్యాచారం చేసినట్లు చెబుతున్న బాధితురాలు గర్భం దాల్చిన విషయం తెలిశాక కూడా అతడితో సంబంధం కొనసాగించిందని జడ్జి తెలిపారు. ఆమె ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు, వాస్తవానికి ఎంతో తేడా ఉందన్నారు. గర్భం దాల్చిన విషయం తెలిశాక కూడా చాలా ఆలస్యంగా ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. సామాజికపరమైన ఒత్తిళ్ల నేపథ్యంలోనే ఇలా చేసి ఉండొచ్చని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. పరస్పర అంగీకారంతోనే గర్భం దాల్చినందున తనపై రేప్ ఆరోపణలు చేయడం అన్యాయమంటూ పిటిషనర్ చేసిన వాదనతో న్యాయమూర్తి ఏకీభవించారు. 2022 డిసెంబర్‌లో దిగువ కోర్టు విధించిన పదేళ్ల జైలు శిక్షను రద్దు చేస్తూ తీర్పు వెలువరించారు.

సిరియాపై ఇజ్రాయెల్ దాడులు..

9 మంది మృత్యువాత

డెమాస్కస్: సిరియా దక్షిణ ప్రాంతంపై గురువారం ఇజ్రాయెల్ చేపట్టిన వైమానిక దాడుల్లో కనీసం 9 మంది మృతి చెందారు. మృతులందరూ సామాన్య పౌరులేనని సిరియా అధికార వార్తా సంస్థ సనా తెలపగా వారంతా దరా ప్రావిన్స్‌కు చెందిన సాయుధులని బ్రిటన్ కేంద్రంగా పనిచేసే సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ పేర్కొంది. హమాలోని వ్యూహాత్మక వైమానిక స్థావరంపై సహా సిరియా ఐదు నగరాలపై బుధవారం రాత్రి ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. తుర్కియే అనుకూల ఆపద్ధర్మ అధ్యక్షుడు అహ్మద్ అల్-షరాకు హమా వైమానిక స్థావరంతో ప్రయోజనాలున్నాయని పరిశీలకులు చెబుతున్నారు. దాడుల్లో ఎయిర్‌బేస్ పూర్తిగా నేలమట్టం కాగా పదుల సంఖ్యలో పౌరులు, మిలటరీ సిబ్బంది గాయపడినట్లు సిరియా విదేశాంగ శాఖ తెలిపింది. సిరియాలో తుర్కియే రక్షిత ప్రాంతాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. బషర్ పాలన అంతమయ్యాక ఇజ్రాయెల్ కూడా తమ సరిహద్దులకు సమీపంలోని సిరియాలో బఫర్ జోన్ ఏర్పాటు చేసుకోవడం తెల్సిందే.

బావిలో విష వాయువు పీల్చి 8 మంది మృతి

ఖాండ్వా: బావిని శుభ్రం చేసేందుకంటూ లోపలికి దిగిన ఎనిమిది మంది అనుమానాస్పద విష వాయువు పీల్చి మృత్యువాత పడ్డారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖాండ్వా జిల్లా ఛైగాన్ మఖాన్ ప్రాంతంలో గురువారం ఈ విషాదం చోటుచేసుకుంది. గంగౌర్ పండుగ సందర్భంగా విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు స్థానికంగా ఉన్న బావిని శుభ్రం చేసేందుకు ఎనిమిది మంది గ్రామస్తులు లోపలికి దిగి, అక్కడే విషవాయువు ప్రభావంతో ఊపిరాడక చనిపోయారు.

ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ దిశగా ఇస్రో అడుగులు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) భవిష్యత్తులో ప్రయోగించబోయే ఉపగ్రహాల్లో అపోజి ఇంధనం బదులుగా ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ రూపొందించుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇస్రో పరిధిలోని మహేంద్రగిరిలో వున్న ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో దీనికి సంబంధించి ప్రయోగాత్మక పరీక్షలను కూడా నిర్వహించారు. సాధారణంగా ఉపగ్రహాలను ముందుగా జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీఓ)లోకి స్థిర పరిచిన తరువాత అక్కడి నుంచి జియో ఆర్బిట్ (జీఓ)లోకి పంపించే క్రమంలో ఇప్పటి దాకా అపోజి ఇంధనాన్ని నింపి ప్రయోగిస్తూ వచ్చారు. ఈ స్థానంలో ఇప్పుడు ఎలక్ట్రిక్ ప్రొపల్షన్‌తో ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఇంజిన్ 300 మిల్లీ న్యూటన్స్ సామర్థ్యం కలిగిన స్టేషనరీ ప్లాస్మా థ్రస్టర్‌ను కలిగి 1,000 గంటల జీవిత కాలానికి ఉపయోగపడే విధంగా ప్రయోగాత్మక పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. భూమి నుంచి రాకెట్ ప్రయాణించాలంటే ద్రవ, ఘన ఇంధనాలు ఇచ్చినంత థ్రస్ట్‌ను ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ అందించదని అందుకే ఉపగ్రహాల్లో మాత్రమే నింపి దాని జీవిత కాలాన్ని పెంచేందుకు, అలాగే ఒక కక్ష్య నుంచి మరో కక్ష్యకు తరలించేందుకు ఎంతో ఉపయోగకరంగా వుంటుందని శాస్త్రవేత్తలు ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ ఇంజిన్లను రూపొందిస్తున్నారు.

వలసదారుల పడవలు మునిగి 16 మంది మృతి

ఏథెన్స్: తుర్కియే నుంచి వలసదారులతో బయలుదేరిన పడవలు గ్రీక్ తీరంలో మునిగిన ఘటనల్లో ముగ్గురు చిన్నారులు సహా 16 మంది జలసమాధి అయ్యారు. లెస్బోస్ దీవికి సమీపంలో గురువారం ఉదయం చోటుచేసుకున్న ఘటనలో రబ్బర్ డింగీ మునిగి ఏడుగురు చనిపోగా మరో 23 మందిని కాపాడినట్లు గ్రీస్ కోస్ట్ గార్డ్ తెలిపింది. వాతావరణం అనుకూలంగానే ఉన్నప్పటికీ పడవ మునగడానికి కారణాలు తెలియలేదని పేర్కొంది. బాధితులు ఏ దేశానికి చెందిన వారో తెలియాల్సి ఉంది. అదే ప్రాంతంలో మరో పడవ మునిగి 9 మంది మరణించినట్లు తుర్కియే కోస్ట్‌గార్డ్ తెలిపింది. ఒకరు గల్లంతవగా 25 మందిని కాపాడామంది.

జైల్లో నాపై విష ప్రయోగానికి ప్రయత్నం

'అగస్టా వెస్ట్‌ల్యాండ్' దళారి ఆరోపణ

న్యూఢిల్లీ: తిహార్ జైలులో తనపై విష ప్రయోగానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అగస్టా వెస్ట్‌ల్యాండ్ చాపర్ కుంభకోణం కేసులో మధ్యవర్తి క్రిస్టియన్ మైకేల్ జేమ్స్ ఆరోపించాడు. ఈ మేరకు అతడు వేసిన పిటిషన్‌పై సమాధానం చెప్పాలంటూ స్పెషల్ జడ్జి సంజీవ్ అగర్వాల్ తిహార్ జైలు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి చేపట్టిన చర్యలపై 16వ తేదీలోగా నివేదిక ఇవ్వాలన్నారు. బ్రిటిష్ పౌరుడైన జేమ్స్‌ను దుబాయ్ నుంచి 2018లో ప్రభుత్వం రప్పించింది. అగస్టా వెస్ట్‌ల్యాండ్ కొనుగోలులో దళారి జేమ్స్ రూ.225 కోట్లను ముడుపుగా అందుకున్నట్లు ఈడీ ఆరోపిస్తోంది.

బుల్లి పేస్ మేకర్

- బియ్యం గింజ కంటే చిన్నది
- సిరంజీ సూది మొనపై ఉంచొచ్చు
- అమెరికా పరిశోధకుల ఘనత



ప్రపంచంలోనే అత్యంత **సూక్ష్మమైన,** బియ్యం గింజ కంటే కూడా **బుల్లి పేస్ మేకర్‌**ను అమెరికా పరిశోధకు**లు అభి**వృద్ధి పరిచారు. నార్త్‌వెస్టర్న్ **యూ**నివర్సిటీకి చెందిన ఇంజనీ**ర్లు** గుండెను కృత్రిమంగా పని**చే**యించే ఈ చిన్న పరికరాన్ని రూపొందించారు. ఉపయోగం తీరాక శరీరంలోనే కలిసిపోవడం దీని మరో ప్రత్యేకత. శరీరంపై గాటు పెట్టాల్సిన అవసరమేమీ లేకుండా ఇంజెక్షన్ ద్వారానే దీనిని లోపలికి పంపించేయొచ్చు. జర్న**ల్** నేచర్‌లో ఈ వివరాలు తాజా**గా** ప్రచురితమయ్యాయి. **తాత్కాలిక** అవసరాలు కలిగిన శిశువుల**కు ఇది** ఎంతో ఉపయోగకరమని ని**పుణులు అం**టున్నారు. 'మేం రూపకల్ప**న చేసిన ఈ** డివైజ్ ప్రపంచంలోనే అత్య**ంత చిన్నదైన** పేస్ మేకర్‌గా భావిస్తున్నాం'అని నార్త్‌వెస్టర్న్ బయో ఎలక్ట్రానిక్స్ నిపుణుడు, బృంద సారథి జాన్ ఎ.రోజెర్స్ చెప్పారు. 'ముఖ్యంగా పీడియాట్రిక్ గుండె సర్జరీలకు సూక్ష్మంగా **ఉండటం ఎంతో** కీలకం. పేస్ మేకర్ ఎంత **చిన్నగా ఉంటే** అంత మంచిది'అని ఆయన **చెప్పారు.** చిన్నారులను దృష్టిలో ఉంచు**కునే ఈ** డివైజ్‌ను రూపొందించామని **నార్త్‌**వెస్టర్న్ కార్డియాలజిస్ట్ ఇగోర్ **ఎఫిమోవ్** చెప్పారు. 'దాదాపు ఒక శాతం శిశువులు పుట్టుకతోనే గుండె సంబంధ లోపాలతో ఉంటున్నారు. సర్జరీ తర్వాత **వీరికి తా**త్కాలిక పేస్ మేకర్ **అవ**సరమవుతుంది. దాదాపు **వారం** పాటు వీరి గుండెలు సొం**తంగా** రిపేర్ చేసుకుంటాయి. ఆ **కీలకమైన** సమయంలో ఈ చిన్న పేస్ **మేకర్ వారి**కి సహాయకారిగా ఉంటుంది. **ఆ తర్వాత ఆ**ది శరీరంలో కలిసిపోతుంది. **దీనిని తొల**గించడానికి మరో సర్జరీ చేయా**ల్సిన ఆవస**రం కూడా ఉండదు'అని ఎఫిమోవ్ వివరించారు.

ఇదెలా పని చేస్తుందంటే..?

ఛాతీపైన అమర్చే చాలా చిన్నగా ఉండే ఫ్లెక్సిబుల్, వైర్‌లెస్ ప్యాచ్‌లో ఈ పేస్ మేకర్ ఉంటుంది. గుండె స్పందనలు క్రమం తప్పినట్లు గుర్తించిన వెంటనే పేస్ మేకర్‌కు ఈ ప్యాచ్ సిగ్నల్ పంపించి, దానిని యాక్టివేట్ చేస్తుంది. ఇది ఇచ్చే సున్నితమైన స్పందనలు శరీరం, కండరాల ద్వారా అంది గుండె లయను క్రమబద్ధం చేస్తాయి. ఇందులోని అత్యంత సూక్ష్మమైన బ్యాటరీ శరీరంలోని ఫ్లూయిడ్లను ఉపయోగించుకుని విద్యుత్‌శక్తిని తయారు చేస్తుంది. దీనికి సాధారణంగా ఉండే ఎలాంటి వైర్లు అవసరం లేదు. దీని వల్ల ఇది చాలా సురక్షితంగా ఉంటుంది. సులభంగా పనిచేస్తుంది. ఇప్పటి వరకు తయారైన పేస్ మేకర్లు రేడియో సిగ్నళ్లపై ఆధారపడగా, ఈ కొత్త డివైజ్ కేవలం కాంతిని ఉపయోగించుకుని గుండె లయను నియంత్రించ గలుగుతుందని రోజెర్స్ చెప్పారు. జంతువులపైన, దాతల ద్వారా అందిన గుండెలపైన చేసిన ప్రయోగాలు సత్ఫలితాలనిచ్చాయని చెప్పారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

గాజాలో మరో 55 మంది మృత్యువాత

డెయిర్ అల్-బలాహ్: గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి నుంచి కొనసాగుతున్న దాడుల్లో 55 మంది ప్రాణాలు కోల్పోయారని గాజాలోని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. దక్షిణ ప్రాంత ఖాన్‌యూనిస్ నగరంపై జరిగిన దాడిలో ఐదుగురు చిన్నారులు, నలుగురు మహిళలు సహా 14 మంది అసువులు బాశారు. వీరిలో 9 మంది ఒకే కుటుంబానికి చెందిన వారని చెప్పాయి. ఖాన్ యూనిస్ సమీపంలో జరిగిన మరో ఘటనలో 1 నుంచి ఏడేళ్లలోపు ఐదుగురు చిన్నారులు, ఒక గర్భిణీ సహా 19 మంది మృతి చెందారు. గాజా నగరంపై జరిగిన దాడుల్లో ఏడుగురు పసికందులు సహా 21 మంది చనిపోయారని వెల్లడించాయి. పాలస్తీనా భూభాగంలో మరో రక్షణ కారిడార్‌ను ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం గాజాలో పెద్ద విస్తీర్ణంలో భూభాగాన్ని ఆక్రమించుకుంటామని బుధవారం ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ దాడులు జరగడం గమనార్హం. రఫా, ఖాన్ యూనిస్ నగరాల మధ్య కొత్తగా ఏర్పాటయ్యే 'మొరాగ్ కారిడార్' కూడా మధ్యధరా సముద్రంపైపే ఉంటుందని తెలిపింది. బందీలందరినీ హమాస్ విడిచిపెట్టే వరకు దాడులు ఆపేది లేదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే గురువారం జడీదా, షుజైయా, తుర్కోమెన్, జెటౌన్ ప్రాంతాల్లోని పాలస్తీనియన్లను ఖాళీ చేసి వెళ్లిపోవాల్సిందిగా ఆదేశించింది. లేకుంటే ఆర్మీ బలవంతంగానైనా వెళ్లగొడుతుందని స్పష్టం చేసింది. వీరంతా గాజా నగరంలోని షెల్టర్లలోకి తరలి వెళ్లాలని హుకుం జారీ చేసింది. కారిడార్ ఏర్పాటు కోసం ఇజ్రాయెల్ చేస్తున్న అమానవీయ ప్రయత్నాలను హమాస్ తీవ్రంగా ఖండించింది.

గుజరాత్‌లో కూలిన యుద్ధ విమానం

ఒక పైలట్ మృతి, మరొకరికి గాయాలు



కూలిన విమాన శకలాలు

జామ్‌నగర్: గుజరాత్‌లో జాగ్వార్ యుద్ధ విమానం గురువారం కూలిపోయింది. ఈ ఘటనలో ఒక పైలట్ తీవ్రంగా గాయపడి మృతి చెందారు. మరో పైలట్ గాయాలపాలై చికిత్స పొందుతున్నారు. శిక్షణలో ఈ ఫైటర్ జెట్ బుధవారం రాత్రి 9.30 సమయంలో జామ్‌నగర్‌కు 12 కిలోమీటర్ల దూరంలోని సువర్దా గ్రామ సమీపంలో కూలి ముక్కలైంది. కాక్‌పిట్, వెనక భాగం ఎగిరి పడ్డాయి. అనంతరం మంటల్లో కాలిపోయింది. ప్రమాదానికి సంబంధించిన వీడియోలు వైరలవుతున్నాయి. ప్రమాద కారణాలపై వైమానిక దళం విచారణకు ఆదేశించింది. విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో పైలట్లు అందులోంచి బయటపడ్డారు. అయితే స్థానిక ప్రజలకు హాని జరగకుండా జాగ్రత్త పడ్డారు. దాంతో పౌరులకు ప్రాణనష్టం జరగలేదు'' అని పేర్కొంది. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించింది.

అప్‌గ్రేడ్ చేసినా...: కొన్నేళ్లుగా జాగ్వార్ యుద్ధ విమాన ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఇటీవలే హరియాణాలో ఓ జాగ్వార్ కూలిపోయింది. అది జనసమ్మర్థ ప్రాంతాలపై పడకుండా పైలట్ చాకచక్యంగా వ్యవహరించి సురక్షితంగా బయటపడ్డారు. బ్రిటిష్-ఫ్రెంచ్ సూపర్‌సానిక్ జెట్ అటాక్ ఎయిర్ క్రాఫ్ట్ అయిన జాగ్వార్‌లది మన వైమానిక దళంలో కీలక పాత్ర. వీటిని 1979ల నుంచీ కొనుగోలు చేస్తున్నారు. రెండు ఇంజన్లుండే ఈ యుద్ధ విమానాన్ని చాలాసార్లు ఆధునీకరించారు. వీటిని ప్రధానంగా భూతల దాడుల కోసం వాడతారు. వైమానిక దళం వద్ద 121 జాగ్వార్ విమానాలున్నాయి. వీటిని 2031 నాటికి క్రమంగా హెచ్‌ఏఎల్ తయారు చేస్తున్న తేజస్ ఎంకే 1ఏ విమానాలతో భర్తీ చేయాలన్నది ఆలోచన.

రాజ్యసభలో గరిష్ట ప్రాతినిధ్యం ఉన్న రాష్ట్రం?

భారత రాజ్యాంగ పరిషత్ మొదట ఉప రాష్ట్రపతి పదవిని కల్పించలేదు. రాజ్యాంగ పరిషత్ ముఖ్య న్యాయ సలహాదారుడైన బెనగళ నర్సింగరావు చొరవతో ఈ పదవిని ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి మరణించినా, సెలవులో ఉన్నా లేదా విధులు నిర్వర్తించలేని పరిస్థితిలో ఉన్నా కొత్త రాష్ట్రపతి ఎన్నికయ్యేంత వరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పార్లమెంట్‌లోని సభాధ్యక్షులు ఒక కమిటీగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వ పరిపాలన నిర్వహించాలని ఆయన సూచించారు. ఆ తర్వాత జరిగిన చర్చల ఫలితంగా హెచ్.వి. కామత్ తదితరులు ఉప రాష్ట్రపతి పదవి ఏర్పాటుకు కృషి చేశారు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ



భారత పార్లమెంట్

కేంద్ర స్థాయిలో శాసన నిర్మాణ శాఖ అంటే పార్లమెంట్ (సంసద్). రాజ్యాంగంలోని 79వ అధికరణం ప్రకారం పార్లమెంట్ అంటే లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రపతి. రాజ్యాంగంలో అయిదో భాగంలోని రెండో అధ్యాయంలో 79 నుంచి 122 వరకు ఉన్న అధికరణలు భారత పార్లమెంట్ నిర్మాణం, అధికారాలు, విధుల గురించి పేర్కొంటున్నాయి.

- భారతదేశంలో 1952 నుంచి 1962 వరకు ద్విసభ్య నియోజకవర్గాలను ఏర్పాటు చేసేవారు.
- బ్రిటిష్ పార్లమెంట్‌లా భారతదేశ పార్లమెంట్‌కు సార్వభౌమాధికారం లేదు.
- 1954లో మొదటి లోక్‌సభ స్పీకర్ జి.వి. మౌలాంకర్ (గణేష్ వాసుదేవ్ మౌలాంకర్) ప్రజా ప్రతినిధుల సభకు లోక్‌సభ అని, రాష్ట్రాల మండలికి రాజ్యసభ అని నామకరణం చేశాడు.
- రాజ్యాంగంలో రాజ్యసభకు 'కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్', లోక్‌సభకు 'హౌస్ ఆఫ్ ది పీపుల్' అనే పదాలను ఉపయోగించారు. కానీ హిందీ భాషా పదాలైన రాజ్యసభ, లోక్‌సభ అనే పదాలే జన బాహుళ్యంలో వాడుకలోకి వచ్చాయి.

రాజ్యసభ

భారత రాజ్యాంగంలోని 80వ అధికరణను అనుసరించి రాజ్యసభను ఏర్పాటు చేశారు. రాజ్యాంగ పండితులు దీన్ని 'ఎగువసభ', 'రాష్ట్రాల పరిషత్', 'పెద్దల సభ'గా వర్ణించారు.

- రాజ్యసభ 1952 ఏప్రిల్ 3న ఏర్పాటైంది.
- రాజ్యసభ తొలి సమావేశాన్ని 1952 మే 13న నిర్వహించారు.
- హిందీలో 'రాజ్య' అంటే రాష్ట్రం అని అర్థం. అందువల్ల రాజ్యసభ అంటే రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే సభగా పేర్కొనవచ్చు.
- రాజ్యాంగం ప్రకారం రాజ్యసభ గరిష్ట సభ్యుల సంఖ్య 250 మంది. ప్రస్తుతం రాజ్యసభలో 245 మంది సభ్యులున్నారు.
- ప్రస్తుతం 4వ షెడ్యూల్ ప్రకారం మొత్తం రాజ్యసభకు కేటాయించిన సభ్యుల సంఖ్య 233. సాహిత్యం, కళలు, శాస్త్ర విజ్ఞానం, సామాజిక సేవ మొదలైన రంగాల్లో విశేషానుభవం ఉన్న 12 మంది సభ్యులను 80(3)వ అధికరణం ప్రకారం రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు.
- రాజ్యాంగంలోని 80(2)వ అధికరణం ప్రకారం రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహించే రాజ్యసభ సభ్యులను రాష్ట్రాల అసెంబ్లీల సభ్యులు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతి ప్రకారం ఎన్నుకుంటారు.
- 80(4)వ అధికరణం ప్రకారం పార్లమెంట్ రూపొందించిన చట్టం ఆధారంగా రాజ్యసభలో కేంద్రపాలిత ప్రాంతాల ప్రాతినిధ్యం ఉంటుంది.
- 80(5)వ అధికరణం ప్రకారం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీట్ల కేటాయింపు రాజ్యాంగంలోని 4వ షెడ్యూల్ ప్రకారం జరగాలి.
- భారత రాజ్యాంగం సమాఖ్య విధానాన్ని అనుసరిస్తోంది. కాబట్టి పార్లమెంట్‌లో రాష్ట్రాల ప్రాతినిధ్యం అవసరమైంది. ఈ కారణంగా రాజ్యసభను ఏర్పాటు చేశారు.
- 'ప్రతి రాష్ట్రం నుంచి ఎగువ సభలో సమాన ప్రాతినిధ్య పద్ధతి' అనే అమెరికా సమాఖ్యకు చెందిన విధానం మన రాజ్యాంగంలో లేదు.
- 4వ షెడ్యూల్‌లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జనాభా ఆధారంగా రాజ్యసభలో ప్రతినిధుల సంఖ్యను నిర్ణయించారు.
- ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు కేటాయించిన సభ్యుల సంఖ్య 31 మంది.
- నాగాలాండ్, మణిపూర్ నుంచి ఒక్కో సభ్యుడిని మాత్రమే కేటాయించారు.
- రాజ్యసభకు నిర్వహించే ఎన్నికల పద్ధతిని దక్షిణాఫ్రికా రాజ్యాంగం నుంచి స్వీకరించారు.

రాజ్యసభకు పోటీ చేయడానికి కావాల్సిన అర్హతలు:

1. భారతదేశ పౌరుడై ఉండాలి.
2. వయసు కనీసం 30 ఏళ్లు ఉండాలి.
3. ఆదాయాన్ని పొందే ప్రభుత్వ ఉద్యోగం చేయకూడదు.
4. పార్లమెంట్ చట్టాలరీత్యా నిర్దేశించిన ఇతర అర్హతలు కలిగి ఉండాలి.

శాశ్వత సభ: లోక్‌సభలా రాజ్యసభకు నిర్ణీత కాల పరిమితి ఉండదు. ఇది శాశ్వత సభ. ఇది రద్దు కాదు. మొత్తం సభ్యుల్లో మూడో వంతు సభ్యులు ప్రతి రెండేళ్లకు ఒకసారి పదవీ విరమణ చేస్తారు. వీరి స్థానంలో కొత్త సభ్యులను ఎన్నుకుంటారు. పదవీ విరమణ చేసిన సభ్యులు తిరిగి పోటీ చేయవచ్చు. ఒక్కో సభ్యుడు ఆరేళ్లు కొనసాగుతాడు.

- అధికరణ 83(1) ప్రకారం రాజ్యసభ కాలపరిమితి గురించి వివరించారు.
- 89వ అధికరణం ప్రకారం రాజ్యసభకు ఎక్స్-అఫీషియో చైర్మన్‌గా ఉప రాష్ట్రపతి వ్యవహరిస్తారు. ఈయనకు నిర్ణాయక ఓటు ఉంటుంది.
- రాజ్యసభ సభ్యులు తమలో నుంచి ఒకరిని డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నుకుంటారు.
- మొదటి రాజ్యసభ చైర్మన్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్.
- మొదటి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ - ఎస్.వి. కృష్ణమూర్తి రావు.
- రాజ్యసభ సమావేశానికి కావాల్సిన కనిష్ఠ సభ్యుల సంఖ్యను 'కోరమ్' అంటారు. మొత్తం సభ్యుల్లో పదో వంతును కోరమ్‌గా పరిగణిస్తున్నారు.

రాజ్యసభ ప్రత్యేక అధికారాలు:

1. 67వ అధికరణం ప్రకారం ఉప రాష్ట్రపతిని తొలగించే తీర్మానాన్ని ముందుగా రాజ్యసభలోనే ప్రవేశపెట్టాలి.
2. అధికరణ 249 ప్రకారం రాష్ట్ర జాబితాలోని ఏదైనా అంశానికి జాతీయ ప్రాముఖ్యం ఉందని భావించి రాజ్యసభ 2/3వ వంతు మెజార్టీతో తీర్మానాన్ని ఆమోదిస్తే ఏడాది కాలానికి చెల్లుబాటయ్యే విధంగా శాసనం చేయవచ్చు.
3. అధికరణ-312 ప్రకారం నూతన అఖిల భారత సర్వీసులను ఏర్పాటు చేయడానికి సంబంధించిన బిల్లు ముందుగా రాజ్యసభ ఆమోదం పొందాలి.

- రాజ్యసభలో ప్రాతినిధ్యం ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు - ఢిల్లీ, పుదుచ్చేరి.
- జాతీయ అత్యవసర పరిస్థితి విధింపునకు సంబంధించిన తీర్మానాన్ని రాజ్యసభ ఒక నెల లోపు ఆమోదించాలి.
- రాష్ట్రపతి పాలనకు సంబంధించిన తీర్మానాన్ని రాజ్యసభ రెండు నెలల్లోపు ఆమోదించాలి.
- లోక్‌సభ ఆమోదించిన ఆర్థిక బిల్లులను రాజ్యసభ 14 రోజుల్లోపు ఆమోదించాలి.

రాజ్యసభలో అత్యధిక స్థానాలున్న రాష్ట్రాలు:

రాష్ట్రం	సభ్యులు
1. ఉత్తరప్రదేశ్	31
2. మహారాష్ట్ర	19
3. తమిళనాడు	18
4. పశ్చిమ బెంగాల్	16
5. బీహార్	16
6. కర్ణాటక	12
7. ఆంధ్రప్రదేశ్	11
8. మధ్యప్రదేశ్	11
9. గుజరాత్	11

- **రాజ్యసభలో ఒక సభ్యుడిని మాత్రమే కలిగి ఉన్న రాష్ట్రాలు:** అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మిజోరాం, నాగాలాండ్, గోవా, మేఘాలయా, సిక్కిం, త్రిపుర.
- కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి నుంచి రాజ్యసభకు ఒక సభ్యుడు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
- ఢిల్లీ (కేంద్రపాలిత ప్రాంతం) నుంచి రాజ్యసభకు ముగ్గురు సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
- తెలంగాణ, అసోం, పంజాబ్ రాష్ట్రాల నుంచి ఏడుగురు సభ్యుల చొప్పున రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

రాజ్యసభ చైర్మన్: పార్లమెంట్‌లోని ఉభయసభలను నిర్వహించడానికి విడివిడిగా సభాధ్యక్షులు ఉంటారు. 89వ అధికరణం ప్రకారం భారత ఉప రాష్ట్రపతి రాజ్యసభకు చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

- ఏ కారణంగానైనా రాజ్యసభ చైర్మన్ అందుబాటులో లేనప్పుడు డిప్యూటీ చైర్మన్ సభను నిర్వహిస్తారు.
- రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ కూడా అందుబాటులో లేనప్పుడు సభా నియమావళి ప్రకారం ఎంపిక చేసిన ఒక సీనియర్ సభ్యుడు సమావేశాలను నిర్వహిస్తారు.
- రాజ్యాంగంలో 89 నుంచి 92 వరకు ఉన్న అధికరణలు రాజ్యసభ సభాధ్యక్షుల ఎన్నిక, రాజీనామా, సమావేశాలకు సంబంధించిన వివరాలను తెలుపుతున్నాయి.
- అధికరణ 97 ప్రకారం రాజ్యసభ చైర్మన్ హోదాలో ప్రస్తుతం ఉప రాష్ట్రపతి నెలకు రూ.4 లక్షలు వేతనం పొందుతున్నారు. ఇతర సౌకర్యాలు, పెన్షన్ మొదలైన సదుపాయాలు కూడా ఉంటాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఇస్రో బెంగళూరులో 23 జేఆర్‌ఎఫ్‌లు

బెంగళూరులోని ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో).. జూనియర్ రీసెర్చ్ ఫెలో, రీసెర్చ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 23.
- **ఖాళీల వివరాలు:** జూనియర్ రీసెర్చ్ ఫెలోలు (జేఆర్‌ఎఫ్)-21, రీసెర్చ్ అసోసియేట్-02
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్, ఎంఎస్సీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 20.04.2025 నాటికి జూనియర్ రీసెర్చ్ ఫెలోకు 28 ఏళ్లు, రీసెర్చ్ అసోసియేట్‌కు 35 ఏళ్లలోపు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** జూనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.37,000, రీసెర్చ్ అసోసియేట్‌కు రూ.58,000.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 20.04.2025.
- **వెబ్‌సైట్:** https://www.isro.gov.in

ఎన్‌ఎల్‌యూ నాగ్‌పూర్‌లో 17 పోస్టులు

నాగ్‌పూర్‌లోని నేషనల్ లా యూనివర్శిటీ (ఎన్‌ఎల్‌యూ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 17.
- **పోస్టుల వివరాలు:** డిప్యూటీ లైబ్రేరియన్-01, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్-01, డిప్యూటీ రిజిస్ట్రార్-02, ఇంజనీర్ కమ్ ఎస్టేట్ ఆఫీసర్-01, అసిస్టెంట్ రిజిస్ట్రార్-02, ప్లేస్‌మెంట్ ఆఫీసర్-01, ఫిజికల్ ఎడ్యుకేషన్ కమ్ స్పోర్ట్స్ ఆఫీసర్-01, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-05, లైబ్రరీ రిస్టోరర్-02, జూనియర్ గార్డెనర్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ, బీటెక్(సివిల్), ఎంబీఏ, ఎల్ఎల్ఎం, డిగ్రీ, ఎనిమిదో తరగతి ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 18 నుంచి 38 ఏళ్లు ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 15.04.2025.
- **వెబ్‌సైట్:** https://nlunagpur.ac.in

భారత విమానయాన పితామహుడెవరు?

వివిధ దేశాల మధ్య ప్రయాణించడానికి రోజులు, నెలల సమయం తీసుకునే పరిస్థితి నుంచి ప్రపంచంలోని ఏ సుదూర ప్రాంతానికైనా కేవలం ఒక రోజులోనే చేరగలగడాన్ని సుసాధ్యం చేసింది వాయు రవాణా. అమెరికాకు చెందిన రైట్ సోదరులు 1903లో తొలిసారిగా విమానాన్ని రూపొందించారు. ఈ విధంగా ప్రారంభమైన విమానయానం రవాణా వ్యవస్థ స్వరూపాన్నే పూర్తిగా మార్చేసింది.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ



భారతదేశం - వాయు రవాణా

ఆధునిక ప్రపంచంలో రవాణా వ్యవస్థలో వాయు రవాణా ప్రాముఖ పాత్ర పోషిస్తోంది. ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి తక్కువ సమయంలో ప్రయాణించడానికి,సరకుల రవాణాకు విమానాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పశ్చిమ దేశాల నుంచి తూర్పు దేశాలకు వెళ్లే విమాన మార్గాలన్నీ మనదేశం మీదుగా వెళ్తున్నాయి. భారతదేశ శీతోష్ణస్థితి విమానయానానికి అనుకూలం.

భారతదేశంలో మొట్టమొదటి ఎయిర్ మెయిల్ సర్వీస్ 1911లో అలహాబాద్ - నైనిటాల్ మధ్య ప్రారంభమైంది. ఈ రెండు ప్రదేశాల మధ్య దూరం 10 కి.మీ. ఈ విమానాన్ని హెన్రీ ఫికిట్ నడిపాడు. మన దేశంలో 1911లోనే విమాన రవాణా ప్రారంభమైనప్పటికీ అది వ్యవస్థీకృతం కాలేదు. 1920లో 'టాటా సన్స్' సంస్థ కొన్ని ఎయిర్ డ్రోమ్‌లను ప్రారంభించింది. అప్పట్నుంచి మనదేశంలో విమాన రవాణా వ్యవస్థీకృతమైంది.

1932లో జె.ఆర్.డి.టాటా కరాచీ - ముంబై నగరాల మధ్య మొదటి విమానాన్ని నడిపారు. జె.ఆర్.డి.టాటాను భారతదేశ విమానయాన పితామహుడిగా వ్యవహరిస్తారు.

భారతదేశంలో విమాన సర్వీసుల ఏర్పాటు కోసం 1950లో 'రాజాధ్యక్ష' కమిటీని భారత ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ సూచనల ప్రకారం 1953లో వాయు రవాణాను జాతీయం చేశారు. 1953లో రెండు ఎయిర్ కార్పొరేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అవి:

1. ఎయిర్ ఇండియా (విదేశీ సర్వీసుల కోసం)
2. ఇండియన్ ఎయిర్‌లైన్స్ (స్వదేశీ సర్వీసుల కోసం)

మన దేశంలో 'వాయుదూత్' సర్వీసులను 1981లో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం దేశంలోని వాయు రవాణాను కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు. 1990 ఏప్రిల్‌లో దేశ విమాన రవాణాలో ప్రైవేట్ వైమానిక సంస్థలను అనుమతించడానికి 'ఓపెన్ స్కై' పాలసీని ప్రవేశపెట్టారు.

ఎయిర్ ఇండియా:

- ఇది ఖండాంతర విమానయాన సర్వీసులను నడుపుతుంది. ఎయిర్ ఇండియా మస్కట్ 'మహారాజా' దీన్ని 'ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా' నిర్వహించేది. ఈ సంస్థ అన్ని ఖండాల్లోని దాదాపు 90 దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యంగా అమెరికా, కెనడా, యూరప్, రష్యా, గల్ఫ్, తూర్పు ఆసియా, పశ్చిమాసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియాలకు సర్వీసులు నడుపుతోంది. వీటిలో గల్ఫ్‌రూటు లాభదాయకం.
- భారతదేశంలో ఎక్కువ అంతర్జాతీయ విమానాశ్రయాలు కేరళలో ఉన్నాయి.
- దేశంలో విమానాశ్రయాలు గుజరాత్‌లో ఎక్కువగా ఉన్నాయి.

ఇండియన్ ఎయిర్‌లైన్స్:

- ఈ సంస్థ దేశంలోని వివిధ నగరాలు, పట్టణాలకు విమానాలను నడుపుతోంది. 19 పొరుగు దేశాలకు సర్వీసులను అందిస్తోంది. 2005లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ తన బ్రాండ్ పేరును 'ఇండియన్'గా మార్చింది. దీని మస్కట్ కోణార్క్ సూర్య దేవాలయంలోని రథ చక్రం. దేశంలోని సాధారణ విమానాశ్రయాలను 'నేషనల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా' నిర్వహించేది.

వాయుదూత్:

సరకుల రవాణా కోసం 1981 లో దీన్ని ప్రారంభించారు. ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాలు నడవని ప్రాంతాలు, ముఖ్యంగా దట్టమైన అడవులున్న ఈశాన్య ప్రాంతాలకు ప్రయాణికుల కోసం ఈ సర్వీసులను ఉపయోగించారు. దీన్ని 1993లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో విలీనం చేశారు.

పవన్‌హన్స్ లిమిటెడ్:

దీన్ని 1985 అక్టోబర్ 15న స్థాపించారు. దీని కేంద్ర కార్యాలయం ఢిల్లీలో ఉంది. పెట్రోలియం స్థావరాలకు సహాయం కోసం ఇది ఏర్పాటైంది. తర్వాతి కాలంలో కొండ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలు, ఎన్టీపీసీ, గెయిల్, బీఎస్‌ఎఫ్ లాంటి సంస్థలకు సేవలందించేందుకు విస్తరించారు.

- ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీలో పైలట్లకు శిక్షణ ఇస్తారు. ఇది ఉత్తర ప్రదేశ్‌లోని ఫుర్సత్‌గంజ్‌లో ఉంది. మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఆధ్వర్యంలో ఇది పనిచేస్తోంది.
- బెంగళూరులోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ విమానాల తయారీ, రిపేర్లను నిర్వహిస్తోంది.

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా:

నేషనల్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలను విలీనం చేసి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాను 1995 ఏప్రిల్ 1న ఏర్పాటు చేశారు.

- ప్రస్తుతం ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (AAI) కింద మూడు సంస్థలు పనిచేస్తున్నాయి. అవి
  1. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ డివిజన్
  2. నేషనల్ ఎయిర్‌పోర్ట్ డివిజన్
  3. ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్
- 1990లో ప్రవేశపెట్టిన ఓపెన్ స్కై పాలసీ వల్ల ప్రైవేటు రంగంలో 8 ప్యాసింజర్ ఎయిర్‌వేస్ ప్రారంభమయ్యాయి. అవి
  1. జెట్ ఎయిర్‌వేస్ 2. కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్
  3. ఇండిగో ఎయిర్‌వేస్ 4. స్పైస్‌జెట్
  5. జెట్‌లైట్ 6. గో ఎయిర్‌వేస్
  7. పారామౌంట్ ఎయిర్‌వేస్
  8. దక్కన్ ఏవియేషన్

అంతర్జాతీయ విమానాశ్రయాలు

1. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (పాతపేరు పాలెం)	న్యూఢిల్లీ
2. నేతాజీ సుభాస్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం (పాతపేరు - డమ్‌డమ్)	కోల్‌కతా
3. ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం (పాతపేరు శాంతాక్రాజ్, సహారా)	ముంబై (మహారాష్ట్ర)
4. అన్నాదురై అంతర్జాతీయ విమానాశ్రయం (పాతపేరు మీనంబాకం)	చెన్నై (తమిళనాడు)
5. నెడుంబస్సేరి అంతర్జాతీయ విమానాశ్రయం	తిరువనంతపురం (కేరళ)
6. గురురామ్‌దాస్‌జీ/రాజాసాన్సీ అంతర్జాతీయ విమానాశ్రయం	అమృత్‌సర్ (పంజాబ్)
7. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం	శంషాబాద్ (హైదరాబాద్)
8. లోకప్రియ గోపీనాథ్ బర్దోలియా అంతర్జాతీయ విమానాశ్రయం	గువాహటి (అసోం)
9. సర్దార్ వల్లభభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం	అహ్మదాబాద్(గుజరాత్)
10. వీర సావర్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం	పోర్ట్‌బ్లెయిర్ (అండమాన్ నికోబార్ దీవులు)
11. దేవి అహల్యాబాయి అంతర్జాతీయ విమానాశ్రయం	ఇండోర్ (మధ్యప్రదేశ్)
12. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం	నాగపూర్ (మహారాష్ట్ర)
13. గయా అంతర్జాతీయ విమానాశ్రయం	గయ (బీహార్)
14. బెంగళూరు/ దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయం	బెంగళూరు (కర్ణాటక)
15. రాజాభోజ్ అంతర్జాతీయ విమానాశ్రయం	భోపాల్ (మధ్యప్రదేశ్)
16. జైపూర్ అంతర్జాతీయ విమానాశ్రయం	జైపూర్ (రాజస్థాన్)
17. వాస్కోడగామా అంతర్జాతీయ విమానాశ్రయం	పనాజి (గోవా)

మాదిరి ప్రశ్నలు

1. ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ ఎక్కడ ఉంది?
   1) ఢిల్లీ 2) రూన్సీ
   3) చిత్తరంజన్ 4) ఫుర్సత్‌గంజ్
2. పవన్‌హన్స్ లిమిటెడ్ హెలికాప్టర్ సర్వీసుల్ని ఎప్పుడు ప్రారంభించారు?
   1) 1953 2) 1985
   3) 1990 4) 1995
3. అన్నాదురై అంతర్జాతీయ విమానాశ్రయం ఎక్కడ ఉంది?
   1) న్యూఢిల్లీ 2) కొచ్చిన్
   3) చెన్నై 4) కోల్‌కతా
4. భారత ప్రభుత్వం వాయు రవాణాను ఏ సంవత్సరంలో జాతీయం చేసింది?
   1) 1953 2) 1948
   3) 1969 4) 1990
5. దేవి అహల్యాబాయి అంతర్జాతీయ విమానాశ్రయం ఎక్కడ ఉంది?
   1) ఇండోర్ 2) పోర్ట్‌బ్లెయిర్
   3) అమృత్‌సర్ 4) గౌహతి
6. కింది వాటిలో ఏ అంతర్జాతీయ విమానాశ్రయానికి డమ్‌డమ్ అనే పేరుండేది?
   1) ఇందిరా గాంధీ
   2) నేతాజీ సుభాష్ చంద్రబోస్
   3) ఛత్రపతి శివాజీ
   4) రాజీవ్ గాంధీ
7. వాయు రవాణాలో ఓపెన్ స్కై పాలసీని ప్రవేశపెట్టిన సంవత్సరం?
   1) 1985 2) 1953
   3) 1990 4) 1995
8. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏ నగరంలో ఉంది?
   1) ముంబై 2) నాగపూర్
   3) జైపూర్ 4) పుణే
9. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   1) 1990 2) 1985
   3) 1981 4) 1995
10. పాలెం(ఇందిరా గాంధీ) అంతర్జాతీయ విమానాశ్రయం ఎక్కడ ఉంది?
    1) శంషాబాద్ 2) కోల్‌కతా
    3) న్యూఢిల్లీ 4) అమృత్‌సర్
11. భారతదేశంలో అతి పొడవైన రన్‌వే ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయం?
    1) ఇందిరా గాంధీ 2) రాజీవ్ గాంధీ
    3) ఛత్రపతి శివాజీ 4) అన్నాదురై
12. శాంతాక్రాజ్ అనే పేరున్న అంతర్జాతీయ విమానాశ్రయం?
    1) ఇందిరాగాంధీ
    2) నేతాజీ సుభాష్ చంద్రబోస్
    3) ఛత్రపతి శివాజీ
    4) సర్దార్ వల్లభభాయ్ పటేల్

సమాధానాలు

1) 4 2) 2 3) 3 4) 1
5) 1 6) 2 7) 3 8) 2
9) 4 10) 3 11) 2 12) 3

గతంలో అడిగిన ప్రశ్నలు

1. హైదరాబాద్‌లోని నూతన అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎవరి పేరు పెట్టారు? (Police Constables-2009)
   1) ఇందిరా గాంధీ
   2) మహాత్మా గాంధీ
   3) రాజీవ్ గాంధీ
   4) జవహర్‌లాల్ నెహ్రూ
2. ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న నగరం? (Prohibition & Excise Constable-2013)
   1) ముంబై 2) చెన్నై
   3) పుణే 4) అహ్మదాబాద్
3. జతపరచండి. (S.I.-2011)

పట్టిక-1 విమానాశ్రయం	పట్టిక-2 స్థలం
ఎ. మీనంబాకం	1. ఢిల్లీ
బి. సాంతాక్రజ్	2. కోల్‌కతా
సి. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం	3. చెన్నై
డి. డమ్‌డమ్	4. ముంబై

కోడ్‌లు:

	ఎ	బి	సి	డి
1)	1	4	3	2
2)	3	4	1	2
3)	3	2	1	4
4)	2	3	4	1
5)	1	2	4	3

4. కిందివాటిలో ఏ రాష్ట్రంలో ఎక్కువ డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్‌లు ఉన్నాయి? (Deputy Jailors-2012)
   1) కర్ణాటక 2) తమిళనాడు
   3) ఆంధ్రప్రదేశ్
   4) గుజరాత్

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 4

వాన చినుకులు గోళాకారంగా ఉండటానికి కారణం ?

మాదిరి ప్రశ్నలు

1. చల్లని నీరు నింపిన గాజు గ్లాసు బయటి భాగం తడిగా ఎందుకు అవుతుంది?
   1) గాజు గ్లాసు ద్వారా నీరు విస్తాపన చెందడం వల్ల
   2) వాతవరణంలో నీటి ఆవిరి గ్లాసుపై ద్రవీభవించడం వల్ల
   3) పరిసరాల ఉష్ణోగ్రతను గ్లాసు అందుకో లేకపోవడం
   4) గ్లాసు, పరిసరాల మధ్య ఉష్ణరాశి వినిమయం లేకపోవడం
2. విశ్వవ్యాప్తంగా విస్తారంగా ఉన్న మూలకం ఏది?
   1) హైడ్రోజన్ 2) హీలియం
   3) ఆక్సిజన్ 4) నైట్రోజన్
3. సాయంకాల చుక్క అని ఏ గ్రహాన్ని పిలుస్తారు?
   1) బుధుడు 2) శుక్రుడు
   3) తోకచుక్క
   4) రాత్రులు మనకు కనిపించే వెలుగు చారలు
4. భారతదేశంలోని పరిశోధన ప్రయోగశాలల పితామహుడు అని ఏ శాస్త్రవేత్తకు పేరు?
   1) ఎస్.ఎస్. బట్నాగర్
   2) విక్రమ్ సారాబాయ్
   3) ప్రఫుల్ చంద్ర రే 4) రాజారామన్న
5. వంటగది నుంచి వెలువడే వ్యర్థాలు భూమిలో కుళ్లి సేంద్రియ ఎరువుగా మారే ప్రక్రియ ఒక
   1) ఉష్ణ మోచక చర్య 2) ఉష్ణ గ్రాహక చర్య
   3) ఉష్ణ రసాయన చర్య
   4) తిరోగమన రసాయన చర్య
6. కింది వాటిలో బహుళ పరావర్తన ధ్వనిపై ఆధారపడి పనిచేసే పరికరాలు ఏవి?
   1) మెగాఫోన్ 2) స్టెతస్కోప్
   3) లౌడ్ స్పీకర్ 4) పైవన్నీ
7. 'ఏకో-రేజింగ్' అని దేనిని అంటారు?
   1) శరీర అంతర్భాగాల పరిమాణాన్ని కొలవడం
   2) సమాచార తరంగాల విస్తరణ దూరం
   3) మిస్సైల్ యొక్క దూరాన్ని
   4) అతి ధ్వనులను ఉపయోగించి నీటి లోపల ఉన్న వస్తువుల మధ్య దూరాన్ని కనుగొనడం
8. వయోలిన్, పియానో నుంచి వెలువడే స్వరాల మధ్య భేదాన్ని తెలియజేసే సంగీత స్వర లక్షణం
   1) కీచుదనం 2) తీవ్రత
   3) నాణ్యత 4) ఆవర్తన కాలం
9. ఒక ప్లాస్టిక్ సీసా అడుగున త్రిభుజాకారంలో ఉన్న గుర్తులో '1' అనే అంకె ఉంది. ఇది దేనిని సూచిస్తుంది?
   1) అధిక సాంద్రత ఉన్న పాలి ఎథిలీన్
   2) అల్ప సాంద్రత ఉన్న పాలి ఎథిలీన్
   3) పాలీ ఎథిలీన్ టెరిఫ్తాలేట్ 4) పాలీ స్టైరీన్
10. ఒక వ్యక్తి చత్వారంతో బాధపడుతున్నాడు. అతడిని వైద్యుడు పరీక్షించి ఏ కటకాలు ఉన్న

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జనరల్ సైన్స్

కంటి అద్దాలను ఉపయోగించాలని సూచిస్తాడు?
   1) తక్కువ నాభ్యాంతరం ఉన్న ద్వికుంభాకార కటకాలు
   2) ఎక్కువ నాభ్యాంతరం ఉన్న పుటాకార కటకాలు
   3) ద్వినాభ్యాంతర కటకాలు
   4) ద్విపుటాకార కటకాలు
11. కంటి శుక్లాల వల్ల కంటిలోని ఏ భాగం దెబ్బ తింటుంది?
    1) రెటీనా 2) కటకం 3) కనుపాప 4) కార్నియా
12. రెండు అట్ట ముక్కలను అతి దగ్గరగా ఉంచి వాటి మధ్య గాలి ఊదితే అవి
    1) ఎక్కడికి కదలవు
    2) దూరంగా జరుగుతాయి
    3) దగ్గరకు వస్తాయి
    4) దగ్గరికి వస్తూ, దూరంగా పోతూ కదులుతాయి
13. కింది వాటిలో ఉష్ణశక్తి తరంగాలు అని పిలిచే తరంగాలు ఏవి?
    1) రేడియో తరంగాలు
    2) అతినీల లోహిత కిరణాలు
    3) పరారుణ కిరణాలు 4) పైవన్నీ
14. ఏకవర్ణ కాంతిని ఉద్గారించే కాంతి జనకం ఏది?
    1) పాదరస దీపం
    2) టంగ్‌స్టన్ హాలోజన్ దీపం
    3) సోడియం దీపం 4) చలిమంట
15. ఒక పట్టకం ద్వారా కాంతిని పంపినప్పుడు అతి తక్కువగా విచలనం చెందే రంగు ఏది?
    1) ఎరుపు. 2) ఆకుపచ్చ. 3) నీలం. 4) వైలెట్
16. క్రేస్కోగ్రాఫ్‌తో దేన్ని కొలుస్తారు?
    1) హృదయ స్పందన 2) నాడీ స్పందన
    3) మొక్కల పెరుగుదల 4) స్ఫటిక నిర్మాణం
17. ఎల్ఈడీ ఉద్గారించే కాంతి రంగు ఏ అంశం పై ఆధారపడి ఉంటుంది?
    1) తిరోశక్మంపై 2) ఎల్ఈడీ పురోశక్మంపై
    3) ఎల్ఈడీ ద్వారా ప్రవహించే పురో విద్యుత్‌పై
    4) ఎల్ఈడీలోని అర్ధ వాహక స్వభావంపై



18. సౌర కుటుంబంలోని గ్రహాలన్నింటిలోనూ అత్యధిక వేడి కలిగిన గ్రహం ఏది?
    1) బుధుడు 2) శుక్రుడు 3) యురేనస్ 4) శని
19. కింది వాటిలో ఏది పరమాణువు కేంద్రకంలో ఉండదు?
    1) ఫోటాన్ 2) ప్రోటాన్
    3) న్యూట్రాన్ 4) మెసాన్
20. ఓల్టా మీటరుతో దేనిని కొలుస్తారు?
    1) బ్యాటరీ 2) ఓల్టేజీ
    3) విద్యుత్ రసాయన తుల్యాంకం
    4) విద్యుత్
21. సరళ హరాత్మక చలనంలో ఉన్న ఒక వస్తువుకు గరిష్ఠ త్వరణం ఎప్పుడు కలిగి ఉంటుంది?
    1) మాధ్యమిక స్థానాల వద్ద
    2) దాని మార్గంలోని అన్ని స్థానాల వద్ద
    3) అంతిమ స్థానం, మాధ్యమిక స్థానం వద్ద
    4) అంతిమ స్థానం వద్ద
22. పరమాణు కేంద్రకంలోని కేంద్రక బలాలు
    1) బలమైన ఆకర్షణ బలాలు
    2) బలమైన వికర్షణ బలాలు
    3) బలహీనమైన ఆకర్షణ, వికర్షణ బలాలు
    4) గురుత్వాకర్షణ బలాలు
23. గాలిలో ప్రయాణించే విమానంపై పనిచేసే వాయు గతిక ఉత్థాపకాన్ని విశదీకరించే సూత్రం ఏది?
    1) బెర్నోలీ సిద్ధాంతం 2) ఉత్ప్లవన సూత్రం
    3) పాజ్వేల్ సమీకరణం 4) రేనాల్డ్ సంఖ్య
24. అత్యధిక అయనీకరణ సామర్థ్యం కలిగినవి
    1) x-కిరణాలు 2) ఆల్ఫా కణాలు
    3) గామా కిరణాలు 4) బీటా కణాలు
25. రాకెట్ ప్రొపెలెంట్‌గా ఉపయోగించేది?
    1) నైట్రోజన్ 2) అమ్మోనియా
    3) ఆక్సిజన్ 4) హైడ్రాజీన్
26. సమ ఉష్ణోగ్రత ప్రక్రియలో
    ఎ) వ్యవస్థ ఉష్ణోగ్రత స్థిరంగా ఉండదు
    బి) వ్యవస్థకు, పరిసరాల మధ్య ఉష్ణ వినిమయం
    సి) వ్యవస్థ అంతర్గత శక్తి స్థిరం
    డి) పీడనం,ఘనపరిమాణం వ్యవస్థకు స్థిరం
    1) బి, సి, 2) సి,డి, 3) ఎ, సి, 4) ఎ, డి
27. కింది వాటిలో దేనిని ఉపయోగించుకుని ఒక వలయంలో కావల్సిన పౌనఃపున్యం ఉన్న ఏకాంతర విద్యుత్‌ను పొందవచ్చు?
    1) ట్రాన్స్‌ఫార్మర్ 2) పవర్ సప్లయ్
    3) ఆంప్లిఫయర్ 4) ఆసిలేటర్
28. గాజు పరిశ్రమల్లో ఉపయోగించే కల్లెట్ అంటే ఏమిటి?
    1) సోడియం సిలికేట్
    2) వర్ణ ద్రవ్యకాలు
    3) పగిలిన గాజు ముక్కలు
    4) చీనా మట్టి ముద్దలు
29. జీవ ప్రక్రియ జరిగే ఆవరణం?
    1) స్ట్రాటో ఆవరణం 2) ట్రోపో ఆవరణం
    3) మీసో ఆవరణం 4) అయానో ఆవరణం
30. అంతర గ్రహాలు అని ఏ గ్రహాలను అంటారు?
    1) సూర్యునికి భూమికి మధ్య ఉన్న గ్రహాలు
    2) సూర్యునికి బృహస్పతికి మధ్య ఉన్న గ్రహాలు
    3) వాయు స్థితిలోని గ్రహాలు
    4) ఉపగ్రహాలు లేని గ్రహాలు
31. వాన చినుకులు గోళాకారంగా ఉండటానికి కారణం?
    1) నీటి స్నిగ్ధత 2) నీటి తలతన్యత
    3) నీటి విసరణం 4) ద్రవాభిసరణ పీడనం
32. ఏ సిద్ధాంతంతో 'రామన్ ఫలితం'ను వివరంగా విశదీకరించవచ్చు?
    1) తరంగ సిద్ధాంతం 2) కణ సిద్ధాంతం
    3) విద్యుత్ అయస్కాంత సిద్ధాంతం
    4) క్వాంటం సిద్ధాంతం
33. MRIలో ఉపయోగించే విద్యుదయస్కాంత వికిరణం ఏది?
    1) ఎక్స్-కిరణాలు 2) మైక్రో తరంగాలు
    3) రేడియో తరంగాలు 4) పరారుణ కిరణాలు
34. ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ ద్రవ్యశక్తి తుల్యతా నియమం $E = mc^2$లో E : శక్తి m : ద్రవ్యరాశి c : ?
    1) ఒక స్థిరాంకం 2) ద్రవ్యవేగం
    3) ద్రవ్యరాశి వేగం 4) కాంతి వేగం
35. పదార్థంలో ఎలక్ట్రాన్‌ల ప్రవాహాన్ని ప్రభావితం చేసేవి?
    1) ఉష్ణీయ కంపనాలు
    2) పరమాణువుల కల్మషం
    3) స్ఫటిక లోపాలు 4) పైవన్నీ
36. పైరో విద్యుత్ ఉత్పత్తి దేని వల్ల జరుగుతుంది?
    1) సంపీడనం 2) ఉష్ణోగ్రత
    3) తన్యత 4) స్నిగ్ధత
37. సముద్రపు నీటి ఘనీభవ స్థానం కింది దేని వల్ల తగ్గుతుంది?
    1) లవణీయత పెరగడం వల్ల
    2) ఉష్ణోగ్రత పెరగడం వల్ల
    3) ఆక్సిజన్ పెరగడం వల్ల
    4) నీటి సంక్షోభం పెరగడం వల్ల
38. సూపర్ నోవా అనేది ఒక
    1) నక్షత్ర మండలం
    2) నక్షత్ర విస్ఫోటనం
    3) అత్యధిక భారం ఉన్న నక్షత్రం
    4) భారీ ద్రవ్యరాశి ఉన్న నక్షత్రం
39. ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్‌లలో శీతలీకరణ పదార్థం ఏది?
    1) భార జలం 2) తేలిక జలం
    3) ద్రవ హీలియం 4) ద్రవ సోడియం
40. డాప్లర్ ప్రభావం అనువర్తింప చేయగలిగే తరంగాలు?
    1) ధ్వని తరంగాలు 2) కాంతి తరంగాలు
    3) రేడియో తరంగాలు
    4) పై మూడు రకాల తరంగాలు
41. నీటిలో ఏర్పడిన శబ్దతరంగం ఉపరితలంలోని గాలిలోకి ప్రవేశించినప్పుడు స్థిరంగా ఉండి తరంగ అభిలక్షణం?
    1) వడి 2) తరంగ దైర్ఘ్యం
    3) పౌనఃపున్యం 4) ఏదీ కాదు
42. సూర్యోదయం, సూర్యస్తమయ సమయాల్లో సూర్యుడు ఏ ఆకారంలో కనిపిస్తాడు?
    1) వృత్తాకారం
    2) కోల ఆకారం(oval shape)
    3) స్తూపాకారం 4) వక్రాకారం
43. గాలిలోని నీటి బిందువు ఏ విధంగా పని చేస్తుంది?
    1) అపసరణ కటకం 2) అభిసరణ కటకం
    3) కటకం వలె పనిచేయదు
    4) సమతల దర్పణం వలె పనిచేస్తుంది
44. అయస్కాంత పదార్థాలన్నీ కింది వాటిలో దేనివలన అయస్కాంత ధర్మాలను పోగొట్టుకుంటుంది?
    1) నీటిలో ముంచినప్పుడు
    2) నూనెలో ముంచినప్పుడు
    3) ఇనుప ముక్క వద్దకు తెచ్చినప్పుడు
    4) బాగా వేడి చేసినప్పుడు
45. ఒక వస్తువును మరొక వస్తువుతో రుద్దినప్పుడు ఆవేశం పొందింది. ఆ వస్తువు భారంలో మార్పు కింది ఏ విధంగా ఉంటుంది?
    1) భారం మారదు
    2) స్వల్పంగా పెరగకపోవచ్చు
    3) స్వల్పంగా తగ్గుతుంది
    4) స్వల్పంగా పెరుగుతుంది లేదా తగ్గుతుంది
46. ఒక సిల్క్ గుడ్డతో గాజు కడ్డీని రుద్దిన రెండింటికి ఆవేశం కలగడానికి కారణం?
    1) ఘర్షణ వల్ల
    2) ఉపరితలాలు నునుపు కావడం వల్ల
    3) ఎలక్ట్రానుల మార్పిడి వల్ల
    4) ఎలక్ట్రానులు, ప్రోటానుల మార్పిడి వల్ల
47. x-కిరణాల అభిలక్షణం
    1) రుణావేశ కణాల ప్రవాహం
    2) ప్రోటానుల ప్రవాహం
    3) పరమాణు మూలం ఉన్న విద్యుదయస్కాంతాల వికిరణాల ప్రవాహం
    4) కేంద్రక మూలం ఉన్న విద్యదయస్కాంత వికిరణాల ప్రవాహం
48. కంటి రెటినాలోని లోపాలను సవరించడానికి ఉపయోగించే విద్యుదయస్కాంత వికిరణం?
    1) అతినీలలోహిత కిరణాలు
    2) పరారుణ కాంతి
    3) ఎక్స్- కిరణాలు 4) లేజర్
49. మానవుని శరీరంలో ఏర్పడిన ట్యూమర్ (కణితి) పరిమాణాన్ని అంచనా వేయడానికి ఉపయోగించే పరికరాల్లో కింది ఏ దృగ్విషయాన్ని ఉపయోగిస్తారు?
    1) వివర్తనం 2) ధృవణం
    3) వ్యతికరణం 4) విశ్లేషణం
50. కింది ఏ సంవత్సరాన్ని అంతర్జాతీయ భౌతిక శాస్త్ర సంవత్సరంగా ప్రకటించారు?
    1) 1905. 2) 2005. 3) 1995. 4) 2015
51. శీతల ప్రదేశాల్లో ఉష్ణోగ్రత తగ్గిపోయినప్పుడు తటాకాలు, సరస్సుల్లోని నీరు ఉపరితలంపై గడ్డకట్టి అడుగు భాగంలో నీరు ద్రవ రూపంలో ఉండటానికి కారణం?
    1) నీటికి చాలా ఎక్కువ విశిష్టోష్ణం ఉండటం
    2) మంచు ఉష్ణ వాహకత్వం విలువ తక్కువగా ఉండటం
    3) నీటి ఘనీభవన ఉష్ణం ఎక్కువ
    4) తటాకాల అడుగు భాగాన ఉష్ణోగ్రత ఎక్కువ
52. ఒక ఎత్తైన కొండ పై నుంచి ఒక వస్తువును స్వేచ్ఛగా పతనం చెందేటట్లు చేశాం. వరుస సమాన కాల వ్యవధుల్లో ప్రయాణించే దూరాల నిష్పత్తి?
    1) 2:4:6. 2) 1:3:7. 3) 1:2:3. 4) 0:2:6:12
53. కదులుతున్న కుట్టు మిషన్ సూదికి ఏ రకమైన చలనం ఉంటుంది?
    1) స్థానంతర చలనం 2) భ్రమణ చలనం
    3) సరళ హరాత్మక చలనం
    4) వృత్తాకార చలనం
54. ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం, ఉష్ణగతిక వ్యవస్థలో నియమం రూపాంతరం?
    1) ద్రవ్య వేగ నిత్యత్వ నియమం
    2) ఉష్ణగతిక శాస్త్ర రెండో నియమం
    3) శక్తి నిత్యత్వ నియమం
    4) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
55. శీతల యంత్రంలోని గాలి వ్యాకోచించడానికి ఏ శక్తిని వినియోగించుకుంటుంది?
    1) ద్రవ్య శక్తిని 2) బాహ్య ఉష్ణ శక్తిని
    3) తన అంతర్గత శక్తిని 4) తన ఉష్ణోగ్రతను

సమాధానాలు

1) 2	2) 1	3) 2	4) 1	5) 1
6) 4	7) 4	8) 3	9) 3	10) 3
11) 2	12) 3	13) 3	14) 3	15) 1
16) 3	17) 4	18) 2	19) 1	20) 3
21) 4	22) 1	23) 1	24) 2	25) 4
26) 3	27) 4	28) 3	29) 2	30) 2
31) 2	32) 4	33) 3	34) 4	35) 4
36) 2	37) 1	38) 2	39) 4	40) 4
41) 3	42) 2	43) 2	44) 4	45) 4
46) 3	47) 3	48) 4	49) 1	50) 2
51) 2	52) 2	53) 3	54) 3	55) 3

The antonym of Critical is..

Directions (Q.No. 1-5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

Climate change poses potentially devastating effects on India's agriculture. While the overall parameters of climate change are increasingly accepted – a 1 °C average temperature increase over the next 30 years, sea level rise of less than 10 cm in the same period, and regional monsoon variations and corresponding droughts- the impacts in India are likely to be quite site and crop specific. Some crops may respond favourably to the changing conditions, others may not. This emphasizes the need to **promote** agricultural research and create maximum flexibility in the system to permit adaptations.

The key ingredient for "drought proofing" is the managed recharge of aquifers. To ensure continued yields of important staple crops, it may also be necessary to shift the locations where these crops are grown, in response to temperature changes as well to water availability. The latter will be a key factor in making long term investment decisions.

For example, water runoff from the Himalayas is predicted to increase over the next 30 years as glaciers melt, but then decline substantially thereafter. It will be **critical** to provide incentives to plan for these large-scale shifts in agro-ecological conditions.

India needs to make long term investment in research and development in agriculture. India is likely to experience changed weather patterns in future.

1. Consider the following statements:
   Climate change may force the shifting of locations of the existing crops due to
   a) Melting of glaciers
   b) Water availability and temperature suitability at other locations
   c) Poor productivity of crops
   d) Wider adaptability of crop plants
   Which of the statements given above are correct?
   1) a, b, & c 2) b & c only
   3) a & d only 4) a & c
   5) a, b, c, & d
2. To promote agricultural research in India is important because:
   1) To predict variations in monsoon patterns and to manage water resources.
   2) To make long term investment decisions for economic growth.
   3) To facilitate wider adaptability of crops.
   4) To predict drought conditions and to recharge aquifers.
   5) Changed weather patterns in future.
3. The spillover from the Himalayas is due to
   1) large-scale shifts in agro-ecological conditions.
   2) changed weather patterns in future
   3) productivity of crops
   4) melting of glaciers
   5) adaptability of crop plants
4. The antonym of **Critical** is
   1) waver 2) steady 3) unsure
   4) insecure 5) fasten
5. The synonym of **promote** is
   1) encompass 2) encourage
   3) entangle 4) entrust 5) encode

Directions (Q.No. 06-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. There is a ____ gap between rich and poor.
   1) vary 2) variety 3) similar
   4) reported 5) yawning
7. She ____ to escape from her office job.
   1) earned 2) yelled 3) yearned
   4) yielded 5) learn
8. The seriousness of the situation is ____ to appreciate in its ____.
   1) easy; complete
   2) different; wholesome
   3) difficult; totality
   4) hard; completeness



BANK EXAMS

GENERAL ENGLISH

   5) tough; compliment
9. The new policy was adopted in the ____ of fierce ____.
   1) wake; opponent
   2) show; postponement
   3) teeth; criticism
   4) course; outcome
   5) reality; injustice
10. The computer is now an ____ tool for the family doctor.
    1) value 2) valid
    3) price 4) worth
    5) invaluable

Directions: (Q.No. 11-15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. The magazine is issued year two times.
    1) year twice 2) twice yearly
    3) yearly two 4) two yearly
    5) no correction required
12. She yelled at the child to getting down from the wall.
    1) got down 2) get down
    3) getting away 4) get upon
    5) no correction required
13. All her yesterday's has vanished without a trace.
    1) Have 2) had
    3) has been 4) have being
    5) no correction required
14. My son's 13 but he's younger for his age.
    1) Youngest 2) youth
    3) older 4) young
    5) no correction required
15. When the needle enters the red zone the engine is indicator hot.
    1) Too 2) much
    3) becomes 4) left
    5) no correction required

Directions (Q.No. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. Exam results (1)/ are not the only (2)/ yard stick of a (3)/ school performance. (4)/ no error (5)
17. I have always (1)/ had a yen (2)/ to travel (3)/ around the world. (4)/ no error (5)
18. Because of the rapid progress (1)/ that science has made (2)/ the universe is slow yielding (3)/ up its secrets. (4)/ no error (5)
19. She brings to the job (1)/ a rare combination (2)/ of youth and (3)/ experiences. (4)/ no error (5)
20. The group was made up of (1)/ people with a range of age, (2)/ professions, incomes and (3)/ computer expertise. (4)/ no error (5)
21. Between 1957 and 2007 expenditures (1)/ in all 5 categories changed to some extent, (2)/ but the most marked change (3)/ was in the food category. (4)/ no error (5)
22. It seems that the man (1)/ who is dropping (2)/ off his own water bottle in the recycling bin (3)/ drove there in his car. (4)/ no error (5)
23. Reality TV shows involve real people perform (1)/ ridiculous and often dangerous acts (2)/ and generally behaving horribly (3)/ towards each other. (4)/ no error (5)
24. It is a legal requirement (1)/ for airline operators to provide (2)/ suitable refreshment (3)/ in the event of a long delay. (4)/ no error (5)
25. For some people, the huge increase in public surveillance (1)/ is a threat to the individual's social liberties (2)/ and was a sign that society (3)/ is becoming increasingly authoritarian. (4)/ no error (5)

Directions (Q.No. 26-30): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

26. Several **alarming** (1) incidents **occurred in** recent years (2) and **was widely** (3) **reported in** (4) the press.
27. **A** (1) general public should **rise to** (2) address the **social evil of** (3) corporal **punishment.** (4)
28. The teacher **was sought** (1) not only for imparting knowledge **and** (2) skills to students **but for also** (3) shaping their minds **and character.** (4)
29. **Prolonged** (1) television **viewvers** (2) have a higher **risk of** (3) fatal pulmonary **embolism.** (4)
30. **I want to** (1) travel to **sea** (2) the world **around** (3) and appreciate new **cultures.** (4)

Directions (Q.No. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Thomas Smart conferred upon Sastri the appellation "Silver Tongued Orator of the British Empire" and he was so called all over the United Kingdom.
B) Srinivasa Sastri was known for his mastery over the English language and his oratory. As a student, he once corrected a few passages in J. C. Nesfield's "English Grammar".
C) The Master of Balliol, Arthur Lionel Smith swore that he had never realized the beauty of the English language until he heard Sastri, while Lord Balfour remarked that listening to Srinivasa Sastri made him realize the heights to which the English language could rise.
D) Whenever he was on visit to the United Kingdom, Sastri was often consulted over spellings and pronunciations.
E) Srinivasa Sastri's inspirations were William Shakespeare, Sir Walter Scott, George Eliot, John Stuart Mill, Thomas Harvey, Victor Hugo and Valmiki - Indian sage and the author of the Hindu epic Ramayana.
F) His mastery over the English language was recognized by King George V, Winston Churchill, Lady Lytton and Lord Balfour who rated him amongst the five best English-language orators of the century.

31. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
32. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
33. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
34. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) E 5) F
35. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q.No. 36-40): Choose the word which is wrongly spelt from the five options given.

36. 1) pedagogue 2) vilify
    3) extraneous 4) bucollic
    5) conundrum
37. 1) powwow 2) malignant
    3) untenable 4) capricious
    5) dissipete
38. 1) railery 2) splenetic
    3) palaver 4) lachrymose
    5) tenacity
39. 1) exiguity 2) pillary
    3) concomitant 4) surfeit
    5) adjudicate
40. 1) promulgate 2) cataclysm
    3) deluge 4) simulacrom
    5) mural

Answers

1) 1;	2) 4;	3) 4;	4) 2;	5) 2;
6) 5;	7) 3;	8) 3;	9) 3;	10) 5;
11) 2;	12) 2;	13) 2;	14) 4;	15) 1;
16) 3;	17) 5;	18) 3;	19) 4;	20) 2;
21) 1;	22) 4;	23) 1;	24) 3;	25) 3;
26) 3;	27) 1;	28) 3;	29) 2;	30) 2;
31) 1;	32) 4;	33) 2;	34) 1;	35) 3;
36) 4;	37) 5;	38) 1;	39) 2;	40) 4.